www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శనివారం | 12-7-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 | సంచిక (Issue) : 104

శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, గ్రీష్మరుతువు, ఆషాఢమాసం, బహుళపక్షం; తిథి: విదియ రా.1.47 తదుపరి తదియ; నక్షత్రం: ఉత్తరాషాఢ ఉ.6.36 తదుపరి శ్రవణం; వర్జ్యం: ఉ.10.38-12.15; దుర్ముహూర్తం: ఉ.5.51-7.35; అమృతఘడియలు: రా.8.21-9.58; రాహుకాలం: ఉ.9.00-10.30; సూర్యోదయం: 5.51; సూర్యాస్తమయం: 6.49

వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

మాతృభాష అమ్మ.. హిందీ పెద్దమ్మ!



ఆంగ్ల భాషను సొంతం చేసుకున్న మనమే..
హిందీని మనభాషగా ఎందుకు అనుకోవడం లేదు?
చిల్లర రాజకీయాల కోసమే కొందరు హిందీని వ్యతిరేకిస్తున్నారు
హిందీ నేర్చుకోవడం అంటే మన ఉనికిని సుదృఢం చేసుకోవడమే
రాజభాషా విభాగం స్వర్ణోత్సవ వేడుకల్లో పవన్ కల్యాణ్
హాజరైన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, రాజ్యసభ వైస్ చైర్మన్ హరివంశ్

12

వాహనంపై అతికించని ఫాస్టాగ్‌లు
ఇకపై బ్లాక్‌లిస్ట్‌లోకి
ఎన్‌హెచ్‌ఏఐ కీలక నిర్ణయం




న్యూఢిల్లీ, జూలై 11: టోల్‌గేట్ల వద్ద జాప్యానికి, ఇతర సమస్యలకు కారణమవుతున్న 'లూజ్ ఫాస్టాగ్'లను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టాలని జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) నిర్ణయించింది. పలువురు ఫాస్టాగ్‌ను వాహనం ముందు అద్దం (విండ్‌షీల్డ్)పై అతికించడం లేదు. టోల్‌గేట్ వద్దకు వచ్చాక ఫాస్టాగ్‌ను తీసి చూపిస్తున్నారు. దీని వల్ల జాప్యం జరుగుతోంది. ఇతర వాహనాదారులకు అసౌకర్యం కలుగుతోంది. అంతేకాకుండా.. కొందరు లూజ్

మిగతా 2వ పేజీలో...



మంత్రి ఇంట్లో నోట్ల కట్టలు!
కరెన్సీ నోట్లతో నిండి ఉన్న బ్యాగ్
మహారాష్ట్రలో ఘటన
సోషల్ మీడియాలో వైరల్
మంత్రి శివసేన (శిండే) నేత

2



75 ఏళ్లు పూర్తయితే దిగిపోవాల్సిందే
ఆరెస్సెస్ అధినేత మోహన్ భాగవత్ స్పష్టీకరణ
ఈ ఏడాది సెప్టెంబరు 17తో మోదీకి 75 ఏళ్లు
అదే నెల 11న భాగవత్‌కూ 75 ఏళ్లు
ఇద్దరూ బ్యాగులు సర్దుకోండి.. కాంగ్రెస్ వ్యాఖ్య

2

ఇలా ఆర్డినెన్స్..
అలా నోటిఫికేషన్!

- స్థానిక సమరానికి సర్కారు సన్నద్ధం.. సవరణలతో సిద్ధమైన పంచాయతీరాజ్ ఫైలు
- ఏ క్షణమైనా గవర్నర్‌కు పంపే అవకాశం.. సోమవారానికే ఆర్డినెన్స్ వచ్చే చాన్స్
- స్థానిక ఎన్నికల నేపథ్యంలో క్షేత్రస్థాయిలో వేడెక్కుతున్న రాజకీయం
- సీఎంకు బీసీ సంఘాల కృతజ్ఞతలు.. ఆర్డినెన్స్, జీవో ఒకేసారి ఇవ్వాలని విజ్ఞప్తి

హైదరాబాద్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికలకు నగారా మోగనుంది. ఈ నెల్లోనే సాధ్యమైనంత తొందర్లోనే ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుంది. బీసీలకు 42 శాతం చొప్పున రిజర్వేషన్లు కేటాయించాలని తాజా క్యాబినెట్ సమావేశంలో నిర్ణయించిన నేపథ్యంలో తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం-2018లో పలు సవరణలు చేసి, ఆర్డినెన్స్ రూపంలో గవర్నర్ ఆమోదం పొందాలని, వెనువెంటనే ఎన్నికల ప్రక్రియను ప్రారంభించాలని నిర్ణయించారు. రిజర్వేషన్ల పెంపునకు సంబంధించి తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం -2018లోని సెక్షన్ 285(ఎ)లో పలు సవరణలు చేస్తూ ఫైలును రూపొందించారు. దాన్ని ఏక్షణమైనా గవర్నర్‌కు పంపే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. గవర్నర్ ఆమోదిస్తే వెంటనే ఆర్డినెన్స్ జారీ అవుతుంది. సోమవారం నాటికే ఆర్డినెన్స్ వస్తుందని అంచనా వేస్తున్నారు. ఆర్డినెన్స్‌తో పాటు సవరించిన చట్టానికి అనుగుణంగా ఎన్నికల్లో రిజర్వేషన్లకు సంబంధించి ప్రత్యేక జీవోను విడుదల చేస్తారు. జీవోలో పేర్కొన్న వివరాల ప్రకారం మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో స్థానిక సంస్థల రిజర్వేషన్లు ఖరారు చేస్తారు.



సీఎం రేవంత్‌రెడ్డితో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య తదితరులు

ఈ నెల 25 లోగా రిజర్వేషన్లు ఖరారు చేసి, సెప్టెంబరు 30 లోపు ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలని ఇప్పటికే హైకోర్టు సూచించింది. ఈ నేపథ్యంలోనే ఆర్డినెన్స్ వచ్చిన రోజునే జీవోను కూడా విడుదల చేయాలని సర్కారు యోచిస్తోంది. ఆ వెంటనే ఎన్నికల ప్రకటన కూడా చేయాలని భావిస్తోంది. వీటిని న్యాయస్థానాల ద్వారా అడ్డుకొనే ప్రయత్నాలు జరిగే అవకాశం ఉంది కాబట్టి వాటిని నివారించడానికి సుప్రీంకోర్టు, హైకోర్టుల్లో కేవియట్ పిటిషన్లు వేస్తున్నారు. మొదటి దశలో మండల, జిల్లా పరిషత్ ఎన్నికలు నిర్వహించి, తరువాత దశలో సర్పంచ్ ఎన్నికలకు వెళ్లాలని ప్రాథమికంగా నిర్ణయించారు. ఎన్ని విడతల్లో నిర్వహించాలనే అంశంపై అధికారులు ఒక నివేదికను రూపొందించినట్లు తెలిసింది. కాగా, బీసీలకు స్థానిక ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వడంపై బీసీ సంఘాలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపాయి. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య శుక్రవారం రేవంత్‌ను

మిగతా 13వ పేజీలో...



ఆ కాలేజీల్లో ఫీజులపై..
6 వారాల్లో తేల్చండి

పిటిషన్ వేసిన ఇంజనీరింగ్ కాలేజీల ప్రతిపాదనలు పరిశీలించండి
కొత్త ఫీజులను ప్రభుత్వానికి తెలపండి
టీఏఎఫ్ఆర్సీకి హైకోర్టు ఆదేశం
ఫీజులు పెంచుకోవడానికి అనుమతి ఇవ్వాలన్న కాలేజీల విజ్ఞప్తి తిరస్కరణ
ప్రస్తుతానికి పాత ఫీజులే

హైదరాబాద్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలు ఫీజులు పెంచుకోవడానికి అనుకూలంగా మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చేందుకు హైకోర్టు నిరాకరించింది. అయితే కోర్టును ఆశ్రయించిన కాలేజీలు అందజేసిన ప్రతిపాదనలను పరిశీలించి, ఆరు వారాల్లో కొత్త ఫీజులను ఖరారు చేయాలని తెలంగాణ ప్రవేశాలు, ఫీజుల నియంత్రణ కమిటీ (టీఏఎఫ్ఆర్సీ)ని ఆదేశించింది. కొత్త ఫీజుల వివరాలను రాష్ట్ర ప్రభుత్వానికి సిఫార్సు చేయాలని పేర్కొంది. ప్రస్తుతానికి పాత ఫీజులు వసూలు చేసుకోవచ్చని, అయితే సదరు ఫీజులు హైకోర్టు ఇచ్చే తుది తీర్పునకు లోబడి ఉంటాయని విద్యార్థులకు చెప్పాలని టీజీఈఏపీసెట్ కన్వీనర్‌ను ఆదేశించింది. ఈ కోర్టు కేసులకు సంబంధించిన వివరాలతో కూడిన సర్క్యులర్‌ను అధికారిక వెబ్‌సైట్‌లో ఉంచాలని సూచించింది. బీటెక్, ఎంటెక్, ఎంబీఏ తదితర వృత్తివిద్యా కోర్సుల ఫీజులు పెంచుకోవడానికి

మిగతా 14వ పేజీలో...

'ప్రైవేటు'గా
వసూళ్లు!



తనిఖీల మాటున ప్రైవేటు వైద్య కళాశాలల నుంచి భారీగా దండుకుంటున్న ఉన్నతాధికారి
లోటుపాట్లే అవకాశంగా వసూళ్ల పర్వం
కాలేజీల్లో సీట్లను బట్టి సొమ్ములు డిమాండ్
ఓ మాజీ మంత్రి కాలేజీ నుంచి రూ.40 లక్షలు
ప్రైవేటు వైద్యకళాశాలల వ్యవహారాలు చూసే సంస్థ ఉన్నతాధికారి బాగోతం
ఆ సంస్థలోనూ ఇష్టానుసారంగా వ్యవహారం
వారానికి ఒక్కసారే విధులకు హాజరు
ఆయన కోసం ఏకంగా 3 ప్రభుత్వ వాహనాలు!

హైదరాబాద్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కొన్ని ప్రైవేటు వైద్య కళాశాలలు.. తనిఖీలకు వచ్చిన జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) బృందాలకు లంచాలిచ్చి, తమకు అనుకూలంగా నివేదికలు ఇప్పించుకున్నాయి. దీనిపై ఇప్పటికే సీబీఐ కేసు నమోదైంది. తాజాగా ఇలాంటి బాగోతమే మరొకటి ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రాష్ట్రంలోని ప్రైవేటు వైద్య కళాశాలల వ్యవహారాలు చూసుకునే ఓ సంస్థ ఉన్నతాధికారి.. తనిఖీల పేరిట వసూళ్లకు పాల్పడినట్లు తెలుస్తోంది. ప్రైవేటు వైద్య కళాశాలల్లోని లోటుపాట్లనే అవకాశంగా చేసుకొని ఈ వసూళ్ల పర్వానికి తెర లేపినట్లు సమాచారం. అంతేకాదు ఆ అధికారి నిబంధనలకు విరుద్ధంగా ఏకకాలంలో మూడు ప్రభుత్వ వాహనాలను వాడుకుంటున్నట్లు విశ్వసనీయ సమాచారం. రాష్ట్రంలో ప్రస్తుతం 30 వరకు ప్రైవేటు వైద్య కళాశాలలు ఉన్నాయి. వాటిల్లో చాలా ఆస్పత్రుల్లో అధ్యాపకుల కొరత తీవ్రంగా ఉంది. పడకలు, అలాగే రోగులూ ఉండరు. దీనికితోడు బోధనాస్పత్రుల్లో పనిచేసే ఇంటర్నీస్, పీజీలు, రెసిడెంట్ డాక్టర్లకు స్టైపెండ్ చెల్లించవు. కొన్ని కాలేజీలు ఒక్క రూపాయి కూడా చెల్లించడం లేదు. మరికొన్ని తూతూ మంత్రంగా ఇస్తున్నాయి. దీన్నే ఆ ఉన్నతాధికారి అస్త్రంగా వాడుకున్నట్లు ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలు చెబుతున్నాయి. కొద్ది రోజుల క్రితం అన్ని ప్రైవేటు మెడికల్ కాలేజీలతో ఒకేసారి మాట్లాడాలని సదరు అధికారి

మిగతా 14వ పేజీలో...

హెచ్‌సీఏ కేసు.. రంగంలోకి ఈడీ
ఎఫ్ఐఆర్, దర్యాప్తు వివరాలు కోరుతూ సీఐడీకి లేఖ
మనీలాండరింగ్ కోణంలో విచారణ?!

14

కాళేశ్వరం, కృష్ణా జలాలపై అసెంబ్లీలో చర్చకు సిద్ధం
కెమెరా తిప్పొద్దు, మైక్ కట్ చేయొద్దు
శాసనసభను వాయిదా వేసి పోవొద్దు
బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు సవాల్
ఘోష్ కమిషన్‌కు 100 పేజీలతో నివేదిక

3

రాజాసింగ్ రాజీనామాకు బీజేపీ ఆమోదం
పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా వ్యవహరించనందువల్లేనని వెల్లడి
ఎమ్మెల్యే పదవిపై అనర్హత వేటు వేసేలా త్వరలో స్పీకర్‌కు లేఖ?
చివరి శ్వాస దాకా హిందుత్వం కోసం పనిచేస్తా.. రాజాసింగ్ స్పష్టీకరణ

12

ఒక్క సెకనులో నెట్‌ఫ్లిక్స్ వీడియోలన్నీ డౌన్‌లోడ్!
10 వేల సార్లు ఇంగ్లిష్ వికీపీడియా కూడా..
ఇంటర్నెట్ వేగంలో సరికొత్త రికార్డు
సెకనుకు 1.02 పెటాబిట్స్
జపాన్ శాస్త్రవేత్తల ఆవిష్కరణ

2



నాగార్జునసాగర్ క్రస్ట్ గేట్లను తాకిన నీటిమట్టం

కాళేశ్వరం కింద సాగునీరు
45 వేల ఎకరాలకే..

39,320 ఎకరాలు ఆరుతడి పంటలు.. 5,250 ఎకరాలు వరి
కృష్ణా, గోదావరి బేసిన్ పరిధిలో 38.76 లక్షల ఎకరాలకు..
కృష్ణా పరిధిలో 17.68 లక్షల ఎకరాలకు నీళ్లు.. స్కైవమ్ నిర్ణయం

హైదరాబాద్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో కాళేశ్వరం ప్రాజెక్టు కింద 44, 570 ఎకరాలకు సాగునీరు అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో 39,320 ఎకరాలు ఆరుతడి పంటలు కాగా... 5,250 ఎకరాల వరి పంటకు నీళ్లివ్వనున్నారు. 2025-26 సంవత్సరానికి గాను ఖరీఫ్‌లో నీటి విడుదలపై ఈఎన్‌సీ(జనరల్) మహ్మద్ అంజద్ అధ్యక్షతన జలసౌధలో స్కైవమ్ (రాష్ట్రస్థాయి సాగునీటి విడుదల ప్రణాళిక కమిటీ) శుక్రవారం సమావేశమయింది. కృష్ణా, గోదావరి

మిగతా 10వ పేజీలో...

ఉధృతంగా గోదావరి
సమ్మక్క సాగర్, మేడిగడ్డ బ్యారేజీలకు భారీగా వరద.. అన్ని గేట్లూ ఎత్తివేత
వాజేడు మండలంలో ఎన్‌హెచ్‌పైకి వరద నీరు.. రాకపోకల నిలిపివేత
కృష్ణమ్మ పరవళ్లు.. శ్రీశైలానికి 1.77 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
545.3 అడుగులకు సాగర్ నీటిమట్టం

10

ఆగని మృత్యుఘోష
కల్తీ కల్లు ఘటనలో మరొకరి మృతి
తొమ్మిదికి పెరిగిన మృతుల సంఖ్య
ఇంకా ఆస్పత్రుల్లో 48 మంది బాధితులు
'గాంధీ' నుంచి చెప్పకుండా వెళ్లిన ఓ వ్యక్తి
బాలానగర్ ఎక్సైజ్ సీఐపై సస్పెన్షన్ వేటు
మరో నలుగురు అధికారులపై విచారణ
10 గ్రాముల అల్ప్రాజోలంతో 1200 కల్తీ కల్లు సీసాలు
నిర్వాహకులకు అడ్డగోలుగా ఆదాయం

3

అధిష్ఠానం మా పాలనపై పూర్తి
సంతృప్తిగా ఉంది

రాష్ట్రంలో సామాజిక న్యాయం, హామీల అమలును ప్రశంసించింది
ముఖ్యమంత్రి రేవంత్, నేను అవగాహనతో పనిచేస్తున్నాం
కర్ణాటక తరహాలో తెలంగాణలో 'పవర్ షేరింగ్' ఏమీ లేదు
ఢిల్లీలో మీడియాతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఇష్టాగోష్ఠి

న్యూఢిల్లీ, జూలై 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వ పనితీరు పట్ల కాంగ్రెస్ అధిష్ఠానం పూర్తి సంతృప్తిగా ఉందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. ఇటీవల పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్

మిగతా 13వ పేజీలో...

ఒక్క సెకనులో నెట్‌ఫ్లిక్స్ వీడియోలన్నీ డౌన్‌లోడ్!



ఇంటర్నెట్ వేగంలో సరికొత్త రికార్డు


- జపాన్ శాస్త్రవేత్తల ఆవిష్కరణ
- 6జీ నెట్‌వర్క్, కొత్త తరం

న్యూఢిల్లీ, జూలై 11: నెట్‌ఫ్లిక్స్‌లో ఉన్న మొత్తం వీడియోలన్నింటినీ ఒక్కటంటే ఒక్క సెకనులో డౌన్‌లోడ్ చేసుకునే ఇంటర్నెట్ వేగాన్ని జపాన్ సాధించింది. సెకనుకు 1.02 పెటాబిట్లతో (10,20,000 గిగాబైట్లు) నడిచే ఈ ఇంటర్నెట్.. ప్రపంచంలోనే అత్యంత వేగంతమైన నెట్‌గా రికార్డు నెలకొల్పింది. మన దేశంలో ఉన్న సగటు ఇంటర్నెట్ స్పీడ్ 63.55 ఎంబీపీఎస్‌తో పోల్చితే ఇది 1.6 కోట్ల రెట్లు వేగవంతమైనది. అమెరికాలోని సగటు నెట్‌తో పోల్చినా.. 35 లక్షల రెట్లు వేగవంతమైనది. జపాన్‌లోని 'నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్స్ టెక్నాలజీ' (ఎన్ఐసీటీ) ఈ వివరాలను వెల్లడించింది. ఎన్ఐసీటీలోని ఫొటానిక్ నెట్‌వర్క్ ల్యాబొరేటరీ, సుమితొమో అనే మరో సంస్థతో కలిసి.. కనీవినీ ఎరుగని ఈ ఇంటర్నెట్ వేగాన్ని సాధించింది. టెక్నాలజీ రంగంలో దీనిని గొప్ప ముందంజగా భావిస్తున్నారు.

దూరం పెరుగుతున్నకొద్దీ సిగ్నల్స్ బలహీనం

ఆప్టికల్ ఫైబర్ల గుండా వెళ్లే డేటా స్పీడ్‌ను పెంచటంపై నిరంతరం పరిశోధనలు నడుస్తూనే ఉన్నాయి. ఒక సెకనుకు పెటాబిట్ల వేగంతో డేటాను ఇంతకుముందు కూడా పంపించగలిగారు గానీ.. అది వెయ్యి కిలోమీటర్ల దూరాన్ని ఎన్నడూ మించలేదు. దీనివల్ల అవి నిత్యజీవనంలో ఉపయోగానికి రాకుండా పోయే పరిశోధనలుగానే మిగిలిపోయాయి. సిగ్నల్స్ ప్రయాణిస్తున్న దూరం పెరుగుతున్నకొద్దీ అవి బలహీనపడుతుంటాయి. ఫైబర్ కోర్ల వద్ద వాటి వేగాన్ని తిరిగి పెంచటం ద్వారా ఈ సమస్యను అధిగమించవచ్చు. అయితే, ఇది సాంకేతికంగా ఒక పెద్ద సవాల్. దీనిని జపాన్ శాస్త్రవేత్తలు అధిగమించగలిగారు. వారు 19 కోర్లతో కూడిన ప్రత్యేకమైన ఆప్టికల్ ఫైబర్‌ను రూపొందించి ఈ ప్రయోగం జరిపారు. ఈ ఫైబర్ మందం 0.125 మిల్లీమీటర్లు. ప్రస్తుతం ప్రపంచమంతటా వినియోగిస్తున్న ఆప్టికల్ ఫైబర్ కూడా 0.125 మిల్లీమీటర్ల మందంతోనే ఉంటోంది. ఇక ఈ 19 కోర్లూ వేటికవే డేటాను తీసుకెళ్లేలా డిజైన్ చేశారు. తద్వారా ఒకే ఆప్టికల్ ఫైబర్‌లో 19 మార్గాల్లో డేటా వెళ్తుంది. ఈ విధంగా ఏకంగా 1808 కి.మీ.ల దూరానికి సెకనుకు 1.02 పెటాబిట్ల వేగంతో డేటాను పంపగలిగారు. ఈ వేగంతో ఇంగ్లిష్ వికీపీడియాలో ఉన్న యావత్ సమాచారాన్ని ఒక సెకనులో పది వేల సార్లు డౌన్‌లోడ్ చేయవచ్చు. పది వేల 4కే సినిమాలను, 1,27,500 సంవత్సరాలపాటు నడిచే సంగీతాన్ని ఒక సెకనులో డౌన్‌లోడ్ చేయవచ్చు. ఇంటర్నెట్ వేగంలో ఈ సరికొత్త రికార్డు.. భవిష్యత్తు సాంకేతికతను గణనీయంగా మార్చనుంది. క్లౌడ్ కంప్యూటింగ్, ఏఐ, డ్రైవర్ రహిత వాహనాలు, రియల్‌టైమ్ ట్రాన్స్‌లేషన్ టూల్స్ వంటి రంగాల్లో భారీ ఎత్తున డేటా ట్రాన్స్‌ఫర్ అవసరమవుతోంది. ఆయా రంగాలు అభివృద్ధి చెందినాకొద్దీ ఈ డిమాండ్ మరింత పెరుగుతుంది. అయితే.. ఈ ఆవిష్కరణ ఇప్పటికిప్పుడు సాధారణ ప్రజల వినియోగంలోకి వచ్చే అవకాశాలు తక్కువే. కానీ ప్రభుత్వాలు, డేటాసెంటర్ ఆపరేటర్లు, టెలికాం కంపెనీలకు ఇది పనికొచ్చే చాన్స్ ఉంది. 6జీ నెట్‌వర్క్‌లకు, నేషనల్ బ్రాడ్‌బ్యాండ్‌లకు, కొత్తతరం అండర్ వాటర్ కేబుల్స్‌కు ఇది మార్గం వేయవచ్చు.

లోకం తీరు



మహారాష్ట్ర మంత్రి ఇంట్లో నోట్ల కట్టలు!

- సోషల్ మీడియాలో వీడియో వైరల్

ముంబై, జూలై 11: శివసేన(యూబీటీ) ఎంపీ సంజయ్ రౌత్ ఎక్స్‌లో శుక్రవారం పోస్టు చేసిన ఓ వీడియో మహారాష్ట్రలో రాజకీయ దుమారం రేపింది. మహారాష్ట్ర సామాజిక న్యాయ శాఖ మంత్రి, శిందే వర్గం శివసేన నేత సంజయ్ శిర్సాట్ ఇంట్లోని ఓ బ్యాగులో కరెన్సీ నోట్ల కట్టలు ఉండడం, ఆ బ్యాగుకు కాస్త దూరంలో శిర్సాట్ కూడా ఉండడమే ఇందుకు కారణం. సంజయ్ రౌత్ పోస్టు చేసిన వీడియోలో ఏముందంటే.. మంత్రి సంజయ్ శిర్సాట్ ఓ గదిలో మంచంపై కూర్చొని సిగిరెట్ కాలుస్తుండగా.. ఆ మంచానికి కాస్త దూరంలో నోట్ల కట్టలతో నిండి ఉన్న ఓ బ్యాగు తెరిచి ఉన్నట్టు కనిపిస్తోంది. శిర్సాట్‌తోపాటు ఆయన పెంపుడు శునకం కూడా గదిలో ఉంది. ఈ వీడియోను ఎక్స్‌లో పోస్టు చేసిన సంజయ్ రౌత్.. ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షా ఈ వీడియో చూడాలని కోరారు. వీడియోపై సంజయ్ శిర్సాట్ కూడా స్పందించారు. ఆ వీడియోలో ఉన్నది తానేనని, తన ఇంటి పడక గదిలో కూర్చొని ఉన్నానని, పక్కన ఉంది తన పెంపుడు శునకమేనని తెలిపారు. అయితే, ఆ డబ్బుల సంగతి తనకు తెలియదన్నారు. నిజంగా తన దగ్గర అంత డబ్బు ఉంటే వాటిని దాచుకునేందుకు తన ఇంట్లో బీరువాలు ఉన్నాయని విమర్శలను తోసిపుచ్చారు. ఎవరో కావాలనే ఈ వీడియో తీసి తనపై కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. కాగా, 2019-24 మధ్యలో ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారంటూ సంజయ్ శిర్సాట్‌కు ఆదాయ పన్ను శాఖ గురువారమే నోటీసులు ఇవ్వడం గమనార్హం.

కుళ్లిపోయిన స్థితిలో పాక్ నటి మృతదేహం!

- కరాచీలోని ఫ్లాట్‌లో 32 ఏళ్ల హుమైరా అస్గర్ మృతి
- 9నెలల క్రితమే ఘటన.. చివరి ఫోన్‌కాల్ గత అక్టోబరులో



న్యూఢిల్లీ, జూలై 11: పాకిస్థానీ నటి, 32 ఏళ్ల హుమైరా అస్గర్ తీవ్ర అనుమానాస్పద స్థితిలో మృతిచెందారు. కరాచీలో ఒంటరిగా అద్దెకు ఉంటున్న ఫ్లాట్‌లో పూర్తిగా కుళ్లిపోయిన స్థితిలో ఇటీవల ఆమె మృతదేహం లభ్యమైంది. తొలుత.. ఆమె నెలరోజుల క్రితం మృతిచెంది ఉంటారని భావించినా.. ఆమె చివరి ఫోన్‌కాల్, ఇతర ఆధారాలను బట్టి తొమ్మిది నెలల క్రితం అంటే 2024 అక్టోబరులో మృతిచెందినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. ఆమె ఏడేళ్ల క్రితం లాహోర్ నుంచి కరాచీకి మారారు. కుటుంబసభ్యులతో సంబంధాలను తెంచుకొని ఒంటరిగా ఉంటున్నారు. యజమానికి అద్దె చెల్లించకపోవడంతో ఫ్లాట్ ఖాళీ చేయాలంటూ కోర్టు ఉత్తర్వును పట్టుకొని అధికారులు వచ్చి చూడగా ఈ ఘటన వెలుగుచూసింది. హుమైరా ఉంటున్న ఫ్లోర్‌లోని మరో ఫ్లాట్ ఫిబ్రవరి దాకా ఖాళీగా పడి ఉంది. తాము ఆ ఫ్లాట్‌లో దిగే సమయానికి ఎలాంటి వాసనను గుర్తించలేకపోయామని అందులో ఉంటున్న వ్యక్తి విచారణ అధికారులతో చెప్పారు. నిరుడు సెప్టెంబరు, అక్టోబరులో హుమైరా చివరిసారిగా కనిపించారని, అప్పటి నుంచి ఆమెను చూడలేదని స్థానికులు చెప్పారు. అయితే ఆమె మృతికి కారణాలు తెలియలేదు. ఫోరెన్సిక్ బృందం వచ్చి నమూనాలను తీసుకెళ్లారు. హుమైరా తమతో రెండేళ్ల క్రితమే అన్ని సంబంధాలను తెంచుకొని వెళ్లిపోయిందని చెబుతూ ఆమె మృతదేహాన్ని తీసుకెళ్లేందుకు తొలుత కుటుంబసభ్యులెవరూ ముందుకు రాలేదు. అయితే సోదరుడు నవీద్ అస్గర్ ఆమె మృతదేహాన్ని తీసుకెళ్లారు. హుమైరా.. జలైబీ (2015), లవ్ వ్యాక్సిన్ (2021) అనే రెండు పాక్ చిత్రాల్లో నటించారు. పలు టీవీ సీరియళ్లలోనూ ఆమె ప్రధాన పాత్రలు పోషించారు.

నేడు ఒకేసారి 51వేల మందికి ఉద్యోగ నియామక పత్రాలు.. ఇవ్వనున్న ప్రధాని


న్యూఢిల్లీ, జూలై 11(ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వంలోని వివిధ విభాగాలు, సంస్థల్లో ఉద్యోగాలకు ఎంపికైన 51 వేల మందికి శనివారం ప్రధాని నరేంద్ర మోదీ నియమాక పత్రాలను అందజేయనున్నారు. 'రోజ్‌గార్ మేళా'లో భాగంగా ఉదయం 11 గంటలకు వర్చువల్‌గా జరిగే కార్యక్రమంలో వీటిని అందిస్తారు. కేంద్రం ఇప్పటివరకు 15 'రోజ్‌గార్ మేళా'లను నిర్వహించి 10లక్షలకు పైగా నియామకపత్రాలను అందజేసింది. తాజాగా 16వ 'రోజ్‌గార్ మేళా'ను దేశవ్యాప్తంగా 47 చోట్ల నిర్వహించనుంది. రైల్వే, హోం, తపాలా, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, ఆర్థిక సేవల విభాగం, కార్మిక, ఉపాధికల్పన శాఖలతో పాటు ఇతర మంత్రిత్వ శాఖల్లో ఉద్యోగాలు కల్పించనుంది.

అమెరికా విదేశాంగ శాఖలో 1,353 మంది ఉద్యోగుల తొలగింపు

వాషింగ్టన్, జూలై 11: అమెరికాలో విభాగాల పునర్వ్యవస్థీకరణపై ట్రంప్ సర్కారు తన ప్రయత్నాలను కొనసాగిస్తోంది. అందులో భాగంగా విదేశాంగ శాఖలో 1,353 మంది ఉద్యోగులను తొలగించాలని శుక్రవారం నిర్ణయించింది. వీరిలో అమెరికాలో పనిచేసే 1,107 మంది సివిల్ సర్వెంట్లు, 246 మంది ఫారెన్ సర్వీసు అధికారులు ఉన్నారు. తొలగింపునకు గురయ్యే ఉద్యోగులకు వ్యక్తిగతంగా ఈ-మెయిల్ ద్వారా నోటీసులు పంపించారు. తొలుత తక్షణమే 120 రోజుల పాటు అడ్మినిస్ట్రేటివ్ లీవ్‌పై వెళ్లాలని సూచించారు. ఆ సెలవు ముగిసిన అనంతరం వారిని ఉద్యోగం నుంచి తొలగిస్తారు. చాలా మంది సివిల్ సర్వెంట్లకు ఈ సెలవు కాలం కేవలం 60 రోజులు కావడం గమనార్హం. ఉద్యోగులను తగ్గించడం కారణంగా సవాళ్లను ఎదుర్కోవడంలో ఇబ్బందులు ఎదురవుతాయని పలువురు దౌత్యవేత్తలు అభిప్రాయపడుతున్నారు.

ఎమిరేట్స్ విమానంలో తెలుగులోనూ మెనూ

- సోషల్ మీడియాలో పోస్టు చేసిన ఓ ప్రయాణికుడు




శంషాబాద్ రూరల్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): శంషాబాద్ విమానాశ్రయం నుంచి దుబాయ్ వెళ్తున్న ఎమిరేట్స్ విమానంలో ప్రయాణికుల సౌకర్యార్థం మెనూను తెలుగులోనూ ముద్రించారు. ఇంగ్లిష్, అరబిక్‌తో పాటు తెలుగు భాషలో ఉన్న ఆ మెనూను ఓ ప్రయాణికుడు సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ఓ విదేశీ విమానయాన సంస్థ తెలుగులోనూ మెనూ ముద్రించడం విశేషం అని ఆయన పేర్కొన్నారు. తెలుగు రాష్ట్రాల్లోని ప్రభుత్వ కార్యాలయాలు, వ్యాపార సముదాయాల్లో తెలుగులోనూ బోర్డులు పెడితే బాగుటుందని అభిప్రాయపడ్డారు. కాగా శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు రాకపోకలు సాగించే అంతర్జాతీయ విమాన సర్వీసులన్నింటిలోనూ మెనూను తెలుగులో కూడా ముద్రిస్తున్నారని తెలిసింది.

రిటైర్మెంట్ @ 75పై రచ్చ

మోహన్ భాగవత్ తాజా వ్యాఖ్యలతో ప్రధాని మోదీ 'వయస్సు'పై మరోసారి చర్చ

- 75ఏళ్లు పూర్తయితే దిగిపోవాల్సిందే
- పుస్తకావిష్కరణ సభలో ఆర్ఎస్ఎస్ అధినేత భాగవత్ స్పష్టీకరణ
- సెప్టెంబరు 17తో మోదీకి 75 ఏళ్లు
- ఇప్పటికే 'వయసు'పై విపక్షాల విసుర్లు



న్యూఢిల్లీ, జూలై 11: నాయకులు 75 ఏళ్ల వయసు రాగానే పక్కకు తప్పుకోవాలంటూ ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ చేసిన వ్యాఖ్యలు మరోసారి రిటైర్మెంట్ రచ్చను రాజేశాయి. భాగవత్ ఈ వ్యాఖ్యలు ప్రధాని నరేంద్ర మోదీని ఉద్దేశించి చేశారా? లేక వచ్చే సెప్టెంబరు నాటికి 75 ఏళ్లు పూర్తిచేసుకుంటున్న తన గురించి తానే భాగవత్ ఈ ప్రకటన చేశారా? అంటూ విపక్షాలు ఆశ్చర్యపోతున్నాయి. మరోవైపు బీజేపీ, ఆర్ఎస్ఎస్ మధ్య 2024 ఎన్నికల ముందు మొదలైన ఆధిపత్య పోరు మరింత పాకాన పడిందా అనే అనుమానాలు కూడా వ్యక్తం అవుతున్నాయి. ఏమైనా జాతీయ రాజకీయ వర్గాలు, ఆర్ఎస్ఎస్ వ్యవహారాల పరిశీలకులు తాజా పరిమాణాలను ఆసక్తిగా గమనిస్తున్నారు. ఇంత చర్చకు కారణమైన ఘటన.. ఆర్ఎస్ఎస్ సిద్ధాంత కర్త మోరోపంత్ పింగ్లేకు అంకితం చేస్తూ గత బుధవారం జరిగిన పుస్తక ఆవిష్కరణ సభలో చోటుచేసుకుంది. సభలో ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ మాట్లాడుతూ.. "75 ఏళ్లు ఒంటిమీదకు వచ్చి శాలువా కప్పించుకున్నామంటేనే, వయసు మీరిందని, బాధ్యతల నుంచి తప్పుకొని, మరొకరికి అవకాశం ఇవ్వాల్సిన సమయం ఆసన్నమైందని అర్థం చేసుకోవాలి' అని పింగ్లే అనేవారు" అని తెలిపారు. భాగవత్ ఈ వ్యాఖ్యలు చేసిన సమయం అనేక సందేహాలకు తావిచ్చింది. వచ్చే సెప్టెంబరు 17వ తేదీతో మోదీ, సెప్టెంబరు 11వ తేదీతో భాగవత్ 75 ఏళ్లు పూర్తి చేసుకోనున్నారు. వీరిద్దరూ 1950 సెప్టెంబరులో ఆరు రోజుల తేడాతో జన్మించారు. దీంతో ప్రధానిగా దిగిపోవాల్సిన సమయం వచ్చేసిందని మోదీకి భాగవత్ పరోక్ష సంకేతం అందించారని విపక్షాలు వ్యాఖ్యానిస్తున్నాయి. "75 ఏళ్లు పూర్తిచేసుకున్న అడ్వాణీ, మురళీమనోహర్ జోషి, జస్వంత్ సింగ్‌లను బాధ్యతల నుంచి తప్పించేదాకా నరేంద్రమోదీ నిద్రపోలేదు. అదే సూత్రాన్ని ఆయన తనకు వర్తింపజేసుకుంటారా?" అని శివసేన (ఉద్ధవ్ ఠాక్రే) నేత సంజయ్ రౌత్ ప్రశ్నించారు. ప్రధానిగా తన పదేళ్లలో మోదీ నాగ్‌పూర్‌లోని ఆర్ఎస్ఎస్ కార్యాలయాన్ని తొలిసారి ఈ ఏడాది మార్చిలో సందర్శించినప్పుడు కూడా రౌత్ ఇలాంటి వ్యాఖ్యలే చేశారు. అప్పట్లో బీజేపీ వాటిని ఖండించింది. బీజేపీ ప్రణాళికలో పదవీ విరమణకు సంబంధించిన నిబంధన లేదని, 2029 వరకు మోదీయే ప్రధానిగా ఉంటారని హోంమంత్రి అమిత్‌షా కూడా స్పష్టం చేశారు.

అయ్యో.. ప్రధాని: కాంగ్రెస్ ఎద్దేవా

"విదేశీ పర్యటనలు చేసి, అవార్డులు అందుకుని స్వదేశానికి తిరిగివస్తున్న ప్రధానమంత్రికి ఆర్ఎస్ఎస్ అందించిన స్వాగతం చూడండి" అని కాంగ్రెస్ నేత జైరామ్ రమేశ్ శుక్రవారం 'ఎక్స్'లో వ్యాఖ్యానించారు. 'అయ్యో.. ప్రధాని' అంటూ వ్యంగ్య వ్యాఖ్యలు చేశారు. తాను చేసే ప్రబోధాలకు బీజేపీ, ఆర్ఎస్ఎస్ కట్టుబడి ఉండాలని మరో కాంగ్రెస్ నేత అభిషేక్ మనూ సింఘ్వీ సూచించారు. వచ్చే సెప్టెంబరుతో 75 ఏళ్లు పూర్తి చేసుకుంటున్న మోదీ, భాగవత్ ఇద్దరూ.. బ్యాగులు సర్దుకుని కార్యాలయాలను వదిలిపెట్టాలని ఏఐసీసీ నేత పవన్ ఖేడా కోరారు.

మోదీకి ఆ సూత్రం వర్తించదు: ఆర్ఎస్ఎస్ పరిశీలకులు

ప్రధానమంత్రి నరేంద్రమోదీకి 75 సంవత్సరాలు అనే నిబంధన వర్తించబోదని ఆర్ఎస్ఎస్ మాజీ నేత, సంఘ్ పరిశీలకుడు దిలీప్ దేవధర్ తెలిపారు. నరేంద్రమోదీ ఈ నిబంధనకు మినహాయింపు అని, బీజేపీలోని మార్గదర్శక మండలి సభ్యులకు మాత్రమే 75 ఏళ్లు అనే నిబంధన వర్తిస్తుందని ఐదేళ్ల క్రితమే మోహన్ భాగవత్ వివరణ ఇచ్చారని దిలీప్ గుర్తుచేశారు. అలాగే, వయసు ప్రమాణంగా ఆర్ఎస్ఎస్ అధినేత వైదొలగడం అనేది ఆ సంస్థ చరిత్రలోనే లేదని సంఘ్ పరిశీలకులు చెబుతున్నారు. ఆర్ఎస్ఎస్ చీఫ్‌లుగా గతంలో పనిచేసిన రజ్జూ భయ్యా, కేఎస్ సుదర్శన్ అనారోగ్యకారణాలతో 78వ యేట బాధ్యతల నుంచి తప్పుకున్నారని, బాలాసాహెచ్ దియోరస్ 79 ఏళ్లవరకు ఆపదవిలో ఉన్నారని గుర్తుచేశారు.

ఈసీకి అపరిమిత అధికారాలు ఇవ్వొద్దు

- జేపీసీ సమావేశంలో ఇద్దరు మాజీ సీజేఐల సూచనలు

న్యూఢిల్లీ, జూలై 11: 'ఒకే దేశం ఒకే ఎన్నిక' విధానం అమలులో భారత ఎన్నికల సంఘానికి అపరిమిత అధికారాలు ఇవ్వకూడదని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తులు అభిప్రాయపడ్డారు. బీజేపీ ఎంపీ పీపీ చౌదరి చైర్‌పర్సన్‌గా ఉన్న సంయుక్త పార్లమెంటరీ కమిటీ(జేపీసీ) శుక్రవారం నిర్వహించిన సమావేశానికి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేఎస్ ఖేహర్ హాజరయ్యారు. జమిలి ఎన్నికలపై వీరు కమిటీకి ప్రజెంటేషన్ ఇచ్చారని సంబంధిత వర్గాలు తెలిపాయి. రాజ్యాంగ సవరణ బిల్లులో ప్రతిపాదించిన విధంగా ఈసీఐకి అపరిమిత అధికారాలు ఇవ్వకూడదని, 'చెక్స్ అండ్ బ్యాలెన్స్' వ్యవస్థ ఉండాలని జడ్జిలు సూచించారు. ఎన్నికల నిర్వహణపై పర్యవేక్షణ యంత్రాంగం ఉండాలన్నారు. ప్రభుత్వం సుపరిపాలన అందించడానికి ఐదేళ్ల పదవీకాలం ఎంతో ముఖ్యమని, దీన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ తగ్గించకూడదని స్పష్టం చేశారు. జమిలి ఎన్నికల ఆలోచనను అన్ని రాష్ట్రాల్లోని ప్రజలు, రాజకీయ పార్టీల నాయకులు సమర్థిస్తున్నారని చౌదరి చెప్పారు. గతంలో ఈ కమిటీ ముందు మాజీ సీజేఐలు జస్టిస్ యూయూ లలిత్, జస్టిస్ రంజన్ గొగోయ్ హాజరయ్యారు. ఈసీఐకి అధికారాలు ఇవ్వాలనుకోవడాన్ని జస్టిస్ గొగోయ్ కూడా ప్రశ్నించారు. కాగా, లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీలకు ఏకకాలంలో ఎన్నికలు జరపడం రాజ్యాంగ మౌలిక నిర్మాణాన్ని ఉల్లంఘించడమేనంటూ ప్రతిపాదిత బిల్లును పలువురు ప్రతిపక్ష నేతలు విమర్శించారు. అయితే కమిటీముందు హాజరైన న్యాయ నిపుణులు ఈ విమర్శలను తోసిపుచ్చారు. జాతీయ, రాష్ట్రాల ఎన్నికలు విడివిడిగా నిర్వహించాలని రాజ్యాంగం ఎప్పుడూ ఆదేశించలేదని స్పష్టం చేశారు.

సిద్దు సీఎం కుర్చీ సేఫ్?!

- 'ఐదేళ్లూ నేనే సీఎం' వ్యాఖ్యల వెనుక అధిష్ఠానం!
- రాహుల్ భరోసాతో సిద్దూలో ధీమా

బెంగళూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో 2023 అసెంబ్లీ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి, ముఖ్యమంత్రిగా సిద్దరామయ్య బాధ్యతలు చేపట్టింది మొదలు.. రాష్ట్రంలో సీఎం మార్పు అంశంపై చర్చ లేని రోజు లేదంటే అతిశయోక్తి లేదు! ఇటీవల జరుగుతున్న పరిణామాలు రాష్ట్రంలో సీఎం మార్పు ఉండబోదని, ఆ దిశగా అధిష్ఠానం సంకేతాలు ఇచ్చిందనే చర్చకు దారితీశాయి. సీఎం సిద్దరామయ్య గురువారం ఢిల్లీలో మాట్లాడుతూ 'ఐదేళ్లు నేనే సీఎంగా ఉంటాను. కుర్చీ ఖాళీగా లేదు. నా సారథ్యంలోనే 2028లో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతాయి' అని చెప్పడం వెనుక రాహుల్‌గాంధీ సందేశం ఉందా? అనే చర్చ జరుగుతోంది. రాహుల్ దిశానిర్దేశమే సిద్దరామయ్య ధీమాకు కారణమనే అభిప్రాయాలు వ్యక్తమౌతున్నాయి. ఢిల్లీలో మూడు రోజులు మకాం వేసిన సిద్దూ.. నాయకత్వ మార్పు అంశంపై హైకమాండ్ వద్ద చర్చ లేదని పేర్కొన్నారు.

మౌనంగా ఉండమని ఖర్గే చెప్పారు: డీకే

మరోవైపు కర్ణాటక రాజకీయాల్లో ట్రబుల్ షూటర్‌గా, మొండి నాయకుడిగా ముద్రపడిన డీకే శివకుమార్.. రెండు రోజులుగా మౌనం పాటిస్తున్నారు. బెంగళూరులో శుక్రవారం ఆయన మాట్లాడుతూ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మౌనంగా ఉండాలని సూచించారని, అదే పాటిస్తున్నానని చెప్పడం చర్చనీయాంశంగా మారింది. ముఖ్యమంత్రి స్పష్టత ఇచ్చాక నాయకత్వ మార్పు గురించి మాట్లాడడం సరికాదని మరో ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. డీకే శివకుమార్ సన్నిహిత నేతలు ఆయన త్వరలో సీఎం అవుతారంటూ గతంలో వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. కాగా, ఢిల్లీలో సీఎం, డిప్యూటీ సీఎంలు మూడు రోజులు మకాం వేసినా, రాహుల్‌గాంధీ ఇద్దరికీ అపాయింట్‌మెంట్ ఇవ్వకపోవడం గమనార్హం.

బిహార్లోనూ ఎన్నికల హైజాక్!

- బీజేపీ కోసమే ఈసీ పనిచేస్తోంది
- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ
- రాజ్యాంగం నుంచి సెక్యులరిజం, సోషలిజాన్ని తొలగించే కుట్ర: ఖర్గే



సమావేశంలో అభివాదం చేస్తున్న రాహుల్ గాంధీ, ఖర్గే

భువనేశ్వర్, జూలై 11: మహారాష్ట్రలో మాదిరిగా బిహార్లోనూ ఎన్నికల హైజాక్‌కు బీజేపీ ప్రయత్నాలు చేస్తోందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ మరోసారి ఆరోపించారు. ఎన్నికల కమిషన్ (ఈసీ) తన విధులు తాను నిర్వర్తించకుండా.. అధికార పార్టీ కోసమే పనిచేస్తోందన్నారు. శుక్రవారం ఒడిసా రాజధాని భువనేశ్వర్‌లో కాంగ్రెస్ నిర్వహించిన 'సంవిధాన్ బచావో సమావేశ్'లో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది చివరిలో జరిగే బిహార్ ఎన్నికలను హైజాక్ చేయకుండా బీజేపీని అడ్డుకోవాలని ఇండియా కూటమి పార్టీలు నిర్ణయించాయని తెలిపారు. ఆ పార్టీ దేశవ్యాప్తంగా రాజ్యాంగంపై దాడిచేస్తోందన్నారు. 'బీజేపీ తన ప్రభుత్వాన్ని ఐదారుగురు పారిశ్రామికవేత్తల కోసమే నడుపుతోంది. సాధారణ ప్రజల కోసం అది పనిచేయదు. నీరు, అడవులు, భూములు గిరిజనులకు చెందినవి. ఒడిసాలోని బీజేపీ ప్రభుత్వం షెడ్యూల్ ఏరియాలను విస్తరించే పంచాయతీల చట్టాన్ని అమలు చేయడం లేదు. అటవీ హక్కుల పట్టాలను గిరిజనులకు అందజేయడం లేదు. మేమొస్తే పెసా, గిరిజనుల చట్టాలను అమలు చేస్తాం. గిరిజనులకు వారి భూములను వారికి అప్పగిస్తాం. గతంలో ఒడిసా రాష్ట్రాన్ని బీజేడీ సర్కారు దోచుకుంది. ఇప్పుడు బీజేపీ ప్రభుత్వం ఆ పనిచేస్తోంది' అని ఆయన విమర్శించారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ కాషాయ పార్టీ.. రాజ్యాంగాన్ని మార్చాలని పనిగా పెట్టుకుందని.. రాజ్యాంగం నుంచి సెక్యులరిజం, సోషలిజాన్ని తొలగించేందుకు ఆ పార్టీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆరోపించారు. బీజేపీ ఏలుబడిలో గిరిజనులు, దళితులు, మహిళలు, యువత సురక్షితంగా లేరన్నారు. పేదలను, గిరిజనులకు కాపాడేందుకు కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం 2006లో అటవీ హక్కుల చట్టం తెచ్చిందని, అయితే మోదీ సర్కారు దానిని అమలు చేయడం లేదని ఆక్షేపించారు. పరిశ్రమల పేరిట ప్రతి చోటా అడవులను నాశనం చేస్తోందన్నారు. కాంగ్రెస్ దేశంలో 160 ప్రభుత్వ రంగ సంస్థ(పీఎస్‌యూ)లను ఏర్పాటుచేస్తే.. వాటిలో 23 సంస్థలను బీజేపీ ప్రైవేటీకరించిందన్నారు. కాంగ్రెస్ సృష్టించిన ప్రజాసంపదను తన మిత్రులకు మోదీ అమ్మేస్తున్నారని ఖర్గే ఆరోపించారు.

వాహనంపై అతికించని ఫాస్టాగ్‌లు ఇకపై బ్లాక్‌లిస్ట్‌లోకి

(మొదటి పేజీ తరువాయి)

ఫాస్టాగ్‌లను దుర్వినియోగం చేస్తున్నారు. కొన్నిసార్లు టోల్ రుసుము తిరిగి తప్పుగా సదరు లూజ్ ఫాస్టాగ్ ఖాతాలోకి వెళుతుండడాన్ని (బోగస్ చార్జిబ్యాక్స్) ఎన్‌హెచ్ఏఐ గమనించింది. ఈ నేపథ్యంలో టోల్ సేకరణ ఏజెన్సీలు లూజ్ ఫాస్టాగ్‌ల సమాచారం తెలియజేసేందుకు ప్రత్యేకంగా ఈ-మెయిల్ ఐడీని అందుబాటులోకి తీసుకొచ్చినట్లు ఎన్‌హెచ్ఏఐ తెలిపింది. దానికి సమాచారం రాగానే ఆయా లూజ్ ఫాస్టాగ్‌లను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టేందుకు చర్యలు చేపడతామని పేర్కొంది.

సీఎం పదవి సరే.. ముందు ఏ పార్టీయో తేల్చుకోండి

- శశి థరూర్‌పై కేరళ కాంగ్రెస్ నేతల వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, జూలై 11: తిరువనంతపురం ఎంపీ శశి థరూర్, కాంగ్రెస్ పార్టీ మధ్య జరుగుతున్న ప్రచ్ఛన్న యుద్ధం క్రమేణా బహిర్గతమవుతోంది. ఆయన ఇటీవల కాలంలో ప్రధాని మోదీని పొగుడుతుండాన్ని తప్పుపడుతున్న కేరళ కాంగ్రెస్ నేతలు ఇప్పుడు బహిరంగంగా విమర్శలు చేస్తున్నారు. వచ్చే ఏడాది జరగనున్న కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో ముఖ్యమంత్రి అభ్యర్థి ఎవరైతే బాగుంటుందనేదానిపై సర్వే జరిపినప్పుడు 28.3% మంది థరూర్ పేరును సూచించారు. ఈ విషయాన్ని బుధవారం ఆయన సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. దీనిపై కాంగ్రెస్ సీనియర్ నేత కె.మురళీధరన్ స్పందిస్తూ సీఎం పదవి మాట ఎలా ఉన్నప్పటికీ తొలుత ఆయన ఏ పార్టీకి చెందిన వారో తేల్చుకోవాల్సి ఉందని వ్యాఖ్యానించారు. సర్వేలో ఎవరు ముందున్నా యూడీఎఫ్ గెలిస్తే ఆ కూటమి అభ్యర్థే ముఖ్యమంత్రి అవుతారని చెప్పారు.

భారత అమ్ములపొదిలోకి లోరా!



ఇజ్రాయెల్ తయారీ మధ్యశ్రేణి క్షిపణిపై మన వాయుసేన దృష్టి

- బాలిస్టిక్, క్రూయిజ్.. రెండు లక్షణాల కలబోత లోరా
- బెల్‌తో కలిసి భారత్‌లో ఉత్పత్తి కోసం ఒప్పందం

న్యూఢిల్లీ, జూలై 11: తరచూ కయ్యానికి కాలుదువ్వే పాకిస్థాన్ ఓవైపు.. ఎప్పుడు చాన్స్ దొరుకుతుందా అని కాచుక్కూర్చున్న చైనా మరోవైపు.. ఈ రెండింటినీ దీటుగా ఎదుర్కొనేలా రక్షణ సామర్థ్యాన్ని పెంచుకోవడంపై భారత వాయుసేన దృష్టిపెట్టింది. ఈ క్రమంలో ఇజ్రాయెల్‌కు చెందిన లోరా (లాంగ్ రేంజ్ ఆర్టిలరీ) సూపర్ సోనిక్ క్షిపణులను అమ్ములపొదిలో చేర్చుకునేందుకు సిద్ధమవుతోంది. యుద్ధ సమయాల్లో విభిన్నమైన అవసరాలకు వినియోగించుకునేలా, మన వద్ద ఉన్న బ్రహ్మోస్ క్షిపణులకు తోడుగా లోరా క్షిపణులను సమకూర్చుకోవాలని భావిస్తోంది. ఇజ్రాయెల్ ఏరోస్పేస్ ఇండస్ట్రీస్ (ఐఏఐ)లోరా క్షిపణులను అభివృద్ధి చేసింది. బాలిస్టిక్, క్రూయిజ్ క్షిపణులకు ఉండే లక్షణాలు దీని సొంతం. గంటకు 6వేల కిలోమీటర్ల (మాక్ 5)కుపైగా వేగంతో దూసుకుపోయి 430 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదించగలదు. ఒకసారి లక్ష్యాన్ని నిర్ధారిస్తే జీపీఎస్, ఐఎన్ఎస్ నావిగేషన్ సాయంతో దూసుకుపోతుంది. క్షిపణి దూసుకెళ్తున్న సమయంలో దాడి చేయాల్సిన లక్ష్యాన్ని మార్చేందుకు వీలుంటుంది. దీనితో శత్రు దేశాలు ఈ క్షిపణులను మధ్యలోనే కూల్చేయడం కష్టతరం అవుతుంది. ఈ క్షిపణుల్లో జామ్ చేయడానికి వీల్లేని సాంకేతికత ఉంది. నిర్ణీత లక్ష్యంపై పది మీటర్లలోపు తేడాతో దాడి చేయగలదు. 5.2 మీటర్ల పొడవు, 1,600 కిలోల బరువు ఉండే 'లోరా' క్షిపణికి 570 కిలోల వార్‌హెడ్‌ను అమర్చవచ్చు. బ్రహ్మోస్ క్షిపణుల బరువు చాలా ఎక్కువ. సరిహద్దులకు కాస్త దగ్గర్లోని భారీ లక్ష్యాలను ఛేదించడానికి అవి అనుకూలం. లోరా క్షిపణులు మరింత లోపలి లక్ష్యాలను అత్యంత కచ్చితత్వంతో ఛేదించేందుకు ఉపయోగపడతాయి. మన వాయుసేన వద్ద ఎక్కువ సంఖ్యలో ఉన్న సుఖోయ్ 30 ఎంకేఐ యుద్ధ విమానాలకు 'లోరా' క్షిపణులను చాలా సులువుగా అనుసంధానం చేయవచ్చు. ఒక్కో సుఖోయ్ ఫైటర్ 4 లోరాలను మోసుకెళ్లగలదు. అంటే ఒక ఫైటర్ వెళ్లి.. ఒకేసారి శత్రువు ఎయిర్‌బేస్‌లోని రన్‌వేను, కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను, రాడార్ వ్యవస్థలను ధ్వంసం చేయవచ్చు. బ్రహ్మోస్ ఒక్కో క్షిపణి ఖరీదు సుమారు రూ.34 కోట్లు కాగా, లోరా క్షిపణుల ఖరీదు సుమారు రూ.21 కోట్లు. బ్రహ్మోస్ అత్యంత తక్కువ ఎత్తులో రాడార్లకు చిక్కకుండా దూసుకెళ్తుంది. సాధారణ ప్రాంతాల్లోని లక్ష్యాలను ఛేదించేందుకు అనుకూలం. లోరా క్షిపణులు ఎత్తయిన, పర్వత ప్రాంతాల్లోని లక్ష్యాలను సమర్థవంతంగా ధ్వంసం చేసేందుకు వీలు కల్పిస్తాయి. లోరా క్షిపణులను మన దేశంలో ఉత్పత్తి చేసేందుకు ఐఏఐ, భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ మధ్య 2023లోనే అవగాహన ఒప్పందం కుదిరింది. సాంకేతిక బదిలీ, ఇతర అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది. అంతా అనుకున్నట్టుగా జరిగితే 2026-27నాటికి లోరా క్షిపణులు వాయుసేన అమ్ములపొదిలోకి చేరనున్నాయి.

త్వరలోనే కొత్త లైఫ్ సైన్సెస్ విధానం

- పెట్టుబడులను ఆకర్షించేలా ప్రోత్సాహకాలు
- ఐదు లక్షల మందికి ఉపాధి అవకాశాలే లక్ష్యం
- అన్ని ఆస్పత్రుల్లో క్యాన్సర్‌ను గుర్తించే ఏఐ స్ర్కీనింగ్
- ఫార్మా టెక్ ఇన్నోవేటివ్ కాంక్లేవ్‌లో మంత్రి దుద్దిళ్ల


ఫార్మా టెక్ ఇన్నోవేటివ్ కాంక్లేవ్‌లో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్, జూలై 11(ఆంధ్రజ్యోతి): "లైఫ్ సైన్సెస్ రంగంలో తెలంగాణ బ్రాండ్‌ను విశ్వవ్యాప్తం చేసేందుకు త్వరలోనే నూతన విధానాన్ని ప్రకటిస్తాం. అంతర్జాతీయ ఫార్మా కంపెనీల నుంచి పెట్టుబడులను ఆకర్షించేలా కొత్త విధానంలో ప్రత్యేక ప్రోత్సాహకాలు ఉంటాయి" అని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. లైఫ్ సైన్సెస్ రంగాన్ని కేవలం పరిశ్రమలు, పరిశోధన-అభివృద్ధి (ఆర్‌అండ్‌డీ)కే పరిమితం చేయకుండా.. టెక్నాలజీ మేళవింపుతో ప్రజలకు ఉపయోగపడేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. హైటెక్ సిటీలోని ఓ హోటల్‌లో శుక్రవారం ఈటీ ఫార్మా టెక్ ఇన్నోవేటివ్ కాంక్లేవ్ రెండో ఎడిషన్‌ను మంత్రి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ను 'గ్లోబల్ లైఫ్ సైన్సెస్ హబ్'గా మార్చేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామని, కేవలం ఏడాదిన్నరలోనే రూ.50వేల కోట్లపైగా పెట్టుబడులను ఆకర్షించగలిగామన్నారు. కొత్త పెట్టుబడులతో కొత్తగా 60వేల మందికి ఉపాధి లభించిందన్నారు. 'మేడ్ ఇన్ తెలంగాణ' స్టెంట్లు, కేథెటర్లు యూఎస్, జపాన్ సహా 89 దేశాలకు ఎగుమతి అవుతున్నాయని గుర్తు చేశారు. లైఫ్ సైన్సెస్‌లో 5 లక్షల మందికి కొత్తగా ఉపాధి అవకాశాలను కల్పించనున్నామని, ఇందుకోసం రూ.లక్ష కోట్లతో దీర్ఘకాలిక పెట్టుబడి వ్యూహాన్ని అమలు చేయబోతున్నామని తెలిపారు. వికారాబాద్, నల్లగొండ, మెదక్‌లో ఫార్మా విలేజెస్ ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. అత్యుత్తమ నైపుణ్య మానవ వనరులను అందించాలనే లక్ష్యంతో 'లైఫ్ సైన్సెస్ యూనివర్సిటీ'ని ఏర్పాటు చేయబోతున్నామని తెలిపారు. సెంటర్ ఫర్ ఫోర్త్ ఇండస్ట్రియల్ రివల్యూషన్ (సీ4ఐఆర్) భాగస్వామ్యంతో సైన్స్ గ్రాడ్యుయేట్లను లైఫ్ సైన్సెస్ రంగంలో నిపుణులుగా తీర్చి దిద్దుతున్నామని వివరించారు. ఇప్పటికే మూడు జిల్లాల్లో నోటి, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్లను ముందే గుర్తించేందుకు ఏఐ ఆధారిత స్ర్కీనింగ్‌ను ప్రయోగాత్మకంగా ప్రారంభించామని, త్వరలోనే అన్ని ఆస్పత్రులు, వైద్య కళాశాలలకు విస్తరిస్తామని వెల్లడించారు.

భూతాపాన్ని తగ్గించేందుకు త్రిముఖ వ్యూహం

- 2047నాటికి పచ్చదనాన్ని 50 శాతానికి పెంచాలి
- పునరుత్పాదక ఇంధనంపై సమీక్షలో గవర్నర్ జిష్ణుదేవ్



హైదరాబాద్, జూలై 11(ఆంధ్రజ్యోతి): పెరుగుతున్న భూతాపాన్ని తగ్గించేందుకు దేశ ప్రధాని పిలుపుమేరకు త్రిముఖ వ్యూహంతో ముందుకు సాగాలని గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ పిలుపునిచ్చారు. 2047 నాటికి తెలంగాణలో పచ్చదనాన్ని 50శాతానికి పెంచాలనే లక్ష్యంతో మొక్కలు నాటే కార్యక్రమాలను ముమ్మరం చేయాలని, ఇంధన పరిరక్షణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ప్రభుత్వానికి సూచించారు. బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియన్సీ(బీఈఈ) దక్షిణ భారత మీడియా సలహాదారు ఏ.చంద్రశేఖర్‌రెడ్డి, ఎనర్జీ ఎఫిషియన్సీ సర్వీసెస్ లిమిటెడ్ (ఈఈఎస్ఎల్) అధికారులు శుక్రవారం గవర్నర్‌ను కలిసి ఇంధన సామర్థ్య రంగంలో కీలక పరిణామాలను వివరించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలను తగ్గించడానికి ప్రభుత్వాలతోపాటు ప్రజలు దృష్టి సారించాలని కోరారు. వాతావరణ మార్పుల వల్లే కలిగే ప్రభావాలను తగ్గించేందుకు ఇంధ న సామర్థ్యమే ఎక్కువగా దోహదపడుతుందన్నారు. సౌర విద్యుత్ తయారీలో మహిళలకు భాగస్వామ్యం కల్పించిన తెలంగాణ ప్రభుత్వ చొరవను ఆయన అభినందించారు. ఇళ్లల్లో వినియోగించే 16 ఉపకరణాలు తక్కువ విద్యుత్‌ను వినియోగించుకునేవై ఉండాలని, వీటిలో ఏసీలు, ఫ్యాన్లు, రిఫ్రిజిరేటర్లు సహా ఇతర పరికరాలు ఉన్నాయని బీఈఈ దక్షిణ భారత మీడియా సలహాదారు చంద్ర శేఖర్ రెడ్డి తెలిపారు. దీనిపై స్పందించిన గవర్నర్ ఈఈఎస్ఎల్ ద్వారా రాజ్‌భవన్, జేఎన్‌టీయూలో ఆడిట్ నిర్వహించి.. ఇంధన సమర్థవంతమైన క్యాంపస్‌లుగా మార్చడానికి సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని సూచించారు. ఈమేరకు ఈఈఎస్ఎల్ సీనియర్ అధికారి ఆదేశ్ సక్సేనా పదిహేను రోజుల్లో రాజ్‌భవన్‌లో ఇంధన ఆడిట్ నిర్వహిస్తామని గవర్నర్‌కు హామీ ఇచ్చారు.

కాళేశ్వరం, కృష్ణా జలాలపై అసెంబ్లీలో చర్చకు సై


కెమెరా తిప్పొద్దు, మైక్ కట్ చేయొద్దు.. శాసనసభను వాయిదా వేసి పోవొద్దు

- మాజీ మంత్రి హరీశ్‌రావు సవాల్

హైదరాబాద్, జూలై 11(ఆంధ్రజ్యోతి): 'కాళేశ్వరం బ్యారేజీలు, కృష్ణా జలాలపై దమ్ముంటే అసెంబ్లీలో చర్చిద్దాం. ఏ రోజైనా, ఎప్పుడైనా చర్చకు సిద్ధం. సభ జరుగుతున్నప్పుడు కెమెరా తిప్పొద్దు. మైక్ కట్ చేయొద్దు. అసెంబ్లీని వాయిదా వేసుకొని పోవొద్దు' అని మాజీ మంత్రి హరీశ్‌రావు సవాలు విసిరారు. దేవాదుల ఎత్తిపోతల పథకం, బనకచర్ల ఏ బేసిన్‌లో ఉందో తెలియనివారు సీఎం అయితే.. మంత్రిగా బాధ్యతలు స్వీకరించి 20 నెలలైనా బేసిక్స్ తెలియనివారు నీటిపారుదల శాఖ మంత్రిగా ఉన్నారని ఎద్దేవా చేశారు. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌ను శుక్రవారం కలిసిన ఆయన.. కాళేశ్వరం బ్యారేజీలకు సంబంధించి, ఆరుసార్లు మంత్రివర్గ తీర్మానం, మూడుసార్లు అసెంబ్లీలో ఆమోదం పొందిందని పేర్కొంటూ 100 పేజీల నివేదికను హరీశ్‌రావు సమర్పించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడారు. 'రేవంత్ రెడ్డి అతి తెలివి మాటలు మాట్లాడుతున్నాడు. ఉమ్మడి ఏపీలో 54లక్షల ఎకరాలకు నీళ్ల ఇచ్చామన్నాడు. బీఆర్ఎస్ హయాంలో 17లక్షల ఎకరాలకు కొత్త ఆయకట్టు, 31 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరణ చేశాం. మొత్తం 48 లక్షల ఎకరాలకు నీళ్ల ఇచ్చాం.' అని చెప్పారు. 2004-2014 దాకా పదేళ్ల కాంగ్రెస్ పాలనలో మొత్తం ఆరు లక్షల ఎకరాలకే సాగునీరు ఇచ్చారని పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రికార్డు స్థాయిలో సాగు విస్తీర్ణం పెరిగిందని అబద్ధాలు చెబుతున్నారన్నారు. 20 నెలల్లో ఒక్క చెరువు, ఒక్క కాలువ అయినా తవ్వారా అని ప్రశ్నించారు. ఒక్క ప్రాజెక్టు అయినా కట్టినట్లు చూపించండని నిలదీశారు. శ్రీశైలం కుడి కాల్వ లైనింగ్ పాపం కాంగ్రెస్‌దేనని, పోతిరెడ్డిపాడు నుంచి నీటి తరలింపు 20 నెలల్లోనే జరిగిందని ఆరోపించారు. కృష్ణా జలాల్లో 34 శాతం తెలంగాణకు చాలని సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్ సంతకాలు చేశారని మండిపడ్డారు. 60 టీఎంసీలను గురుదక్షిణగా చంద్రబాబుకు ఇచ్చారని ఆరోపించారు.

కవర్ పాయింట్ ప్రజెంటేషన్..

ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చినది పవర్ పాయింట్ ప్రజంటేషన్ కాదని అది 50 ఏళ్ల కాంగ్రెస్ ద్రోహ చరిత్రకు కవర్ పాయింట్ ప్రజంటేషన్ అని హరీశ్ మండిపడ్డారు. కృష్ణా జలాల్లో ఉమ్మడి ఏపీకి 811 టీఎంసీలు కేటాయిస్తే.. అందులో 299 టీఎంసీలు తెలంగాణకు చాలని, ఏపీకి 512 టీఎంసీలు కేటాయించాలని శాశ్వత ఒప్పందం చేసుకున్నారంటూ అబద్ధం చెప్పడం సిగ్గుచేటని విమర్శించారు. తాత్కాలిక వినియోగానికి, నీటి పంపకానికి తేడా తెలియకుండా రేవంత్‌రెడ్డి మాట్లాడుతున్నారన్నారు. ఉమ్మడి ఏపీలో జానారెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వంటి చేతకాని నాయకుల వల్లే 299 టీఎంసీల వినియోగానికే అవకాశం దొరికిందని ఆక్షేపించారు. రాష్ట్రాల వారీగా నీటిని పంచాలని తెలంగాణ ఏర్పడిన 42 రోజులకే కేంద్రాన్ని కోరుతూ కేసీఆర్ లేఖ రాశారని హరీశ్ గుర్తు చేశారు. కృష్ణా జలాల్లో శాశ్వత ఒప్పందం చేసుకొని ఉంటే.. సెక్షన్-3 కింద నీటి పంపకాలు ఎందుకు అడుగుతామని ప్రశ్నించారు. సుప్రీంకోర్టు గడపతొక్కి, నిర్విరామ పోరాటం చేసి, కేంద్రం మెడలు వంచి, సెక్షన్-3 సాధించామని చెప్పారు. ఆ సెక్షన్-3 ప్రకారం తెలంగాణ న్యాయవాదులు 763 టీఎంసీల కోసం వాదనలు వినిపిస్తుంటే.. కృష్ణాలో 500 టీఎంసీలు చాలని రేవంత్‌రెడ్డి, 535 టీఎంసీలు చాలని ఉత్తమ్ చెబుతున్నారని మండిపడ్డారు. గోదావరిలో 1000 టీఎంసీలు, కృష్ణాలో 500 టీఎంసీలు ఇస్తే చాలని ఏ విధంగా చంద్రబాబుకు ఆఫర్ ఇస్తారని ప్రశ్నించారు. గోదావరి జలాల్లో 2918 టీఎంసీలు కావాలని కేసీఆర్ కోరారని గుర్తు చేశారు.



నీటి లభ్యత లేదని చెప్పింది సీడబ్ల్యూసీయే

తుమ్మిడిహెట్టి వద్ద 102 టీఎంసీలు, మేడిగడ్డలో 282 టీఎంసీల నీటి లభ్యత ఉందని సీడబ్ల్యూసీ చెప్పిందని హరీశ్ తెలిపారు. కాళేశ్వరం విచారణలో పలు వివరాలు ప్రభుత్వం కమిషన్‌కు ఇచ్చిందని ప్రచారం జరుగుతోందని, అసలు ఇచ్చిందా లేదా అన్న అనుమానంతోనే 100 పేజీలతో తానొక నివేదిక ఇచ్చానని చెప్పారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లబ్యారేజీలకు సంబంధించి ఆరుసార్లు క్యాబినెట్ సమావేశమయిందని, మూడుసార్లు శాసనసభ ఆమోదం కూడా ఉందని గుర్తు చేశారు. కమిషన్ విచారణపూర్తయ్యాకా కమిషన్‌కు అందించిన వివరాలన్నీ బయటపెడతామని స్పష్టం చేశారు. కాగా, తెలంగాణ సాగునీటి ప్రాజెక్టులకు ప్రముఖ ఇంజనీరు నవాబ్ అలీ నవాజ్ జంగ్ బహదూర్ ఆద్యుడని, ఇరిగేషన్ రంగంలో ఆయన చెరగని ముద్ర వేశారని హరీశ్‌రావు ఎక్స్‌వేదికగా పేర్కొన్నారు. సర్‌ఆర్థర్ కాటన్, కేఎల్‌రావు, మోక్షగుండం విశ్వేశ్వరయ్య వంటి దిగ్గజాలసరసన నిలిచిన గొప్ప ఇంజనీర్ మనతెలంగాణలో పుట్టడం గర్వకారణన్నారు. నవాజ్‌జంగ్ జయంతి సందర్భంగా ఆయన సేవలను స్మరించుకున్నారు.

జనం నమ్మకాన్ని నిలబెట్టుకోవాలి: మంత్రి దామోదర

- నాగర్ కర్నూలులో మెడికల్ కళాశాల నూతన భవనం ప్రారంభం
- 550 పడకల ఆస్పత్రికి శంకుస్థాపన

నాగర్‌కర్నూల్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): వైద్యులను జనం దేవుడితో సమానంగా భావిస్తారని, ఆ నమ్మకాన్ని వైద్యులు కచ్చితంగా నిలబెట్టుకోవాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ అన్నారు. శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో మెడికల్ కళాశాల నూతన భవనాన్ని ప్రారంభించిన ఆయన రూ.235 కోట్ల వ్యయంతో నిర్మించబోతున్న 550 పడకల ఆస్పత్రికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందన్నారు. అత్యాధునిక టెక్నాలజీతో వైద్య రంగాన్ని సామాన్య ప్రజలకు చేరువ చేస్తున్నామని, రాష్ట్రంలో ప్రతీ 35 కి.మీ.కు ఓ ట్రామా కేంద్రం, ప్రతీ జిల్లాకు నర్సింగ్ కళాశాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. తెలంగాణలోని నాలుగు ప్రధాన నగరాల్లో క్యాన్సర్ నిర్ధారణ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. వచ్చే ఏడాదిలోగా మెడికల్ కళాశాలల్లో నిమ్స్, ఉస్మానియా తరహాలో వైద్య సదుపాయాలను అందుబాటులోకి తేస్తామని తెలిపారు. గత ప్రభుత్వం మెడికల్ కళాశాలల్లో మౌలిక సదుపాయాలను కల్పించడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలోని మెడికోల రవాణా సదుపాయం కోసం రూ.50 లక్షలు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రసంగిస్తూ.. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో రూ.235 కోట్లతో 550 పడకల ఆసుపత్రికి శంకుస్థాపన చేయడం చరిత్రాత్మకమన్నారు. నిధులు అవసరమైతే ప్రభుత్వం నుంచే కాకుండా తన చారిటీ ద్వారా మంజూరు చేస్తానని భరోసానిచ్చారు. కార్యక్రమంలో నాగర్‌కర్నూల్, అచ్చంపేట ఎమ్మెల్యేలు చిక్కుడు వంశీకృష్ణ, కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.


మహిళా సంఘాల ప్రతినిధులకు ప్రమాద బీమా చెక్కును అందిస్తున్న మంత్రులు దామోదర, కోమటిరెడ్డి

ఆగని మృత్యుఘోష

కల్తీ కల్లు ఘటనలో మరొకరి మృతి.. తొమ్మిదికి పెరిగిన మృతుల సంఖ్య

- ఇంకా ఆస్పత్రుల్లో 48 మంది

హైదరాబాద్ సిటీ, హైదర్‌నగర్, నిమ్స్, జూలై 11(ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి కల్తీ కల్లు ఘటనలో మృత్యుఘోష కొనసాగుతోంది. కల్తీ కల్లు తాగి అస్వస్థతకు గురైన వారిలో చాకలి పెద్ద గంగారం(70) శుక్రవారం తెల్లవారుజామున గాంధీ ఆస్పత్రిలో మరణించాడు. దీంతో ఈ ఘటనలో మృతుల సంఖ్య తొమ్మిదికి చేరింది. కామారెడ్డి జిల్లా బిచ్కుంద మండలం పుల్కల్ గ్రామానికి చెందిన పెద్ద గంగారం.. కొంతకాలంగా ఆల్విన్‌కాలనీ డివిజన్ ఆదర్శనగర్‌లో ఉంటున్నాడు. ఓ ప్రమాదంలో కుడి చేయి పోగొట్టుకున్న పెద్దగంగారం స్థానికంగా భిక్షాటన చేస్తూ వచ్చిన డబ్బుతో కల్లు తాగేవాడు. మరోపక్క, కల్తీ కల్లు తాగి అస్వస్థతకు గురైన వారిలో ఇంకా 48 మంది గాంధీ, నిమ్స్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. నిమ్స్ ఆస్పత్రిలో 35 మందికి చికిత్స కొనసాగుతుండగా వారిలో తొమ్మిది మందికి డయాలసిస్ చేస్తున్నారు. నిమ్స్ నుంచి ఐదుగురిని శుక్రవారం డిశ్చార్జి చేశారు. గాంధీ ఆస్పత్రిలో ప్రస్తుతం 18 మందికి డయాలసిస్ చేస్తున్నారు. ఓ బాధితుడు ఎవరికీ చెప్పకుండా గాంధీ ఆస్పత్రి నుంచి వెళ్లిపోయాడు. కాగా, ఇందిరానగర్ కాలనీలోని కల్లు కాంపౌండ్‌ను అధికారులు శుక్రవారం సీజ్ చేశారు. కల్తీ కల్లు ఘటన బాలానగర్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన నేపథ్యంలో విచారణకు ఆదేశించిన ఉన్నతాధికారులు.. బాలానగర్ ఎక్సైజ్ సీఐ వేణుకుమార్‌ను సస్పెండ్ చేశారు. మరో నలుగురు క్షేత్రస్థాయి సిబ్బందిపై కూడా చర్యలు తీసుకున్నట్టు సమాచారం. ఇంత పెద్దఎత్తున కల్తీ కల్లు విక్రయాలు జరుగుతున్నా పట్టించుకోని జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారి, ఇద్దరు ఏఈఎస్ (అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్)లు, ఓ ఈఎస్ (ఎక్సైజ్ సూపరింటెండెంట్)పై దర్యాప్తు కొనసాగుతున్నట్లు తెలిసింది.


పెద్దగంగారం


ఎక్సైజ్ సీఐ వేణుకుమార్

10 గ్రా. అల్ప్రాజోలంతో 1200 సీసాలు

నిబంధనల ప్రకారం తాటి చెట్ల నుంచి తీసిన కల్లును మాత్రమే దుకాణాల్లో విక్రయించాలి. చాలా చోట్ల ఈ పరిస్థితి లేదు. దీంతో కల్లు కాంపౌండ్ నిర్వాహకులు కల్తీ దందాకు తెరలేపారు. అల్ప్రాజోలం, డైజోఫామ్, క్లోరల్‌హైడ్రేడ్ వంటి రసాయనాలతో కల్తీ కల్లు తయారు చేసి విక్రయిస్తున్నారు. క్లోరల్ హైడ్రేడ్ కిలో రూ.250, డైజోఫాం కిలో రూ.500 కాగా కిలో అల్ప్రాజోలం రూ.15 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు. అయితే, రూ.15వేల విలువైన 10 గ్రాముల అల్ప్రాజోలంతో 100 పెట్టెల కల్లు(1200 సీసాలు)ను తయారు చేస్తున్నట్లు తెలిసింది. ఒక సీసా కల్లు రూ.50కి విక్రయిస్తుంటారు. 100 పెట్టెలు అమ్మితే రూ.60వేల ఆదాయం వస్తుంది. ఒక్కో కాంపౌండ్‌లో రోజుకు 150-200 వరకు సీసాలు విక్రయిస్తారు. ఒక్కో నిర్వాహకుడు 4-5 దుకాణాలు నిర్వహిస్తూ నెలకు రూ.లక్షల్లో సంపాదిస్తున్నారు. కాసుల వర్షం కురుస్తుండడంతో పలువురు రాజకీయ నాయకులు ఈ దందాలోకి ప్రవేశించినట్లు ఆరోపణలు ఉన్నాయి. జిల్లాల వారీగా కల్లు కాంపౌండ్ లైసెన్సు కలిగిన వారికి నయానో భయానో చెల్లించి ఆయా దుకాణాలను తమ అనుచరులతో నడిపిస్తున్నారని తెలిసింది. ఈ దందా వెనుక రాజకీయ నాయకులు ఉండడంతో ఏం జరిగినా సరే ఎక్సైజ్ అధికారులు ఆ దుకాణాల జోలికి వెళ్లడంలేదనే ఆరోపణలు ఉన్నాయి.

గతంలో తనిఖీలు ఇలా..

కల్లు కంపౌండ్ నిర్వాహకులు గతంలో నిర్ణీత రుసుము చెల్లించి లైసెన్సులు పొందేవారు. ఆయా దుకాణాలను ఎక్సైజ్ కానిస్టేబుళ్లు తనిఖీలు చేసి కల్లు శాంపిళ్లను ల్యాబ్‌లకు పంపేవారు. అయితే, కల్తీ కల్లుతో ప్రజల ప్రాణాలు పోతున్న ఘటనలు అధికమవ్వడంతో 2012లో రాష్ట్రవ్యాప్తంగా కల్లు కాంపౌండ్లను మూసేశారు. తెలంగాణ ఏర్పాటయ్యాక.. కల్లు గీతను గీత కార్మికుల వృత్తిగా గుర్తించిన ప్రభుత్వం నిబంధనలకు లోబడి కల్లు దుకాణాల నిర్వహణకు 2014లో అనుమతిచ్చింది. ప్రభుత్వానికి చెల్లించాల్సిన లైసెన్సు రుసుమును కూడా రద్దు చేసింది. దీంతో లైసెన్స్‌లు ఉన్నవారు, లేనివారు అని తేడా లేకుండా తాడి కో ఆపరేటివ్ సొసైటీస్‌లో సభ్యులుగా ఉన్న వారి పేర్లతో బినామీలు కల్లు కంపౌండ్లు తెరిచారు. ఎక్సైజ్ శాఖ లెక్కల ప్రకారం రాష్ట్రంలో 4064 తాడి కో ఆపరేటివ్ సొసైటీలున్నాయి. వీటిల్లో 2,24,663 మంది సభ్యులుండగా వారిలో 29,272 మందికి కల్లు కాంపౌండ్ లైసెన్సులున్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలో 3,541 కల్లు కాంపౌండ్‌లు నడుస్తున్నాయి.

ఆగస్టు 13న హైదరాబాద్‌లో.. దివ్యాంగుల మహాగర్జన

- మంద కృష్ణ మాదిగ

పంజాగుట్ట, జూలై 11 (ఆంధ్రజ్యోతి): తీవ్ర వైకల్యం కలిగిన కండరాల క్షీణత వ్యాధిగ్రస్తులకు రాష్ట్ర ప్రభుత్వం నెలకు రూ.15 వేల పెన్షన్ ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. ఏపీలో నెలకు రూ.15 వేలు ఇస్తున్నారని, ఇక్కడ ఎందుకివ్వరని ప్రశ్నించారు. ఆగస్టు 13న చలో హైదరాబాద్ దివ్యాంగుల మహాగర్జనకు సంబంధించిన సన్నాహక సదస్సుకు మద్దతుగా తెలంగాణ మస్క్యులర్ డిస్ట్రోఫీ అసోసియేషన్, వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తీవ్ర వైకల్యం కలిగిన కండరాల క్షీణత వ్యాధిగ్రస్తులకు నెలకు రూ.15 వేల పెంపుపై 'మా గోస పేరు'తో సదస్సు జరిగింది. ఈ సందర్భంగా మంద కృష్ణ మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు సామాజిక పింఛన్ రూ.4వేలు, దివ్యాంగుల పింఛన్ రూ.6 వేలు, తీవ్ర వైకల్యం కలిగిన కండరాల క్షీణత వ్యాధిగ్రస్తులకు రూ.15 వేల పెన్షన్‌ను మంజూరు చేసి హామీ ఇచ్చిన రోజు నుంచి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

స్టాప్ బోర్డును మార్చడం.. బ్రేక్ వేయడంలో ఆలస్యం

- చార్మినార్ రైలు పట్టాలు తప్పడానికి కారణం

న్యూఢిల్లీ, జూలై 11: బ్రేక్ వేయడంలో ఆలస్యం, అత్యవసర బ్రేక్‌ను వేయకపోవడం, స్టాప్ బోర్డును ప్లాట్‌ఫామ్ డెడ్ ఎండ్‌కు మార్చడం వంటివి గత ఏడాది హైదరాబాద్ స్టేషన్‌లో చార్మినార్ ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పడానికి కారణమైనట్టు కమిషనర్ ఆఫ్ రైల్వే సేఫ్టీ(సీఆర్ఎస్) నివేదిక వెల్లడించింది. 2024 జనవరి 10న చార్మినార్ ఎక్స్‌ప్రెస్ హైదరాబాద్ స్టేషన్‌లో ఐదో నంబరు ప్లాట్‌ఫాంపై నేరుగా వెళ్లి డెడ్ ఎండ్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో ఆరుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటనపై సీఆర్ఎస్ సౌత్ సెంట్రల్ సర్కిల్ దర్యాప్తు చేపట్టింది. లోకోపైలట్ ఆటోమేటిక్ బ్రేక్‌ను ఆలస్యంగా వేశారని, అసిస్టెంట్ లోకోపైలట్ ఎమర్జెన్సీ బ్రేక్ వేయడంలో విఫలమైనట్టు దర్యాప్తు నివేదికలో పేర్కొంది. స్టాప్ బోర్డును స్టేషన్ అడ్మినిస్ట్రేషన్ డెడ్ ఎండ్‌కు మార్చడం కూడా ప్రమాదానికి దారితీసినట్టు తెలిపింది.

హ్యాట్రిక్ మృత్యుంజయుడు

- ఒకే రోజు మూడు సార్లు చావు అంచులదాకా వెళ్లొచ్చిన వ్యక్తి


మనోజ్

కౌటాల, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ప్రమాదమో, మరేదైనా కారణం వల్లనో ఎవరైనా చావు అంచుల దాకా వెళ్లి ప్రాణాలతో బయటపడితే వాళ్లని మృత్యుంజయులు అంటారు. అలాంటిది కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన ఓ వ్యక్తి ఒకే రోజు ఒకటి కాదు రెండు కాదు ఏకంగా మూడు సార్లు చావు అంచుల దాకా వెళ్లి ప్రాణాలతో నిలిచి హ్యాట్రిక్ మృత్యుంజయుడిగా నిలిచి జనం నోరెళ్లబెట్టేలా చేశాడు. కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలం తాటిపెల్లి గ్రామానికి చెందిన చన్నెకార్ మనోజ్ కొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధపడుతూ మతిస్థిమితం కోల్పోయాడు. రోజూ ఇంట్లోంచి వెళ్లి ఇష్టమొచ్చినట్లు తిరుగుతుంటాడు. శుక్రవారం ఉదయం కూడా అలానే ఇంట్లో నుంచి బయటికెళ్లిన మనోజ్.. ఒకటికి మూడు సార్లు చావును పలకరించాడు. తొలుత తాటిపల్లికి సమీపంలోని ఓ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌పైకి ఎక్కి మనోజ్ పడుకున్నాడు. ఆ సమయంలో విద్యుత్ సరఫరా లేకపోవడంతో బతికిపోయాడు. దీనిని గమనించి నానాపాట్లు పడి మనోజ్‌ను అతికష్టం మీద కిందికి దించిన స్థానికులు, విద్యుత్ అధికారులు హమ్మయ్యా అనుకున్నారు. కాసేపటికే మనోజ్ తనకు దొరికిన ఓ కత్తితో శరీరంపై ఇష్టారాజ్యంగా పొడుచుకుని గాయాలు చేసుకున్నాడు. ఏం జరుగుతుందోనని భయపడిన అక్కడున్న వాళ్లంతా వారించడంతో కత్తిని పడేసిన మనోజ్ గ్రామ సమీపంలోని వార్దా నదివైపు పరుగెత్తాడు. దీంతో అతనికి నచ్చజెప్పి వెనక్కి తీసుకువచ్చేందుకు కుటుంబసభ్యులు, స్థానికులు ప్రయత్నిస్తుండగా.. మనోజ్ ఒక్కసారిగా నదిలో దూకేశాడు. వార్దాలో వరద ఉధృతి ఎక్కువగా ఉండడంతో అందరూ చూస్తుండగానే మనోజ్ ప్రవాహంలో కొట్టుకుపోయాడు. దీంతో మనోజ్ ప్రాణాలతో బయటపడే అవకాశం లేదని అంతా అనుకున్నారు. కానీ, నదిలో 25 కిలోమీటర్ల మేర కొట్టుకుపోయిన మనోజ్ నదికి ఆవలి తీరంలో మహారాష్ట్రలోని రాంపూర్ వద్ద తీరానికి చేరాడు. గమనించిన స్థానికులు అతడిని నీళ్లలో నుంచి బయటికి తెచ్చి వివరాలు అడిగారు. మనోజ్ కుటుంబసభ్యులకు ఫోన్ ద్వారా సమాచారమిచ్చారు. చివరికి శుక్రవారం రాత్రి మనోజ్‌ను తాటిపెల్లికి క్షేమంగా తీసుకొచ్చారు. ఇలా మనోజ్ హ్యాట్రిక్ మృత్యుంజయుడు అయ్యాడు.

నేడు నల్సార్, ఓయూకు సీజేఐ గవాయ్

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్): మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా శామీర్‌పేటలోని నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయంలో శనివారం నిర్వహించనున్న స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్ హాజరుకానున్నారు. గౌరవ అతిథులుగా సీఎం రేవంత్‌రెడ్డి, సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నరసింహ హాజరుకానున్నారు. అలాగే సీజేఐ గవాయ్ శనివారం ఉస్మానియా విశ్వవిద్యాలయానికి రానున్నారు. మధ్యాహ్నం మూడున్నర గంటలకు ఠాగూర్ ఆడిటోరియంలో "భారత రాజ్యాంగ రూపకల్పనలో బాబాసాహెబ్ డాక్టర్ బీఆర్.అంబేడ్కర్" అనే అంశంపై విశిష్టోపన్యాసం చేయనున్నారు. కాగా, శుక్రవారం హైదరాబాద్ చేరుకున్న గవాయ్‌కు శంషాబాద్ విమానాశ్రయంలో పలువురు ప్రముఖులు స్వాగతం పలికారు. సీఎస్ రామకృష్ణారావు, డీజీపీ జితేందర్ కలెక్టర్ నారాయణరెడ్డి, సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి, ఏజీ సుదర్శన్‌రెడ్డి తదితరులు సీజేఐని స్వాగతించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

తాలిబాన్ పక్షాన..!

అఫ్ఘానిస్థాన్‌లో తాలిబాన్ పాలనను తప్పుబడుతూ, దాని నిరంకుశ విధానాలూ అణచివేతలూ వివక్షలూ వదులుకోవాల్సిందిగా ఐక్యరాజ్యసమితి సర్వప్రతినిధి సభలో ప్రవేశపెట్టిన తీర్మానంమీద ఇటీవల సభ్యదేశాలు ఓటుచేశాయి. 116దేశాలు సమర్థిస్తే, అంటే తాలిబాన్‌కు వ్యతిరేకంగా నిర్ద్వంద్వంగా నిలబడితే, 12దేశాలు ఓటింగ్‌కు దూరంగా ఉంటే, రెండు దేశాలు తీర్మానానికి వ్యతిరేకంగా ఓటేశాయి. అంటే, అఫ్ఘానిస్థాన్‌లో అణచివేతలూ, వివక్షలూ ఉన్నాయని ఇవి ఒప్పుకోలేదని అనుకోవాలి. మహిళల పట్ల అమానవీయంగా వ్యవహరించవద్దని, సర్వవివక్షలనూ పక్కనబెట్టి సమ్మిళితంగా వ్యవహరించాలన్న ఆ తీర్మానం వీటికి నచ్చలేదని అర్థం. ఆ రెండుదేశాలు అమెరికా, ఇజ్రాయెల్. ఇక, ఓటింగ్‌కు దూరంగా ఉండిపోయిన పన్నెండుదేశాల్లో భారత్ కూడా ఒకటి. తాలిబాన్‌కు వ్యతిరేకంగా ఓటుచేసిన దేశాల్లో ప్రధానంగా చెప్పుకోవాల్సింది పాకిస్థాన్.

వ్యూహాత్మక ఎత్తుగడగానో, స్పష్టత వద్దనుకున్నప్పుడో దేశాలు ఓటింగ్‌కు దూరంగా ఉండిపోతాయి. అయితే, ఆ ఎత్తుగడలోనూ, అస్పష్టతలోనూ ఆయాదేశాలు తమ సందేశాన్ని ఇస్తూనే ఉంటాయి. ఓటింగ్‌లో పాల్గొన్న దేశాలన్నింటిలోనూ ఓ పద్నాలుగు మినహా మిగతా నూటపదహారూ తాలిబాన్‌కు వ్యతిరేకంగా ఓటుచేసిన ఈ సందర్భంలో ఎవరెటు అన్నదే కాదు, ఎందుకు అన్నది కూడా మరింత స్పష్టంగా కనిపిస్తుంది. ఈ సర్వప్రతినిధి సభ తీర్మానానికి పెద్ద విలువేమీ లేదనీ, ఎలాగూ అత్యధికదేశాలు తాలిబాన్‌కు వ్యతిరేకంగా ఓటేసి, భారీ మెజారిటీతో దానిని నెగ్గించాయి కదా అనుకున్నా ఏ గట్టున ఎవరున్నారన్నది ముఖ్యమే. సెప్టెంబరు 11 దాడుల తరువాత, అఫ్ఘానిస్థాన్‌లో తాలిబాన్లకు వ్యతిరేకంగా అమెరికా అతిపెద్ద, సుదీర్ఘకాల యుద్ధం చేసింది. ఇస్లామిక్ తీవ్రవాదానికి అడ్డాగా మారిన అఫ్ఘానిస్థాన్‌నుంచి తాలిబాన్లను తరిమికొట్టి, తానుమెచ్చినవారిని కూచోబెట్టింది. తన బలగాలను అక్కడే ఉంచి, సరిహద్దుల్లో కాచుకుకూచున్న తాలిబాన్లతో పోరాడటానికి వీలుగా అక్కడి ప్రభుత్వ సైన్యాలకు శిక్షణ ఇచ్చింది. రెండుదశాబ్దాల అనంతరం అమెరికా తన సైన్యాలను ఉపసంహరించుకొని, తాలిబాన్ పునరాగమానికి మార్గం సుగమం చేసింది. అమెరికా సైన్యాలు పూర్తిగా తరలకముందే తాలిబాన్లు దేశాన్ని సునాయాసంగా కైవసం చేసుకున్నారు. అల్లా దయవల్ల తన పొరుగుదేశం తాలిబాన్ల చేతిలోకి వచ్చిందంటూ పాక్ మాజీ పాలకుడు ఇమ్రాన్‌ఖాన్ ఎంతో సంతోషించారు కానీ, తాలిబాన్‌ను గుప్పిట్లో పెట్టుకొని భారత్‌ను ఆడించవచ్చునన్న పాక్ పాలకుల కలలు అనతికాలంలోనే కల్లలైనాయి. సరిహద్దు ఉగ్రవాదంతో సహా అఫ్ఘాన్ నుంచి చాలా సమస్యలు ఎదురవుతూండటంతో తాలిబాన్ ఇప్పుడు దానికి శత్రువైంది.

అమెరికా వ్యతిరేక శక్తులకు ఆశ్రయం ఇవ్వబోనన్న హామీకి కట్టుబడివున్నంతకాలం తాలిబాన్‌తో ట్రంప్‌కు సమస్య ఉండదు. అఫ్ఘాన్‌లో వదిలిపోయిన ఆయుధాలను కూడా వెనక్కు ఇమ్మని అమెరికా గట్టిగా అడగడం లేదు. ఇరాన్‌తో ఘర్షణలు పెరుగుతున్న తరుణంలో, రాబోయే రోజుల్లో చైనాతో కయ్యం తప్పనిస్థితిలో అఫ్ఘానిస్థాన్ మరింత అవసరం. కాబూల్‌కు ఉత్తరదిక్కున ఉన్న అతిపెద్ద, అతికీలకమైన బగ్రామ్ ఎయిర్‌బేస్‌ను అమెరికాకు ఇచ్చేందుకు తాలిబాన్ ఒప్పుకున్నట్టుగా వార్తలు వస్తున్నాయి. జో బైడెన్ విధించిన ఆంక్షలను కూడా సడలించి తాలిబాన్లతో సయోధ్య పెంచుకుంటున్న ట్రంప్ ఇప్పుడు ఐక్యరాజ్యసమితిలోనే తాలిబాన్లను వెనకేసుకొచ్చారు.

ముప్పయేళ్ళక్రితం అఫ్ఘానిస్థాన్‌లో తాలిబాన్ అడుగుపెట్టింది మొదలు, దానిని అమెరికా తరిమికొట్టేవరకూ భారత్ చాలా సమస్యలూ ఉగ్రదాడులు ఎదుర్కొంది. అఫ్ఘాన్‌లో తాలిబాన్ వ్యతిరేక కూటమివైపు నిలబడింది కూడా. నాలుగేళ్ళక్రితం మలిరాకడలో తాలిబాన్ భారత్ వ్యతిరేక వైఖరిని పూర్తిగా వదులుకుంది. అఫ్ఘానిస్థాన్‌నుంచి భారత్‌మీద ఈగవాల నివ్వబోమని హామీ ఇచ్చింది. భారత్ సాయాన్నీ, పెట్టుబడులనూ కోరింది. అఫ్ఘాన్ పూర్వవిద్యార్థి ఒకరిని దౌత్యవ్యవహర్తగా గుర్తించడంతో మొదలై భారత అధికారులూ, మంత్రుల పర్యటనలతో సంబంధాలు మరింత బలపడ్డాయి. ఒకప్పుడు పాక్‌పక్కన ఉండి, భారతవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన తాలిబాన్ ఇటీవలి పహల్గాం ఉగ్రదాడిని నిర్ద్వంద్వంగా ఖండించడం గతంలో ఏమాత్రం ఊహకు అందనిది. పాకిస్థాన్ శత్రువు మనకు మిత్రుడు కావడంలో ఆశ్చర్యమేమీ లేదు కానీ, మన వ్యూహాత్మక, దౌత్య ప్రయోజనాలకోసం తాలిబాన్ దుశ్చర్యలను గుడ్డిగా సమర్థించాల్సిన అవసరమేమీ లేదు. పరిస్థితులు ఎల్లవేళలా ఒకేరీతిలో, అనుకూలంగానే ఉంటాయన్న నమ్మకమేమీ లేదు.

ప్రైవేట్ సంస్థలకే 'నిర్మాణ' బాధ్యతలు

భారత్-ఇంగ్లాండ్ మధ్య క్రికెట్ మ్యాచ్‌లు ఆసక్తితో చూస్తుండగా ప్రముఖ సిమెంట్ కంపెనీ వాణిజ్య ప్రకటన ట్యాగ్‌లైన్ ఒకటి నన్ను విశేషంగా ఆకర్షించింది. అదిలా ఉంది: 'As India Builds, India Grows'. ఇది నూటికి నూరుపాళ్ల సత్యం. అవును, మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఆర్థిక వ్యవస్థ విస్తరణ మధ్య బలమైన సానుకూల సంబంధముంటుంది. రోడ్లు, వంతెనలు, రైల్వేలు, విమానాశ్రయాలు, పాఠశాలలు, కళాశాలలు, ఆసుపత్రులు, కార్యాలయాలు మొదలైన వాటికి భవనాలు నిర్మించాలి. ఈ సామాజిక, సామూహిక సదుపాయాలను సమృద్ధిగా నిర్మించుకున్నప్పుడే ఆర్థిక వ్యవస్థ విస్తరణ సాధ్యమవుతుంది. ఈ మౌలిక సదుపాయాలను మనం సత్వరమే అభివృద్ధిపరచుకోవాలి. అయితే వాటిని ఎలా నిర్మించుకోవాలో మనం తెలుసుకుని తీరాలి.




▪ పి. చిదంబరం

'పళని' పలుకు

జవహర్‌లాల్ నెహ్రూ ఒక గొప్ప నిర్మాత. ఆయనను ద్వేషించేవారు చేస్తున్న విమర్శలు నయా పైసా విలువ లేనివి. 1947లో మన దేశ జనాభా 34 కోట్లు. అక్షరాస్యత రేటు కేవలం 12 శాతం. తన 17 ఏళ్ల ప్రధానమంత్రిత్వ కాలంలో నెహ్రూ ఎన్నో పాఠశాలలు, కళాశాలలు నిర్మించారు. ఐఐటీలు, ఐఐఎమ్‌లు, ఉక్కు కర్మాగారాలు, ఐఓసీ, ఓఎన్‌జీసీ, ఎస్‌ఎల్‌సీ, హెచ్ఏఎల్, బీహెచ్‌ఈఎల్, ఇస్రో, భాక్రానంగల్, హీరాకుడ్, దామోదర్ వ్యాలీ, ఇంకా ఎన్నో సమున్నత సంస్థలు, బహుళార్థ సాధక ప్రాజెక్టులు, పారిశ్రామిక సంస్థలకు ఆయనే అంకురార్పణ చేశారు, నిర్మించి అభివృద్ధి పరిచారు. ఇదంతా జరిగింది స్వాతంత్ర్య తొలి సంవత్సరాలలోను, అదీనూ విద్యా వ్యాప్తి చాలా తక్కువగా ఉన్న, సాంకేతికతలు అందుబాటులో లేని, మానవ వనరులకు నైపుణ్యాలు కొరవడిన కాలంలో అన్న వాస్తవాన్ని విస్మరించకపోతే నెహ్రూ నిర్మాణ సామర్థ్యం ఎంత మహోన్నతమైనదో అర్థమవుతుంది. నెహ్రూ నిర్మించినవి ఈ నాటికీ ఉన్నాయి, జాతి పురోగతికి అద్వితీయంగా దోహదం చేస్తున్నాయి. నెహ్రూ భారత్‌కు ఆర్థిక వనరులు తక్కువగా ఉండవచ్చునేమో కానీ, చిత్తశుద్ధి, అంకిత స్వభావం, ప్రతిభాపాటవాలు ఉన్న మానవవనరులు సమృద్ధిగా ఉన్నాయి.

క్రీస్తుశకం రెండవ శతాబ్దిలో చోళ చక్రవర్తి కావేరీ నదిపై గొప్ప ఆనకట్ట నిర్మించాడు. ప్రపంచంలో అత్యంత పురాతన ఆనకట్టలలో అదొకటి. నేటికీ ఉపయోగంలో ఉన్నది. వేలాది ఎకరాలకు సాగునీటి సదుపాయాన్ని కల్పిస్తున్నది. అంతకంటే ముఖ్యంగా వరదల నియంత్రణకు ఇతోధికంగా తోడ్పడుతోంది.

భారత్ నేటికీ ప్రతి రోజూ ఈ మహా నిర్మాణ కార్యకలాపాలను కొనసాగిస్తూనే ఉన్నది. అయితే ప్రైవేట్ రంగంలో నిర్మాణాల, ప్రభుత్వ రంగంలో నిర్మాణాల నాణ్యత, మన్నిక మధ్య ఎంత వ్యత్యాసమున్నదో ప్రతి పౌరుడికీ బాగా తెలుసు. ఈ రెండు విధాల నిర్మాణ కార్యకలాపాలలోనూ కాంట్రాక్టర్లు పాల్గొంటున్నారు. అయితే వారు ప్రవర్తిస్తున్న తీరుతెన్నులు వేర్వేరుగా ఉంటున్నాయి. నిర్మాణ ప్రక్రియలూ భిన్నమైనవి.



టెలీకమ్యూనికేషన్స్, విద్యుత్ పంపిణీ, రవాణారంగం, మైనింగ్, చమురు, సహజవాయువు అన్వేషణ తదితర రంగాలలో ప్రైవేటీకరణ పరిస్థితులను మెరుగుపరిచింది. నాణ్యమైన సేవలను అందించేందుకు దోహదం చేసింది. ప్రభుత్వ రంగ నిర్మాణ కార్యకలాపాలలోనూ అదే బాటను అనుసరించడం ఉత్తమం. సామూహిక, సామాజిక సదుపాయాల నిర్మాణంలో ఆరోగ్యకరమైన పోటీతో ప్రైవేట్ సంస్థలకు మరింత పాత్ర కల్పించడమే అన్ని విధాల శ్రేయస్కరం.

ప్రజల ధనంతో ప్రభుత్వ రంగంలో జరుగుతున్న నిర్మాణ కార్యకలాపాల తీరుతెన్నులను పరిశీలిద్దాం. ప్రైవేట్ నిర్మాణ కార్యకలాపాల నాణ్యత ఎంపిక చేసుకున్న ఆర్కిటెక్ట్, నియమించుకున్న కాంట్రాక్టర్, నిధుల లభ్యతపై ఆధారపడి భిన్నంగా ఉంటుంది. ప్రభుత్వ నిర్మాణ కార్యకలాపాలు, మరీ ముఖ్యంగా జాతీయ ప్రాధాన్యమున్న ప్రాజెక్టులకు భూమి, నిధుల పరంగా అవరోధాలు ఉండవు. అయితే మనం చూస్తున్నదేమిటి? హైవేలు, కొత్త రోడ్లు నిర్మాణమయి అవగానే కుంగిపోతున్నాయి. మురుగునీటిని తీసుకువెళ్లే కాలువలు లేదా గొట్టాలు పగిలిపోయి రోడ్లపై మురుగునీరు వెల్లువెత్తుతోంది. దేశ రాజధానిలోని అశోకా రోడ్డులో గత 18 నెలల్లో మురుగునీటి గొట్టాలు పగిలిపోవడం, రోడ్డు కుంగిపోవడం మూడుసార్లు సంభవించింది. రోడ్లు గుంతలమయమైపోతున్నాయి. ఆ బాటల్లో ప్రయాణిస్తున్న వాహనాలు ఆ గుంతల్లో పడిపోతున్నాయి. గ్వాలియర్‌లో రూ. 18 కోట్ల వ్యయంతో నిర్మాణమైన ఒక రోడ్డు 15 రోజులలోనే కుంగిపోయింది. గుజరాత్‌లోని మోర్బిలో మరమ్మతు నిర్వహించి వాహనాల రాకపోకలకు పునఃప్రారంభించిన ఒక వంతెన నాలుగు రోజులలోనే కూలిపోవడంతో 141 మంది మరణించారు. సరైన అర్హతలులేని కంపెనీకి ఆ వంతెన మరమ్మతు, పునరుద్ధరణ పనులను అప్పగించినట్టు విచారణలో వెల్లడయింది. సదరు కాంట్రాక్టర్ నాసిరకం సామగ్రిని ఉపయోగించడం వల్లే వంతెన కూలిపోవడం జరిగింది. బిహార్‌లో వంతెనలు నిర్మాణంలో ఉన్నప్పుడో లేదా నిర్మాణమైన వెంటనే కూలిపోతేనో ఆశ్చర్యపోయేవాళ్లు ఎవరూ ఉండరు సుమా! ఒక వంతెన అయితే నిర్మాణంలో ఉండగానే మూడుసార్లు కూలిపోయింది!

ఎంత సమయం, మరెంత ధనం వృథా! ఇందుకు పలు కారణాలు ఉన్నాయి. మొట్టమొదటి కారణం జవాబుదారీతనం పూర్తిగా లోపించడమే. ఒక వినాశనకర ప్రాజెక్టుకు పలువురు అధికారులు బాధ్యులయితే అంతిమంగా ఆ నష్టానికి ఏ ఒక్కరూ జవాబుదారీ కాదు అన్న రీతిలో పరిస్థితులు ఉన్నాయి. ఈ కారణంగా ప్రతి ఒక్కరూ బాధ్యతారహితంగా వ్యవహరించడం సాధారణమైపోయింది. రాజకీయ అవినీతి గురించి ప్రత్యేకంగా చెప్పేదేముంది? అపరిమిత ఆర్థిక లబ్ధిని సమకూర్చే మంత్రిత్వశాఖల విషయమై మంత్రుల మధ్య తీవ్ర పోటీ ఉంటోంది. చాలా రాష్ట్రాలలో 'రేట్ కార్డ్' ఉన్నది. ప్రాజెక్టులను అధ్వానంగా అమలుపరచడంలో కొన్ని విభాగాలు/ఏజెన్సీలు అప్రతిష్ఠను మూటకట్టుకుంటున్నాయి. ఈ విషయంలో పీడబ్ల్యూడీలు అగ్రగామిగా ఉన్నాయి. తక్కువ వ్యయ గృహ నిర్మాణాలు చేసే (ఇవి నిజానికి కాంక్రీట్ మురికివాడలు) డీడీఏ మొదలైన వాటి తీరుతెన్నులు కూడా ప్రశస్తంగా ఉండడం లేదు. హైవేస్, రైల్వేస్ పని తీరుకూడా ఇదే రీతిలో అధ్వానంగా ఉంటోంది.

ప్రభుత్వ రంగంలో నిర్మాణ కార్యకలాపాలు సమర్థంగా, ప్రజోపయోగకరంగా లేకపోవడమనేది ఒక క్లిష్ట సమస్య. అపరిష్కృతంగా కొనసాగుతున్న ఒక చిక్కుముడి. సాహసోపేతంగా అసాధారణ చర్యలు చేపట్టినప్పుడే అది పరిష్కారమవుతుంది. ఇందుకు సామాజిక, సామూహిక సదుపాయల నిర్మాణంలో ప్రభుత్వ ఏజెన్సీల ప్రమేయాన్ని దశల వారీగా తొలగించాల్సి ఉన్నది. ఇటువంటి 'సంస్కరణల'కు గతంలో ప్రయత్నాలు జరిగాయి, విఫలమయ్యాయి. మరోసారి అటువంటి సంస్కరణలకు ప్రయత్నించినా మళ్లీ విఫలమవడం ఖాయం. మార్గాంతరమేమిటి? టెలీకమ్యూనికేషన్స్, విద్యుత్ పంపిణీ, రవాణారంగం, మైనింగ్, చమురు, సహజవాయువు అన్వేషణ తదితర రంగాలలో ప్రైవేటీకరణ పరిస్థితులను మెరుగుపరిచింది. నాణ్యమైన సేవలను అందించేందుకు దోహదం చేసింది. ప్రభుత్వ రంగంలో నిర్మాణ కార్యకలాపాలలోనూ అదే బాటను అనుసరించడం ఉత్తమం. తొలుత వ్యయాలు పెరగవచ్చు, నిర్మాణ సంస్థలు ఒక కూటమిగా ఏర్పడడమూ జరుగుతుంది, సందేహం లేదు. అయితే లొసుగులు, లోపాలు సరిదిద్దుతూ సామూహిక, సామాజిక సదుపాయాల నిర్మాణంలో ఆరోగ్యకరమైన పోటీతో ప్రైవేట్ సంస్థలకు మరింత పాత్ర కల్పించడమే అన్ని విధాల శ్రేయస్కరం.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)


మూర్తీభవించిన మానవతే మెహెరలీ

'ప్రపంచ నగరం'గా పరిగణన పొందేందుకు ఒక నగరానికి ఉండవలసిన ప్రమాణాలు ఏమిటి? అవేమిటో నిర్ణయిస్తూ 2006లో నేను (ఇప్పుడు ఆగిపోయిన) ఒక పత్రికలో వ్యాసం రాశాను. 'ప్రపంచ నగరం' అనే ప్రతిపత్తిని కల్పించే అర్హతలు: నగరం చాలా పెద్దదిగా ఉండాలి; దానికి చారిత్రక గంభీరత ఉండాలి; నిత్యం అభివృద్ధి చెందుతున్న సాంస్కృతిక జీవనం ఉండాలి; భాష, మత, సామాజిక వైవిధ్యం అపారంగా ఉండాలి; జాతి పురోగతికి దోహదం చేసే ఒక ఆర్థిక శక్తి కేంద్రంగా ఉండాలి. ఈ ప్రమాణాల ఆధారంగా చూస్తే ప్రపంచంలో మూడే మూడు ప్రపంచ నగరాలు ఉన్నాయి. అవి: లండన్, న్యూయార్క్, ముంబై.

న్యూయార్క్ మేయర్ పదవికి పోటీపడుతున్న జోహ్రాన్ మమ్దానీ గురించి చదివినప్పుడు నాకు నా పాత వ్యాసం గుర్తుకు వచ్చింది. క్రైస్తవులు అత్యధికంగా ఉన్న లండన్ ఇప్పటికే ఒక ముస్లిం మేయర్‌ను ఎన్నుకున్నది. క్రైస్తవులు, యూదులతో పాటు నాస్తికులు గణనీయంగా ఉన్న న్యూయార్క్ సైతం త్వరలో ఒక అన్యమతస్థుడిని మేయర్‌గా ఎన్నుకోనున్నదా? ఈ ప్రశ్న గురించి తర్కిస్తూ ఉంటే మన మూడో ప్రపంచ నగరం ముంబై దశాబ్దాల క్రితమే ఆరుగురు ముస్లిం మేయర్లను ఎన్నుకున్నదన్న విషయం గుర్తుకు వచ్చింది. ఈ ఆరుగురిలో మొదటివారు 1934లోను, చివరివారు 1963లోను ఎన్నికయ్యారు.

ముంబై మేయర్లుగా ఎన్నికైన ఆ ఆరుగురిలో ఒకరిని జ్ఞాపకం చేసుకోవడమే ఈ కాలమ్ లక్ష్యం. ఆ వ్యక్తి ఆ పదవిలో స్వల్పకాలం మాత్రమే ఉన్నారు. అదే ఆయన ఏకైక ప్రత్యేకత గానీ, ప్రధాన విశిష్టత గానీ ఎంతమాత్రం కాదు. ఆయన పేరు యూసఫ్ మెహెరలీ. 75 సంవత్సరాల క్రితం ఇదే నెలలో ఆయన కీర్తిశేషుడు కావడం కూడా ఈ కాలమ్‌కు ప్రేరణ అయిన కారణాలలో ఒకటి. బాంబేలో 1903లో జన్మించిన మెహెరలీ ఆ నగరంలోనే పాఠశాల, కళాశాల విద్యాభ్యాసం చేశారు. విద్యార్థి దశలోనే మంచి వక్తగా పేరు పొందారు. న్యాయశాస్త్రంలో పట్టా పొందినప్పటికీ రాజకీయ భావాలు, అభిప్రాయాల కారణంగా న్యాయవాదిగా ప్రాక్టీస్ చేసేందుకు అవసరమైన లైసెన్స్‌ను ఆయనకు నిరాకరించారు. విద్యాభ్యాసం ముగిసిన తరువాత స్వాతంత్ర్య సమరంలో చురుగ్గా పాల్గొన్నారు. 1928లో అందరూ శ్వేతజాతీయులే ఉన్న సైమన్ కమిషన్‌కు వ్యతిరేకంగా తీవ్రంగా ఉద్యమించారు. రెండేళ్ల తరువాత ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని జైలుకు వెళ్లారు. 1934లో జాతీయ కాంగ్రెస్‌లో భాగంగా కాంగ్రెస్ సోషలిస్ట్ పార్టీ ఏర్పడినప్పుడు సామ్యవాద ఆలోచనా స్పష్టత, పార్టీ సిద్ధాంతాలను ప్రజలలోకి ప్రభావశీలంగా తీసుకువెళ్లగల నాయకుడుగా మెహెరలీ పేరు పొందారు. కార్మిక హక్కులను కాపాడే విషయంలో ఆయన ప్రత్యేక శ్రద్ధ చూపారు. అలాగే ఆసియా, ఆఫ్రికా దేశాలలో ప్రబలమవుతున్న వలసపాలన వ్యతిరేక ఉద్యమాలలో కూడా విశేష శ్రద్ధ చూపారు.

1930వ దశకంలో మెహెరలీ అవిరామంగా ఆసేతు హిమాచలం పర్యటిస్తూ సమాజంలోని అట్టడుగు వర్గాల వారిలో కూడా సోషలిస్టు సిద్ధాంతాలను ప్రభావదాయకంగా ప్రచారం చేశారు. అదే కాలంలో ఆయన ఐరోపా, అమెరికాలలో విస్తృతంగా పర్యటించి ఆయా దేశాలలోని డెమొక్రాటిక్ సోషలిస్టు పార్టీలు, నాయకులతో విస్తృత సంబంధాలు



లండన్ ప్రజలు ఇప్పటికే ఒక ముస్లిం మతస్థుడిని మేయర్‌గా ఎన్నుకున్నారు. న్యూయార్క్ ఓటర్లూ వచ్చే నవంబర్‌లో జరగనున్న ఎన్నికలలో జోహ్రాన్ మమ్దానీ వైపే మొగ్గుచూపవచ్చు. మన ముంబై దశాబ్దాల క్రితమే ఆరుగురు ముస్లిం మేయర్లను వరుసగా ఎన్నుకున్నది. స్వాతంత్ర్య సమరయోధుడు, సోషలిస్టు నేత, సైమన్ గో బ్యాక్ నినాద స్రష్ట యూసఫ్ మెహెరలీ వారిలో ఒకరు. తన నగర ఘనతను, దేశ ప్రతిష్ఠను నిజంగా సమున్నతం చేసిన ఆ దేశ భక్తుడి వంటి ఒక మేయర్‌ను ముంబై మళ్లీ ఎప్పుడు ఎన్నుకుంటుంది?

నెలకొల్పుకున్నారు.

ఏప్రిల్ 1942లో బాంబే మేయర్‌గా యూసఫ్ మెహెరలీ ఎన్నికయ్యారు. అదే ఏడాది ఆగస్టులో క్విట్ ఇండియా ఉద్యమాన్ని గాంధీ ప్రారంభించారు. బాంబేలో జరగనున్న ఏఐసీసీ సమావేశంలో పాల్గొనేందుకు గాంధీ రైలులో నగరానికి వచ్చినప్పుడు ఆయనకు మేయర్‌గా మెహెరలీ స్వాగతం పలికారు. ఆ ఏఐసీసీ సమావేశంలోనే చరిత్రాత్మక క్విట్ ఇండియా తీర్మానాన్ని ఆమోదించారు. క్విట్ ఇండియా నినాదాన్ని సృష్టించింది మెహెరలీయేనన్న ఐతిహ్యం ఒకటి ఉన్నది. అయితే ఇది ఆయనకు తప్పుగా ఆపాదించింది కావచ్చేమో?! ఒకటి మాత్రం స్పష్టం: 1928లో 'గో బ్యాక్ సైమన్' అన్న నినాదాన్ని ఇచ్చింది మెహెరలీయే. ఆ స్ఫూర్తిదాయక నినాదం ఆనాడే కాదు ఇప్పుడు కూడా భారతీయుల హృదయాలలో ప్రతిధ్వనిస్తూనే ఉన్నది. క్విట్ ఇండియా నినాదాన్ని ఇచ్చింది మెహెరలీయేనని మధు దండావతే తాను రాసిన 'మెహెరలీ జీవిత చరిత్ర'లో ప్రస్తావించలేదు. మహాత్మా గాంధీ ఆశీస్సులతో 1942 ఆగస్టు విప్లవం సందర్భంగా మెహెరలీ ఆధ్వర్యంలోని పద్మా పబ్లికేషన్స్ అనే సంస్థ 'క్విట్ ఇండియా' అనే శీర్షికతో ఒక చిన్న పుస్తకాన్ని తీసుకు వచ్చిందని మాత్రమే మధు దండావతే పేర్కొన్నారు.



▪ రామచంద్ర గుహ

గతానుగతం

యూసఫ్ మెహెరలీ గురించి నేను తొలుత 1980ల తొలినాళ్లలో ఒక స్నేహితుడి ద్వారా విన్నాను. కొన్ని సంవత్సరాల అనంతరం న్యూయార్క్‌లోని ఒక బుక్ షాప్‌లో అమెరికన్ జర్నలిస్ట్, చరిత్రకారుడు బెర్ట్రామ్ డి. ఉల్ఫె వ్యాస సంపుటి 'Strange Communists I Have Known' కొన్నాను. ఆ పుస్తకంలో మెహెరలీపై ఒక వ్యాసం ఉన్నది. ఆ వ్యాస శీర్షిక 'గాంధీ వెర్సెస్ లెనిన్'. చమత్కారంగా ఉన్న ఆ శీర్షిక వెన్వెంటనే చదివేలా ఆసక్తి రేకెత్తించింది.

మెహెరలీ 1930ల నడిమి సంవత్సరాలలో మొదటిసారి అమెరికా వెళ్లినప్పుడు ఆయనకు ఉల్ఫె పరిచయమయ్యాడు. ఆ పరిచయం స్నేహంగా వర్ధిల్లింది. మెహెరలీతో పరిచయం లేనప్పుడు ఉల్ఫెకు తెలిసిన వామపక్షవాదులు అమెరికన్ కమ్యూనిస్టులు మాత్రమే. సోవియట్ నియంతలు లెనిన్, స్టాలిన్‌లకు వారు విధేయులు. ఒక మంచి లక్ష్యాన్ని సాధించేందుకు ఎటువంటి అనైతిక మార్గాలనైనా అనుసరించవచ్చని విశ్వసించేవారు. మెహెరలీ సోషలిస్టు విశ్వాసాలలోని దయా స్వభావం, మానవతా దృష్టి ఉల్ఫెను విశేషంగా ఆకట్టుకున్నాయి. 'గాంధీ ప్రభావం వల్లే కాంగ్రెస్ సోషలిస్ట్ పార్టీ కమ్యూనిస్టుల అనైతిక పద్ధతులకు మెహెరలీ దూరంగా ఉండగలిగార'ని ఉల్ఫె అర్థం చేసుకున్నాడు.

మెహెరలీ గురించి ఆనందప్రదమైన కథనొకదాన్ని ఉల్ఫె చెప్పారు. ఆయన తన భారతీయ మిత్రుడిని కేప్‌కాడ్‌కు తీసుకువెళ్లారు. అట్లాంటిక్ మహాసముద్ర జలాలు మసాచుసెట్స్ బే జలాలు సంగమించే ప్రదేశమది. మెహెరలీ కారు దిగి చెప్పులు విడిచి ఆ సంగమ స్థలి జలాల్లోకి నడుచుకు వెళ్లారు. ఆ సంగమ జలాల్లో కొంత సేపు ధ్యానముగ్నుడై ఉండి తిరిగి వెనక్కి వచ్చారు. 'అప్పుడు ఆయన మోములో అనిర్వచనీయమైన ఆనందానుభూతిని గమనించాను. మెహెరలీ అంత సంతోషంగా ఉండడం నేను అంతకు ముందు ఎప్పుడూ చూడలేదు' అని ఉల్ఫె గుర్తు చేసుకున్నారు. 'నదుల సంగమమైనా, సాగరాల కూడలి అయినా, కాలవల కలయిక అయినా... జలాల సంగమ ప్రదేశాన్ని మహాపవిత్రమైన స్థలంగా మా భారతీయులు విశ్వసిస్తారు' మెహెరలీ తన అమెరికన్ స్నేహితుడికి వివరించారు.

మెహెరలీ మొదటిసారి అమెరికాను సందర్శించినప్పుడు బ్రిటిష్ వలసపాలన దుర్మార్గాల పట్ల ధర్మాగ్రహాన్ని వ్యక్తం చేయడాన్ని ఉల్ఫె గమనించారు. అయితే 1946లో రెండవసారి అమెరికాను సందర్శించిన సమయంలో బ్రిటిష్ పాలకుల గురించి ప్రేమాస్పదంగా మాట్లాడడం ఉల్ఫెను విస్మయపరిచింది. మెహెరలీ తన మిత్రుడికి ఇలా చెప్పారు: 'భారతీయ నాగరికత, సంస్కృతికి బ్రిటిష్ వారు చాలా మేలుచేశారు. మరీ ముఖ్యంగా బ్రిటిష్ సంప్రదాయంలో స్వతస్సిద్ధంగా ఉన్న వైయక్తిక, పౌర హక్కులు భారతీయులకు లభించేందుకు దోహదం చేశారు'. ఉల్ఫె దిగ్భ్రాంతి చెందాడు. 'మిమ్ములను సుదీర్ఘకాలం జైళ్లలో బంధించిన బ్రిటిష్ వారి 'న్యాయ వివేకం'ను ఎలా మెచ్చుకుంటున్నార'ని ప్రశ్నించగా మెహెరలీ మృదువుగా ఇలా సమాధానమిచ్చారు: 'వారు మమ్ములను అణచివేసినప్పటికీ ఆ విషయంలో వారు పూర్తిగా సంతోషదాయకంగా లేరు. ఇబ్బందిపడ్డారు. బ్రిటిష్ జైలులో నేను నిరాహార దీక్ష చేస్తే చదువుకోవడానికి మీ పుస్తకంగానీ, మరేదైనా పుస్తకం గానీ తప్పక అందుబాటులోకి వస్తుంది. అదే హిట్లర్ లేదా స్టాలిన్ జైళ్లలో అయితే నేను నిస్సందేహంగా ఫైరింగ్ స్క్వాడ్ ఎదుట నిలబడవలసివచ్చేది. గాంధీ కనుక సోవియట్ జైలులో ఖైదీగా ఉన్నట్లయితే తన మొదటి నిరసనకే ఆయన గల్లంతయిపోయేవారు. ఇంగ్లీష్ వారయితే ఆయన ధిక్కారం గురించి తమ పై అధికారులకు తప్పక తెలియజేసేవారు. ఎంతగా పరిహసిస్తున్నప్పటికీ మా మహాత్ముడిని తప్పక గౌరవించేవారు. అందుకే ఇంగ్లీష్‌వారు పాల్పడుతున్న దుష్ట పనులను వ్యతిరేకించండి, ఎట్టి పరిస్థితులలోను ఇంగ్లీష్ వారిని అసహ్యించుకోవద్దు అని గాంధీజీ మాకు బోధించారు. ఆయన మాటకు మేము కట్టుబడి ఉన్నాము'.

పరిపూర్ణ నిస్వార్థుడు కాబట్టే సదా ఇతరుల సంక్షేమం గురించి ఆలోచిస్తూ మెహెరలీ తన సొంత ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేశారు. ఈ కారణంగానే ఆయన అకాల మరణానికి గురయ్యారు. చివరి రోజుల్లో ముంబైలోని ఒక సుప్రసిద్ధ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మెహెరలీ జయప్రకాశ్ నారాయణ్‌కు ఇలా చెప్పారు: 'ఆసుపత్రిలో చనిపోవడం ద్వారా నాకు చికిత్స చేసిన డాక్టర్ల మంచి పేరుకు కళంకం తీసుకురావడం నాకు ఇష్టం లేదు. నన్ను ఇంటికి తీసుకువెళ్లండి. నా గృహంలోనే నేను చనిపోదలుచుకున్నాను'. ఇలా అంతిమ క్షణాలలో కూడా మెహెరలీ ఇతరుల బాగోగుల గురించే ఆలోచించారని దండావతే వ్యాఖ్యానించారు.

ముస్లింగా పుట్టిన వ్యక్తిని మేయర్‌గా ఎన్నుకోవడమనేది ఒకానొకప్పుడు ముంబైకు ఒక మామూలు విషయంగా ఉండేది. అదే ఆ మహానగర విశిష్ట లక్షణంగా కూడా ఉండేది. లండన్, న్యూయార్క్ నగరాలు ఇటీవలి దశాబ్దాలలో సామాజిక, మత పరమైన వైవిధ్యాన్ని స్వాగతించేవిగా పరిణమించగా ముంబై సంకుచిత దురభిమానాలకు, దురహంకారాలకు ప్రాధాన్యమిస్తున్న నగరంగా మారిపోయింది. ఎంత విషాదం! తన నగర ఘనతను, దేశ ప్రతిష్ఠను నిజంగా సమున్నతం చేసిన యూసఫ్ మెహెరలీ వంటి ఒక మేయర్‌ను ముంబై ఎప్పటికైనా మళ్లీ ఎన్నుకుంటుందా?

(వ్యాసకర్త చరిత్రకారుడు)

తెలుగువారి అపురూప కళాస్రష్ట

తెలుగులో ప్రాచీన చిత్రకళకు వేల సంవత్సరాల చరిత్ర ఉన్నప్పటికీ ఆధునిక చిత్రకళకు వందేళ్ల చరిత్ర మాత్రమే ఉంది. రాజమహేంద్రవాసి దామెర్ల రామారావుతో ఆధునిక ఆంధ్ర చిత్రకళ చరిత్ర ప్రారంభమైంది. గత వందేళ్లలో వడ్డాది పాపయ్య, బాపు, కె. రాజయ్య, కె. లక్ష్మాగౌడ్, అంట్యాకుల పైడిరాజు, సి.ఎస్.ఎన్. పట్నాయక్, బి.వి. నరసింహారావు, బి.ఎ. రెడ్డి, దేవగుప్తాపు శ్రీనాథ వుడయార్, జి. నరసింహారావు, గౌస్ బేగ్, పద్మశ్రీ ఎస్. కృష్ణారెడ్డి, పద్మశ్రీ ఎస్వీ. రామారావు, తోట నరసింహం తదితరులు మన చిత్రకళకు గుర్తింపు, గౌరవం తెచ్చారు.



వీరిలో కృష్ణారెడ్డి, ఎస్వీ రామారావులు చిత్రకళా సాధనతో పాటు బోధకులుగా కూడా పేరు పొందారు. కృష్ణారెడ్డి ప్రింట్ మేకింగ్‌లోను, రామారావు ఆధునిక చిత్రకళా రీతుల్లోను ప్రత్యేక గుర్తింపు పొందారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వీరిద్దరూ అమెరికాలో అత్యున్నత కళాకారులుగా పేరుపొందినా, మన రాష్ట్రంలో ఈ తరం చిత్రకారులకి వీరి గురించి అంతగా తెలియదు. అందుకు కారణం వీరు అమెరికాలో స్థిరపడటమే. చిత్రకళలో అనేక విభాగాలున్నాయి. అందులో ప్రింట్ మేకింగ్ అనేది భారతదేశంలో, ముఖ్యంగా మన తెలుగు రాష్ట్రాలలో అంతగా ప్రాచుర్యం పొందలేకపోయింది. విదేశాలలో ఈ కళాప్రక్రియకు ఎంతో ఆదరణ ఉన్నది. ఈ పద్ధతిలో చిత్రకారుడు అనుకున్న భావాన్ని ఒక జింక్ ప్లేటుపై గీసి, దానిని యాసిడ్‌లో ముంచితే, ఆ ప్లేటుపై చిత్రం గోచరిస్తుంది. దానిపై కావలసిన రంగులను వేసి, పేపరుపై ముద్రించడాన్ని ప్రింట్ మేకింగ్ అంటారు. ప్రింట్ మేకింగ్‌లో అనేక రకాలు, పద్ధతులు ఉన్నాయి. కాగితం, వస్త్రాలు, కలప, లోహం తదితరాలపై కూడా ముద్రించవచ్చు. ఎలక్ట్రానిక్ యుగం రాకముందు ప్రింట్ మేకింగ్ ద్వారానే ముద్రణలు జరిగాయి.

తెలంగాణకు చెందిన పి. గౌరి శంకర్, దేవరాజ్ డకోజీ, కె. లక్ష్మాగౌడ్, డి.ఎల్.ఎన్.రెడ్డి తదితరులు 1970 దశకంలో హైదరాబాద్ కేంద్రంగా ప్రింట్ మేకింగ్‌లో విశేష కృషి చేశారు. తరువాత దేవరాజ్ న్యూఢిల్లీ వెళ్ళి అక్కడ గర్హి స్టుడియో విభాగాధిపతిగా పనిచేశారు.

ప్రపంచంలో అగ్రశ్రేణి ప్రింట్ మేకరుగా గుర్తింపు పొందిన ఎస్. కృష్ణారెడ్డి చిత్తూరు జిల్లాకు చెందిన నందనూరులో 1925 జూలై 15న జన్మించారు. 1941లో శాంతినికేతన్‌లో ప్రఖ్యాత చిత్రకారుడు నందలాల్ బోస్ వద్ద శిష్యరికం చేసి, 1946లో ఫైన్ ఆర్ట్స్ పట్టా పొందారు. తరువాత 1947–50 వరకు మద్రాసు కళాక్షేత్రంలోని కళా విభాగానికి అధిపతిగా వ్యవహరించారు.

అనంతరం లండన్ విశ్వవిద్యాలయానికి చెందిన స్లేడీ స్కూల్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్‌లో శిక్షణ పొందారు. పారిస్‌లో శిల్పకళలో ప్రసిద్ధి పొందిన శిల్పి జడ్కిన్‌తో, మిలాన్‌లో మెరినో మెరినోతో ప్రింట్స్ రూపొందించడంలో కలిసి పనిచేస్తూ చిత్రకళను అధ్యయనం చేశారు. 1965 నుంచి పారిస్‌లోని అటులియర్ 17 స్టూడియోకు అసోసియేట్ డైరెక్టర్‌గా, విస్కాన్సిన్ విశ్వవిద్యాలయంలో ఆర్ట్ విభాగానికి ప్రొఫెసర్‌గా పనిచేశారు. కృష్ణారెడ్డి రూపొందించిన ప్రింట్ మేకింగ్‌లో టెక్నిక్, శిల్పకళలోని ప్రతిభ అతనికి ఎనలేని గుర్తింపు తెచ్చాయి. ఆయన చిత్రాలలోని లావణ్యం, రంగుల సొగసు, భావనలో సౌందర్యం, నూతన రీతులు కళాభిమానులు, విమర్శకుల్ని మెప్పించాయి. వారి చిత్రాలు, శిల్పాలు నైరూప్యంగా ఉంటాయి. అలాగే చిత్రాల్లో వాడిన రంగులు ప్రత్యేకంగా ఉండి ఆలోచింపచేస్తాయి.

కృష్ణారెడ్డి చిత్ర, శిల్పకళా ప్రతిభ గుర్తించిన కేంద్ర ప్రభుత్వం 1972లో పద్మశ్రీ పురస్కారంతో గౌరవించింది. 1980లో విశ్వభారతి విద్యాలయం గగన్ అబానీ పురస్కారాన్ని నాటి ప్రధాని ఇందిరాగాంధీ చేతుల మీదుగా బహుకరించారు. అదే సంవత్సరం తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఆయన్ని గౌరవ డాక్టరేట్‌తో సత్కరించింది. 1997లో అఖిలభారత లలిత కళల సంఘం వారిని 'కళారత్న' పురస్కారంతో గౌరవించింది. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రసిద్ధ చిత్రశాలల్లోనూ ఆయన చిత్రాలు ఉన్నాయి. ఆ మహాకళాకారుడు న్యూయార్క్‌లో 2018 ఆగస్టు 22న కన్నుమూశారు.

● సుంకర చలపతిరావు
కళారత్న అవార్డు గ్రహీత

(జూలై 15: కృష్ణారెడ్డి శతజయంతి)

యాక్సిడెంట్లకు హెడ్‌లైట్లూ కారణమే!

దేశంలో నిత్యం అనేక రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయి. వీటి ద్వారా ఏటా లక్షలాది మంది చనిపోవడమే కాకుండా ఎంతో మంది గాయపడుతున్నారు. రాత్రి వేళల్లోనే ఈ ప్రమాదాలు అత్యధికంగా జరుగుతున్నాయి. వీటికి కారణం అధిక వేగంతో వెళ్లే విదేశీ వాహనాలు, కళ్లపై అధిక ప్రభావంతో పడే హైబీమ్ లైటింగ్, తాగి వాహనాలు నడపటం... వంటివి. అభివృద్ధి చెందిన దేశాల్లో విశాలమైన రోడ్లు, తక్కువ జనాభా, ట్రాఫిక్ రూల్స్‌ను కచ్చితంగా పాటించడం వల్ల అక్కడ రోడ్డు ప్రమాదాలు తక్కువ. మన దగ్గర అలా కాదు. రోడ్డు భద్రత తక్కువ, ట్రాఫిక్ ఎక్కువ.

ఒకప్పుడు స్వదేశీ అంబాసిడర్, మారుతి తరహా కార్లు, బస్సులు, ద్విచక్ర వాహనాల వంటి మోటారు వాహనాలు పరిమిత వేగంతో ప్రయాణించేవి. వాటి హెడ్‌లైట్లపై సగం నల్లరంగు వేయటమో, నల్ల స్టిక్కర్లు అంటించడమో చేసేవారు. ఫలితంగా కాంతి అన్ని వైపులా ప్రసరించకుండా ఎదుటి వాహనాలు స్పష్టంగా కనిపించేవి. కానీ ప్రస్తుతం అలాంటివేవీ పాటించడం లేదు. దీంతో ప్రస్తుత వాహనాల హైబీమ్ లైట్ల కాంతి నేరుగా ఎదురుగా వచ్చే వాహనదారుల కళ్లపై పడుతోంది. వారికి ఎదుటి వాహనాలు కన్పించకపోవడంతో యాక్సిడెంట్లు జరుగుతున్నాయి. తద్వారా ప్రమాదాలు నానాటికీ పెరిగిపోతున్నాయి. ఎదుటి వాహనాలకు ఇబ్బంది లేని విధంగా లైటింగ్ ఏర్పాటు చేయాలని వాహన తయారీ కంపెనీలను కేంద్రం ఆదేశించాలి. రోడ్డు రవాణా, పోలీసు అధికారులు తమ బృందాలతో నిత్యం అప్రమత్తంగా ఉంటూ నిబంధనలు పాటించని వాహనదారులపై కఠిన చర్యలు తీసుకోవాలి. అప్పుడే ప్రమాదాలు తగ్గుతాయి.

– తిరుమలశెట్టి సాంబశివరావు

కేపీఎన్‌పీఎస్ రెండవ రాష్ట్ర మహాసభ

కులవ్యవస్థ నిర్మూలన కోసం 'కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి' (KANPS) 1992 నవంబర్ 22న అఖిలభారత స్థాయిలో ఏర్పడింది. అనివార్య కారణాల వల్ల ఆచరణలోకి అడుగుపెట్టలేదు. సంస్థ వ్యవస్థాపకుల్లో ఒకరైన ఉప్పుమావూలూరి సాంబశివరావు చొరవతో 2019 సెప్టెంబర్ 17న పెరియార్ 140వ జయంతి, శరద్ పాటిల్ (వ్యవస్థాపకులు-మహారాష్ట్ర) 94వ జయంతి సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో కార్యాచరణలోకి అడుగుపెట్టింది. విద్య, ఉద్యోగ రంగాలలో అగ్రకుల ఆధిపత్యాన్ని సుస్థిరం చేసుకోవడానికి తీసుకువచ్చిన ఈడబ్ల్యుఎస్ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా గళమెత్తింది. కుల అసమానతలు రూపుమాపడానికి జనగణనలో కులగణన చేపట్టాలని నినదించింది. ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ చట్టబద్ధత కోసం అట్టడుగు ఎస్సీ ఉపకులాల వైపు నిలబడింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, పేదలు, రైతులు, రైతు కూలీలు తమ జీవనోపాధి అయిన వ్యవసాయాన్ని విధ్వంసం చేస్తూ కాలుష్యాన్ని వెదజల్లి, పర్యావరణాన్ని దెబ్బతీసే చిత్తనూరు ఇథనాల్ కంపెనీ వ్యతిరేక ఉద్యమంలో క్రియాశీలక పాత్రను పోషించింది. 2022 నవంబర్ 22న హైదరాబాదులో తన మొదటి రాష్ట్ర మహాసభలను విజయవంతంగా పూర్తిచేసుకున్నది. ప్రస్తుతం ఆరేళ్ల కార్యాచరణతో 2వ రాష్ట్ర మహాసభలను 2025 జూలై 13న ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ హాల్, తెలంగాణ చౌరస్తా, మహబూబ్‌నగర్ పట్టణంలో జరపనున్నది. ఉదయం పది గంటల నుంచి నాలుగు సెషన్లలో ఈ సభ జరగనున్నది. పలువురు వక్తలు వివిధ అంశాలపై ప్రసంగిస్తారు.

– బండారి లక్ష్మయ్య, కేపీఎన్‌పీఎస్ ఆలిండియా కన్వీనర్

ఉరకలెత్తుతున్న గోదావరి

ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో పోటెత్తుతున్న ప్రవాహం



చిట్ ఇన్‌టేక్ వెల్ వద్ద గోదావరి వరద

అంతర్రాష్ట్ర రాకపోకలు నిలిపివేసిన పేరూరు పోలీసులు

- రామన్నగూడెం పుష్కరఘాట్ వద్ద మొదటి ప్రమాద హెచ్చరికకు చేరువలో..
- భూపాలపట్నం-హైదరాబాద్ జాతీయ రహదారిపై రాకపోకలకు బ్రేక్
- పేరూరు వద్ద 15.42 మీటర్లకు చేరిన నీటి ప్రవాహం
- పలు గ్రామాలకు నిలిచిన రాకపోకలు
- జలమయం అవుతున్న లోతట్టు ప్రాంతాలు.. అధికారుల అప్రమత్తం
- సమ్మక్క సాగర్‌లోకి భారీ వరద.. బ్యారేజీలోని మొత్తం గేట్లు ఎత్తివేత
- మేడిగడ్డ బ్యారేజీకి కొనసాగుతున్న వరద
- 8.68 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- మంగపేట మండలంలో గోదావరి వరదతో వ్యవసాయ భూములకు కోత

7



రామన్నగూడెం పుష్కరఘాట్ వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి నది



సమ్మక్క బ్యారేజీలోకి వస్తున్న వరద నీళ్లు



మాట్లాడుతున్న దయాకర్‌రావు

'స్థానిక' ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌దే విజయం

- బీసీలకు రిజర్వేషన్ ఎన్నికల స్టంట్
- సీఎం సహా అందరూ అందినంత దండుకుంటున్నారు..
- ఫోన్ ట్యాపింగ్‌లో నా ప్రమేయం లేదు..
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

వర్ధన్నపేట జూలై 11 (ఆంధ్రజ్యోతి): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ ఘన విజయం సాధించడం ఖాయమని బీఆర్‌ఎస్ నేత, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ధీమా వ్యక్తం చేశారు. వర్ధన్నపేట పట్టణంలో బీఆర్‌ఎస్ మండల విస్తృత స్థాయి సమావేశం శుక్రవారం మండల అధ్యక్షుడు తూళ్ల కుమారస్వామి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా దయాకర్‌రావు మాట్లాడుతూ.. ఏ ఎన్నికలు జరిగినా బీఆర్‌ఎస్ పార్టీ ఘన విజయం సాధించడం ఖాయమన్నారు. ఎక్కడికి వెళ్లినా కాంగ్రెస్ పార్టీపై వ్యతిరేకతతోపాటు బీఆర్‌ఎస్‌కు బ్రహ్మరథం పట్టడమే ఇందుకు నిదర్శనమన్నారు. ఇతర పార్టీల నుంచి వచ్చే వారిని స్థానిక సంస్థల ఎన్నికల ముందే తీసుకోవాలని, తరువాత తీసుకోబోమన్నారు. బీసీ రిజర్వేషన్ ఎన్నికల స్టంట్ అని అన్నారు. ఇళ్ల నిర్మాణం స్థానిక సంస్థల ఎన్నికల కోసమేనని, ఎన్నికల తర్వాత ఆ పథకాన్ని నీరుగార్చే ఆలోచనలో ఉన్నారన్నారు. విదేశాలలో సైతం రేవంత్‌రెడ్డి భారీగా నిధులు సమకూర్చుకున్నాడని ఆరోపించారు. ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలందరూ అందినంత దండుకుంటున్నారని ఆరోపించారు. రైతుబంధు ఏడాది ఎగ్గొట్టి రుణమాఫీ చేశారని, రుణమాఫీ సైతం చాలామంది రైతులకు

(మిగతా 7వ పేజీలో...)

వరుణుడు కరుణించడేమి!?



బకెట్ సహాయంతో పత్తి మొక్కలకు నీరు పోస్తున్న రైతు శివరాత్రి వెంకన్న

ఉమ్మడి జిల్లాలో 25.8 శాతం లోటు వర్షపాతం నమోదు

- జనగామ జిల్లాలో అత్యధికంగా 41 శాతం లోటు
- జూన్‌లో కురవని వర్షాలు, జూలైలో అదే పరిస్థితి
- నెలన్నర రోజుల సాగు కాలం పోయినట్టే..
- తడి లేక ఎండుతున్న మొక్కలు
- నార్లు పోయడంలో అన్నదాతల తడబాటు
- సేఫ్‌జోన్‌లోనే ఉన్నామంటున్న వ్యవసాయ అధికారులు

హనుమకొండ, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది రుతుపవనాలు ముందుగానే ప్రవేశించడంతో వర్షాలు పుష్కలంగానే కురుస్తాయని ఆశించిన రైతులకు నిరాశే ఎదురైంది. రోహిణి కార్తెలో ముందస్తుగా మురిపించిన వానలు... ఆ తర్వాత ఆశించినంతగా ఉండకపోవడంతో రైతులు ప్రత్యామ్నాయాలు వెతుక్కోవలసిన పరిస్థితి ఏర్పడింది. తొలకరి వర్షాలకే మురిసిపోయి దుక్కులు దున్ని విత్తనాలు వేశారు. కానీ ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లాలో ఆశించినంతగా వర్షాలు కురవలేదు. సాధారణ వర్షపాతం కన్నా తక్కువ వర్షపాతం నమోదైంది. జూన్ నెలారంభం నుంచి ఈనెల 11వ తేదీ వరకు ఉమ్మడి జిల్లాలో సగటున 25.8 శాతం తక్కువ వర్షం పడింది. జనగామ జిల్లాలో అత్యధికంగా 41శాతం లోటు వర్షపాతం రికార్డయింది. వాతావరణ శాఖ తెలిపిన వివరాల ప్రకారం ఆరు జిల్లాల్లో రెండింటిలోనే సాధారణ వర్షం కురవగా, మిగతా నాలుగు జిల్లాలో లోటు వర్షమే పడింది. 20 నుంచి 59 శాతం మేర తక్కువ వర్షం పడితే దానిని లోటుగా, 19 శాతం కన్నా తక్కువ వర్షం కురిస్తే దానిని సాధారణ వర్షపాతంగా, 59 నుంచి 100శాతం కన్నా తక్కువ వర్షం కురిస్తే దానిని తీవ్రమైన లోటు(వర్షాభావం)గా పరిగణిస్తారు.

రెండు జిల్లాల్లోనే సాధారణం

జూన్ 1 నుంచి ఇప్పటి వరకు మహబూబాబాద్ జిల్లాలో సాధారణ పాతం 211.1 మి.మీ. కాగా, 182.8 మి.మీ. వర్షం (లోటు 13 శాతం) కురిసింది. వరంగల్ జిల్లాలో 232.8 మి.మీ. సాధారణ వర్షపాతం కాగా, 191.9 మి.మీ. పడింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో సాధారణ వర్షం 233.7 మి.మీ. కాగా, 159.6 మి.మీ. (లోటు 37శాతం), హనుమకొండ జిల్లాలో సాధారణ వర్షపాతం 220 మి.మీ. కాగా, వాస్తవంగా 171.3 మి.మీ. (లోటు 22 శాతం), జనగామ జిల్లాలో సాధారణ వర్షపాతం 142 మి.మీ. కాగా, అతితక్కువగా 107.8 మి.మీ. (లోటు 41 శాతం), ములుగు జిల్లాలో సాధారణ వర్షపాతం 302.1 మి.మీ. కాగా, 230.2 మి.మీ. (లోటు 24 శాతం) వర్షపాతం రికార్డు అయింది. రానున్న రోజుల్లో సాధారణం కన్నా మించి వర్షాలు కురిస్తే తప్ప ఈ లోటు భర్తీ కాదు. ముందు ముందు ఇదే లోటు పరిస్థితి కొనసాగితే అన్నదాతలకు గడ్డుకాలమే. కిందటేడు ఇదేకాలంలో వరంగల్, హనుమకొండ, జనగామ జిల్లాలో సాధారణ వర్షపాతం రికార్డు అయింది. మహబూబాబాద్ జిల్లాలో



వర్ధన్నపేటలో వర్షం కోసం ఆకాశం వైపు చూస్తున్న రైతు ఆలకుంట్ల ఎల్లయ్య

(మిగతా 7వ పేజీలో...)

మేడారం జాతరకు భారీ ఏర్పాట్లు

- వనదేవతల ఘన కీర్తిని ప్రపంచానికి తెలియచేస్తాం..
- క్షేత్రాన్ని అద్భుతంగా అభివృద్ధి చేస్తాం
- పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క



మేడారంలో వనదేవతలను దర్శించుకుంటున్న మంత్రి సీతక్క

తాడ్వాయి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): వనదేవతలు సమ్మక్క, సారలమ్మల ఘన కీర్తిని ప్రపంచ వ్యాప్తంగా తెలియజేసే విధంగా మేడారంలో ఏర్పాట్లు చేస్తున్నామని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. శుక్రవారం తాడ్వాయి మండలంలోని మేడారం వనదేవతలను దర్శించుకొని మొక్కులు చెల్లించారు. అనంతరం పూజారులతో మాట్లాడుతూ 2026 జనవరి 28 నుంచి 31వ తేదీ వరకు జరుగబోయే మేడారం మహా జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు జరకుండా అన్ని ఏర్పాట్లను ముందుగానే చేస్తామని అన్నారు. ఆదివాసీ సంస్కృతి సంప్రదాయాలు దెబ్బతినకుండా అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, జంపన్నల ఘన కీర్తిని ప్రపంచానికి చాటి చెప్పే విధంగా ఏర్పాట్లు చేస్తున్నామని పూజారులకు వివరించారు. వేల సంవత్సరాల పాటు నిలిచేలా మేడారం దేవస్థానాన్ని సుందరీకరించి, అభివృద్ధి చేయడం జరుగుతుందని అన్నారు. ఇప్పటి వరకు జాతరలో శాశ్వత పనులు జరుగుతుండగా, మరో రూ.112 కోట్లతో సౌకర్యాల రూపకల్పనకు ప్రభుత్వానికి అంచనాలు తయారు చేసినట్లు చెప్పారు. మేడారం మహా జాతరను విజయవంతం చేయడానికి సీఎం రేవంత్‌రెడ్డి, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ కృషి చేస్తున్నారని తెలిపారు. ఇందులో భాగంగా క్యూలైన్ల విస్తరణ పనులు జరుగుతున్నాయని అన్నారు. జంపన్న వాగుకు ఇరువైపులా భక్తులు సేద తీరడానికి ఆహ్లాదకరమైన పార్కులు, సుందరీకరణ జరుగుతుందని మంత్రి పేర్కొన్నారు. ములుగు మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ రేగ కల్యాణి పదవీ బాధ్యతలు స్వీకరించి సమ్మక్క, సారలమ్మలకు మొదటి సారి మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంపత్‌రావు, దేవస్థానం కార్యనిర్వహణాధికారి వీరస్వామి, పూజారుల సంఘం అధ్యక్షుడు జగ్గారావు, సంబంధిత అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

రాంనగర్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా నగరంలోని పలు సబ్‌స్టేషన్‌ల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని హనుమకొండ టౌన్ డీఈ జి. సాంబరెడ్డి తెలిపారు. మచిలీబజార్ సబ్‌స్టేషన్ పరిధిలోని రాయపురవాడ, రాగన్న దర్వాజ, థౌజండ్ పిల్లర్ టెంపెల్, అలంకార్ సర్కిల్ ఏరియా, మడికొండ సబ్‌స్టేషన్ పరిధిలోని కుమ్మరిగూడెం, అయోధ్యపూర్, రాంపేట, తరాలపల్లి గ్రామంలో ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు, న్యూశాయంపేట, వడ్డెపల్లి, బాలసముద్రం, రాంపూర్ సబ్‌స్టేషన్, కడిపికొండ ఏరియాలో ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు, యాదవనగర్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 9.30 నుంచి 11.30 వరకు, టేకులగూడెం సబ్‌స్టేషన్ పరిధిలో సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు, వెస్ట్‌సిటీ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా జరగదని డీఈ తెలిపారు.



రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ స్నేహ శబరీష్

టీబీ ఆస్పత్రిని పరిశీలించిన కలెక్టర్

వరంగల్ మెడికల్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఎక్స్ రే పరీక్ష తీరును పరిశీలించేందుకు కలెక్టర్ స్నేహ శబరీష్ శుక్రవారం టీబీ హాస్పిటల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఎక్స్‌రే విభాగం పనితీరు, ఆస్పత్రిలోని ఓపీ విభాగంను పరిశీలించారు. టీబీ చికిత్స పొందుతున్న వారికి ముందుగా ఒక నెల పోషకాహార కిట్ అందించాలన్నారు. మిగతా వారికి కూడా పోషకాహార కిట్లు అందించే ప్రయత్నం చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ అప్పయ్య, డాక్టర్ సునీత, డాక్టర్ విజయలక్ష్మి డాక్టర్ హిమబిందు, టీహబ్ మేనేజర్ కౌముది తదితరులు పాల్గొన్నారు.

నెరవేరుతున్న పేదల కల

- ఇందిరమ్మ ఇళ్లకు చకచకా బిల్లుల మంజూరు
- భీమదేవరపల్లిలో సంబరాలు



భీమదేవరపల్లిలో శృతి-జలంధర్‌రెడ్డి దంపతులతో కాంగ్రెస్ నాయకులు

భీమదేవరపల్లి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల బిల్లులు చకచక మంజూరు అవుతుండటంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. భీమదేవరపల్లి మండల కేంద్రంలో మార్పాటి శృతి-జలంధర్‌రెడ్డి దంపతుల ఇందిరమ్మ ఇంటికి రూ.4లక్షలు మంజూరయ్యాయి. ఇక్కడ సుమారు 150 ఇళ్లు మంజూరు కాగా, 80 ఇళ్లకు పనులు ప్రారంభించారు. ఇందులో 2 ఇళ్లకు రూ. 4లక్షల చొప్పున, 12 ఇళ్లకు రూ.2లక్షల చొప్పున, 72 ఇళ్లకు రూ.లక్ష చొప్పున బిల్లులు మంజూరు చేశారు. గత ఏప్రిల్ 9న శృతి-జలంధర్‌రెడ్డి దంపతులకు ఇందిరమ్మ ఇల్లు మంజూరైంది. ఇంటి బేస్‌మెంట్ పూర్తయిన తర్వాత 15 రోజులకు రూ. లక్ష, గోడలు పూర్తయిన తర్వాత మరో రూ. లక్ష, ఇంటి కప్పు పూర్తయిన తర్వాత రూ. 2లక్షలు ప్రభుత్వం బిల్లులు మంజూరు చేసింది. ఈ నిధులతో పాటు కొంత డబ్బు కలుపుకొని ఇంటి నిర్మాణ పనులు పూర్తి చేస్తున్నట్లు శృతి దంపతులు తెలిపారు. తాము 420 చదరపు అడుగుల్లో కిచెన్, దేవుడి రూమ్, బెడ్‌రూం (అటాచ్డ్ బాత్రూం), హాల్ నిర్మించుకుంటున్నామన్నారు. ఈ నెల 30న నూతన గృహ ప్రవేశం చేయనున్నట్లు ఇందుకు తమ ఎమ్మెల్యే, మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఆహ్వానిస్తామన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ సుధారాణి

ప్లాస్టిక్ రహిత నగరమే లక్ష్యం

- అందరి సహకారం ఎంతో అవసరం
- నిషేధిత ప్లాస్టిక్ సంచులు వాడితే రూ.లక్ష జరిమానా
- మేయర్ గుండు సుధారాణి

వరంగల్ కార్పొరేషన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ రహిత వరంగల్ నగరంగా తీర్చిదిద్దేందుకు అందరి సహకారం అవసరమని వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి అన్నారు. శుక్రవారం వరంగల్ నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని మేయర్ కాన్ఫరెన్స్ హాల్‌లో

(మిగతా 7లో..)



చోరీ జరిగిన ఇంటి పరిసరాలను పరిశీలిస్తున్న డీసీపీ, పోలీసు సిబ్బంది

పట్టపగలు మారణాయుధాలతో బెదిరించి చోరీ

నెక్కొండ, జూలై 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పనికర గ్రామంలో శుక్రవారం మధ్యాహ్నం బండారి నిరోష ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడినట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. చోరీ జరిగిన ఇంటిని వరంగల్ ఈస్ట్‌జోన్ డీసీపీ అంకిత్ కుమార్ సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. ఇద్దరు వ్యక్తులు తలకు హెల్మెట్, మాస్కులు, చేతులకు గ్లౌజ్‌లను ధరించి గ్రామం చివరన ఉన్న బండారు నిరోష ఇంటికి వచ్చారు. ఈ సమయంలో ఆమె ఇంట్లో ఒంటరిగా ఉండగా మారణాయుధాలతో బెదిరించిన దొంగలు ఆమెను భయభ్రాంతులకు గురిచేసి ఒంటిపైన ఉన్న చెవుల కమ్మలు, ఇతర బంగారు వస్తువులు తీసుకున్నారు. ఇంట్లోని బీరువాలో ఉన్న బంగారు నెక్లెస్, రెండు బంగారు ఉంగరాలు, కమ్మలు, మాటీలు, రూ.2లక్షల 32 వేల నగదు దొంగలు దోచుకెళ్లారు. ఈ విషయమై బాధితురాలు నిరోష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

తప్పిపోయిన బాలిక తల్లిదండ్రులకు అప్పగింత

హనుమకొండ టౌన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా తాడిచర్ల గ్రామానికి చెందిన ఉల్లిగంటి సంపత్ కుమార్తె (9) హనుమకొండ హంటర్‌రోడ్డులోని టీజీఎస్‌యూఆర్ఎస్ సోషల్ వెల్ఫేర్‌లో 5వ తరగతి చదువుతోంది. శుక్రవారం హాస్టల్ నుంచి మధ్యాహ్న సమయంలో బయటకు వెళ్లిపోయినట్లు హాస్టల్ సిబ్బంది తల్లిదండ్రులకు తెలపడంతో హాస్టల్ సిబ్బంది, బాలిక తల్లిదండ్రులు సుబేదారి సీఐ ఎం.రంజిత్‌కుమార్‌కు తెలిపారు. పోలీసు సిబ్బందితో సీసీ కెమెరాలను పరిశీలించగా పద్మాక్షి గుట్ట వద్ద కనిపించడంతో బాలికను స్టేషన్‌కు తీసుకొచ్చి తల్లిదండ్రులకు అప్పగించినట్లు సీఐ రంజిత్‌కుమార్ తెలిపారు.

కాజీపేటలో..

కాజీపేట, జూలై 11 (ఆంధ్రజ్యోతి): తప్పిపోయిన బాలికను తిరిగి తల్లిదండ్రులకు అప్పగించారు రైల్వే పోలీసులు. కాజీపేట రైల్వే సీఐ వి.నరేశ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. భూపాలపల్లి జిల్లా నాచారం గ్రామానికి చెందిన అంజలి అనే బాలిక కాజీపేట రైల్వేస్టేషన్‌లో ఈనెల 9న తప్పిపోయి వచ్చింది. బాలికను అదుపులోకి తీసుకుని సఖీ సెంటర్‌కు అప్పగించారు. శుక్రవారం బాలిక తల్లి స్వరూపను పిలిపించి అంజలిని అప్పగించినట్లు ఇన్‌స్పెక్టర్ చెప్పారు.

ప్రపంచ చాంపియన్ షిప్‌కు ఎంపికైన దీప్తి



పర్వతగిరి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): అర్జున అవార్డు గ్రహీత జీవంజి దీప్తి పారా ఒలింపిక్ చాంపియన్‌షిప్‌నకు ఎంపిక అయింది. ఇటీవల బెంగుళూరులోని కంటీరామ్ స్టేడియంలో జరిగిన ప్రపంచ చాంపియన్‌షిప్ ఎంపిక పోటీల్లో ఆమె పాల్గొని 400 మీటర్ల విభాగంలో 56.06 నిమిషాల్లో పూర్తి చేసి ప్రథమ స్థానంలో నిలిచి గోల్డ్‌మెడల్ సాధించారు.

విద్యుత్ అధికారులతో సీఎండీ వీడియో కాన్ఫరెన్స్

రాంగనర్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఎన్పీడీసీఎల్ పరిధిలోని 16 సర్కిళ్ల ఎస్ఈ, డీఈ, ఏడీఈ, ఏఈ, ఎస్ఏఓ, ఏఏఓలతో సీఎండీ వరుణ్‌రెడ్డి శుక్రవారం వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ.. 15 నుంచి 20 కిలోమీటర్ల పొడవు ఉండే విద్యుత్ లైన్‌లో 1000 ఫాల్ట్ ప్యాసేజ్ ఇండికేటర్స్ ఏర్పాటు చేయనున్నామన్నారు. రియల్ టైం ఫీడర్ మానిటరింగ్ ఈనెల 30 సబ్‌స్టేషన్‌లు, వచ్చే నెల 120 సబ్‌స్టేషన్‌లలో పూర్తి చేయాలన్నారు.

ఇక ప్రతీ ఏడాది సమ్మర్ ఇంటర్న్‌షిప్

విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి

నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాదర్ సుబుధీ



సిప్ -2025 పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రదానం చేస్తున్న డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాదర్ సుబుధి

హనుమకొండ, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ నిట్‌లో ఇక నుంచి ప్రతీ ఏడాది క్రమంతప్పకుండా సమ్మర్ ఇంటర్న్‌షిప్ (సిప్-2025) కార్యక్రమాన్ని నిర్వహిస్తామని డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాదర్ సుబుధి అన్నారు. నిట్‌లో సమ్మర్ ఇంటర్న్‌షిప్-2025 శుక్రవారం ముగిసింది. ఈ ఏడాది మొదటిసారిగా ప్రారంభించిన ఈ కార్యక్రమంలో దేశవ్యాప్తంగా 194మంది విద్యార్థులు పాల్గొన్నారు. మే 9న ప్రారంభమైన ఇంటర్న్‌షిప్ రెండు నెలలపాటు కొనసాగింది. శుక్రవారం జరిగిన ముగింపు కార్యక్రమంలో ప్రొఫెసర్ సుబుధి మాట్లాడుతూ.. ఇంటర్న్‌షిప్‌లో పాల్గొన్న విద్యార్థులను అభినందిస్తూ భవిష్యత్తులో వారు ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. సిప్-2025 విజయవంతంగా ముగియడం ద్వారా పరిశోధన సంస్కృతి, సంస్థల మధ్య సహకారం పెరిగే దిశగా ఒక ముఖ్యమైన అడుగుపడినట్లయిందన్నారు.

భవిష్యత్తులో మరింత మంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చే దిశగా ఇది మార్గదర్శకంగా నిలువగలదన్నారు. ఇంటర్న్‌షిప్‌లో పాల్గొన్న విద్యార్థులు నిట్ అధ్యాపకుల మార్గదర్శకంలో ఉన్నతస్థాయి పరిశోధన, ప్రాయోగిక అధ్యయనంలో పాల్గొనే అవకాశాన్ని పొందారన్నారు. విద్యార్థులు అత్యాధునిక ప్రయోగశాలలు, పరిశోధనా సదుపాయాలను ఉపయోగించుకొని విలువైన జ్ఞానాన్ని సముపార్జించుకోగలిగారన్నారు. అకడమిక్ డీన్ ప్రొఫెసర్ వెంకయ్య చౌదరి సిప్ ముఖ్యాంశాలను వివరించారు. ముగింపు సందర్భంగా ఇంటర్న్‌షిప్‌లో పాల్గొన్న అండర్ గ్రాడ్యుయేట్, పోస్టు గ్రాడ్యుయేట్ విద్యార్థులు తమ అనుభవాలను పంచుకున్నారు. తాము ప్రత్యక్ష పరిశోధనలో పాల్గొని విలువైన జ్ఞానాన్ని పొందగలిగినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

స్పోర్ట్స్ అకాడమీల్లో ప్రవేశాలకు ఎంపికలు

15, 16 తేదీల్లో పోటీలు : డీవైఎస్‌వో

వరంగల్ స్పోర్ట్స్ జూలై 11(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని గచ్చిబౌలి, ఎల్బీ స్టేడియాల్లోని స్పోర్ట్స్ అకాడమీల్లో 2025-26 సంవత్సరానికి గాను ప్రవేశాలకు ఈనెల 15, 16 తేదీల్లో 12 ఏళ్ల వయస్సు నుంచి 16 ఏళ్ల వయస్సు కలిగిన బాలబాలికలకు పలు క్రీడాంశాల్లో ఎంపిక పోటీలను నిర్వహించనున్నట్లు డీవైఎస్‌వో అశోక్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. గచ్చిబౌలి స్టేడియంలో హాకీ అకాడమీలో ప్రవేశాలకు 24మంది, అథ్లెటిక్స్‌లో 15 మంది బాలబాలికలను ఎంపిక చేస్తామన్నారు. అదేవిధంగా ఎల్బీ స్టేడియంలో హ్యాండ్‌బాల్ అకాడమీకి 14మంది, ఫుట్‌బాల్ అకాడమీకి 24మంది బాలురను ఎంపిక చేస్తామన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా హైదరాబాద్ లోని గచ్చిబౌలి, ఎల్బీ స్టేడియాల్లోని అకాడమీల ప్రవేశాల ఎంపిక పోటీల్లో పాల్గొనే బాలబాలికలు 12నుంచి 16 ఏళ్ల వయస్సుతో పాటు తెలంగాణ రాష్ట్రానికి చెంది ఉండాలన్నారు. అదే విధంగా నేషనల్ స్పోర్ట్స్ ఫెడరేషన్ (ఎన్ఎస్ఎఫ్), స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్ఐ) ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర, జాతీయ స్థాయి సబ్ జూనియర్స్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు ఎంపిక పోటీల్లో ఎక్కువ ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన క్రీడాకారులు తమ ఆధార్‌కార్డు, జనన ధ్రువీకరణ పత్రం, గతంలో రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడల్లో పాల్గొన్న విజయం సాధించిన సర్టిఫికెట్లు, 10పాస్ పోర్టు సైజ్ ఫొటోలను వెంట తీసుకొని హాకీ, అథ్లెటిక్స్ ఎంపిక పోటీల్లో పాల్గొనే వారు హైదరాబాద్‌లోని స్పోర్ట్స్ కాంప్లెక్స్ గచ్చిబౌలి స్టేడియం, హ్యాండ్‌బాల్, ఫుట్‌బాల్ ఎంపిక పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు ఎల్బీ స్టేడియంలో ఈనెల 15వ తేదిన ఉదయం రిపోర్టు చేయాలని ఆయన కోరారు. మరిన్ని వివరాలకు సెల్ 9392997668 నెంబర్‌లో సంప్రదించాలని అశోక్‌కుమార్ సూచించారు.

నేత్ర వైద్య సదస్సుకు హాజరైన వైద్యులు

వరంగల్ మెడికల్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): నేత్ర వైద్యంలో మెళకువలపై ఈ నెల 11, 12, 13 తేదీల్లో వరంగల్‌లోని సత్యసాయి గార్డెన్స్‌లో నిర్వహిస్తున్నారు. శుక్రవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి సదస్సులో వైద్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సదస్సులో తమ అనుభవాలు, నూతన వైద్య పద్ధతులను పంచుకున్నారు. వరంగల్‌కు చెందిన ప్రముఖ నేత్ర వైద్య నిపుణుడు డాక్టర్ కేశరాజు విజయ్ కుమార్ రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ సదస్సులో డాక్టర్ భరత్‌కుమార్, డాక్టర్ అయిత రాజరవీంద్ర, డాక్టర్ పి.ప్రవీణ్, డాక్టర్ రాజ్‌కుమార్, డాక్టర్ వేణుమాధవ్, డాక్టర్ పరమేశ్వర్‌రావు, డాక్టర్ రాజలింగం, డాక్టర్ రిషి స్వరూప్ తదితర వైద్యులు పాల్గొన్నారు.

ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య

హసన్‌పర్తి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం సిద్ధాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ వట్టి చేరాలు కథనం ప్రకారం.. సిద్ధాపూర్ గ్రామానికి చెందిన చిల్ల నర్సయ్య (42), రజిత దంపతులకు ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. నర్సయ్య ఇనుప సామాను వ్యాపారం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునే వాడు. నర్సయ్య యేడాది నుంచి మద్యానికి బానిసయ్యాడు. దీంతో భార్య రజిత తన ముగ్గురు పిల్లలను తీసుకొని రెండు రోజుల కిందట పుట్టింటికి వెళ్లింది. దీంతో నర్సయ్య మనస్థాపం చెంది ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. భార్య రజిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ వట్టి చేరాలు తెలిపారు.

కడుపు నొప్పి భరించలేక..

మడికొండ, జూలై 11(ఆంధ్రజ్యోతి): కడుపు నొప్పి భరించలేక పెయింటర్ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కాజీపేట మండలం కడిపికొండలో చోటు చేసుకుంది. మడికొండ ఎస్సై రాంమోహన్ తెలిపిన వివరాల ప్రకారం.. కడిపికొండ ఎస్సీ కాలనీకి చెందిన పెయింటర్ రేణుంట్ల రమేష్(43) కొంతకాలంగా కడుపు నొప్పి, అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొంది ఇంటికి వచ్చాడు. గురువారం సాయంత్రం కడుపు నొప్పి ఎక్కువ కావడంతో పడుకుంటానని ఇంట్లోకి వెళ్లి చున్నీతో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య అనురాధ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

హసన్‌పర్తి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): చికిత్స పొందుతూ యువకుడు మృతి చెం దిన ఘటన శుక్రవారం హసన్‌పర్తి పోలీసుస్టేషన్ పరిధి వంగపహాడ్‌లో వెలుగులోకి వచ్చింది. ఎస్సై శీలం రవిందర్ కథనం ప్రకారం.. వంగపహాడ్ గ్రామానికి చెందిన దుప్పటి రాజుకు ఇద్దరు సంతానం. పెద్ద కుమారుడు నితిన్ ప్రైవేటు ఉద్యోగి. ఇంకా వివాహం కాలేదు. నితిన్ ఈ నెల 8న గ్రామ శివారు గుట్టలో పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి చేరుకోగా నగరంలోని ఆస్పత్రికి తరలించగా శుక్రవారం మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి తండ్రి రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శీలం రవిందర్ తెలిపారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉందని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

రెవెన్యూ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

● ట్రెంగ రాష్ట్ర అధ్యక్షుడు కొండమల్ల రవి

వడ్డెపల్లి, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ నాన్ - గెజిటెడ్ అసోసియేషన్ (ట్రెంగ) రాష్ట్ర అధ్యక్షుడు కొండమల్ల రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం హనుమకొండ పబ్లిక్‌గార్డెన్‌లోని నేరెళ్ల వేణుమాధవ్ కళాప్రాంగణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పే రివిజన్ కమిషన్ (వేతన సవరణ) 5 ఏళ్లకోసారి తప్పకుండా జరుగాలని అన్నారు. 2023 జూలైలో ఇవ్వాల్సిన పీఆర్‌సీ ఇప్పటివరకు ఇవ్వలేదని దుయ్యబట్టారు. ఇప్పటికైనా 50శాతం ఫిట్మెంట్‌తో పీఆర్‌సీ ప్రకటించాలని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ప్రకటించినట్లే తమకు కూడా 5 ఏళ్లకోసారి పీఆర్‌సీని ప్రకటించాలని , పెండింగ్ డీఏలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ట్రెంగ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మాచుపల్లి శేఖర్, ప్రధాన కార్యదర్శి పిట్టల విజయ్‌బాబు, ఉపాధ్యక్షులు తాళ్లూరి కృష్ణప్రసాద్, రాష్ట్ర నాయకులు శ్రీనివాస్‌రావు, భూక్య నర్సింహనాయక్, మహ్మద్ సలీం పాషా, మహ్మద్ మక్బూల్‌అలీ, వంశీధర్, గన్ను నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

రేపు ప్రెస్‌క్లబ్‌లో వైద్య శిబిరం

వడ్డెపల్లి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ బాలసముద్రంలోని గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్‌లో సభ్యుల కోసం వైద్య శిబిరాన్ని ఈ నెల 13న ఉదయం 9 గంటలకు ఏర్పాటు చేసినట్లు ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, కార్యదర్శి బొల్లారపు సదయ్య, కోశాధికారి బోళ్ల అమర్ తెలిపారు. ఈ నెల 12న ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు వీబీఆర్ డయాగ్నోస్టిక్స్ సహాయంతో ఉచిత రక్త పరీక్షలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రెస్ క్లబ్ సభ్యులు ఉదయం 7 గంటలకు పరిగడుపున వచ్చి రక్త పరీక్షల కోసం శాంపిల్స్ ఇవ్వాలని తెలిపారు. ఈ శాంపిల్స్ ఆధారంగా ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో నిపుణులైన వైద్యులు వ్యాధి నిర్ధారణ చేసి తగిన వైద్యాన్ని అందిస్తారని పేర్కొన్నారు. ఈ క్యాంపులో ప్రముఖ కార్డియాలజిస్టులు డాక్టర్లు మల్లికార్జున్, వివేక్, కూరపాటి మధు, అనిల్‌రెడ్డి, న్యూరోఫిజీషియన్లు డాక్టర్లు వినయ్‌కుమార్‌గౌడ్, శ్రీచరణ్, నర్సింగరావు, గ్యాస్ట్రో, ఫిజీషియన్లు డాక్టర్లు సుమన్, వైద్యం గౌతం పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. ప్రెస్‌క్లబ్‌లో సభ్యత్వం కలిగిన సభ్యులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

ఎస్సీలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

సీజీఎంఎస్ఈ డీజీఎం ఎంఎస్ఆర్‌కే మూర్తి

కేయూ రోడ్డులో జిల్లాస్థాయి అవగాహన సదస్సు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎస్ఆర్‌కే మూర్తి

వరంగల్ కార్పొరేషన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని సీజీఎంఎస్ఈ డీజీఎం ఎంఎస్ఆర్‌కే మూర్తి కోరారు. శుక్రవారం కేయూ రోడ్డులోని హనుమాన్‌నగర్‌లో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎస్ఆర్‌కే మూర్తి మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీలు వారు పెట్టుకున్న ప్రాజెక్ట్ దరఖాస్తుపై పూర్తి అవగాహన కలిగిన ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో షెడ్యూల్ తెగల కమిషనర్ సభ్యులు వడ్డెపల్లి రాంచందర్, తాజ్‌ఖాన్, లీడ్‌బ్యాంకు మేనేజర్ హవేలి రాజు, షెడ్యూల్ కులాల హక్కుల పరిరక్షణ సమితి జాతీయ ఉపాధ్యక్షుడు చిన్నపల్లి కొమురయ్య, జాతీయ కార్యదర్శి పసునూరి మనోహర్, జాతీయ ఉపాధ్యక్షుడు రడపాక పరంజ్యోతి, ఎర్ర చంద్రమౌళి, రవినాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి అయిత మల్లేశ్, సూరారపు నిరంజన్, జిల్లా నాయకులు కిన్నెర రంజిత్, డక్క ప్రభాకర్‌లు పాల్గొన్నారు.

దారికాచి దాడి చేసి..

● అర్ధరాత్రి ఇద్దరు యువకులపై విచక్షణా రహితంగా దాడి
● స్థానికుల రాకతో పరార్ ● రంగశాయిపేటలో ఘటన
● కేసు నమోదు చేసిన పోలీసులు ● ప్రాణాపాయ స్థితిలో బాధితులు





తల పగిలి రక్తస్రావంతో వంశీ, ఐసీయూలో చికిత్స పొందుతున్న నరేష్


కరీమాబాద్/శంభునిపేట జూలై11 (ఆంధ్రజ్యోతి): వరంగల్ రంగశాయిపేట ప్రాంతంలో గురువారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఇద్దరు యువకులపై విచక్షణా రహితంగా దాడి చేశారు. ఒకరిని డ్రెయినేజీలో పడేసి బండరాయితో మోదారు. మరొకరిని దాదాపు పదిమంది కలిసి ముఖం, శరీర భాగాలు కమిలిపోయేలా కొట్టారు. ఈలోపు స్థానికులు రావడంతో పరారయ్యారు. మిల్స్‌కాలనీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రంగశాయిపేట ప్రాంతానికి చెందిన కేడల నరేష్, అవినయ్, చంద్రకాంత్ ముగ్గురు కలిసి గురువారం అర్ధరాత్రి రంగశాయిపేట ఆర్టీఏ జంక్షన్ వద్ద ఉండగా అదే సమయంలో రోడ్డుకు అవతలి వైపున ఫలుదా జ్యూస్, ఐస్‌క్రీం బండి వద్దకు సుమారు పది మంది ఆటోలో వచ్చారు. జ్యూస్ తాగాక డబ్బులు అడిగితే వారితో గొడవకు దిగారు. ఇది గమనించిన ఈ ముగ్గురు యువకులు వెళ్లి వారిని అడ్డుకున్నారు. దీంతో ఆటోలో వచ్చిన వ్యక్తులు మిమ్మల్ని చంపుతామని బెదిరించి అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఆ తర్వాత కేడల నరేష్ అతడి స్నేహితులు అక్కడి నుంచి ద్విచక్రవాహనంపై శంభునిపేటకు చేరుకున్నారు. అక్కడి నుంచి కేడల నరేష్ రంగశాయిపేటకు వస్తుండగా శంభునిపేట వద్ద బజ్జూరి వంశీ అనే యువకుడు కలవడంతో తనను తీసుకొని రంగశాయిపేటలోని కాపువాడకు వస్తున్నారు. అయితే అప్పటికే ఆర్టీఏ జంక్షన్ వద్ద గొడవ పడిన వ్యక్తులు వీరిని వెంబడిస్తున్నారు. రంగశాయిపేట రజకవాడకు రాగానే కేడల నరేష్, బజ్జూరి వంశీలపై ఒక్కసారిగా కర్రలు, రాడ్లతో దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో ఇద్దరి తలకు, చేతులకు తీవ్రమైన గాయాలయ్యాయి. దాడి సమయంలో చేసిన అరుపులకు స్థానికులు బయటికి రావడంతో వారు ఆటోలో పారిపోయారు. గాయపడిన వ్యక్తులను చికిత్స నిమిత్తం ఎంజీఎంకు తరలించారు. మిల్స్‌కాలనీ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.

కేడల నరేష్‌ను మెరుగైన చికిత్స కోసం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. బాధ్యులపై చర్య తీసుకోవాలని కోరుతూ కేడల నరేష్ తల్లి కేడల పుష్పలత శుక్రవారం సాయంత్రం మిల్స్‌కాలనీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్సై సురేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దింపుడుకల్లం కాడ అవాక్కయ్యారు..

● మృతదేహం తన తండ్రిది కాదని తేల్చిన కుమార్తె ● అంతిమయాత్రలో అయోమయం
● ఎవరో వ్యక్తిని తమ వ్యక్తిగా భావించిన కుటుంబసభ్యులు ● సినిమా కథను తలపించిన ఘటన





ప్రమాదం జరిగినప్పుడు.. | తిరిగి ఇచ్చేసిన మృతదేహం

రాయపర్తి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఎవరైనా చనిపోతే దింపుడుకల్లం వద్ద చివరిసారిగా అతడి కుటుంబసభ్యులు చెవిలో పిలవడం ఆనవాయితీ. దీన్నే చివరి పిలుపు అని కూడా సంబోధిస్తారు. ఇలా దింపుడుకల్లం ఘట్టంలో తన తండ్రి ముఖాన్ని చూసిన కూతురు ఒక్కసారిగా అవాక్కైంది. ఆ మృతదేహం తన తండ్రిది కాదని చెప్పడంతో దహన సంస్కారాలకు వచ్చిన కుటుంబసభ్యులు, బంధువులు కంగుతిన్నారు. అంత్యక్రియల్ని నిలిపివేశారు. మృతదేహాన్ని తిరిగి మార్చురీకి పంపించారు. అచ్చం సినిమా కథను పోలివున్న ఈ ఘటన వరంగల్ జిల్లా రాయపర్తి మండలంలోని మైలారం గ్రామంలో చోటు చేసుకుంది.

ఈ నెల 9న మహబూబాబాద్ జిల్లా తొర్రూరులో ఓ షోరూమ్ ముందు ఓ వ్యక్తి పడి ఉండగా అక్కడి పోలీసులు చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అయితే తమకు అందిన సమాచారంతో సదరు వ్యక్తి కొన్నేళ్ల కిందట ఇతర ప్రాంతానికి వలస వెళ్లిపోయిన మైలారం గ్రామానికి చెందిన కుమారస్వామిగా బంధువులు భావించారు. అతడు చికిత్స పొందుతూ గురువారం మృతి చెందగా, ఎంజీఎం సిబ్బంది పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబీకులకు శుక్రవారం అప్పగించారు. కుటుంబసభ్యులు మృతదేహాన్ని తీసుకొని వచ్చి గ్రామంలో దహన సంస్కారాలకు చేయాల్సిన తంతును ప్రారంభించి మృతదేహాన్ని ఊరేగిస్తూ శ్మశానవాటిక వద్దకు తీసుకెళ్లారు. అక్కడ దింపుడుకల్లం వద్ద కుటుంబసభ్యులు చివరి పిలుపు పిలుస్తుండగా ముఖాన్ని చూసిన కూతురు తన తండ్రి కాదని చెప్పడంతో దహన సంస్కారాలు ఆగిపోయాయి. ఎంజీఎం సిబ్బంది ఇచ్చిన మృతదేహం కుమారస్వామిది కాదని కుటుంబసభ్యులు గ్రహించారు. మృతదేహాన్ని అప్పగించే సమయంలో కూడా కుమారస్వామి కుటుంబసభ్యులు గమనించలేదు.

కుమారస్వామి చాలాకాలంగా సూరత్‌లో ఉండి తరువాత వెలికట్టలో స్థిరపడి కొన్నేళ్లుగా భార్యతో గొడవపడి దూరంగా ఉంటున్నట్టు తెలిసింది. చాలాకాలం నుంచే అతడికి కుటుంబంతో సంబంధాలు తెగిపోయాయి. దీంతో చనిపోయింది కుమారస్వామి అని భావించారే గానీ ముఖాన్ని గుర్తుపట్టలేకపోయారు. ఈ పరిస్థితే వేరొకరి మృతదేహానికి అంతిమయాత్ర చేసే వరకు తెచ్చింది. విచిత్రమేమిటంటే 'అసలు కుమారస్వామి' ఎక్కడున్నాడు? మరి చనిపోయిన వ్యక్తి ఎవరు? అనేది మిస్టరీగా మారింది. పొరపాటుగా తెచ్చిన మృతదేహాన్ని శుక్రవారం రాత్రి తిరిగి ఎంజీఎంకు పంపించారు. ఇదిలావుండగా, ఈ నెల 9న తొర్రూరు నుంచి అంబులెన్సులో పంపించిన వ్యక్తి, శుక్రవారం ఎంజీఎం నుంచి మృతదేహంగా తీసుకువచ్చిన వ్యక్తి రూపాలు వేర్వేరుగా వున్నాయి. అంబులెన్సులో పంపించిన వ్యక్తి ఎవరు? ఇప్పుడు చనిపోయిన వ్యక్తి ఎవరు? అనేది తెలియడం లేదు.

అసలేం జరిగిందంటే..

మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం వెలికట్టె గ్రామానికి చెందిన కుమారస్వామి చాలా ఏళ్ల కిందట తాపీమేస్త్రీ పని చేస్తుండగా కిందపడగా తలకు గాయమై మానసికంగా స్థితి కోల్పోయాడు. అప్పటికే భార్యాభర్తల మధ్య తగాదాలతో కొన్ని ఏళ్లుగా విడివిడిగా ఉంటున్నారు. మానసిక స్థితి బాగాలేని కుమారస్వామి.. మద్యానికి బానిసై రోడ్లపై చిత్తుకాగితాలు ఏరుకుంటూ ఎక్కడో జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలో 9న తొర్రూరులో జాతీయ రహదారి పక్క ఓ షోరూమ్ ఎదుట ఓ వ్యక్తి స్పృహ తప్పిపోగా, షోరూమ్ యజమాని స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. దీంతో తొర్రూరు ఎస్ఐ ఉపేందర్ తన సిబ్బందిని పంపి అతడిని అంబులెన్స్‌లో ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అయితే స్థానికుల్లో కొందరు అతడు కుమారస్వామి అని చెప్పడంతో కుటుంబ సభ్యులకు సమాచారం అందించినట్లు తెలుస్తోంది. ఈ మేరకు భార్య కూడా ఆస్పత్రికి వెళ్లి పరామర్శించినట్లు చెబుతున్నారు. మరి ఆమె తన భర్తను గుర్తించలేకపోయింది..? మృతదేహాన్ని ఊరికి తీసుకువచ్చిన తర్వాత బంధువులు, గ్రామస్థులు కూడా ఎందుకు గుర్తించలేకపోయారు..? అనేది ప్రశ్నార్థకంగా మారింది. మొత్తమ్మీద ఒక పొరపాటు అందరినీ అయోమయానికి గురిచేసింది.

గోదావరి పరవళ్లు

ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో పోటెత్తుతున్న ప్రవాహం



చత్తీస్‌గఢ్ వైపు నుంచి బస్సులు నిలిచిపోవడంతో వరదనీరులో నడిచి వస్తున్న ప్రయాణికులు

- రామన్నగూడెం పుష్కరఘాట్ వద్ద మొదటి ప్రమాద హెచ్చరికకు చేరువలో..
- భూపాలపట్నం-హైదరాబాద్ జాతీయ రహదారిపై రాకపోకలకు బ్రేక్
- పేరూరు వద్ద 15.42 మీటర్లకు చేరిన నీటి ప్రవాహం

వాజేడు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద నీరుతో గోదావరి వరద ప్రవాహం ఒక్కసారిగా పెరిగిపోయింది. ములుగుజిల్లా వాజేడు మండలంలోని పేరూరు వద్ద ఉదయం 6గంటలకు 14.70 మీటర్ల నీటిమట్టంతో ఉన్న ప్రవాహం 8గంటలకు 14.92 మీటర్లు, 10 గంటలకు 15.12 మీటర్లు, 12గంటలకు 15.21 మీటర్లు, 2గంటలకు 15.29 మీటర్లు, 4గంటలకు 15.36 మీటర్లు, 5గంటలకు 15.39 మీటర్లు, సాయంత్రం ఆరుగంటలకు 15.42 మీటర్ల నీటి ప్రవాహంతో క్రమేణా గోదావరి పెరుగుతుందని సీడబ్ల్యూసీ అధికారులు పేర్కోన్నారు. అకస్మాత్తుగా గోదావరికి వరద ఉధృతి పెరగటంతో మండలంలో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. మండల కేంద్రం నుంచి గుమ్మడి దొడ్డి వెళ్లే రహదారి, పూసూరు-ఏడ్జర్లపల్లి, పేరూరు-చంద్రుపట్ల, కోయవీరా పురం గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. పూసూరు-ముళ్లెకట్ట వంతెన వద్ద గోదావరి వరద ఉధృతితో జలకళను సంతరించుకుంది. ఈ క్రమంలో అధికారులు ఆయా గ్రామాలలో పర్యటించి లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. ఎంపీడీవో శ్రీకాంత్ నాయుడు, జీపీ కార్యదర్శులు వరద ఉధృతిపై నిత్యం సమీక్షిస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

జాతీయ రహదారిపై రాకపోకలకు బ్రేక్

గోదావరికి వరద నీరు పోటేత్తడంతో అంతర్రాష్ట్ర రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. భూపాలపట్నం-హైదరబాద్ 163వ జాతీయ రహదారి టేకులగుడెం వద్ద ఉన్న రేగుమాగు వాగుకు వరద నీరు చేరి రహదారిని ముంచెత్తింది. దీంతో చత్తీస్‌గఢ్, తెలంగాణకు రాకపోకలు నిలిచిపోయి ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ క్రమంలో పేరూరు ఎస్సై గుర్రం కృష్ణప్రసాద్, ఎంపీడీవో శ్రీకాంత్ నాయుడు, తదితర అధికారులు వరద ఉధృతిని పరిశీలించి రాకపోకలను నిలిపివేశారు. కాగా, మండలంలోని టేకుల గుడెం జాతీయ రహదారి పై ఉన్న రేగుమాగు వాగు వరద ఉధృతి కారణంగా అంతర్రాష్ట్ర రాకపోకలను నిషేదిస్తున్నట్లు ములుగు జిల్లా ఎస్పీ శబరీష్ ఒక ప్రకటనలో తెలిపారు. వరద ఉధృతి తగ్గే వరకు వంతెన పై ప్రయాణాలు నిలిపివేస్తున్నట్లు తెలిపారు. జాతీయ రహదారిపై ఉన్న వరదలో ఎవరూ దాటకుండా బారికేడ్లు, పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఇరు రాష్ట్రాల ప్రజలు ప్రయాణాలు అత్యవసరమైతే భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం మీదుగా ప్రయాణం చేయాలని సూచించారు.

మొదటి ప్రమాద హెచ్చరికకు చేరువలో....

ఏటూరునాగారం రూరల్ (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరికి వరద ఉధృతి పెరిగింది. శుక్రవారం సమ్మక్క బ్యారేజ్ గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల చేయడంతో ఏటూరునాగారం మండలంలోని రామన్న గూడెం పుష్కరఘాట్ వద్ద గోదావరి క్రమ క్రమంగా పెరుగుతోంది. శుక్రవారం పుష్కరఘాట్ వద్ద ఉదయం 8 గంటలకు గోదావరి నీటిమట్టం 13.990 మీటర్లు ఉండగా మధ్యాహ్నం 2 గంటలకు 13.580మీటర్లకు చేరి క్రమంగా పెరిగింది. సాయంత్రం 5 గంటలకు పుష్కరఘాట్ వద్ద గోదావరి నీటి 14.400 మీటర్లకు చేరింది. దీంతో గోదావరి ప్రవాహం క్రమంగా పెరుగుతుండడంతో మొదటిప్రమాద హెచ్చరికకు దాటి ప్రవహించనున్నట్లు జలవనరుల శాఖాధికారులు తెలిపారు. పుష్కరఘాట్ వద్ద 14.820 మీట్లర్లకు చేరితే మొదటి ప్రమాద హెచ్చరిక, 15.820 మీటర్లకు రెండవ ప్రమాద హెచ్చరిక, 17.320 మీటర్లకు చేరితే మూడవ ప్రమాద హెచ్చరికను అధికారులు జారీ చేయనున్నారు.



కమలాపురంలోని పాలాలకు చేరిన బ్యాక్ వాటర్



మంగపేట పుష్కరఘాట్ సమీపంలో ఉరుకలేస్తున్న గోదావరి

లోతట్టు ప్రాంతాలు జలమయం

మంగపేట (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలతో పాటు కాళేశ్వరం వద్ద లక్ష్మీబ్యారేజీ ఇతర బ్యారేజీలు, తుపాకులగూడెం సమ్మక్క బ్యారేజీ గేట్లను ఎత్తడం, ఉప నదులు, జలపాతాల నీరు తోడు కావడంతో మంగపేట మండలంలోని కమలాపురం బిల్ట్ ఇన్‌టేక్ వెల్, మంగపేట పుష్కరఘాట్ వద్ద గోదావరి వరద ప్రవాహం పెరుగుతోంది. బిల్ట్ ఇన్‌టేక్ వెల్ వద్ద శుక్రవారం ఉదయం 7.5 ఫీట్ల వరకు చేరిన గోదావరి ప్రవాహం ఆ తర్వాత కూడా కొనసాగింది. సాయంత్రానికి 8.5 ఫీట్లకు చేరింది. కమలాపురం ఎర్రవాగు, మంగపేట గౌరారంవాగు నీటికి గోదావరి వరుదపోటు కమ్మడంతో బ్యాక్ వాటర్ పొలాలకు చెరుతోంది. గోదావరి వరద పోటు పెరుగుతుండడంతో వ్యవసాయ భూములు కోతకు గురై మునిగిపోతున్నాయి. కమలాపురం, మంగపేట, గంపోని గూడెం, బోరునర్సాపురం, పొద్మూరు రైతుల భూములు గోదావరి వరద పోటుతో కోతకు గురై నీటిలో కలిసి పోతున్నాయి. వరద ప్రవాహం పెరుగడం వలన తీర ప్రాంత గ్రామాలైన చుంచుపల్లి, వాడగూడెం, పాలాయిగూడెం, దేవనగరం, కత్తిగూడెం, అకినేపల్లి- మల్లారం లోతట్టు ప్రాంతాలకు నెమ్మదిగా వరద నీరు చేరుతోంది. లోతట్టు ప్రాంతాల్లో వరద నీరు చేరుతుండటంతో రెవెన్యూ, పోలీస్, మండల పరిషత్, గ్రామపంచాయతీ అధికారులు శుక్రవారం వేర్వేరుగా పర్యటించి వరద నీటి ప్రవాహాలను పరిశీలించారు. కమలాపురం, పొద్మూరు, మంగపేట, బోరునర్సాపురం తీరం గ్రామాలను తహసీల్దార్ తోట రవిందర్, ఎస్సై టీవీఆర్ సూరి, ట్రైనీ ఎస్సైలు సురేష్, శ్రీకాంత్, ఆర్ఐలు శ్రీనివాస్, ఏసుపాదంతో పాటు తీర గ్రామాల పంచాయతీ కార్యదర్శులు వరద అంచనాను పరిశీలించారు.

సమ్మక్క సాగర్‌లోకి భారీ వరద

బ్యారేజిలోని మొత్తం గేట్లు ఎత్తివేత



బ్యారేజిలోకి వస్తున్న వరద నీళ్లు

కన్నాయిగూడెం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలోని తుపాకులగూడెం వద్ద గోదావరి నదిపై ఉన్న సమ్మక్క సాగర్ బ్యారేజిలోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. ఎగువన కురుస్తున్న వర్షాలతో పాటు ప్రాణహిత, ఇంద్రావతి నదుల నుండి భారీగా వరద నీళ్లు వచ్చి చేరుతుండటంతో గోదావరి ప్రవాహం ఉధృతంగా మారింది. ఎగువనుండి 7,46,410 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండటంతో బ్యారేజిలోని మొత్తం 59 గేట్లు ఎత్తి బ్యారేజిని ఫ్రీఫ్లోగా ఉంచారు. సమ్మక్క సాగర్ బ్యారేజి వద్ద 82.10 మీటర్ల నీటి మట్టం నమోదైంది.



పంపింగ్ చేస్తున్న మోటార్లు

కొనసాగుతున్న దేవాదుల పంపింగ్

కన్నాయిగూడెం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): కన్నాయిగూడెం మండలంలోని గుట్టల గంగారం వద్ద ఉన్న చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్టులో పంపింగ్ కొనసాగుతోంది. గురువారం సాయంత్రం వరకు ఫేజ్ 2,ఫేజ్ 3లో రెండు మోటార్ల చొప్పున మొత్తం నాలుగు మోటార్ల ద్వారా నీటిని ఎత్తి పోసిన అధికారులు గురువారం రాత్రికి ఫేజ్2 లోని రెండు మోటార్లను నిలిపివేసి ఫేజ్3 లోని రెండు మోటార్ల ద్వారా 583 క్యూ సెక్కుల నీటిని పంపింగ్ చేశారు. శుక్రవారం మధ్యాహ్ననికి ఫేజ్ 1 లో మరో మోటారు ను ఆన్ చేసి మొత్తం మూడు మోటార్ల ద్వారా పంపింగ్ కొనసాగిస్తున్నారు. ఫేజ్ 1 లో ఒక మోటారు,ఫేజ్ 2 లో రెండు మోటార్లు మొత్తం 3 మోటార్ల ద్వారా 831 క్యూ సెక్కుల నీటిని భూపాలపల్లి జిల్లా భీం ఘనపూర్ రిజర్వాయర్‌కు పంపింగ్ చేస్తున్నారు. దేవాదుల ఇన్‌టేక్ వెల్ వద్ద 83.3 మీటర్ల నీటి మట్టం నమోదైంది.



పేరూరు-చంద్రుపట్ల మధ్య ఉన్న మరిమాగు వాగు వంతెన పై వరద నీరు

మేడిగడ్డ బ్యారేజీకి కొనసాగుతున్న వరద

8.68లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

మహదేవపూర్ రూరల్, జూలై 11 : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని మేడిగడ్డ బ్యారేజీకి వరద ప్రభావం కొనసాగుతోంది. ఎగువన కురుస్తున్న వర్షాలతో ఇన్‌ఫ్లో భారీగా నమోదవుతుంది. శుక్రవారం బ్యారేజీలోకి 8.68 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదుకాగా, 85 గేట్లను ఎత్తి అంతే నీటిని దిగువకు పంపిస్తున్నారు. బ్యారేజీ వద్ద నీటి మట్టం 8.60 మీటర్లుగా ఉంది.

కాళేశ్వరం వద్ద ప్రాణహిత పరవళ్లు

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద ప్రాణహిత నది పరవళ్ళు తొక్కుతోంది. మహరాష్ట్రలోని ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు భారీ వరద కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద గోదావరి నదిలో కలుస్తోంది. దీంతో గోదావరి నది నిండుగా ప్రవహిస్తుంది. శుక్రవారం సాయంత్రం మొదటి 11.79 మీటర్ల ఎత్తులో ప్రవహిస్తుంది. ఈ ప్రవాహం 12.200 మీటర్లు దాటితే మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేయనున్నారు.

తప్పుల తడకగా మోమోలు, ప్రొవిజినల్స్

- ఎంబీఏలో సీట్లు కోల్పోయిన విద్యార్థులు
- హనుమకొండలో ప్రముఖ విద్యాసంస్థ నిర్వాకం

హనుమకొండ, జూలై 11 (ఆంధ్రజ్యోతి): కొన్ని ప్రైవేటు విద్యాసంస్థలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నాయి. ఇవి చేసే తప్పులకు వారి జీవితాలు బలవుతున్నాయి. ఉన్నత చదువులు చదివే అవకాశాలను కోల్పోతున్నారు. వివరాల్లోకి వెళితే.. హనుమకొండ జిల్లాలో పేరున్న ఓ విద్యాసంస్థలో కొందరు విద్యార్థులు ఇటీవల బీబీఏ పూర్తి చేశారు. వీరంతా ఎంబీఏలో చేరేందుకు ఇతర విద్యా సంస్థలో దరఖాస్తులు చేసుకున్నారు. ప్రవేశాల సందర్భంగా సర్టిఫికెట్లను పరిశీలించగా వాటిలో అనేక తప్పులు ఉన్నట్టు వెల్లడైంది.

ఈ విద్యాసంస్థ ఇచ్చిన మెమోలతో పాటు, ప్రొవిజినల్స్‌లో సైతం తప్పులు ఉన్నట్టు గుర్తించారు. బీబీఏ మూడో సెమిస్టర్, ఆరో సెమిస్టర్ మెమోలలో గ్రేడ్ల విషయంలో అన్నీ తప్పులే ఉన్నాయని, వాటి మీద ఉన్న క్యూఆర్ కోడ్ కూడా పని చేయడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొన్నారు. దీంతో ఎంబీఏలో సీటు ఇవ్వడానికి సదరు విద్యాసంస్థలు నిరాకరించాయని తెలిపారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఈ విద్యాసంస్థకు వచ్చి మొరపెట్టుకోవడంతో మెమోలు, ప్రొవిజినల్స్‌లో తప్పులను గమనించి నాలికకర్చుకున్నారు. వాటిని సరిచేసి ఇవ్వడానికి వారం పడుతుందని చావుకబురు చల్లగా చెప్పారు.

బయట అడ్మిషన్లు పూర్తయి తమ పిల్లలు సీటు కోల్పోయే పరిస్థితి ఉందని తల్లిదండ్రులు ఎంత మొరపెట్టుకున్నా పట్టించుకునేవారు లేకుండా పోయారన్నారు. ప్రైవేటు విద్యాసంస్థ వారు తప్పులు దిద్ది ఇచ్చేసరికి పుణ్యకాలం గడిచిపోయి తమ పిల్లలు ఎంబీఏ సీట్లు కోల్పోయారని, ఒక సంవత్సరం వృథా అయిందని పలువురు తల్లిదండ్రులు వాపోయారు. విద్యాసంస్థ నిర్వాహకులు మార్కుల మోమోలను తయారు చేసేప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకొని ఉంటే ఈ పరిస్థితి ఏర్పడేది కాదని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

గిరిజన మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

మంత్రి సీతక్క

గోవిందరావుపేట, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : గిరిజన మహిళలు ఆర్థికం గా అభివృద్ధి చెందాలని మంత్రి సీతక్క అన్నారు. మండలంలోని మొట్లగూడెం గ్రామంలో రాండ్‌స్టాడ్ గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్, సయోధ్య హోమ్ ఫర్ ఉమెన్ ఇన్ నీడ్ సహకారంతో సమ్మక్క,సారలమ్మ ఆదివాసీ సహకార సమాఖ్యకు కేటాయించిన అడ్డాకుల ప్లేట్ తయారీ యూనిట్‌ను ఆమె శుక్రవారం ప్రారంభించారు. అంతకుముందు వన మహోత్సవంలో భాగంగా ఆమె మొక్కను నాటారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ గిరిజనులు అన్నిరంగాల్లో అభివృద్ధి చెందేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని, గిరిజనులు వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంపత్‌రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, ఎఫ్‌డీవో రమేష్, ఎఫ్ఆర్‌వో అబ్దుల్ రహమాన్, రాండ్‌స్టాడ్ గ్లోబల్ సంస్థ ప్రతినిధులు అక్యూల్, స్వప్న విట్టల్, మిక్కిలినేని సంయుక్త, ఫైల్ దాసికా, సీఎస్ఆర్ టీం సభ్యులు ప్రణదిపూర్ణ, శైలజ, వంశీకృష్ణ, వినయ్, స్మిత, ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు. కాగా, మంత్రి సీతక్క ఏటూరునాగారం మండలంలోని చిన్నబోయినపల్లి గ్రామపంచాయతీ పరిధిలో గల చింతలమోరి గొత్తికోయగూడెంలో శుక్రవారం పర్యటించారు. రాండ్‌స్టాడ్, స్ఫూర్తి ఫౌండేషన్ సహకారంతో విద్యార్థులకు కుర్చీలు, స్కూల్ బ్యాగులు, ఆట వస్తువులు, పుస్తకాలను అందచేశారు.



అడ్డాకుల ప్లేట్ యూనిట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి సీతక్క



అమ్మవారి సన్నిధిలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

రెండో రోజూ కొనసాగిన శాకంబరీ ఉత్సవాలు

- వేల సంఖ్యలో దర్శించుకున్న భక్తులు
- అమ్మవారికి పూజలు చేసిన ఎమ్మెల్యే నాయిని

వరంగల్ కల్చరల్, జూలై11 (ఆంధ్రజ్యోతి): భద్రకాళి ఆలయంలో శాకంబరీ ఉత్సవాలు రెండో రోజూ కొనసాగాయి. దివ్యమైన రూపంతో శాకంబరీ అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. వేలాది మంది భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. శుక్రవారం వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి ప్రసాదాన్ని అందజేశారు. భక్తులకు శాకంబరీ కూరగాయల ప్రసాదం అందించారు. ఈ కార్యక్రమంలో ఈవో శేషు భారతి, సూరింటెండెంట్ అద్దంకి విజయ్‌కుమార్, అర్చకులు, ధర్మకర్తలు పాల్గొన్నారు.

గణనీయంగా పెరిగిన ఆదాయం

భద్రకాళి అమ్మవారి ఆదాయం ఈసారి గణనీయంగా పెరిగింది. 2024లో శాకంబరీ ఉత్సవాల ముగింపు రోజున టికెట్లు, ప్రసాదాల ద్వారా రూ. 4,01,127 ఆదాయం రాగా ఈ ఏడాది రూ.6,00,005 చేకూరింది. గత ఏడాదితో పోలిస్తే దాదాపు రూ.2లక్షలు అదనంగా లభించింది. కాగా, గత సంవత్సరం 15 రోజుల ఆదాయం రూ. 33,41,665 రాగా, ఈసారి రూ.48,00,274 ఆదాయం లభించింది. గత ఏడాది కంటే రూ.15 లక్షల అదనపు ఆదాయం లభించింది. ఉత్సవాలకు రాష్ట్రం నలుమూలల నుంచే గాక దేశ, విదేశాలనుంచి కూడా అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు తరలివచ్చారు. దీంతో అమ్మవారి ఆదాయం గణనీయంగా పెరిగింది.

వరుణుడు కరుణించడేమి!?

(5వ పేజీ తరువాయి)

అధికంగా వర్షాలు కురిశాయి. కానీ సారి పరిస్థితులు ఇందుకు భిన్నంగా ఉన్నాయి.

నెలన్నరకాలం పోయినట్టే..

రుతుపవనాల కదలిక మందగించడంతో అడపాదడపా తేలిక పాటి నుంచి మోస్తరు వర్షాలు అక్కడక్కడా కురుస్తున్నాయే తప్ప. భారీ వర్షాలు ఎక్కడా పడడం లేదు. ఇప్పటికే విత్తనాలు వేసిన రైతులు 15 రోజుల వరకు వర్షాలు లేకపోయినా తడి తగిలినా మొలకెత్తుతాయనే ఆశతో ఉన్నారు. ప్రస్తుత పరిస్థితిని చూస్తే నెలన్నర కాలం పోయిందని రైతులు వాపోతున్నారు. వర్షాలు సంతృప్తికంగా పడకపోవడంతో ఉమ్మడి జిల్లాలోని సుమారు 1800కుపైగా చెరువులు నీళ్ల లేక వెలవెలబోతున్నాయి.

ఎండిపోతున్న మొక్కలు

వరుణుడు కరుణించకపోవడంతో మొలకెత్తిన మొక్కలు ఎండుముఖం పడుతున్నాయి. విత్తనాలు నాటి నెలరోజులు దాటినా పంటలకు సరిపడా ఒక్కభారీ వర్షం కురకపోవడంతో రైతులు ఆవేదన చెంతున్నారు. మరో వారం, పది రోజులకు కూడా సరిపోను భారీ వర్షాలు కురకపోతే ప్రస్తుతం మొలకెత్తిన పంటలన్నీ ఎండిపోయే ప్రమాదం ఉందని కలవరపడుతున్నారు. వారం రోజులుగా ప్రతీ రోజు మేఘాలు కమ్ముకుంటూ వర్షం వస్తుందని ఆశతో ఎదురుచూస్తున్న అన్నదాతలకు నిరాశే మిగులుతోంది. అడపాదపా ఓ మోస్తరు వర్షం మాత్రమే పడుతోంది. లోటు వర్షం పరిస్థితుల నేపథ్యంలో తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు పలు కీలక సూచలు చేశారు. వర్షాధార పంటలైన పత్తి, సోయాబీన్, మొక్కజొన్న, కందులు, పెసర్లు వేయాలనుకుంటున్న రైతులు భూమి 15 -20 సెంటీమీటర్ల లోతు తడిస్తేనే నాట్లు వేయాలని సూచించారు.

హనుమకొండ జిల్లాలో..

హనుమకొండ జిల్లాలోని 14 మండలాల్లో 8 మండలాల్లో లోటు వర్షపాతం, 6 మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. భీమదేవరపల్లి, ఎల్కతుర్తి, హసన్‌పర్తి, ధర్మసాగర్, హనుమకొండ, ఐనవోలు, పరకాల, దామెర మండలాల్లో లోటు వర్షం, వేలేరు, కమలాపూర్, కాజీపేట, ఆత్మకూరు, శాయంపేట, నడికూడ మండలాల్లో సాధారణ వర్షపాతం రికార్డు అయింది.

ఇంకా సేఫ్‌జోన్‌లోనే ఉన్నాం.. : రవీందర్ సింగ్, జిల్లా వ్యవసాయాధికారి

రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. జూన్‌లో లోటు వర్షపాతం రికార్డయినా ఇంకా కాలం ఉంది కనుక ముందు ముందు కురిసే వర్షాలు రైతులను ఆదుకుంటాయని ఆశించవచ్చు. రైతులు ఇప్పుడే నారు పోస్తున్నారు. నాట్లు వేయడం ఆలస్యమైతేనే ముదురు నారుకు ఏం చేయాలనేది అప్పుడు చెప్పొచ్చు. లేదంటే ఏ ప్రత్యామ్నాయ పంటలు వేయాలనేది సూచిస్తాం. ఇప్పటివరకైతే రైతులకు నష్టమేమీ ఉండదు. ఆందోళన చెందాల్సిన అవసరం కూడా లేదు. నారు ముదురుతోనే ఇబ్బంది. పత్తికి, మొక్కజొన్నకు ఇప్పుడు ఇబ్బంది ఏమీ లేదు. మంచి వర్షాలు పడితే పంట పెరుగుతుంది. వర్షాలు సంతృప్తికరంగా కురవకపోతే వరి విషయంలో స్వల్పకాలిక పంటలను ఎంచుకోవాలి. లేదంటే నేరుగా విత్తనాలు చల్లుకోవాలి. ఇలా రెండు ప్రత్యామ్నాయ మార్గాలు ఉన్నాయి. వర్షాలు పడడం ఆలస్యమై నార్లు ముదిరితే దానికి సంబంధించిన యాజమాన్య పద్ధతి, యూరియా చల్లడం వంటివి పాటిస్తే సరి.

'స్థానిక' ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌దే విజయం

(5వ పేజీ తరువాయి)

అందలేదని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత బీఆర్‌ఎస్ కార్యకర్తలపై ఉందన్నారు. అనంతరం నల్లబెల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు బిర్రు స్వామి బీఆర్‌ఎస్‌లో చేరారు.

అబద్ధాలకోరు సీఎం

అబద్ధాలకోరు సీఎం రేవంత్‌రెడ్డి అని ఎర్రబెల్లి దుయ్యబట్టారు. శుక్రవారం వర్ధన్నపేటలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో తన పాత్ర ఏమీలేదని, కొంతమంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు పని గట్టుకొని దుష్ప్రచారం చేస్తున్నారన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 40 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎలాంటి తప్పుచేయలేదని, తప్పు చేసే వారిని సైతం సహించలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో కేసులు షరామామూలేనని, తనపై కేసులు పెట్టినా పోరాడుతానని అన్నారు. కాళేశ్వరం, ఎస్సారెస్పీ, మిషన్ భగీరథలాంటి పథకాలను రేవంత్‌రెడ్డి నీరుగార్చారని విమర్శించారు. అధికారంలోకి రాగానే కల్యాణలక్ష్మి పథకానికి తోడు తులం బంగారం ఇస్తామని, పింఛన్‌లు పెంచుతామని హామీ ఇచ్చి రెండేళ్లు గడుస్తున్నా వాటిని తుంగలో తొక్కారన్నారు. ఈ సమావేశంలో నాయకులు పిట్టల రాజు, మున్నూరు సోము, తుమ్మల యాకయ్య, సిలువేరు కుమారస్వామి, తక్కళ్లపెల్లి రవీందర్‌రావు, జన్ను రాములు, సుంకరి సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత నగరమే లక్ష్యం

(5వ పేజీ తరువాయి)

గ్రేటర్ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్‌తోపాటు నగర వర్తక, వాణిజ్యసంస్థల నిర్వాహకులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ప్రజారోగ్య విభాగం, ఆస్కి సంస్థల సంయుక్తాధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో మేయర్ అధికారులకు, నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా సుధారాణి మాట్లాడుతూ.. ప్లాస్టిక్ నిర్మూలనకు ప్రతీ ఒక్కరు అంకిత భావంతో కృషి చేయాలని అన్నారు. 120 మైక్రాన్స్ తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్ వాడితే పర్యావరణంతోపాటు మానవ ఆరోగ్యంపై ప్రభావం పడుతుందని అన్నారు. జ్యూట్ బ్యాగులను నిత్య జీవితంలో వాడే విధంగా అందరికీ అవగాహన కల్పించాలన్నారు. ప్లాస్టిక్ వ్యాపారులు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని, ప్లాస్టిక్ సంచులను స్టోర్‌లలో నిలువ ఉంచరాదని అన్నారు. నగరంలో ఎక్కడైనా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ విక్రయాలు జరిపితే రూ.లక్ష జరిమానాతోపాటు షాపును సీజ్ చేయాలని ఆదేశించారు.

గ్రేటర్ వరంగల్ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ.. మనుషుల ద్వారా సెప్టిక్ ట్యాంకులు శుభ్రం చేయడాన్ని ప్రభుత్వం నిషేధించిందని, యంత్రాల ద్వారానే శుభ్రం చేయించాలని అన్నారు. వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ ద్వారా 14420 టోల్‌ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేశామని, అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అధికారులు ఈ నెంబర్‌ను విస్తృత ప్రచారం చేయాలన్నారు. అనంతరం డీస్లడ్జింగ్ ఆపరేటర్లకు మేయర్, కమిషనర్ చేతుల మీదుగా రక్షణ కవచాలు అందించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనా, జీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, ఎంహెచ్‌వో డాక్టర్ రాజేశ్, ఆస్కి కోఆర్డినేటర్ రాజమోహన్‌రెడ్డి, శ్వేత, నగర వర్తక వ్యాపారులు, స్లడ్జింగ్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

కురిసిన భారీ వర్షం... రోడ్లపై చేరిన వరద నీరు

హనుమకొండ టౌన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ నగరంలో శుక్రవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. దీంతో నగరంలోని లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. హనుమకొండ బస్టాండ్ ప్రాంగణంలోకి వర్షం నీరు చేరడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. హనుమకొండ బస్టాండ్ కూడలి నుంచి పబ్లిక్‌గార్డెన్ రోడ్డుపై భారీగా నీరు నిలిచి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. హనుమకొండ బాలసముద్రంలోని అంబేద్కర్‌కాలనీ, జితేందర్‌సింగ్ నగర్ గుడిసెలలో వర్షం నీరు చేరి గుడిసెవాసులు ఇబ్బంది పడినట్లు కాలనీ వాసులు పేర్కొన్నారు. పలు కాలనీలలో సరైన డ్రెయినేజీ కాలువల లేక రోడ్డుపైనే మురుగు నీరు చేరి నగర వాసులు ఇబ్బందులు పడ్డారు.



రోడ్డుపై చేరిన వర్షం నీటిలో వెళ్తున్న వాహనాలు



గవర్నర్‌తో సమావేశమైన రెడ్‌క్రాస్ పాలకవర్గం

గవర్నర్‌ను కలిసిన రెడ్‌క్రాస్ ప్రతినిధులు

హనుమకొండ కలెక్టరేట్, జూలై11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గవర్నర్, రాష్ట్ర రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షుడు జిష్ణుదేవ్ వర్మను శుక్రవారం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్ రెడ్‌క్రాస్ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం గవర్నర్‌తో కాసేపు మాట్లాడారు. గవర్నర్‌ను కలిసిన వారిలో జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి, రాష్ట్ర పాలక మండలి సభ్యులు ఈవీ శ్రీనివాస్‌రావులు ఉన్నారు.

అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్యం

జీడబ్ల్యూఎంసీ కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు

హనుమకొండ చౌరస్తా, జూలై 11(ఆంధ్రజ్యోతి) : అర్హులైన ప్రతీ పేద వారికి ఇందిరమ్మ ఇళ్లు అందించడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పని చేస్తోందని 10వ డివిజన్ కార్పొరేటర్, జీడబ్ల్యూఎంసీ కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. శుక్రవారం హనుమకొండ 10వ డివిజన్ పరిధిలోని రాయ్‌పుర, మచిలీబజార్, వడ్డెరివాడలోని అర్హులైన పలు పేదవారికి కేటాయించిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు స్థానిక కార్పొరేటర్, జీడబ్ల్యూఎంసీ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో 10వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శోభనబోయిన కుమార్ యాదవ్, మాజీ కార్పొరేటర్ నసీం జహాన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు బొంత రామకృష్ణ, నజీర్, జాఫర్ ఖాన్, తదితరుల పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి

హనుమకొండ కలెక్టరేట్, జూలై11(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి గౌస్ హైదర్ అన్నారు. హనుమకొండ హంటర్‌రోడ్ దుర్గాదేవికాలనీలో ఉన్న తెలంగాణ మైనారిటీల రెసిడెన్షియల్ కళాశాల కాజీపేట బాలురు-1ను శుక్రవారం విజిలెన్స్ అధికారులు అక్బర్, మక్బుల్‌పాషాతో కలిసి గౌస్‌హైదర్ సందర్శించారు. స్టోర్ రూమ్, వంటగది, డైనింగ్ హాల్‌ను ఈ సందర్భంగా గౌస్‌హైదర్ తనిఖీ చేశారు. కళాశాలలో పరిశుభ్రత ప్రమాణాలు, ఆహార నాణ్యత, సాధారణ డైట్ మెనూ ప్రకారం అందించాలన్నారు. అనంతరం కొద్దిసేపు విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా గౌస్‌హైదర్ మాట్లాడుతూ.. కళాశాలలో అన్ని సౌకర్యాలు మెరుగ్గా ఉండాలన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. కళాశాల ప్రిన్సిపాల్ పి.శిరీష, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

'స్థాయి మరచి మాట్లాడడం తగదు'

కాజీపేట, జూలై 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్‌కు ఆ పదవి దాస్యం వినయ్ భాస్కర్ పెట్టిన బిక్ష అని, అలాంటి వ్యక్తి తనస్థాయి మరిచి మాట్లాడటం సరైందికాదని బీఆర్ఎస్ సీనియర్ మైనారిటీ నాయకులు అన్నారు. కాజీపేట మీడియా పాయింట్‌లో శుక్రవారం మైనారిటీ నాయకులు మాట్లాడారు. మైనారిటీ పెద్దల సహకారంతో బీఆర్ఎస్‌లో పదవి చేజిక్కించుకున్న అజీజ్‌ఖాన్ తన ప్రవర్తన, మాటల తీరు మార్చుకోవాలని హితవు పలికారు. ఈ మీడియా సమావేశంలో బీఆర్ఎస్ మైనారిటీ నాయకులు ఎస్కే మహమూద్, ఎం.డి. షఫీ, ఎం.డి. అప్జల్ పాషా, నయూమ్ జుబేర్, మథిన్, పర్వీన్, దస్తగిరి, చందన్ తదితరులు ఉన్నారు.

గ్రేటర్ కార్యాలయాన్ని పరిశుభ్రంగా ఉంచాలి

వరంగల్ కార్పొరేషన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ ప్రధాన కార్యాలయాన్ని పరిశుభ్రంగా ఉంచుతూ, ఉద్యోగులు ప్రశాంత వాతావరణం అందించే విధంగా పరిసరాలు ఉండాలని జీడబ్ల్యుఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ అన్నారు. గ్రేటర్ మునిసిపల్ ప్రధాన కార్యాలయం పాతభవనంతో పాటు గ్రౌండ్ ఫ్లోర్, మొదటి, 2వ అంతస్తులు అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డుల గది, కంట్రోల్ రూం, ప్రజారోగ్య, పట్టణ ప్రణాళిక, ఇంజనీరింగ్, మలేరియా, అకౌంట్స్, కంప్యూటర్, ఎస్టాబ్లిషమెంట్ విభాగాలను పరిశీలించి అక్కడ పని చేసే సిబ్బంది జాబ్‌చాట్ అడిగి తెలుసుకున్నారు. ఆయా కార్యాలయాల్లో మరమ్మతులు చేపట్టుటకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మలేరియా విభాగంలో విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన ఉద్యోగిని గుర్తించి నెల జీతం నిలిపివేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనా, సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, ఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్, పనిచేసే సూపరింటెండెంట్లు రావుల ఆనంద్, రామకృష్ణ, ఉమాదేవేందర్, ఐటీ అధికారి రమేష్ పాల్గొన్నారు.

అనాథ బాలలకు సాథి కమిటీ తోడ్పాటు

వరంగల్ లీగల్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): అనాథ బాలలు, దివ్యాంగులు, నిరాధరణకు గురైన బాలల కోసం సాథి కమిటీ తోడ్పాటును అందిస్తుందని హనుమకొండ న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి క్షమాదేశ్‌పాండే అన్నారు. 18 ఏళ్లలోపు ఉన్న బాలబాలికలకు ఆధార్‌కార్డు, అర్బన్ సర్టిఫికేట్ ఇతర ప్రభుత్వ గుర్తింపు కార్డులు అందించే విషయంలో సాథి కమిటీ సహాయ సహకారాలు అందిస్తుందని ఆమె అన్నారు. హనుమకొండ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ.. సాథి కమిటీలో వివిధ ప్రభుత్వ అధికారులు, ప్రభుత్వ సంస్థలు, పారా లీగల్ వలంటీర్లు, ప్యానల్ లాయర్స్‌తో జిల్లా స్థాయి కమిటీని ఏర్పాటు చేశామని కార్యదర్శి అన్నారు. నిరాదారణకు గురైన పిల్లలకు సరైన గుర్తింపు కార్డులు జారీ చేయడానికి సర్వే చేపడతామని కార్యదర్శి అన్నారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ డిప్యూటీ తహసీల్దార్ రంజిత్‌కుమార్, హనుమకొండ జిల్లా బాలల పరిరక్షణ అధికారి ఎస్.ప్రవీణ్‌కుమార్, ఎన్జీవో ప్రతినిధులు ఎర్ర శ్రీకాంత్, కల్యాన్, సుజాత, ప్యానల్ అడ్వకేట్స్, ప్యారా లీగల్ వలంటీర్స్ తదితరులు పాల్గొన్నారు.

టీఎస్‌డీఎఫ్ రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి

వడ్డెపల్లి, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ ఎల్బీ నగర్‌లోని అబ్బాస్ ఫంక్షన్ హాల్‌లో ఈ నెల 13న మధ్యాహ్నం 12 గంటలకు తెలంగాణ స్టేట్ డెమోక్రసీ ఫోరం (టీఎస్‌డీఎఫ్) రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ గ్రేటర్ వరంగల్ కమిటీ కార్యదర్శి రాచర్ల బాలరాజు పిలుపునిచ్చారు. శుక్రవారం హనుమకొండలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సదస్సుకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు ఎన్‌రెడ్డి హంసారెడ్డి, శివాజీ, రాజ్‌మహ్మద్ , సదానందం, శ్రీనివాసరావు, గడ్డం నాగార్జున, పిట్టల శ్రీనివాస్, మాస్ సావిత్రి, ఉప్పుల శివ, శ్రవణ్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

హసన్‌పర్తి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సబ్ స్టేషన్ మరమ్మతుల దృష్ట్యా మండలంలోని చింతగట్టు, ఎల్లాపూర్, నాగారం, మల్లారెడ్డిపల్లి విద్యుత్ సబ్ స్టేషన్‌ల పరిధి ప్రాంతాలలో శనివారం ఉదయం 9 గంటల నుంచి ఉదయం 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు హనుమకొండ ఎన్‌పీడీసీఎల్ డీఈ సామ్యనాయక్ తెలిపారు. ఆయా గ్రామాల విద్యుత్ వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

రూ.100కోట్ల వర్సిటీ భూములను కబ్జా చేసేందుకు కుట్ర

- ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటుకు నిరసనగా 19న వర్సిటీ బంద్
- కేయూ బీఆర్ఎస్వీ అధ్యక్షుడు బైరపాక ప్రశాంత్

కేయూ క్యాంపస్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): కేయూ స్థలంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటు చేసే ప్రతిపాదనలతో రూ.100కోట్ల విలువైన వర్సిటీ భూములను కబ్జా చేసేందుకు కుట్ర జరుగుతోందని కేయూ బీఆర్ఎస్వీ అధ్యక్షుడు బైరపాక ప్రశాంత్ ఆరోపించారు. శుక్రవారం కేయూలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్వీ అధ్యక్షుడు బైరపాక ప్రశాంత్ ఇతర నేతలు పాల్గొని మాట్లాడారు. వర్సిటీ భూములను స్కూల్‌కు కేటాయిస్తూ పాలకమండలి నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. వర్సిటీ భవిష్యత్ అవసరాలకు భూములు కావాలని అన్నారు. రానున్న రోజుల్లో వర్సిటీలో ఇన్నోవేషన్ కోర్సులు ప్రవేశపెట్టాల్సి ఉందన్నారు. అందుకు వర్సిటీ భూములు అవసరం ఉంటాయని పేర్కొన్నారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను ప్రభుత్వ స్థలంలో నిర్మించాలని అన్నారు. ప్రహరీకి రూ.22కోట్ల నిధులున్నప్పటికీ పనులు ఎందుకు చేయడం లేదన్నారు. క్యాంపస్‌లో నూతనంగా ఒక కళాశాలతోపాటు మరో నాలుగు హాస్టల్స్ నిర్మించాల్సి ఉందన్నారు. వర్సిటీ చుట్టూరా భూములు అక్రమణలకు గురవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. విజిలెన్స్ సర్వే రిపోర్టును బయటపెట్టాలని డిమాండ్ చేశారు. సీఆర్‌పీఎఫ్ కేటాయించిన భూములను వెనక్కితీసుకోవాలని అన్నారు. వర్సిటీ భూముల కాపాడుకునేందుకు తమ నిరసనల్లో భాగంగా ఈనెల 19న వర్సిటీ బంద్‌కు పిలుపునిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్వీ కేయూ ఇన్‌చార్జి జెట్టి రాజేందర్, జిల్లా కోఆర్డినేటర్ గండ్రకోట రాకేశ్‌యాదవ్, గొల్లపల్లి వీరస్వామి, కందికొండ తిరుపతి, కమలేశ్, పస్తం అనిల్, రాచూరి రాజేశ్, మసూద్, హరి, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.



ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతున్న బీఆర్ఎస్వీ అధ్యక్షుడు బైరపాక ప్రశాంత్ తదితరులు

కేయూ భూముల్లో స్కూల్ నిర్మాణాలు వద్దు..

కేయూ క్యాంపస్ భూముల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ ప్రతిపాదనలను విరమించుకోవాలని ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర కార్యదర్శి గడ్డం నాగార్జున, బీఎస్‌పీ రాష్ట్ర కన్వీనర్ కామగోని శ్రావణ్, పీడీఎస్‌యూ ఉమ్మడి జిల్లా కార్యదర్శి మర్రి మహేశ్, స్వేరో జిల్లా అధ్యక్షుడు ఎల్తూరి సాయికుమార్‌లు డిమాండ్ చేశారు. శుక్రవారం కేయూలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పశ్చిమ నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ రావడంపై హర్షం వ్యక్తం చేశారు. అయితే వర్సిటీ భూముల్లో ఏర్పాటు చేయడాన్ని వ్యతిరేకిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో బీఎస్ఎఫ్ నేత కమ్మరపల్లి శివ, ధర్మ, మాస్ సావిత్రి, ఉప్పుల శివ, అమర్నాథ్, శేఖర్, రాజు, మురళి , ఉమేశ్ తదితరులు పాల్గొన్నారు.

కేయూలో ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను అడ్డుకుని తీరుతాం

కాకతీయ యూనివర్సిటీ క్యాంపస్ స్థలంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను అడ్డుకుని తీరుతామని ఎస్ఎఫ్ఐ జిల్లా సెక్రటరీ మంద శ్రీకాంత్ హెచ్చరించారు. శుక్రవారం వర్సిటీ పరిపాలన భవనంలోని వీసీ చాంబర్ ఎదుట నిరసన ఆందోళనలు చేపట్టారు. బైఠాయించి నినాదాలు చేశారు. క్యాంపస్‌లో 15 ఏకరాల భూమిని స్కూల్ కేటాయించడాన్ని వ్యతిరేకిస్తున్నట్లు స్పష్టం చేశారు. పశ్చిమ ఎమ్మెల్యే, వీసీ పునరాలోచన చేసి వర్సిటీ భూముల్లో స్కూల్ ప్రతిపాదనలను విరమించుకోవాలని అన్నారు. లేదంటే ఎస్ఎఫ్ఐ నేతృత్వంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు స్టాలిన్, కేయూ అధ్యక్షకార్యదర్శులు చెన్నూరు సాయికుమార్, బిరెడ్డి జశ్వంత్, ఉపాధ్యక్షుడు మల్లేశ్, రాహుల్, తదితరులు పాల్గొన్నారు.

గౌతమ బుద్ధుడి బోధనలు అవసరం



నృత్య రూపకం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బీఎస్ఐ నేతలు

వడ్డెపల్లి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): అనైతిక ప్రవర్తనలతో కునారిల్లుతున్న వర్తమాన సమాజానికి గౌతమ బుద్ధుడి బోధనలు అవసరమని బుద్ధిస్టు సొసైటీ ఆఫ్ ఇండియా (బీఎస్ఐ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు నక్క సుదర్శనం, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బొమ్మల్ల అంబేద్కర్‌లు అన్నారు. శుక్రవారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్ ప్రాంతంలోని గౌతమ బుద్ధుడి విగ్రహ ప్రాంగణంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఆర్థిక అంతరాలు, సామాజిక వివక్షకు అమానవీయ సంఘటనలు తొలగించేందుకు బుద్ధుడి మార్గం శరణ్యమని అన్నారు.

రేపు అంబేద్కర్ భవన్‌లో నృత్య రూపకం ప్రదర్శన

హనుమకొండలోని అంబేద్కర్ భవన్‌లో బీఎస్ఐ వరంగల్ ఉమ్మడి జిల్లా ఆధ్వర్యంలో ఈ నెల 13న సాయంత్రం 5 గంటలకు 'బుద్ధుడితో నా ప్రయాణం - డాక్టర్ బీఆర్ అంబేద్కర్ నృత్య రూపకం (నాటకం) ప్రదర్శించనున్నట్లు బీఎస్ఐ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు పరమళ్ల కృష్ణస్వామి, ప్రధాన కార్యదర్శి పుండుర్తి సాంబయ్య తెలిపారు. అంబేద్కర్ వాదులు, బుద్ధిస్టులు, కవులు, కళాకారులు, దళిత ప్రజా సంఘాల నాయకులు హాజరై నృత్య రూపకాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు. తొలుత నృత్యరూపకానికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో డీబీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రౌతు రమేష్, బీఎస్ఐ జిల్లా కోశాధికారి జవ్వాజి కిషన్, ప్రజా సంఘాల నాయకులు యాడాల రవీందర్, సింగారపు రవి ప్రసాద్, గద్దె నర్సయ్య, జంగిలి వెంకటస్వామి, చిట్యాల బాబు పాల్గొన్నారు.

ప్రపంచ జనాభా దినోత్సవాన ఆరోగ్యశాఖ ర్యాలీ



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య

వరంగల్ మెడికల్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు.హనుమకొండలోని ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి నుంచి పోచమ్మకుంట, పెద్దమ్మగడ్డ పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య మాట్లాడుతూ.. ప్రపంచ జనాభా 820 కోట్లు ఉండగా, అందులో 146 కోట్ల జనాభాతో మన భారతదేశం ప్రపంచంలోనే మొదటిస్థానంలో ఉందని, ఈ సంవత్సరం థీమ్ ప్రణాళిక బద్ధమైనమాతృత్వం కోసం గర్భధారణల మధ్య ఆరోగ్యకరమైన సమయం అంతరం, నినాదం, శారీరకంగా, మానసికంగా సిద్ధంగా ఉన్నప్పుడే తల్లి కావడానికి సరైన సమయం అని తెలిపారు. వైద్య ఆరోగ్య సిబ్బంది, ప్రభుత్వ విభాగాలు సమన్వయంతో పనిచేస్తూ బాల్యవివాహాల నియంత్రణకు చర్యలు తీసుకోనున్నట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మీ, అదనపు డీఎంహెచ్ఓ డాక్టర్ టి.మదన్ మోహన్‌రావు, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ విజయ్ కుమార్, డాక్టర్ మహేందర్, డాక్టర్ హిమబిందు, డాక్టర్ మంజుల, డాక్టర్ ఇక్తెధర్ అహ్మద్, డాక్టర్ గీత, డాక్టర్ ఎం.డి.యాకూబ్‌పాషా, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యుల సదస్సులో పాల్గొన్న ఎంపీ కావ్య

వరంగల్ మెడికల్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): కాకతీయ మెడికల్ కాలేజీలో ఫోరెన్సిక్ అండ్ టాక్సికాలజీ వైద్యుల రాష్ట్రస్థాయి రెండు రోజుల సదస్సు శుక్రవారం జరిగింది. ఈ సదస్సుకు వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య ముఖ్య అతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. మెడికల్ విభాగంలో ఫోరెన్సిక్, పాతాలజీ వైద్యులు కీలకపాత్ర పోషిస్తారని తెలిపారు. నేర విచారణలో ఫోరెన్సిక్ ఆధారాలు ప్రధానమని, వైద్యపరమైన ఆధారాలను విశ్లేషించడంతో పాటు న్యాయ ప్రక్రియలో ఫోరెన్సిక్ వైద్యులు సహాయం చేస్తారని పేర్కొన్నారు. ఫోరెన్సిక్ వైద్యుల సమస్యలను పార్లమెంట్ వేదికగా పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి.బి.నిర్మల గీతాంబ, కేఎంసీ ప్రిన్సిపాల్ సంధ్య, ఫోరెన్సిక్ వైద్యుల రాష్ట్ర అధ్యక్షులు అభిజిత్ సుబేదా, ఉస్మానియా హెచ్ఓడీ శ్రీధరాచారి, గాంధీ హెచ్ఓడీ కృపాసింగ్, ఫోరెన్సిక్ వైద్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ డాక్టర్ కడియం కావ్య



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే నాయిని, కలెక్టర్ స్నేహ శబరీష్, ఇతరశాఖల అధికారులు

అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి

- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి
- కలెక్టర్‌తో కలిసి అధికారులతో సమీక్షా సమావేశం

హనుమకొండ కలెక్టరేట్, జూలై11(ఆంధ్రజ్యోతి): వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. జిల్లా కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్‌హాల్‌లో శుక్రవారం పశ్చిమ నియోజకవర్గస్థాయిలో ఇందిరమ్మ ఇండ్లు, రెండు పడకల గదుల ఇండ్లు, కాజీపేట ఆర్వోబీ నిర్మాణ పనుల పురోగతి, భద్రకాళి చెరువు పూడికతీత పనులపై జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డితో కలిసి రెవెన్యూ, మున్సిపల్, గృహ నిర్మాణ, ఆర్అండ్‌బీ, సాగునీటిపారుదల శాఖల అధికారులతో ఎమ్మెల్యే సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.. నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరితగతిగా నాణ్యతతో పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఆర్అండ్‌బీ ఈఈ సురేష్‌బాబుతో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత

మడికొండ, జూలై 11(ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. మడికొండ ఎస్సై పెగడ రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం ఉదయం పెట్రోలింగ్ నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ జంపయ్య, పోలీసులు మడికొండ సబ్‌స్టేషన్ వద్ద ఇసుక లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్‌ను ఆపి ప్రశ్నించగా డ్రైవర్ వద్ద ఎలాంటి అనుమతి పత్రాలు లభించలేదు. ఇసుక ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బాలవికాసలో మహిళాశక్తి సంబరాలు

రూ.2.40కోట్ల చెక్కును అందించిన నాయిని

వరంగల్ కార్పొరేషన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): మహిళాశక్తి సంబరాల్లో భాగంగా పశ్చిమ నియోజకవర్గ పరిధి 51వ డివిజన్ కాజీపేటలోని బాలవికాస మందిరంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. వరంగల్ మహానగర పాలక సంస్థ, మెప్మా సంయుక్తాధ్వర్యంలో శుక్రవారం యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా సహకారంతో 16 మహిళా సంఘాలకు రూ.2.40కోట్ల చెక్కును పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా రాజేందర్‌రెడ్డి మాట్లాడారు. మహిళలు అన్నిరంగాల్లో ఆర్థికంగా ఎదగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ చహత్ బాజ్‌పాయ్, కార్పొరేటర్లు విజయశ్రీ రజాలీ, సర్తాద్ బేగం, మానస రాంప్రసాద్‌తో పాటు అదనపు కమిషనర్ జోనా, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా హెడ్ మహేశ్వర్, డిప్యూటీ కమిషనర్ రవీందర్, డీఎంసీ రజితారాణి, కమ్యూనిటీ ఆర్గనైజర్లు, మహిళా సంఘాల నాయకులు పాల్గొన్నారు.



మహిళా సంఘాలకు చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే, మేయర్, కమిషనర్

సంప్రదాయ వృత్తులను రక్షించండి

వడ్డెపల్లి, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ జాతీయుల సంప్రదాయ వృత్తులను రక్షించాలని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మను ఆ సంఘం రాష్ట్ర నేతల విజ్ఞప్తి చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వేములవాడ మదన్‌మోహన్, గౌరవ అధ్యక్షుడు డాక్టర్ లాలుకోట వెంకటాచారి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చొల్లేటి కృష్ణమాచారి తదితరులు కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ జాతీయుల సంప్రదాయ వృత్తులు కమ్మరం, వడ్రంగం, ఇత్తడి, శిలా శిల్పి, స్వర్ణకార వృత్తులు ప్రపంచీకరణ నేపథ్యంలో నిలబడలేక అడుగంటి పోతున్నాయని అన్నారు. ఈ వృత్తులపై ఆధారపడిన లక్షలాది మంది విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మలు ఆత్మహత్యలకు, ఆకలి చావులకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తమ సమస్యలను తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. గవర్నర్‌ను కలిసిన వారిలో సంఘం రాష్ట్ర నేతలు తంగెళ్లపల్లి శ్రీధర్, ఎర్రోజు అశోక్‌బాబు, తంగేళ్లపల్లి శ్రీధర్, పులిగిళ్ల శ్రీనివాసాచారి తదితరులు ఉన్నారు.

బీసీ రిజర్వేషన్ అమలు చరిత్రాత్మకం

హసన్‌పర్తి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు తెలంగాణ ప్రభుత్వ చరిత్రాత్మక నిర్ణయమని జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు పింగిళి వెంకట్‌రెడ్డి అన్నారు. బీసీల రిజర్వేషన్ అమలుపై హర్షం వ్యక్తం చేస్తూ గ్రేటర్ 66వ డివిజన్ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు కనపర్తి కిరణ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఆత్మకూరు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తంగెళ్లపల్లి తిరుపతి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పోరెడ్డి మహేందర్‌రెడ్డి, నాయకులు ఆరెల్లి వెంకటస్వామి, పెద్దమ్మ నర్సింహరాములు, అనూష, గొరై కిరణ్, చిర్ర తిరుపతి, లక్ష్మారెడ్డి, రవీందర్, రమేష్, కిశోర్, పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే బీసీల సంక్షేమం

రిజర్వేషన్ సంబురాల్లో జీడబ్ల్యూఎంసీ ఫ్లోర్ లీడర్ తోట వెంకన్న

హనుమకొండ సిటీ, జూలై 11(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌తోనే బీసీల సంక్షేమం సాధ్యమని, తొలి నుంచి బీసీలకు అండగా నిలిచిందని జీడబ్ల్యూఎంసీ ఫ్లోర్ లీడర్ తోట వెంకన్న పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు ప్రభుత్వం 42శాతం రిజర్వేషన్ కల్పించడంపై హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో వెంకన్న ఆధ్వర్యంలో సంబురాలు జరిగాయి. ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించడం ఆనందంగా ఉందన్నారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి బీసీ వర్గాలు అండగా నిలిచాయన్నారు. ఇందుకు స్పందనగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బీసీలకు రిజర్వేషన్ ప్రకటించడంపై కృతజ్ఞతలు తెలియచేస్తున్నట్లు తెలిపారు. మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు బంక సరళాదేవి మాట్లాడుతూ.. కాంగ్రెస్ మాట ఇచ్చిందంటే అమల్లోకి తెస్తుందనేది మరోసారి నిరూపితమైందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు చీకటి శారదా ఆనంద్, మానస రాంప్రసాద్, కవిత కిషన్‌తో పాటు బంక సంపత్, తాడిశెట్టి విద్యాసాగర్, నసీం జహాన్, నాగరాజు, వీరగంటి రవీందర్, నలబోల సతీశ్, మేరీ, శోభనబోయిన కుమార్ యాదవ్, షేక్ అజ్‌గర్, బంక సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

భోజన కుతూహలం

నరాల జబ్బులకు దివ్యౌషధం

ప్రకృతిలో ఉన్న ప్రతి మొక్కకు ఏదో ఒక ప్రయోజనం ఉంటుంది. కొన్ని మొక్కలు పిచ్చిగా కనిపిస్తాయి. కానీ వాటి వల్ల కూడా అనేక ప్రయోజనాలుంటాయి. అలాంటి వాటిలో ఒకటి 'ఎలుక చెవి ఆకు' మొక్క. ఈ మొక్క ఆకులు ఎలుక చెవి ఆకారంలో ఉంటాయి. అందువల్ల ఈ మొక్కను సంస్కృతంలో ఖుకర్ణి, మూషిక కర్ణి అని కూడా పిలుస్తూ ఉంటారు. భోజనకుతూహలం గ్రంథం ప్రకారం దీని ఆకులు కారం తీపి రుచులు కలిసి ఉంటాయి. ఇవి కఫాన్ని, పైత్యాన్ని తగ్గిస్తాయి. ఈ ఆకుల వల్ల కలిగే ఇతర ప్రయోజనాలను కూడా ఈ గ్రంథంలో పేర్కొన్నారు.

ఈ ఆకులు ఆకుకూరల కన్నా ఎక్కువ శక్తిమంతమైనవి. అందువల్ల వీటిని ఎక్కువగా తినకూడదు. ఆకుకూరలతో కానీ.. కూరగాయాలతో కానీ కలిపి వండుకోవాలి. ప్రతి రోజూ వంటలో కొద్దిగా ఈ ఆకులను ఉపయోగిస్తే అనేక రకాల ఆరోగ్య ప్రయోజనాలు చేకూరతాయి.

- ఈ ఆకులు శరీరంలోపల ఉండే వాపులను తగ్గిస్తాయి. తలనెప్పి నుంచి ఉపశమనాన్ని ఇస్తాయి. కడుపులో నులిపురుగులకు ఇది మంచి విరుగుడు. నులిపురుగులు పోతే జీర్ణశక్తి బాగుపడుతుంది.
- కొన్ని అటవీ ప్రాంతాల్లో ఈ ఆకులను పాము విషానికి విరుగుడుగా కూడా వాడతారు. పేగుల్లో పెరిగే ఎలికపాములకు విరుగుడుగా ఈ ఆకులను వినియోగిస్తారు.
- ఫిట్స్ వంటి నరాల జబ్బులకు ఈ ఆకులు మంచి మందు. రకరకాల మానసిక వ్యాధులకు విరుగుడుగా వీటిని వాడతారు.
- మధుమేహ నియంత్రణకు ఈ ఆకుల కషాయం మంచి మందు. ప్రతి రోజు ఈ ఆకుల కషాయం తాగితే మధుమేహం అదుపులో ఉంటుంది.



- చెవి సమస్యల పరిష్కారానికి ఈ ఆకులు బాగా పనిచేస్తాయి. ఈ ఆకులను దంచి.. దాని నుంచి రసం తీసి.. ఆ రసంతో సరిసమానంగా నువ్వుల నూనె కలిపి.. కొద్దిగా వేడి చేసి చెవిలో వేసుకుంటే.. చెవిలో వచ్చే రకరకాల ఇన్‌ఫెక్షన్లు తగ్గుతాయి.
- ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్‌లు తరచుగా వచ్చేవారికి ఈ ఆకులు బాగా పనిచేస్తాయి. ఉబ్బసం, ఆయాసం వంటి వాటికి ఈ ఆకుల కషాయం విరుగుడుగా పనిచేస్తుంది.

● గంగరాజు అరుణాదేవి

మేకప్


పుట్టుమచ్చలను దాచి...

ముఖం మీది పుట్టుమచ్చలు పెద్దవిగా, వికారంగా ఉంటే, వాటిని మేకప్‌తో దాచేసుకోవచ్చు. అందుకోసం ఎలాంటి మేకప్ మెలకువలు పాటించాలో తెలుసుకుందాం!

పుట్టుమచ్చలను మేకప్‌తో దాచేయడం కోసం ఫౌండేషన్, కన్‌సీలర్ వాడుకుంటే సరిపోదు. అందుకోసం ప్రత్యేకమైన మెలకువలు పాటించాలి. అవేంటంటే....

చర్మాన్ని సిద్ధం చేయాలి: ముఖాన్ని శుభ్రంగా కడుక్కుని, మాయిశ్చరైజర్ రాసుకోవాలి. తర్వాత ప్రైమర్ సహాయంతో ముఖాన్ని తదుపరి మేకప్‌కు సిద్ధం చేయాలి

కలర్ కరెక్ట్: ముదురు రంగు పుట్టుమచ్చలు చర్మంలో కలిసిపోయేలా చేయడం కోసం గోధుమ రంగు టోన్‌ను ఎంచుకోవాలి. ఎరుపు రంగు పుట్టుమచ్చల కోసం ఆకుపచ్చ టోన్ ఎంచుకోవాలి



చిన్న బ్రష్: చదునుగా ఉండే చిన్న బ్రష్‌ను కరెక్టర్‌లో ముంచి, పుట్టుమచ్చ మీద నేరుగా అద్దుకోవాలి

కన్‌సీలర్: చర్మపు రంగుకు దగ్గరగా ఉండే కన్‌సీలర్ ఎంచుకోవాలి. కరెక్టర్ అద్దిన ప్రదేశంలోనే కన్‌సీలర్ అప్లై చేయాలి. తర్వాత బ్రష్‌తో లేదా వేలితో మృదువుగా అడుగున ఉన్న కలర్ కరెక్టర్ చెదిరిపోకుండా కన్‌సీలర్ అంచులను చర్మంలో కలిసిపోయేలా అద్దుకోవాలి

ట్రాన్స్‌క్యులెంట్ పౌడర్: కన్‌సీలర్ అద్దుకున్న ప్రదేశం మీద ట్రాన్స్‌క్యులెంట్ పౌడర్‌ను అద్దుకోవాలి. ఇలా చేయడం వల్ల ఆ ప్రదేశంలో ముడతలు ఏర్పడకుండా ఉంటాయి

ఫౌండేషన్: కన్‌సీలర్ సెట్ అయిన తర్వాత, యధాతథంగా ఫౌండేషన్ అప్లై చేసి, చర్మం మీద సమంగా పరుచుకునేలా అద్దుకోవాలి

చిన్న మొత్తాల్లో: ఒకేసారి ఎక్కువ మోతాదు కన్‌సీలర్ లేదా ఫౌండేషన్ అప్లై చేయకుండా చిన్న మొత్తాల్లో తీసుకుని అద్దుకుంటూ సహజసిద్ధంగా చర్మంలో కలిసిపోయేలా నేర్పరితనంతో వ్యవహరించాలి

సెట్టింగ్ స్ప్రే: మేకప్ రోజంతా చెక్కుచెదరకుండా ఉండడం కోసం సెట్టింగ్ స్ప్రే వాడుకోవాలి.

వంటిల్లు





చేదుగా ఉన్నప్పటికీ కాకరకాయను ఇష్టంగా తింటూ ఉంటాం. కాకరకాయతో తయారుచేసే పులుసు, వేపుడు, పకోడీ లాంటివి వేటికవే ప్రత్యేకమైన రుచితో నోరూరిస్తూ ఉంటాయి. కాకరకాయ ముక్కలను జతచేసి మాంసాహార వంటకాలు వండితే 'ఆహా...! ఏమి రుచి' అనకుండా ఉండరు. అలాంటి కాకరకాయను విభిన్నంగా ఆస్వాదించాలనుకునేవారి కోసం ఈ రుచులు...

కాకరకాయతో భలే రుచిగా..!

గుత్తి కాకరకాయ



కావాల్సిన పదార్థాలు

- లేత కాకరకాయలు- పావు కేజీ, పసుపు- అర చెంచా, ఉప్పు- రెండు చెంచాలు, మెంతులు- పావు చెంచా, జీలకర్ర- అర చెంచా, ధనియాలు- ఒక చెంచా, నువ్వులు- రెండు చెంచాలు, నూనె- ఆరు చెంచాలు, ఉల్లిపాయ ముక్కలు- అర కప్పు, చింతపండు- అయిదు రెమ్మలు, వెల్లుల్లి రెబ్బలు- ఎనిమిది, కారం- మూడు చెంచాలు, కరివేపాకు- రెండు రెమ్మలు

తయారీ విధానం

- కాకరకాయలకు తొడిమలు తీసి మధ్యలో చాకుతో సన్నని గాటు పెట్టాలి. చెంచా సహాయంతో లోపల ఉన్న గింజలను తీసివేయాలి. ఒక గిన్నెలో ఒక చెంచా ఉప్పు, పావు చెంచా పసుపు వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని కాకరకాయలకు పట్టించి అరగంటసేపు అలాగే ఉంచాలి. తరవాత కాకరకాయలను ఒక్కోదాన్ని చేత్తో గట్టిగా పిండి రసాన్ని తీసివేయాలి.
- స్టవ్ మీద గిన్నెపెట్టి కాకరకాయలు వేసి అవి మునిగేవరకూ నీళ్లు పోసి ఉడికించాలి. అవి సగానికి పైగా ఉడికిన తరవాత పళ్లెంలోకి తీయాలి.
- స్టవ్ మీద మందపాటి గిన్నె పెట్టి మెంతులు, జీలకర్ర, ధనియాలు, నువ్వులు వేసి ఎర్రగా వేపాలి. వాటిని పళ్లెంలోకి తీసి చల్లార్చాలి. అదే గిన్నెలో మూడు చెంచాల నూనె వేసి వేడి చేయాలి. ఇందులో ఉల్లిపాయ ముక్కలు వేసి దోరగా వేపాలి. చింతపండు కూడా వేసి రెండు నిమిషాలు మగ్గించాలి. తరవాత స్టవ్ మీద నుంచి దించాలి. మిక్సీలో మెంతులు, నువ్వులు తదితరాలు వేసి మెత్తని పొడి చేయాలి. తరవాత ఉల్లిపాయలు, చింతపండు, వెల్లుల్లి రెబ్బలు, పావు చెంచా పసుపు, కారం, ఒక చెంచా ఉప్పు, కరివేపాకు వేసి మెత్తగా గ్రైండ్ చేయాలి. ఈ పేస్టుని గిన్నెలోకి తీసి బాగా కలపాలి. ఉప్పు సరిచూడాలి. దీన్ని చేత్తో కొద్ది కొద్దిగా తీసుకుంటూ ఉడికించిన కాకరకాయల లోపల నిండుగా నింపాలి.
- స్టవ్ మీద వెడల్పాటి గిన్నె పెట్టి మూడు చెంచాల నూనె వేసి వేడి చేయాలి. ఇందులో కాకరకాయలను పేర్చి మూత పెట్టి బాగా వేగనివ్వాలి. అయిదు నిమిషాల తరవాత కాకరకాయలను జాగ్రత్తగా తిప్పుతూ అన్నివైపులా ఎర్రగా వేపాలి. తరవాత పళ్లెంలోకి తీయాలి. ఇలా తయారు చేసుకున్న గుత్తి కాకరకాయ వేడి అన్నంలోకి బాగుంటుంది.

కాకరకాయను ఆహారంలో చేర్చుకోవడం వల్ల రక్తపోటు తగ్గుతుంది. రోగనిరోధక శక్తి, జీర్ణ శక్తి, ఆకలి పెరుగుతాయి. కడుపులోని నులిపురుగులు నశిస్తాయి. చర్మ వ్యాధులు తగ్గుతాయి. ఆస్తమా, జలుబు, దగ్గు లాంటి సమస్యలు దూరమవుతాయి.

జాగ్రత్తలు

- కాకరకాయలను నేరుగా నీటిలో కాకుండా ఆవిరి మీద ఉడికిస్తే వాటిలో పోషకాలు నిలుస్తాయి.
- నువ్వులకు బదులు పల్లీలు వేసుకోవచ్చు.
- కాకరకాయలను చిన్న మంటమీద ఎర్రగా వేపాలి. లేకపోతే చేదుగా అనిపిస్తాయి. దోరగా వేగితేనే వాటికి కమ్మదనం వస్తుంది.

కాకరకాయ చికెన్

కావాల్సిన పదార్థాలు

- చికెన్- పావు కేజీ, కాకరకాయలు- మూడు, ధనియాల పొడి- ఒక చెంచా, టమాటా ముక్కలు- ఒక కప్పు, కరివేపాకు- రెండు రెమ్మలు, కొత్తిమీర తరుగు- తగినంత, నూనె- అయిదు చెంచాలు, కారం- రెండు చెంచాలు, పసుపు- పావు చెంచా, ఉప్పు- ఒకటిన్నర చెంచా, అల్లం వెల్లుల్లి పేస్టు- ఒక చెంచా, ఉల్లిపాయ ముక్కలు- అర కప్పు, పచ్చిమిర్చి- రెండు

తయారీ విధానం

- కాకరకాయలను సన్నని పొడవైన ముక్కల్లా కోయాలి. స్టవ్ మీద మందపాటి గిన్నె పెట్టి నూనె వేసి వేడి చేయాలి. ఇందులో కాకరకాయ ముక్కలు వేసి ఎర్రగా వేపి పళ్లెంలోకి తీయాలి. ఇదే గిన్నెలో కరివేపాకు, ఉల్లిపాయ ముక్కలు, పచ్చిమిర్చి చీలికలు, అల్లం వెల్లుల్లి పేస్టు వేసి దోరగా వేపాలి. తరవాత చికెన్ ముక్కలు, పసుపు, ఉప్పు వేసి కలిపి మూతపెట్టి మగ్గించాలి. పది నిమిషాల తరవాత కారం, టమాటా ముక్కలు వేసి కలపాలి. టమాటా ముక్కలు మెత్తబడిన తరవాత ఒక గ్లాసు నీళ్లు పోసి మరిగించాలి. తరవాత వేయించిన కాకరకాయ ముక్కలు, ధనియాల పొడి వేసి నెమ్మదిగా కలపాలి. రెండు నిమిషాల తరవాత కొత్తిమీర తరుగు చల్లి స్టవ్ మీద నుంచి దించాలి. ఈ కాకరకాయ చికెన్ కూర... వేడి అన్నం, చపాతీల్లోకి బాగుంటుంది.



తరచూ కాకరకాయతో తయారుచేసిన పదార్థాలు తినడం వల్ల రక్తంలో చక్కెర శాతం తగ్గుతుంది. నోటిపూత, సుఖవ్యాధులు, కాలేయ సంబంధిత సమస్యల నుంచి ఉపశమనం కలుగుతుంది. శరీర బరువు నియంత్రణలో ఉంటుంది.

జాగ్రత్తలు

- కాకరకాయ ముక్కలను చక్రాల్లా కూడా కోసుకోవచ్చు.
- ఉల్లిపాయ ముక్కలు ఎక్కువగా వేసుకుంటే కూర కమ్మగా ఉంటుంది.
- చికెన్ ముక్కలను మరీ మెత్తగా మగ్గించకూడదు.
- పసుపు, ఎరుపు రంగులు కలగలిసిన టమాటాలను తీసుకుంటే కాకరకాయ ముక్కల చేదు తగ్గుతుంది.

కాకరకాయ నిల్వ పచ్చడి



కావాల్సిన పదార్థాలు

- కాకరకాయలు- అర కేజీ, చింతపండు- 80 గ్రాములు, బెల్లం- చిన్న ముక్క, మెంతులు- ముప్పావు చెంచా, ఆవాలు- రెండు చెంచాలు, జీలకర్ర- రెండు చెంచాలు, నువ్వుల నూనె- రెండు కప్పులు, వెల్లుల్లి రెబ్బలు- పది, ఇంగువ- పావు చెంచా, ఎండు మిర్చి- రెండు, కరివేపాకు- రెండు రెమ్మలు, ఉప్పు- ముప్పావు కప్పు, కారం- ఒక కప్పు, పసుపు- ఒక చెంచా

తయారీ విధానం

- కాకరకాయలను మంచినీళ్లతో కడిగి అరగంటసేపు ఆరబెట్టాలి. తరవాత మరీ సన్నగా కాకుండా కొద్దిగా లావుపాటి చక్రాలుగా తరిగి పలుచని గుడ్డ మీద పరచి తేమ లేకుండా ఆరనివ్వాలి. వెల్లుల్లి రెబ్బలను కచ్చాపచ్చాగా దంచి ఉంచుకోవాలి. ఒక గిన్నెలో చింతపండు వేసి శుభ్రంగా కడగాలి. అది మునిగేవరకూ నీళ్లు పోసి బెల్లం వేసి కలపాలి. ఈ గిన్నెను స్టవ్ మీద పెట్టి చింతపండు మెత్తబడే వరకూ అంటే కనీసం అయిదు నిమిషాలపాటు ఉడికించాలి. తరవాత స్టవ్ మీద నుంచి దించి చల్లార్చాలి.
- స్టవ్ మీద మందపాటి గిన్నె పెట్టి మెంతులు, ఒక చెంచా ఆవాలు, ఒక చెంచా జీలకర్రలను విడివిడిగా వేయించి ఒక పళ్లెంలోకి తీయాలి. వీటిని చల్లార్చాలి. తరవాత మిక్సీలో వేసి మెత్తగా గ్రైండ్ చేసి చిన్న గిన్నెలోకి తీయాలి. ఈ మిక్సీ గిన్నెలోనే చింతపండు మిశ్రమం వేసి మెత్తగా గ్రైండ్ చేయాలి. ఈ మిశ్రమాన్ని జల్లి గంటెలో వేసి చెంచాతో అదుముతూ మెత్తని గుజ్జును గిన్నెలోకి వడబోయాలి.
- స్టవ్ మీద వెడల్పాటి గిన్నె పెట్టి నువ్వుల నూనె పోసి వేడి చేయాలి. ఇందులో కాకరకాయ ముక్కలు వేసి పెద్ద మంట మీద దోరగా వేపాలి. కొద్దిగా రంగు మారడం మొదలవగానే కాకరకాయ ముక్కలను పళ్లెంలోకి తీయాలి. తరవాత ఈ నూనెలోనే కచ్చాపచ్చాగా దంచిన వెల్లుల్లి రెబ్బలు, ఒక చెంచా ఆవాలు, ఒక చెంచా జీలకర్ర, ఇంగువ, ఎండుమిర్చి ముక్కలు, కరివేపాకు వేసి దోరగా వేపాలి. తరవాత ఇందులో చింతపండు గుజ్జు వేసి కలిపి తడి పోయేవరకూ వేపాలి. తరవాత స్టవ్ మీద నుంచి దించి చల్లార్చాలి.
- మరో పెద్ద గిన్నెను తీసుకుని అందులో మెంతి-ఆవ పిండి, ఉప్పు, కారం, పసుపు వేసి బాగా కలపాలి. తరవాత వేయించిన కాకరకాయ ముక్కలు వేసి కలపాలి. వెంటనే చల్లారిన చింతపండు గుజ్జు మిశ్రమం కూడా వేసి బాగా కలపాలి. ఈ పచ్చడి మీద మూతపెట్టి రెండు రోజులపాటు ఊరనివ్వాలి. తరవాత ఉప్పు సరి చూసుకుని గాజు సీసాలో భద్రపరచుకోవాలి. ఇలా తయారు చేసిన కాకరకాయ పచ్చడి..... వేడి అన్నం, చపాతీ, పుల్కా, బ్రెడ్‌లోకి రుచిగా ఉంటుంది. ఇది రెండు నెలల వరకు నిల్వ ఉంటుంది.

కళ్లద్దాల మచ్చలా..?

ఈరోజుల్లో పెద్దలే కాదు చిన్నపిల్లలూ కళ్లద్దాలు పెట్టుకోవాల్సి వస్తోంది. ఫ్యాషన్ కోసం కూడా కొందరు కళ్లజోడు వాడతారు. అయితే కళ్లజోడు వలన ముక్కు మీద మచ్చలు ఏర్పడుతుంటాయి. వాటిని ఎలా తగ్గించుకోవాలో తెలుసుకుందాం...

- కలబందలో చర్మాన్ని ప్రకాశవంతంగా మార్చే లక్షణాలు ఉన్నాయి. రాత్రి పడుకొనేముందు కలబంద గుజ్జును కళ్లజోడు వలన కలిగిన మచ్చల మీద రాయాలి. తెల్లారి లేవగానే నీళ్లతో కడిగేయాలి.
- బంగాళదుంప రసాన్ని మచ్చల మీద రాసి పావుగంట తరువాత కడిగేయాలి. రోజుకు రెండుసార్లు ఇలా చేస్తే మంచి ఫలితం ఉంటుంది.
- ముఖం మీద మచ్చలను తొలగించడంలో కీరదోశ చక్కగా పని చేస్తుంది. కీరదోసను గుండ్రటి ముక్కలుగా కోసి, ముక్కు మీద మచ్చలున్న చోట పెట్టి కొంచెం సేపు రుద్దాలి. తరువాత చల్లటి నీటితో కడిగేసుకోవాలి.
- తేనె చర్మానికి తేమను అందించడంతో పాటు మచ్చలను తగ్గించేందుకు బాగా సహాయపడుతుంది. ఒక స్పూన్ తేనెలో ఒక స్పూన్ పాలు కలిపి మచ్చల మీద రాసి 15 నిమిషాల తరువాత కడిగేయాలి.
- నారింజ తొక్కను బాగా ఎండబెట్టి మిక్సీలో వేసి పొడి చేసుకోవాలి. ఈ పొడిలో కొంచెం పాలు పోసి పేస్టులా చేసుకుని మచ్చల మీద రాసి పావుగంట తరువాత చన్నీటితో కడిగేయాలి.
- గులాబీ నీళ్లను మచ్చల మీద రాసి రాత్రంతా ఉంచి ఉదయాన్నే కడిగేయాలి. రోజూ ఇలా చేసిన మంచి ఫలితముంటుంది.



ఫిగర్ స్కేటింగ్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించడం కోసం అమెరికా పౌరసత్వాన్ని వదులుకుంది భారత సంతతికి చెందిన తారా ప్రసాద్. జాతీయ పోటీల్లో విజేతగా నిలుస్తూ 2026 వింటర్ ఒలింపిక్స్ మీద గురి పెట్టిన 25 ఏళ్ల తార ప్రస్థానం ఇది.



ఫిగర్ స్కేటింగ్‌లో మెరుస్తున్న 'తార'

ఏడేళ్ల వయసులో మొదటిసారిగా ఐస్ రింక్ మీద అడుగుపెట్టింది తార. ఆ తర్వాత పదేళ్ల వరకూ ఆ క్రీడను ఒక ఆహ్లాదకరమైన కాలక్షేపంగానే పరిగణించింది. కానీ ప్రపంచంలోని అతి పెద్ద క్రీడా వేదిక మీద భారత్‌కు ప్రాతినిధ్యం వహించే స్థాయికి ఎదుగుతానని ఊహించలేదు. అమెరికా అయోవాలో పుట్టిన తార 2019లో భారత్‌కు తిరిగొచ్చింది. జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో విజేతగా నిలిచింది. 'ఇప్పుడు ఈ క్రీడ పట్ల మక్కువ బాగా పెరిగింది. అయితే చిన్నప్పటిలాగే రింక్‌లోకి అడుగుపెట్టి స్కేటింగ్ చేయడంలో ఉండే ఆనందాన్ని ఇప్పటికీ ఆస్వాదిస్తూనే ఉన్నాను. కానీ ఈ క్రీడ ద్వారా రాబోయే ఒలింపిక్స్‌లో స్వదేశానికి ప్రాతినిధ్యం వహించే స్థాయికి ఎదగాలనే పట్టుదల నాలో పెరిగింది. అందుకోసం తీవ్రంగా కృషి చేస్తున్నాను' అంటూ ఒక సందర్భంలో వివరించింది.

అథ్లెట్ల కుటుంబం

తారది తమిళనాడుకు చెందిన అథ్లెట్ల కుటుంబం. ఆమె తల్లి కవిత రామస్వామి కూడా ఏడేళ్ల వయసులోనే అథ్లెటిక్స్‌లోకి అడుగు పెట్టారు. కవిత తండ్రి, తార తాతయ్య, 87 ఏళ్ల వి.రామస్వామి ఇప్పటికీ మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో పాల్గొంటున్నారు. కవిత కూడా ఇప్పటికీ పరుగు పందేల్లో పాల్గొంటూ ఉంటారు. 'స్కేటింగ్ అంటే రింక్ దగ్గరకు వెళ్లడమే కాదు. ఆ క్రీడకు పోషకాహారం, శరీర దారుఢ్యం, మర్దన చికిత్స ల్లాంటివి అవసరం. స్కేటింగ్ పలు రకాల క్రీడల సమాహారం లాంటిది' అంటున్నారు తార తల్లి కవిత. ఈమె గతంలో 1990 బీజింగ్ ఏసియన్ గేమ్స్ క్యాంప్‌లో పరుగుల రాణి పి.టి.ఉషతో కలిసి శిక్షణ పొందారు. తార గురించి ప్రస్తావిస్తూ, 'తార, ఏదైనా చేయాలని నిర్ణయించుకుంటే ఆ పని అయ్యేదాకా వదిలిపెట్టదు. ఆమె మెదడు చురుగ్గా పని చేస్తుంది. ఆ వేగాన్ని అందుకుని, ఆమె మనసును అర్థం చేసుకోవడం చాలాకష్టం' అంటూ వివరించారు.

విమర్శకుల నోళ్లు మూయించి...

భారత దేశానికి తిరిగొచ్చిన ప్రారంభంలో ఆమెకెలాంటి క్రీడా లక్ష్యాలూ లేవు. అప్పటి వరకూ సరదా కోసమే స్కేటింగ్ చేసేది. కానీ అస్వస్థతతో దీర్ఘకాలం పాటు క్రీడకు దూరమైన తర్వాత, ఫిగర్ స్కేటింగ్ పట్ల ఆమెకు మక్కువ పెరిగింది. అప్పటికే భారత పౌరసత్వం పొందడంతో, రాబోయే ఒలింపిక్స్‌లో స్వదేశానికి ప్రాతినిధ్యం వహించాలని నిర్ణయించుకుంది. కానీ పౌరసత్వం పొంది, క్రీడాపరమైన విజయాలు సాధించడం మొదలుపెట్టిన తర్వాత, సామాజిక మాధ్యమాల్లో ప్రశంసలతో పాటు విమర్శలను కూడా ఎదుర్కోవలసి వచ్చింది. 'ఆసియ గేమ్స్‌తో పాటు నాలుగు ఖండాల పోటీల్లో పాల్గొన్న తర్వాత, ఆన్‌లైన్‌లో నా మీద నిందలు మొదలయ్యాయి. అయితే అవన్నీ వ్యక్తిగత ప్రతిష్ఠకు భంగం కలిగిస్తాయని నేను అనుకోవడం లేదు. వింటర్ స్పోర్ట్స్ పట్ల అందరి ఆసక్తినీ పెంచడానికి అవే విమర్శలు సహాయపడతాయని ఆశిస్తున్నాను. ఆన్‌లైన్‌లో నన్నెంతో మంది అవమానిస్తూ ఉంటారు. చంపుతామని బెదిరిస్తూ ఉంటారు. అయినా నేను బెదరను' అంటున్న తార 'సవాళ్లు ఉంటాయని తెలిసీ నేనీ దారిని ఎంచుకున్నాను. కాబట్టి చేతులెత్తేసే ప్రసక్తే లేదు' అంటూ ఇన్‌స్టాగ్రామ్‌లో విమర్శకుల నోళ్లు మూయించింది.

భిన్నాభిరుచులు...

యూనివర్శిటీ ఆఫ్ కొలరాడోలో కంప్యూటర్ సైన్స్ అండ్ మెషీన్ లెర్నింగ్ విద్యార్థి అయిన తార, తన అభిరుచిని ఫిగర్ స్కేటింగ్‌కే పరిమితం చేయలేదు. ప్రపంచాన్ని చుట్టిరావడం, సొంత వ్యాపారాన్ని కలిగి ఉండడం, డైమండ్ ఫేస్ ఆఫ్ లాంగ్స్ పీక్‌ను అధిరోహించడం, భారత దేశంలో ఫిగర్ స్కేటింగ్ అభివృద్ధికి సహాయపడడాన్ని తన లక్ష్యాలుగా ప్రకటించుకుంటోంది. స్కేటింగ్ తర్వాత తానెక్కువగా ఇష్టపడేది పర్వతారోహణ అనీ, అప్పుడప్పుడూ హైకింగ్‌కు కూడా వెళ్తూ ఉంటాననీ అంటోంది. అలాగే తార స్కేటింగ్ కోసం తన దుస్తులను తానే డిజైన్ చేసుకుని, కుట్టుకుంటూ ఉంటుంది.

అదే లక్ష్యం...

ఫిగర్ స్కేటింగ్‌లో కొరియోగ్రఫీ, కాస్ట్యూమ్స్ కీలకమనీ, అవి రెండూ మ్యూజిక్ థీమ్‌తో సరితూగేలా చూసుకుంటూ ఉంటాననీ అంటున్న తార, గతంలో పద్మావతి సినిమా సౌండ్ ట్రాక్‌తో పాటు, ఎ.ఆర్.రెహమాన్ అధీరా పాటలకు ప్రదర్శనలిచ్చింది. 2022, 2023, 2025 జాతీయ ఛాంపియన్‌షిప్ విజేత అయిన తార, గత ఏడాది స్లోవేనియాలోని అంతర్జాతీయ టోర్నమెంట్స్‌లో రెండు రజత పతకాలు గెలుచుకుంది. వచ్చే ఏడాది వింటర్ ఒలింపిక్స్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించడమే లక్ష్యంగా కృషి చేస్తోంది. ఈ పోటీలకు అర్హత సాధించే ఈవెంట్ ఈ సెప్టెంబరులో బీజింగ్‌లో జరగబోతోంది. అయితే అర్హత సాధించినా, సాధించకపోయినా, స్కేటింగ్ మాత్రం కచ్చితంగా కొనసాగిస్తాననీ, వ్యక్తిగత లక్ష్యాలు, అన్వేషించవలసినవి కూడా ఎన్నో ఉన్నాయనీ అంటోంది. ఒకవేళ తార వింటర్ ఒలింపిక్స్‌కు అర్హత పొందితే, ఈ పోటీల్లో పాల్గొనే అర్హత సాధించిన మొట్టమొదటి భారతీయ ఫిగర్ స్కేటర్‌గా గుర్తింపు పొందగలుగుతుంది.

స్క్రీన్ టైమ్ తగ్గించుకుందామిలా..

పిల్లలు, పెద్దలు అందరిలో ఫోన్ వినియోగం పెరిగిపోయింది. గంటల తరబడి ఫోన్‌లు చూస్తూ గడిపేస్తున్నారు. అయితే స్క్రీన్ టైమ్ తగ్గించుకునేందుకు చిట్కాలు..

- యాప్స్‌ను ఎంత సమయం వాడలన్నది టైమర్ సెట్ చేసుకోవాలి. ఇలా చేయడం వల్ల ఆ సమయం పూర్తవగానే ఫోన్‌కు నోటిఫికేషన్ వస్తుంది. దాంతో ఫోన్ పక్కన పెట్టేయవచ్చు.
- తినేటప్పుడు, పడకగదిలో వంటి చోట్ల ఫోన్ వాడకూడదని నిర్ణయించుకుని పాటించండి. ఆ సమయంలో కుటుంబసభ్యులతో మాట్లాడడం చేయాలి.
- ప్రతిరోజూ కొంత సమయం డిజిటల్ బ్రేక్‌గా పెట్టుకుని అనుసరించండి. ఆ సమయంలో ఫోన్ అసలే ముట్టుకోవద్దు.



- నోటిఫికేషన్‌లు వచ్చినప్పుడల్లా అవసరం లేకపోయిన ఫోన్ చూస్తుంటాం. అందుకే అత్యవసరమైన నోటిఫికేషన్‌లు మినహా మిగతావన్నీ ఆఫ్ చేసుకోవాలి.
- పనివేళలు, నిద్రపోయే సమయంలో డునాట్ డిస్టర్బ్ మోడ్‌ను ఆన్ చేసుకోండి. దీనివల్ల ప్రశాంతంగా పని చేసుకోవచ్చు, పడుకోవచ్చు.
- అలారం కోసం ఫోన్ వాడకూడదు. గడియారాన్నే వాడడం అలవాటు చేసుకోవాలి.
- ఫోన్ వాడడం తగ్గించి ఆ సమయంలో పుస్తకాలు చదవడం, కొత్త విషయాలు నేర్చుకోవడం లేదా కుటుంబంతో గడపడం చేయాలి.

ఆ అధికారి ఎవరు?

» 'ఆంధ్రజ్యోతి' కథనంపై ఆరా తీసిన నిఘా వర్గాలు

హైదరాబాద్, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : 'ఐఏఎస్‌లపై రిటైర్డ్ అధికారి పర్యవేక్షణ' అనే శీర్షికతో శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితం అయిన కథనంపై ఇంటెలిజెన్స్ అధికారులు ఆరా తీశారు. సచివాలయంలో సంబంధిత అధికారి ఎక్కడ పని చేస్తున్నారు.. ఏం సబ్జెక్టులు చూస్తున్నారు.. అనే సమాచారం సేకరించారని తెలిసింది. ఆయన జీఏడీలో డిప్యూటీ కార్యదర్శి హోదాలో పదవీ విరమణ చేసి, అనంతరం కాలుష్య నియంత్రణ మండలిలో సలహాదారుగా పొరుగు సేవల కింద నియమితులయ్యారు. జీతం ఒకచోట తీసుకుంటూ నిబంధనలకు విరుద్ధంగా జీఏడీలో పని చేయడం, అత్యంత కీలక విభాగాలకు సర్క్యులేటింగ్ అధికారి హోదాలో వ్యవహరించడం సచివాలయ అధికారుల్లో చర్చనీయాంశంగా మారింది. ఇదే విషయంపై ముఖ్యమంత్రి కార్యాలయ సీపీఆర్వో కూడా జీఏడీ అధికారులను సంప్రదించి వివరాలు సేకరించినట్లు తెలిసింది.

గోషా మహల్‌లో 'ఉస్మానియా' వద్దంటూ వ్యాజ్యం

హైదరాబాద్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా జనరల్ హాస్పిటల్ (ఓజీహెచ్)ను గోషామహల్ పోలీస్ స్టేడియానికి తరలింపుపై వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు జారీచేసింది. గోషామహల్ పోలీస్‌స్టేడియంలో ఉస్మానియా నూతన ఆస్పత్రి భవనం నిర్మించడాన్ని సవాల్ చేస్తూ గుండోలు రాము హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ ఆస్పత్రి కారణంగా గోషామహల్‌లో ఉంటున్న ప్రజలకు పర్యావరణ పరంగా, ఆరోగ్యపరంగా సమస్యలు ఎదురవుతాయని పేర్కొన్నారు. వాదనలు విన్న తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ రేణుక ధర్మాసనం.. ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసి, విచారణ నాలుగు వారాలకు వాయిదా వేసింది.

సుమోటో వ్యాజ్యంగా 'ఆంధ్రజ్యోతి ' కథనం

» స్వీకరించిన లోకాయుక్త

» ఆదివాసీ కుటుంబాల కుల బహిష్కరణపై విచారణ

హైదరాబాద్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అయిదు ఆదివాసీ కుటుంబాలను ఏడాదికాలం కుల బహిష్కరణ చేశారంటూ 'ఆంధ్రజ్యోతి' పత్రికలో బుధవారం ప్రచురితమైన కథనాన్ని లోకాయుక్త సుమోటోగా విచారణకు స్వీకరించింది. దీనిపై వివరణ ఇవ్వాలని జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఇల్లందు స్టేషన్ హౌస్ ఆఫీసర్‌లకు నోటీసులు జారీచేసింది. ఇల్లందు మండలం పాతపూసపల్లికి చెందిన ముడిగె రాములు, సీతమ్మ, సుగుణ, లక్ష్మీనారాయణ సహా ఐదు కుటుంబాలను కుల బహిష్కరణ చేశారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. దీనిపై 'ఆంధ్రజ్యోతి'లో కథనం రావడంతో లోకాయుక్త స్పందించింది. కల్తీకల్లు తదితర అంశాలపై సైతం లోకాయుక్త సుమోటోగా విచారణ చేపడుతోంది.

2 వేల మంది విద్యార్థినులకు ఆంత్రప్రెన్యూర్ శిక్షణ

» అంబేడ్కర్ వర్సిటీతో వి-హబ్ ఒప్పందం

రాష్ట్రంలోని యూనివర్సిటీల విద్యార్థినులను మహిళా పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక ప్రణాళిక అమలు చేయనున్నట్టు వి-హబ్ సీఈవో సీత పళ్లచోళ్ల తెలిపారు. ఇందుకోసం ప్రత్యేకంగా వీ-ఎనేబుల్ కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. శుక్రవారం అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో నిర్వహించిన కార్యక్రమంలో వర్సిటీతో వి-హబ్ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఇందులో భాగంగా వినూత్న ఆలోచనలున్న యూనివర్సిటీ విద్యార్థినులకు వి-హబ్ ప్రత్యేక శిక్షణ అందించనుంది. ఈ సందర్భంగా సీత పళ్లచోళ్ల మాట్లాడుతూ ఒప్పందంలో భాగంగా వచ్చే ఏడాది కాలంలో వర్సిటీలోని 2 వేల మంది విద్యార్థినులకు శిక్షణ ఇస్తామని, ఆరు నెలల కాలపరిమితితో మూడు దశల్లో ఈ శిక్షణ ఉంటుందన్నారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని వర్సిటీ వీసీ ఘంటా చక్రపాణి స్వాగతించారు.

ఉధృతంగా గోదావరి

» ఎగువన కురుస్తున్న వర్షాలతో పరవళ్లు

» సమ్మక్క సాగర్, మేడిగడ్డ బ్యారేజీలకు భారీగా వరద.. అన్ని గేట్లూ ఎత్తివేత

» కొనసాగుతున్న దేవాదుల పంపింగ్

» భద్రాద్రి వద్ద 37.2 అడుగుల నీటిమట్టం

» నీట మునిగిన స్నాన ఘట్టాలు, షెడ్డు

శ్రీశైలంకు 1.77 లక్షలు, జూరాలకు 1.09 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో


భద్రాచలం వద్ద గోదావరి ప్రవాహం

ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్

ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో గోదావరి, కృష్ణా నదులు పరవళ్లు తొక్కుతున్నాయి. రెండు నదులపై ప్రాజెక్టులకు భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రాణహిత, ఇంద్రావతి నదుల నుంచి భారీగా వరద వస్తుండడంతో గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం వద్ద గోదావరిపై ఉన్న సమ్మక్క సాగర్ బ్యారేజీకి 7,46,410 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. నీటిమట్టం 82.10 మీటర్లు ఉండగా.. బ్యారేజీ మొత్తం 59 గేట్లను ఎత్తివేశారు. ఇదే మండలం గుట్టల గంగారం వద్ద చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్టులో 3 మోటార్ల ద్వారా 831 క్యూసెక్కుల నీటిని భూపాలపల్లి జిల్లా భీం ఘనపూర్ రిజర్వాయర్‌కు పంపింగ్ చేస్తున్నారు. దేవాదుల ఇన్‌టేక్ వెల్ వద్ద 83.3 మీటర్ల నీటిమట్టం నమోదైంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం మేడిగడ్డ బ్యారేజీకి శుక్రవారం 8.68 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. 85 గేట్లను ఎత్తి అంతే నీటిని దిగువకు పంపిస్తున్నారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 8.60 మీటర్లు ఉంది. మహదేవపూర్ మండలం కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద ప్రాణహిత నది పరవళ్లు తొక్కుతోంది. శుక్రవారం సాయంత్రం 11.79 మీటర్ల నీటిమట్టం నమోదైంది. ఇది 12.2 మీటర్లు దాటితే మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేస్తారు. ఏటూరునాగారం మండలం పుష్కరఘాట్ వద్ద గోదావరి పెరుగుతూ శుక్రవారం సాయంత్రం 5 గంటలకు 14.4 మీటర్లకు చేరింది. 14.82 మీటర్లకు చేరితే మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేయనున్నారు. వాజేడు మండలంలో గోదావరి ఉధృతంగా ప్రవహిస్తుండడంతో పూసూరు-ఎడ్జర్లపల్లి, పేరూరు-చంద్రుపట్ల, వాజేడు-గుమ్మడిదొడ్డి మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. 163వ జాతీయ రహదారిపైకి వరద నీరు ప్రవేశించడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. మంగపేట మండలంలో గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. కమలాపురం బిల్ట్ ఇన్‌టేక్ వెల్ వద్ద నీటిమట్టం 8.5 అడుగులకు చేరింది. ఇక భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం పెరుగుతోంది. గురువారం అర్ధరాత్రి 12 గంటలకు 30 అడుగులు ఉండగా.. శుక్రవారం ఉదయం 6 గంటలకు 33.3 అడుగులకు పెరిగింది. మధ్యాహ్నం 12 గంటలకు 35.4 అడుగులు నమోదై సాయంత్రం 6 గంటలకు 37.2కు చేరింది. భద్రాచలం వద్ద స్నాన ఘట్టాలతో పాటు మహిళలు దుస్తులు మార్చుకునేందుకు ఏర్పాటు చేసిన షెడ్ మునిగాయి. ముంపు మండలాలైన కుక్కునూరు, వేలేరుపాడుల్లో వరద ముంపు తీవ్రత కనిపిస్తోంది. కుక్కునూరు-దాచారం మార్గంలో గుండేటి వాగు కాజ్‌వేపై వరద చేరడంతో రాకపోకలు నిలిచిపోయాయి. వేలేరుపాడు మండలం ఎద్దువాగు కాజ్‌వేపై వరద పెరుగుతుండడంతో 14 గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి.

కృష్ణమ్మ పరవళ్లు

కృష్ణా నది విషయానికొస్తే.. శ్రీశైలం ప్రాజెక్టుకు వరద కొనసాగుతోంది. శుక్రవారం 1.77 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. మూడు గేట్లు, ఎడమ, కుడిగట్టు జల విద్యుత్ కేంద్రాలు, పోతిరెడ్డిపాడు, ఎంజీకేఎల్ఐ ద్వారా 1.70 లక్షల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 215.81 టీఎంసీలు కాగా ప్రస్తుతం 203.89 టీఎంసీల నిల్వ ఉంది. ఆలమట్టి, నారాయణపూర్‌కు కూడా వరద నిలకడగా కొనసాగుతోంది. ఆలమట్టికి 1.11 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా లక్ష క్యూసెక్కులను నారాయణపూర్‌కు వదులుతున్నారు. నారాయణపూర్ వద్ద లక్ష క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవుతుండగా 95,760 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. జూరాల వద్ద 1.09 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవుతుండగా 1.02 లక్షలను శ్రీశైలం వైపు వదులుతున్నారు. తుంగభద్రకు 41,972 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా 40,855 క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు. నాగార్జున సాగర్ ప్రాజెక్టు నీటిమట్టం శుక్రవారం సాయంత్రం క్రస్ట్ గేట్లను తాకింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 590 అడుగులు కాగా 545.30 అడుగులకు చేరింది. సాగర్ పూర్తి సామర్థ్యం 312.0450 టీఎంసీలు కాగా 199.5466 టీఎంసీలు ఉంది. ఎగువనుంచి 1,24,800 క్యూసెక్కులు సాగర్‌కు చేరుతుండగా 5,244 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

నేడు, రేపు తేలికపాటి వర్షాలు

తెలంగాణలో శని, ఆదివారాల్లో పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. శనివారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది.

నవంబరులో తెలంగాణ-ఈశాన్య రాష్ట్రాల సాంస్కృతిక ఉత్సవం

హైదరాబాద్, జూలై11(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది నవంబర్‌లో తెలంగాణ-ఈశాన్య రాష్ట్రాల సాంస్కృతిక ఉత్సవం జరుగనుంది. దీనికి సంబంధించిన ఏర్పాట్లపై గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ రాజ్‌భవన్‌లో జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో సమీక్షించారు. నవంబర్ 25వ తేది నుంచి 4 విడతలుగా ఈ ఉత్సవం నిర్వహిస్తామని అధికారులు గవర్నర్‌కు వివరించారు. ఈశాన్య రాష్ట్రాల సంస్కృతిని తెలంగాణ వాసులకు పరిచయం చేయడంతో పాటు ఆరోగ్య సంరక్షణ, ఐటీ, ఫార్మా రంగాల పురోగతి ప్రదర్శన ఉంటుందని గవర్నర్‌కు ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిషోర్ వివరించారు. ఏక్ భారత్-శ్రేష్ట భారత్ అర్థం ప్రతిబింబించేలా ఉత్సవాన్ని నిర్వహించాలని గవర్నర్ సూచించారు. చిత్రకళ, ఫోటోగ్రఫీ, కళా ప్రదర్శనలు, మీడియా, జర్నలిజం, మహిళా సాధికారత, ఆటలు, ఫార్మా లైఫ్ సైన్సెస్ రంగాలకు సంబంధించి 6వందల మంది ప్రతినిధులు ఈ ఉత్సవంలో పాల్గొంటారని అధికారులు వివరించారు. పలువురు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

యాదగిరిగుట్టలో శంఖు, చక్ర, నామాల పునరుద్ధరణ!

» టెండర్లు పిలిచేందుకు అధికారుల నిర్ణయం

యాదగిరిగుట్ట, జూలై 11(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి కొండపై శంఖు, చక్ర, నామాలు పునరుద్ధరించేందుకు అధికారులు యోచిస్తున్నారు. ఆలయ ఉద్ఘాటన అనంతరం కనుమరుగైన వీటిని ప్రసాదాల తయారీ కేంద్రం పైభాగంలో బిగించేందుకు నిర్ణయించారు. ఈవో ఎస్.వెంకట్రావు అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో దీనిపై నిర్ణయం తీసుకున్నారు. శంఖు, చక్ర, నామాల బిగింపు ప్రక్రియతోపాటు రాత్రి వేళ ధగధగ మెరిసేలా ప్రత్యేక విద్యుత్ దీపాలంకరణ ఏర్పాటుకు టెండర్లను ఆహ్వానించాలని నిర్ణయించారు. అలాగే భక్తులు మొక్కు వెంట్రుకలు సమర్పించేందుకు కొత్తగా తులసీకాటేజీలో మరో కల్యాణ కట్ట అందుబాటులోకి రానుంది. దేవస్థానానికి సంబంధించి అద్దె గదుల సముదాయం ఇక్కడే ఉన్నందున భక్తులకు అనుకూలంగా ఉంటుందని ఈవో నిర్ణయించారు.

కాళేశ్వరం కింద సాగునీరు 45 వేల ఎకరాలకే..

(మొదటిపేజీ తరువాయి)

బేసిన్ పరిధిలోని భారీ, మధ్య తరహా ప్రాజెక్టులతో పాటు చిన్న లిఫ్టుల కింద 12,.04 లక్షల ఎకరాల ఆరుతడి పంటలకు, 26.71 లక్షల ఎకరాల్లో వరి పంటకు కలిపి.. మొత్తం 38.76 లక్షల ఎకరాలకు సాగునీటిని అందించాలని అధికారులు నిర్ణయం తీసుకున్నారు. దీనికోసం 339.11 టీఎంసీల నీటిని విడుదల చేయనున్నారు. కృష్ణా బేసిన్ పరిధిలోని అన్ని జలాశయాల్లో పుష్కలంగా నీటి నిల్వలు ఉన్నందునా.. 7.38 లక్షల ఎకరాల్లో ఆరుతడి పంటలకు, 10.30 లక్షల ఎకరాల్లో వరి పంటకు కలిపి 17.68 లక్షల ఎకరాలకు నీళ్లు ఇవ్వాలని కమిటీ నిర్ణయించింది. ఇక గోదావరి బేసిన్ పరిధిలోని శ్రీరాంసాగర్, శ్రీపాద ఎల్లంపల్లి, మిడ్‌మానేరు వంటి ప్రాజెక్టుల్లో నీటి నిల్వ లేనందునా.. నీటి నిల్వ ఉన్న ప్రాజెక్టుల నుంచి 6.37 లక్షల ఎకరాలకు సాగునీటిని అందించాలని నిర్ణయించారు. మరో వారం రోజుల్లో దీని కోసం స్కైవమ్ కమిటీ ప్రత్యేకంగా సమావేశం కానుంది. ఇక వానాకాలంలో గోదావరి బేసిన్ పరిధిలో 62.52 టీఎంసీలు, కృష్ణా బేసిన్ పరిధిలో 196.41 టీఎంసీలు సాగునీటి కోసం వినియోగించనున్నారు.

టీటీడీలో వెయ్యి మంది అన్యమత ఉద్యోగులు!

» వారిని తక్షణం తొలగించండి: బండి సంజయ్



తిరుమల, జూలై 11(ఆంధ్రజ్యోతి): టీటీడీలో ఇప్పటికీ వెయ్యి మందికి పైగా అన్యమతస్థులు ఉద్యోగాల్లో ఉన్నారని. వెంటనే వారిని తొలగించాలని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కోరారు. శుక్రవారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఆయన బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డితో కలిసి ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. 'టీటీడీలో ఉన్న అన్యమతస్థులకు స్వామిపై విశ్వాసం లేదు. సనాతన ధర్మానికి అనుగుణంగా వ్యవహరించాలనే ఆలోచన వారికి లేదు. అలాంటి వ్యక్తులకు టీటీడీలో ఉద్యోగాలు ఇవ్వడం, వారిని ఇంకా కొనసాగించడం సరికాదు. జీతాలు ఇస్తూ వారిని ఎలా ప్రోత్సహిస్తారు. గతం నుంచి ఉన్నారు, మేము ఏమీ చేయలేం అంటే అది చేతగానితనం అవుతుంది. టీటీడీ బోర్డుకు నేను సూటిగా చెప్తున్నా. ఇది మంచి పద్ధతి కాదు. వారిని వెంటనే తొలగించాల్సిన బాధ్యత మీపై ఉంది. ఇది రిక్వెస్ట్ కాదు, డిమాండ్' అని సంజయ్ స్పష్టం చేశారు. హిందువుల ఆస్తి టీటీడీ, నామం పెట్టుకుని చర్చికి వెళితే ఉద్యోగమిస్తారా అని ఆయన ప్రశ్నించారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్



గాలి జనార్దన్ రెడ్డి తనయుడు కిరీటిరెడ్డి హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'జూనియర్'. శ్రీలీల కథానాయిక. రాధాకృష్ణ దర్శకత్వంలో రజనీ కొర్రపాటి నిర్మించారు. ఈ నెల 18న విడుదలవుతోంది. దర్శకుడు ఎస్.ఎస్ రాజమౌళి చేతుల మీదుగా శుక్రవారం చిత్రబృందం ట్రైలర్‌ను విడుదల చేసింది. దర్శకుడు ఈ చిత్రాన్ని యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా తీర్చిదిద్దారని ట్రైలర్‌ను బట్టి తెలుస్తోంది. కిరీటిరెడ్డి తన సహజనటనతో అలరించారు. వైవా హర్ష, సత్య కామెడీ టైమింగ్ ప్రత్యేకాకర్షణగా నిలిచింది. రొమాన్స్, ఎమోషన్స్ లాంటి అన్ని రకాల హంగులతో మంచి కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని రూపొందించినట్లు యూనిట్ తెలిపింది. ఈ చిత్రానికి సంగీతం: దేవి శ్రీ ప్రసాద్. సినిమాటోగ్రఫీ:కేకే సెంథిల్ కుమార్

'ఓజీ' షూటింగ్ పూర్తి



పవన్ కల్యాణ్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న 'ఓజీ' సినిమా షూటింగ్ పూర్తయింది. ఈ మేరకు చిత్ర యూనిట్ శుక్రవారం అధికారికంగా ప్రకటించింది. దసరా పండుగ సందర్భంగా సెప్టెంబరు 25న సినిమా ప్రేక్షకుల ముందుకు వస్తోందంటూ రిలీజ్ డేట్ పోస్టర్‌ని విడుదల చేసింది. వర్షంలో తడుస్తూ కారు దిగి గన్‌తో ఫైర్ చేస్తున్న పవన్ కల్యాణ్ పోస్టర్ అదిరిపోయింది. కాగా, ఈ సినిమాను సుజీత్ దర్శకత్వంలో డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్స్ బేనర్‌పై దానయ్య నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో ఇమ్రాన్ హష్మీ, ప్రియాంక అరుల్ మోహన్, ప్రకాశ్ రాజ్, శ్రియ రెడ్డి తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. తమన్ సంగీతం అందిస్తున్నారు.

అమెరికా చదువుల కథ



విదేశాల్లో చదువుతున్న భారతీయ విద్యార్థుల జీవితాలు, వారి కలలు, కష్టాలు, స్నేహాలను వివరించే కథాంశంతో రూపుదిద్దుకొంటున్న 'విసా.. వింటారా.. సరదాగా' చిత్రం ఫస్ట్ లుక్‌ని శుక్రవారం విడుదల చేశారు. అశోక్ గల్లా, గౌరీ ప్రియ, రాహుల్ విజయ్, శివాత్మిక ప్రధాన పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రంతో ఉద్భవ్ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మాతలు. పూర్తి వినోదాత్మకంగా రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రం విదేశాల్లో విద్యార్థి జీవితాల్లోని ఎత్తు పల్లాలను ప్రతిబింబిస్తుందని దర్శకనిర్మాతలు తెలిపారు.

మోనికా వచ్చేసింది!



తమిళ చిత్రరంగ సూపర్‌స్టార్ రజనీకాంత్ హీరోగా లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో రూపొందుతున్న 'కూలీ' చిత్రం ఆగస్టు 14న విడుదల కావడానికి సిద్ధమవుతోంది. ఈ చిత్రంలో అక్కినేని నాగార్జున కీలక పాత్ర పోషిస్తున్నారు. సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా పూజా హెగ్డే పాల్గొన్న స్పెషల్ సాంగ్ 'మోనికా'ను శుక్రవారం విడుదల చేశారు. సముద్రం నేపథ్యంలో చిత్రీకరించిన ఈ సాంగ్‌లో రెడ్ కలర్ డ్రెస్‌లో ఉన్న పూజ తన డ్యాన్స్ మూమెంట్స్‌తో ఆకట్టుకున్నారు. సౌబిన్ షాహిర్ కూడా ఆమెతో పాటు ఈ పాటలో పాల్గొన్నారు. ఆమిర్‌ఖాన్, ఉపేంద్ర, సత్యరాజ్ సౌబిన్ షాహిర్, శ్రుతీహాసన్, మహేంద్రన్ తదితరులు నటిస్తున్న 'కూలీ' చిత్రాన్ని ఏషియన్ మల్టీప్లెక్స్ సంస్థ ద్వారా సురేశ్‌బాబు, దిల్ రాజు, సునీల్ నారంగ్, భరత్ నారంగ్ తెలుగు రాష్ట్రాల్లో విడుదల చేస్తున్నారు.

భారీ హంగులతో ఆకట్టుకుంటుంది

- సంజయ్ దత్



ధృవ సర్జా కథానాయకుడిగా నటించిన తాజా చిత్రం 'కేడీ ద డెవిల్'. ప్రేమ్ దర్శకత్వంలో వెంకట్ కే నారాయణ నిర్మించారు. రీష్మా నానయ్య కథానాయిక. సంజయ్‌దత్, శిల్పాశెట్టి, నోరా ఫతేహీ ప్రధాన పాత్రల్లో నటించారు. ఇటీవలే నిర్వహించిన కార్యక్రమంలో చిత్రబృందం టీజర్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా సంజయ్‌దత్ మాట్లాడుతూ 'కేవీఎన్ ప్రొడక్షన్స్ ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్, హై టెక్నికల్ వాల్యూస్‌తో గ్రాండియర్‌గా నిర్మించింది. ఇదొక డిఫరెంట్ యాక్షన్ థ్రిల్లర్. ధృవ నా తమ్ముడు లాంటి వారు. ఆయన చాలా గొప్పస్థాయికి ఎదగాలి. రొమాంచిత పోరాట ఘట్టాలు, భారీ హంగులతో 'కేడీ ద డెవిల్' ఆకట్టుకుంటుంది' అని అన్నారు. ధృవ సర్జా మాట్లాడుతూ 'నేనెంతగానో ఇష్టపడే నటుడు సంజయ్‌దత్. ఆయనతో కలసి పనిచేయడం సంతోషాన్నిచ్చింది. శిల్పాశెట్టిగారి దగ్గర నటనలో మెలకువలు నేర్చుకున్నాను. త్వరలో విడుదల తేదీ ప్రకటిస్తాం' అని చెప్పారు. 'సాహస వీరుడు సాగర కన్య' చిత్రం చేసినప్పటి నుంచి తెలుగు ప్రేక్షకులు నాపై అదే ప్రేమను చూపిస్తున్నందుకు ధన్యవాదాలు. సంజయ్‌దత్ గారితో నేను చేసిన ప్రతిసినిమా హిట్టయింది. ఈ చిత్రం కూడా తప్పకుండా ఘన విజయం అందుకుంటుంది' అని ఆకాంక్షించారు. 'నేను దర్శకత్వం వహించిన కన్నడ చిత్రం 'జోగి'ని తెలుగులో 'యోగి'గా రీమేక్ చేశారు. ఇప్పుడు 'కేడీ ద డెవిల్' చిత్రంతో తెలుగు ప్రేక్షకుల ముందుకు వస్తున్నందుకు ఆనందంగా ఉంది' అని ప్రేమ్ చెప్పారు.

ఆ పాటను అనుమతి లేకుండా ఉపయోగించారు

● హైకోర్టుకెక్కిన ఇళయరాజా



ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజా మరోమారు హైకోర్టును ఆశ్రయించారు. ప్రముఖ నటి వనిత విజయకుమార్, కొరియోగ్రాఫర్ రాబర్ట్ మాస్టర్ జంటగా నటించిన 'మిసెస్ అండ్ మిస్టర్' శుక్రవారం విడుదలైంది. ఇందులో తాను సంగీతం సమకూర్చిన 'మైఖేల్ మదన కామరాజన్' చిత్రంలోని ఓ పాటను తన అనుమతి లేకుండా వాడారని, ఇది కాపీరైట్ ఉల్లంఘన కిందకే వస్తుందని, అందువల్ల ఆ పాటను తొలగించాలని ఆయన తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఇళయరాజా తరపు న్యాయవాది ఈ పిటిషన్‌ను హైకోర్టులో దాఖలు చేసి, తక్షణ విచారణకు స్వీకరించాలని కోరారు. ఈ పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన న్యాయమూర్తి సెంథిల్ కుమార్ సోమవారానికి వాయిదా వేశారు.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

అలరించే గదాధారి



పురాణగాథ నేపథ్యంలో భారీ బడ్జెట్‌తో తెలుగు, కన్నడ, హిందీ భాషల్లో తెరకెక్కుతోన్న చిత్రం 'గదాధారి హనుమాన్'. రవికిరణ్ కథానాయకుడు. రేణుకాప్రసాద్, బసవరాజ్ హురకడ్డి నిర్మించారు. శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో చిత్రబృందం టీజర్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా రవికిరణ్ మాట్లాడుతూ 'హనుమంతుడు ఇచ్చిన శక్తితోనే ఈ సినిమాను భారీ స్థాయిలో తెరకెక్కించాం. పతాక సన్నివేశాలు సంభ్రమాశ్చర్యాలకు గురిచేస్తాయి. అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించే అంశాలు సినిమాలో ఉన్నాయి' అని చెప్పారు. రేణుకా ప్రసాద్ మాట్లాడుతూ 'రోహిత్ కొల్లి సినిమాను అద్భుతంగా తెరకెక్కించారు. వినోద భరితంగా నడిపిస్తూనే భావోద్వేగాలను ఆవిష్కరించే ప్రయత్నం చేశారు' అని ప్రశంసించారు. రోహిత్ కొల్లి మాట్లాడుతూ 'మూడేళ్ల కష్టం ఈ సినిమా. రవి జాయిన్ అవడంతో పాన్ ఇండియా స్థాయిలో తీసుకొస్తున్నాం. రేణుకా ప్రసాద్ ఖర్చుకు వెనుకాడకుండా భారీ స్థాయిలో నిర్మించేందుకు సహకరించారు. హనుమంతుని గదా శక్తిని చూపుతూ రూపొందించిన సీక్వెన్స్ ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి' అని చెప్పారు.

హనుమంతుడి పాత్ర 15 నిముషాలేనా?!



రణ్‌బీర్ కపూర్ శ్రీరాముడిగా, సాయిపల్లవి సీతగా నటిస్తున్న 'రామాయణ' సినిమాపై రోజు రోజుకీ అంచనాలు పెరుగుతున్నాయి. ఈ సినిమాకు సంబంధించి ఏదో ఒక కొత్త వార్త బయటకు వచ్చి ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతోంది. వారి అంచనాలకు ఏ మాత్రం తగ్గకుండా ఉండేలా ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ చిత్రాన్ని రూపొందిస్తున్నారు దర్శకుడు నితిశ్ తివారీ. 'రామాయణ' చిత్రంలో సన్నీ డియోల్ హనుమంతుడిగా నటిస్తున్న సంగతి తెలిసిందే. వచ్చే ఏడాది దీపావళి సందర్భంగా విడుదలయ్యే సినిమా తొలి భాగంలో హనుమంతుడి పాత్ర కేవలం పదిహేను నిముషాలే ఉంటుందనే వార్త ఇప్పుడు వినిపిస్తోంది. అయితే 2027 దీపావళికి విడుదలయ్యే రెండో భాగంలో మాత్రం ఆయన పాత్ర సమగ్రంగా ఉంటుందని చెబుతున్నారు. ఈ విషయం గురించి చిత్ర యూనిట్ అధికారికంగా వెల్లడించకపోయినప్పటికీ ఈ వార్త మాత్రం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.



ముంబైలో టెస్లా షోరూమ్ రెడీ

వచ్చే వారమే ప్రారంభం

న్యూఢిల్లీ: ప్రపంచ ఈవీ దిగ్గజం టెస్లా భారత మార్కెట్లోకి లాంఛనప్రాయంగా ప్రవేశించేందుకు సన్నాహాలు పూర్తి చేసింది. వచ్చే వారం ముంబైలోని బాంద్రా కుర్లా కాంప్లెక్స్‌లో తొలి ఎక్స్‌పీరియెన్స్ సెంటర్ ప్రారంభించనుంది. అమెరికాకు చెందిన కుబేరుడు ఎలాన్ మస్క్ నేతృత్వంలోని ఈ విద్యుత్ కార్ల దిగ్గజం ఈ నెల 15న నిర్వహిస్తున్న ప్రారంభ కార్యక్రమానికి ఎంపిక చేసిన వారికి ఇప్పటికే ఆహ్వానాలు పంపింది. అయితే దీనిపై స్పందించేందుకు కంపెనీ ప్రతినిధులెవరూ అందుబాటులో లేరు.

ఆస్టిన్ ప్రధాన కేంద్రంగా పని చేస్తున్న ఈ కంపెనీ చైనా ప్లాంట్‌లో ఉత్పత్తి చేసిన మోడల్ వై రియర్ వీల్ డ్రైవ్ ఎస్‌యూవీ సహా కొన్ని మోడళ్లను ముంబై చేర్చిందని పరిశ్రమ నిపుణులు చెబుతున్నారు. ఈ షోరూమ్ కోసం టెస్లా ఇప్పటికే 24,565 చదరపు అడుగుల విస్తీర్ణం గల వేర్‌హౌస్‌ను లోధా లాజిస్టిక్స్ పార్క్ నుంచి ఐదేళ్ల కాలానికి లీజుకి తీసుకుంది. 40 వేల డాలర్ల లోపు ధరల శ్రేణిలోని కార్లకు 70 శాతం కస్టమ్స్ సుంకాన్ని, ఆ పైబడిన ధరలోని కార్లకు నూరు శాతం కస్టమ్స్ సుంకాన్ని భర్తీ చేసుకునేందుకు ప్రారంభ టారిఫ్ రాయితీలు కల్పించాలని భారత ప్రభుత్వాన్ని ఆ సంస్థ కోరుతోంది.

ఐటీ షేర్లలో భారీ అమ్మకాలు

సెన్సెక్స్ 690 పాయింట్లు డౌన్

ముంబై: ఐటీ, ఆటో, ఎనర్జీ షేర్లలో భారీ అమ్మకాల ఒత్తిడి శుక్రవారం మార్కెట్‌ను కుంగదీసింది. కార్పొరేట్ ఫలితాల సీజన్‌కు ఐటీ దిగ్గజం టీసీఎస్ నిరుత్సాహపూరితమైన ప్రారంభం అందించడం ఐటీ, ఆటో, ఇంధన కౌంటర్లలో అమ్మకాల ఒత్తిడిని పెంచింది. దీనికి తోడు టారిఫ్ సంబంధిత అస్థిరతలు, ప్రపంచ మార్కెట్ల నుంచి అందిన మిశ్రమ సంకేతాలు మార్కెట్‌పై ప్రభావం చూపాయి. సెన్సెక్స్ 689.91 పాయింట్ల నష్టంతో 82,500.47 వద్ద స్థిరపడగా నిఫ్టీ 205.40 పాయింట్ల నష్టంతో 25,149.85 వద్ద క్లోజైంది.

కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత వ్యక్తిగత ఆర్థిక ఎంసీపీ (మోడల్ కంటెక్స్ట్ ప్రొటోకాల్) ప్రారంభించినట్లు ఎఫ్ఐ మనీ వెల్లడించింది. వినియోగదారులు ఏఐ అసిస్టెంట్‌ను ఉపయోగించటం ద్వారా తమ ఆర్థిక లక్ష్యాలను నిర్దేశించుకునే అవకాశం లభిస్తుందని ప్రకటించింది. అలాగే బ్యాంక్ ఖాతాలు, మ్యూచువల్ ఫండ్స్, రుణాలు, బీమా, రియల్ ఎస్టేట్, ఈపీఎఫ్ సహా అన్నింటిని ఎఫ్ఐ ఎంసీపీ ద్వారా వినియోగించుకునే సౌలభ్యాన్ని అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపింది.

హెల్త్‌కేర్‌లోకి అదానీ గ్రూప్

- ముంబై, అహ్మదాబాద్‌ల్లో హాస్పిటల్స్ ఏర్పాటు
- గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీ వెల్లడి

ముంబై: అదానీ గ్రూప్.. ఆరోగ్య సంరక్షణ (హెల్త్‌కేర్) రంగంలోకి ప్రవేశిస్తోంది. ఇందులో భాగంగా ముంబై, అహ్మదాబాద్ నగరాల్లో అత్యాధునిక సదుపాయాలతో రెండు ఆస్పత్రులు ఏర్పాటు చేస్తోంది. ముంబైలో జరిగిన ఒక సదస్సులో అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీ ఈ విషయం వెల్లడించారు. తాము ఏర్పాటు చేసే ఆస్పత్రుల్లో వ్యాధి నిర్ధారణ, చికిత్సల్లో కృత్రిమ మేధను ఎక్కువగా ఉపయోగించనున్నట్టు తెలిపారు. అనేక వ్యాధులకు ఒకే చోట చికిత్స అందించేలా ఈ ఆస్పత్రులు ఏర్పాటు చేస్తామన్నారు. అత్యవసర పరిస్థితులు, కొవిడ్ వంటి మహమ్మారులు వ్యాపించినప్పుడు ఈ ఆస్పత్రుల సామర్థ్యాన్ని వెంటనే విస్తరించవచ్చన్నారు. అందుబాటు ధరల్లో అత్యాధునిక వైద్య సేవలను అందరికీ అందుబాటులోకి తేవడమే తమ లక్ష్యమని అదానీ స్పష్టం చేశారు.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	99,000 ▲	90,750 ▲	1,21,000 ▲
విజయవాడ	1,00,000 ▲	94,000 ▼	1,11,000 ▲
విశాఖపట్నం	1,00,710 ▲	90,750 ▲	1,21,000 ▲
రాజమండ్రి	99,000 ▲	90,750 ▲	1,13,600 ▼
ప్రొద్దుటూరు	97,600 ▲	89,790 ▲	1,11,000 ▲
ముంబై	97,511 ▲	89,320 ▲	1,10,290 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



12వ తేదీ			
హైదరాబాద్	510	విజయవాడ	525
వరంగల్	512	గోదావరి	515
చిత్తూరు	583	విశాఖపట్నం	540
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	93	విజయవాడ	97
వరంగల్	93	గుంటూరు	102
కరీంనగర్	93	ఒంగోలు	105
మహబూబ్‌నగర్	93	చిత్తూరు	98
కర్నూలు	93	నెల్లూరు	103
విశాఖపట్నం	81	అనంతపురం	103
గోదావరి	97		

దేశీయంగా రేర్ ఎర్త్ మాగ్నెట్ల తయారీకి

రూ.1,345 కోట్లతో ప్రత్యేక నిధి

- ప్రత్యేక ప్రోత్సాహకాలకు ప్రభుత్వం సిద్ధం
- చైనా ఆధిపత్యానికి చెక్ పెట్టేందుకే..
- కేంద్ర మంత్రి కుమార స్వామి



న్యూఢిల్లీ: దేశీయంగా రేర్ ఎర్త్ మాగ్నెట్ల ఉత్పత్తికి ప్రభుత్వం సిద్ధమైంది. ఇందుకోసం ముందుకు వచ్చే కంపెనీలకు ప్రత్యేక ప్రోత్సాహకాలు అందించేందుకు రూ.1,345 కోట్లతో ప్రత్యేక నిధిని ఏర్పాటు చేయనుంది. కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్‌డీ కుమార స్వామి ఈ విషయం ప్రకటించారు. రాష్ట్రాలతో చర్చించిన తర్వాత ఈ ప్రతిపాదనను కేంద్ర క్యాబినెట్ ఆమోదానికి పెడతామని ఆయన చెప్పారు.

రెండు కంపెనీలకే అవకాశం

అయితే రేర్ ఎర్త్ మాగ్నెట్ల తయారీకి రెండు కంపెనీలను మాత్రమే ఎంపిక చేయనున్నట్టు కుమార స్వామి తెలిపారు. రేర్ ఎర్త్ ఖనిజాల ఉత్పత్తి, వాటిని శుద్ధి చేయడం, శుద్ధి చేసిన ఖనిజాల నుంచి తుది ఉత్పత్తులైన రేర్ ఎర్త్ మాగ్నెట్ల తయారీ వరకు అన్ని దశల్లోనూ కంపెనీలకు ప్రభుత్వం అండగా ఉంటుందని కేంద్ర మంత్రి చెప్పారు. ఇప్పటికే వినియోగించి పారేసిన రేర్ ఎర్త్ మాగ్నెట్లను కరిగించి ఆ భస్మంతో మాగ్నెట్లను తయారు చేసేలా కంపెనీలను ప్రోత్సహించడం తమ లక్ష్యమని ప్రభుత్వం ప్రకటించింది.

చైనాదే హవా

ఆటోమొబైల్, కంప్యూటర్ చిప్స్, విండ్ టర్బైన్స్‌లో రేర్ ఎర్త్ మాగ్నెట్లు కీలకం. ప్రస్తుతం ఈ మాగ్నెట్ల ఉత్పత్తిలో చైనాదే హవా. ప్రపంచ ఉత్పత్తిలో 90 శాతం చైనాలోనే కేంద్రీకృతమైంది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి చైనా మన దేశానికి వీటి ఎగుమతులను నిలిపివేసింది. దీంతో దేశీయ ఆటోమొబైల్ కంపెనీలు ముఖ్యంగా విద్యుత్ వాహనాల కంపెనీలు వీటి సరఫరా కోసం అరిచి గగ్గోలు పెడుతున్నాయి. అయినా చైనా నుంచి ఉలుకూ పలుకు లేదు. ప్రత్యామ్నాయాలు చూద్దామన్నా పెద్దగా ఫలించడం లేదు. దీంతో సొంత కాళ్లపై నిలబడడం తప్ప వేరే మార్గం లేదని ప్రభుత్వం నిర్ణయానికి వచ్చింది. అందులో భాగంగానే దేశీయంగా రేర్ ఎర్త్ మాగ్నెట్ల ఉత్పత్తికి ముందుకు వచ్చే కంపెనీలను ప్రోత్సహించాలని నిర్ణయించింది.

ఎలక్ట్రిక్ ట్రక్కులకు ప్రోత్సాహం

సరుకుల రవాణ రంగంలో విద్యుత్ బ్యాటరీలతో పని చేసే ట్రక్కులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఇందుకోసం పీఎం ఈ-డ్రైవ్ పథకం కింద రూ.500 కోట్లతో ప్రత్యేక ప్రోత్సాహకాలు ప్రకటించింది. ఈ పథకం కింద ఒక్కో ఎలక్ట్రిక్ ట్రక్కు కొనుగోలుపై రూ.9.6 లక్షల వరకు ప్రత్యేక డిస్కౌంట్ లభిస్తుందని కుమార స్వామి ప్రకటించారు. అయితే ఈ డిస్కౌంట్‌ను ట్రక్కు కొనుగోలుదారునికి కాకుండా వాటిని తయారు చేసే కంపెనీలకు ఇస్తామన్నారు.

8 బీమా కంపెనీలకు ఐఆర్‌డీఏఐ ఝలక్

ఆరోగ్య బీమా లోపాలపై గుస్సా
షోకాజ్ నోటీసులు జారీ

న్యూఢిల్లీ: ఆరోగ్య బీమా పాలసీల సెటిల్‌మెంట్స్ లోపాలపై బీమా నియంత్రణ, అభివృద్ధి మండలి (ఐఆర్‌డీఏఐ) మరోసారి ఆందోళన వ్యక్తం చేసింది. ఈ విషయంలో ఎనిమిది బీమా కంపెనీలకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఈ కంపెనీలన్నీ క్లెయిమ్స్ సెటిల్‌మెంట్‌కు సంబంధించి గత ఏడాది మే నెలలో తాము జారీ చేసిన 'హెల్త్ ఇన్సూరెన్స్ మాస్టర్ సర్క్యులర్' నిబంధనలు తుంగలో తొక్కాయని పేర్కొంది. ప్రైవేట్ రంగంలోని నివా బూపా హెల్త్ ఇన్సూరెన్స్, స్టార్ హెల్త్ అండ్ అల్లైడ్ ఇన్సూరెన్స్, కేర్ హెల్త్ ఇన్సూరెన్స్, మణిపాల్‌సిగ్నా హెల్త్ ఇన్సూరెన్స్, టాటా ఏఐజీ జనరల్ ఇన్సూరెన్స్, ఐసీఐసీఐ లొంబార్డ్ జనరల్ ఇన్సూరెన్స్, హెచ్‌డీఎఫ్‌సీ ఎర్గో జనరల్ ఇన్సూరెన్స్‌తో పాటు ప్రభుత్వ రంగంలోని న్యూ ఇండియా అష్యూరెన్స్ కంపెనీకి కూడా ఈ నోటీసులు అందాయి.

వచ్చే వారం చర్చ: ఈ నోటీసులకు ఇప్పటి వరకు ఐసీఐసీఐ లొంబార్డ్, న్యూ ఇండియా అష్యూరెన్స్ మాత్రమే సమాధానం ఇచ్చాయి. మిగతా కంపెనీలు ఇంకా సమాధానం ఇవ్వాల్సి ఉంది. వచ్చే వారం జరిగే ఐఆర్‌డీఏఐ బోర్డు సమావేశంలో ఈ అంశం చర్చకు రానుంది. బీమా కంపెనీలు ఇచ్చిన సమాధానాలను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటారు. జరిమానాలు లేదా పాలసీదారులకు వడ్డీతో సహా క్లెయిమ్స్ రిఫండ్ చేయమని ఆదేశించే అవకాశం ఉందని భావిస్తున్నారు

ఐఆర్‌డీఏఐ లేవనెత్తిన అభ్యంతరాలు

- క్లెయిమ్స్ చెల్లింపుల నుంచి అనవసర తగ్గింపులు
- అహేతుక కారణాలతో క్లెయిములను తిరస్కరించడం
- నిర్ణీత కాలానికి మించి సెటిల్‌మెంట్స్ ఆలస్యం చేయడం

పన్ను వసూళ్లు తగ్గాయ్..

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం..జూలై 10 నాటికి ప్రత్యక్ష పన్ను వసూళ్లు నికరంగా 1.34% తగ్గి రూ.5.63 లక్షల కోట్లకు చేరాయి. రిఫండ్లు అధికంగా ఉండడమే ఇందుకు కారణం. ఇదే సమయంలో కార్పొరేట్ పన్ను వసూళ్లు నికరంగా 3.67% తగ్గి రూ.2 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. గత ఏడాది ఇదే కాలంలో వసూలైన కార్పొరేట్ పన్నుల పరిమాణం రూ.2.07 లక్షల కోట్లుంది. ఇక నాన్ కార్పొరేట్ పన్ను (వ్యక్తిగత ఆదాయపు పన్ను, హెచ్‌యూఎఫ్‌లు, సంస్థలు) వసూళ్లు రూ.3.45 లక్షల కోట్ల వద్ద స్థిరంగా ఉన్నాయి. సెక్యూరిటీ లావాదేవీల పన్ను ద్వారా రూ.17,874 కోట్లు వసూలైంది. నికర రిఫండ్ల విలువ 38% పెరిగి రూ.1.02 లక్షల కోట్లకు చేరింది.

జురిక్ కోటక్ నుంచి వాణిజ్య బీమా

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): జురిక్ కోటక్ జనరల్ ఇన్సూరెన్స్.. వాణిజ్య (కమర్షియల్) ఇన్సూరెన్స్ విభాగంలోకి ప్రవేశించింది. ఎస్‌ఎంఈల నుంచి బడా కార్పొరేట్ కంపెనీల అవసరాలకు తగ్గట్టుగా ప్రత్యేక బీమా పాలసీలను తీసుకువచ్చినట్లు సంస్థ ఎండీ, సీఈఓ అలోక్ అగర్వాల్ వెల్లడించారు. అంతేకాకుండా ఆస్తులు, లయబిలిటీ, మెరైన్, ఇంజనీరింగ్ రంగాలతో పాటు ఇతరత్రా విభాగాలకు కూడా ప్రత్యేకంగా పాలసీలను రూపొందించినట్లు ఆయన చెప్పారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో కంపెనీ మొత్తం ప్రీమియం ఆదాయం రూ.2,036 కోట్లుగా ఉండగా అందులో కమర్షియల్ ఇన్సూరెన్స్ విభాగం వాటా 3 శాతంగా ఉందన్నారు. దేశీయంగా ఆర్థిక కార్యకలాపాలు ఊపందుకుంటుండటంతో ఈ ఏడాది ఈ విభాగంలో 15 నుంచి 20 శాతం వృద్ధిని సాధించవచ్చని భావిస్తున్నట్లు అగర్వాల్ చెప్పారు. ప్రస్తుతం కంపెనీ దేశవ్యాప్తంగా 31 కార్యాలయాలను నిర్వహిస్తోంది. ఈ ఏడాది కొత్తగా ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంతో పాటు మరికొన్ని నగరాలకు విస్తరించనుంది.

- ప్రీమియం నూడుల్స్ విభాగంలోని టూ యమ్ తన కే-బాంబ్ నూడుల్స్ కోసం బాలీవుడ్ నటి అనన్య పాండేను ప్రచారకర్తగా నియమించుకుంది. అనన్య ప్రచారంతో కే-బాంబ్ మరింత మంది వినియోగదారులకు చేరువ కానుందని టూ యమ్ వెల్లడించింది.
- గుజరాత్‌లోని రాజ్‌కోట్‌లో భారత్‌లోనే అతిపెద్ద సోలార్ ప్యానల్ ఫ్రేమ్ ప్లాంట్‌ను ప్రారంభించినట్లు హెచ్ అండ్ హెచ్ అల్యూమినియం లిమిటెడ్ ప్రకటించింది. రూ.150 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేసిన ఈ ప్లాంట్ వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 24,000 మెట్రిక్ టన్నులని తెలిపింది. ఈ ప్లాంట్ పూర్తిగా అందుబాటులోకి వస్తే ఏటా అమ్మకాలు రూ.750 కోట్లకు చేరుకునే అవకాశం ఉంటుందని కంపెనీ అంచనా వేస్తోంది.



1 x 2



ఫైనల్లో సినర్, అల్కారజ్

వింబుల్డన్

- సెమీస్‌లో జొకోవిచ్‌కు ఝలక్



లండన్: డబుల్ డిఫెండింగ్ చాంపియన్, ప్రపంచ రెండో ర్యాంకర్ కార్లోస్ అల్కారజ్ వరుసగా మూడో వింబుల్డన్ టైటిల్‌కు అడుగు దూరంలో నిలిచాడు. స్పెయిన్‌కు చెందిన రెండోసీడ్ అల్కారజ్ ఫైనల్లో అడుగు పెట్టాడు. ఆదివారం జరిగే తుదిపోరులో ప్రపంచ నెంబర్‌వన్ యానిక్ సినర్ (ఇటలీ)తో అమీతుమీ తేల్చుకుంటాడు. శుక్రవారం జరిగిన పురుషుల సింగిల్స్ సెమీఫైనల్లో అల్కారజ్ 6-4, 5-7, 6-3, 7-6 (6)తో ఐదో సీడ్ టేలర్ ఫ్రిట్జ్ (అమెరికా)పై గెలుపొందాడు. రెండో సెమీస్‌లో టాప్‌సీడ్ సినర్ 6-3, 6-3, 6-4తో వరుస సెట్లలో ఆరో సీడ్ నొవాక్ జొకోవిచ్‌కు షాకిచ్చాడు. తద్వారా 23 ఏళ్ల సినర్ తొలిసారి వింబుల్డన్ ఫైనల్లో ప్రవేశించాడు. ఏడుసార్లు వింబుల్డన్ విజేత జొకో.. సినర్‌కు ఏ దశలోనూ పోటీ ఇవ్వలేక పోయాడు. గంటా 55 నిమిషాల పోరులో ఒక్క సెట్ కూడా నెగ్గలేకపోయాడు. దీంతో రికార్డుస్థాయిలో 25వ గ్రాండ్‌స్లామ్ నెగ్గాలన్న 38 ఏళ్ల జొకోవిచ్ కల మరోసారి కలగానే మిగిలిపోయింది.

ఇక ఈ వింబుల్డన్ ఫైనల్..ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్ ఫైట్‌ను పునరావృతం చేయనుంది. ఐదు సెట్లపాటు హోరాహోరీగా సాగిన రొలాండ్ గారోస్ ఫైనల్లో సినర్‌పై 22 ఏళ్ల అల్కారజ్ గెలిచాడు. కాగా..వింబుల్డన్ సెమీస్ గెలుపుతో అల్కారజ్ వరుస విజయాల సంఖ్య 24కి చేరడం విశేషం.

అనిసిమోవా X స్వియటెక్
నేడు మహిళల సింగిల్స్ ఫైనల్



రాత్రి 8.30 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో

మహిళల ఆఖరి టీ20 నేడు
భారత్ X ఇంగ్లండ్
రా. 11.05 నుంచి సోనీ నెట్‌వర్క్‌లో

ఇటలీకి టీ20 ప్రపంచకప్ బెర్త్

న్యూఢిల్లీ: వచ్చే ఏడాది భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమివ్వనున్న ఐసీసీ పురుషుల టీ20 ప్రపంచకప్‌నకు మొదటిసారి ఇటలీ జట్టు అర్హత సాధించింది. హేగ్ నగరంలో శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో ఇటలీపై నెదర్లాండ్స్ గెలిచింది. దీంతో నెదర్లాండ్స్ నేరుగా ప్రపంచకప్ బెర్త్ దక్కించుకుంది. అయితే, అంతకుముందు జెర్సీ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో స్కాట్లాండ్ ఓటమి పాలైంది. దీంతో.. గత నాలుగు ఎడిషన్లలో టీ20 కప్‌లో తలపడిన స్కాట్లాండ్, ఈసారి అనూహ్యంగా టోర్నీకి దూరమవడం గమనార్హం. స్కాట్లాండ్ నిష్క్రమణతో.. జెర్సీ, ఇటలీ జట్లు చెరో ఐదు పాయింట్లతో సమంగా నిలిచాయి. కానీ, నెట్ రన్‌రేట్ పరంగా ముందంజలో నిలిచిన ఇటలీ మెగా టోర్నీలో ఆడేందుకు తొలిసారి చోటు దక్కించుకోగా.. జెర్సీ జట్టు రేసు నుంచి వెనుదిరిగింది.

విహార యాత్ర కోసం రాలేదు

గంభీర్

లండన్: భారత క్రికెటర్లు విదేశీ పర్యటనలకు వెళ్లేది విహారం కోసం కాదని, ఎక్కువ సమయం ఆటపైనే దృష్టి పెట్టాల్సి ఉంటుందని కోచ్ గౌతమ్ గంభీర్ స్పష్టం చేశాడు. ఈమేరకు కుటుంబ సభ్యులను తమ వెంట తెచ్చుకోవడంపై బీసీసీఐ విధించిన ఆంక్షలకు పూర్తి మద్దతు ప్రకటించాడు. 'ఎవరికైనా కుటుంబాలు ముఖ్యమే. కానీ ఆటగాళ్లు ఓ విషయం గుర్తుంచుకోవాలి. మీరంతా ఇక్కడికి వచ్చింది హాలీడే కోసం కాదు. ఓ లక్ష్యంతో వచ్చారు. ఎంతో మందిలో కేవలం మీకు మాత్రమే దేశం గర్వపడేలా ఆడే అవకాశం వచ్చింది. అందుకే దృష్టంతా ఆటపైనే ఉండడం అవసరం' అని పుజారకిచ్చిన ఇంటర్వ్యూలో గంభీర్ తేల్చాడు.

మిక్స్‌డ్ కాంస్య పోరుకు సురేఖ జోడీ

- వ్యక్తిగత ఈవెంట్‌లో సెమీస్‌కు తెలుగు ఆర్చర్
- ఆర్చరీ ప్రపంచ కప్ స్టేజ్-4

మాడ్రిడ్: తెలుగు స్టార్ ఆర్చర్ వెన్నం జ్యోతి సురేఖ ప్రపంచ కప్ స్టేజ్-4 పోటీల్లో మరో రెండు పతకాలకు చేరువైంది. ఇప్పటికే సహచరులతో కలిసి కాంపౌండ్ మహిళల టీమ్ ఈవెంట్‌లో ఫైనల్ చేరిన సురేఖ.. తాజాగా వ్యక్తిగత విభాగంలో సెమీఫైనల్‌కు, మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో కాంస్యం పోరుకు చేరుకుంది. శుక్రవారం జరిగిన మహిళల వ్యక్తిగత ఈవెంట్ క్వార్టర్స్‌లో టాప్‌సీడ్ సురేఖ 147-144తో హజల్ బురున్ (తుర్కియే)ని ఓడించి సెమీస్ చేరింది. ఇదే కేటగిరిలో మరో భారత అమ్మాయి పర్ణీత్ కౌర్ 142-141తో ఓజ్నూర్ (తుర్కియే)పై గెలిచి సెమీస్‌లో ప్రవేశించింది. ఇక కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్ సెమీఫైనల్లో భారత ద్వయం, టాప్‌సీడ్ సురేఖ/రిషభ్ యాదవ్ 152-155తో నెదర్లాండ్స్ జంట చేతిలో ఓటమిపాలైంది. దీంతో శనివారం జరిగే కాంస్య పతక పోరులో ఎల్ సాల్వడార్ జంటతో సురేఖ జోడీ తలపడనుంది. కాగా, రికర్వ్ విభాగం మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో ధీరజ్ బొమ్మదేవర/అంకిత ద్వయం 1-5తో స్విట్జర్లాండ్ జంట చేతిలో ఓడి ఆరంభ రౌండ్లోనే వెనుదిరిగింది.

స్పోర్ట్స్

భళా.. బుమ్రా

లార్డ్స్‌లో తొలిసారి 5 వికెట్లు

- ఇంగ్లండ్ మొదటి ఇన్నింగ్స్ 387
- రూట్ శతకం ● భారత్ తొలి ఇన్నింగ్స్ 145/3
- రాహుల్ అజేయ అర్ధసెంచరీ ● రెండో టెస్టు



లండన్: భారత్-ఇంగ్లండ్ జట్ల మధ్య జరుగుతున్న రెండో టెస్టులో శుక్రవారం బౌలర్ల జోరు మధ్య ఆట ఆచితూచి అన్నట్టుగా సాగింది. స్టార్ పేసర్ బుమ్రా (5/74) ప్రతిష్ఠాత్మక లార్డ్స్ మైదానంలో తొలిసారిగా ఐదు వికెట్లతో హానర్స్ లిస్ట్‌లో చేరాడు. ఆ తర్వాత బ్యాటింగ్‌లో ఓపెనర్ కేఎల్ రాహుల్ (53 బ్యాటింగ్) అజేయ అర్ధసెంచరీతో భారత్ నిలకడగా ఆడుతోంది. ప్రస్తుతం గిల్ సేన 242 పరుగులు వెనుకబడి ఉండడంతో శనివారం ఏమేరకు నిలుస్తారనేది కీలకం కానుంది. అయితే అంతకుముందు బుమ్రా మిడిలార్డర్‌ను దెబ్బతీసినా.. బ్రైడన్ కార్స్ (56), జేమీ స్మిత్ (51) అర్ధసెంచరీలతో ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 112.3 ఓవర్లలో 387 పరుగులు చేసింది. రూట్ (104) శతకం పూర్తి చేయగా, స్టోక్స్ (44) పర్వాలేదనిపించాడు. సిరాజ్, నితీశ్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. అనంతరం తొలి ఇన్నింగ్స్‌లో టాపార్డర్‌ను కోల్పోయిన భారత్ 43 ఓవర్లలో 3 వికెట్లకు 145 పరుగులు చేసింది. రాహుల్ (53 బ్యాటింగ్) హాఫ్ సెంచరీతో నిలువగా, కరుణ్ నాయర్ (40) సహకరించాడు.

ఆదుకున్న టెయిలెండర్లు: రెండో రోజు 251/4 ఓవర్‌నైట్ స్కోరుతో ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్ ఆరంభించగా.. ఉదయం సెషన్ ఆసక్తికరంగా సాగింది. తొలి బంతినే ఫోర్‌గా మలిచి రూట్ శతకం పూర్తి చేయగా.. పేసర్ బుమ్రా తన పదునైన బంతులతో ఏకంగా మూడు వికెట్లతో చెలరేగాడు. అయితే జేమీ స్మిత్ వన్డే తరహాలో చెలరేగి ఆదుకున్నాడు. ఆరంభ మూడో ఓవర్‌లోనే కెప్టెన్ స్టోక్స్‌ను బుమ్రా బౌల్డ్ చేశాడు. అయితే ఆ వెంటనే సిరాజ్ ఓవర్‌లో స్మిత్ ఇచ్చిన క్యాచ్‌ను రాహుల్ వదిలేశాడు. అప్పటికి అతడి స్కోరు 5 రన్స్ మాత్రమే. మరోవైపు బుమ్రా మాత్రం తర్వాతి ఓవర్‌లోనే రూట్, వోక్స్ (0)లను వరుస బంతుల్లో పెవిలియన్ చేర్చాడు. దీంతో ఒక్కసారిగా ఇంగ్లండ్ 271/7 స్కోరుతో షాక్‌కు గురైంది. బుమ్రా జోరుకు ఈ సెషన్‌లోపే జట్టు ఆలౌటవుతుందనిపించింది.

బంతి మారింది..లయ తప్పింది: సెషన్ ఆరో ఓవర్‌లో బంతి మార్పు కోసం భారత్ ఫిర్యాదు చేసింది. అప్పటికి కేవలం పది ఓవర్లు మాత్రమే ఆ బంతిని వాడడం గమనార్హం. అయితే అంపైర్లు మార్చిన బంతిపై కెప్టెన్ గిల్ అసంతృప్తి వ్యక్తం చేశాడు. తను అంపైర్‌తో వాగ్వాదానికి దిగినా ఎలాంటి ఫలితం లేకపోయింది. 'ఇది పది ఓవర్ల బంతేనా?' అంటూ సిరాజ్ ఆశ్చర్యపోవడం మైక్‌లో వినిపించింది. ఇన్నింగ్స్ 91వ ఓవర్ మధ్యలో ఈ మార్పు జరగ్గా.. స్మిత్ అదే ఓవర్‌లో ఫోర్‌తో తన బ్యాట్‌కు పనిచెప్పాడు. బంతి స్వింగ్ కాకపోవడంతో స్మిత్-కార్స్ జోడీ అడపాదడపా ఫోర్లతో పాటు చకచకా సింగిల్స్‌తో స్కోరును 300 దాటించారు. అయితే కేవలం 48 డెలివరీల తర్వాత 99వ ఓవర్‌లో బంతిని మరోసారి మార్చాల్సి వచ్చింది. అయినా బౌలర్లు ప్రభావం చూపలేదు. కార్స్ ఫోర్లతో వేగం పెంచాడు. అటు స్మిత్ 52 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేశాడు. అయితే విరామం తర్వాత రెండో ఓవర్‌లోనే స్మిత్‌ను సిరాజ్ అవుట్ చేశాడు. దీంతో ఎనిమిదో వికెట్‌కు 84 పరుగుల కీలక భాగస్వామ్యం ముగిసింది. అటు ఆర్చర్ (4)ను బుమ్రా బౌల్డ్ చేసి లార్డ్స్‌లో తొలిసారి ఐదు వికెట్ల ఫీట్‌ను అందుకున్నాడు. ఇక సిరాజ్ ఓవర్‌లో సిక్సర్‌తో కార్స్ ఫిఫ్టీ పూర్తి చేయగా.. అతడి క్యాచ్‌లను ఆకాశ్, జురెల్ వదిలేయడం గమనార్హం. అయితే తర్వాతి ఓవర్‌లోనే సిరాజ్ అతడి వికెట్‌తో ఇంగ్లండ్ ఇన్నింగ్స్‌ను ముగించాడు. మొత్తంగా చివరి మూడు వికెట్ల మధ్యే 116 రన్స్ రావడం విశేషం.


అంపైర్‌తో గిల్

రాహుల్ హాఫ్ సెంచరీ: రెండో సెషన్‌లో 14 ఓవర్లు ఆడిన భారత్ తొలి ఇన్నింగ్స్‌లో టీ బ్రేక్ సమయానికి 44 పరుగులు చేసి జైస్వాల్ (13) వికెట్‌ను కోల్పోయింది. ఆర్చర్ తన తొలి ఓవర్‌లోనే అతడి వికెట్ తీశాడు. ఆ తర్వాత కూడా ఈ పేసర్ నిలకడగా 145కి.మీ వేగంతో బంతులు విసిరి ఇబ్బంది పెట్టాడు. కరుణ్, రాహుల్ మాత్రం వికెట్ కోల్పోకుండా ఆఖరి సెషన్‌కు వెళ్లారు. అయితే ఓపిగ్గా ఆడుతున్న కరుణ్‌ను చివరి సెషన్‌లో స్టోక్స్ అవుట్ చేశాడు. రెండో వికెట్‌కు వీరి మధ్య 61 పరుగులు జత చేరాయి. ఆ తర్వాత భీకర ఫామ్‌లో ఉన్న గిల్ (16)ను పేసర్ వోక్స్ అవుట్ చేయడంతో భారత్ 107 రన్స్‌కు 3 వికెట్లు కోల్పోయింది. అయితే పట్టుదలగా ఆడిన రాహుల్ మాత్రం అర్ధసెంచరీతో ఆకట్టుకున్నాడు. అతడికి పంత్ (19 బ్యాటింగ్) సహకరించడంతో రెండో రోజును భారత్ ముగించింది.

స్కోరుబోర్డు

ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: క్రాలే (సి) పంత్ (బి) నితీశ్ 18; డకెట్ (సి) పంత్ (బి) నితీశ్ 23; పోప్ (సి సబ్) జురెల్ (బి) జడేజా 44; రూట్ (బి) బుమ్రా 104; బ్రూక్ (బి) బుమ్రా 11; స్టోక్స్ (బి) బుమ్రా 44; స్మిత్ (సి సబ్) జురెల్ (బి) సిరాజ్ 51; వోక్స్ (సి సబ్) జురెల్ (బి) బుమ్రా 0; కార్స్ (బి) సిరాజ్ 56; ఆర్చర్ (బి) బుమ్రా 4; బషీర్ (నాటౌట్) 1; **ఎక్స్‌ట్రాలు: 31; మొత్తం: 112.3 ఓవర్లలో 387 ఆలౌట్. వికెట్ల పతనం:** 1-43, 2-44, 3-153, 4-172, 5-260, 6-271, 7-271, 8-355, 9-370, 10-387.**బౌలింగ్:** బుమ్రా 27-5-74-5; ఆకాశ్ 23-3-92-0; సిరాజ్ 23.3-6-85-2; నితీశ్ 17-0-62-2; జడేజా 12-1-29-1; సుందర్ 10-1-21-0.

భారత్ తొలి ఇన్నింగ్స్: జైస్వాల్ (సి) బ్రూక్ (బి) ఆర్చర్ 13; రాహుల్ (బ్యాటింగ్) 53; కరుణ్ (సి) రూట్ (బి) స్టోక్స్ 40; గిల్ (సి) స్మిత్ (బి) వోక్స్ 16; పంత్ (బ్యాటింగ్) 19; **ఎక్స్‌ట్రాలు: 4; మొత్తం: 43 ఓవర్లలో 145/3. వికెట్ల పతనం:** 1-13, 2-74, 3-107.**బౌలింగ్:** వోక్స్ 13-1-56-1; ఆర్చర్ 10-3-22-1; కార్స్ 8-1-27-0; స్టోక్స్ 6-2-16-1; బషీర్ 6-1-22-0.

1 విదేశీ గడ్డపై ఎక్కువ సార్లు (13) ఐదు వికెట్ల ఫీట్‌ను అందుకున్న భారత బౌలర్‌గా బుమ్రా. కపిల్ (12)ను అధిగమించాడు. అయితే తన కెరీర్‌లో ఇది 15వది. అలాగే సేనా జట్లపై అత్యధికంగా 11 సార్లు ఈ ఫీట్‌ను నమోదు చేసిన ఆసియా బౌలర్‌గా అక్రమ్ సరసన నిలిచాడు.


రాహుల్ (53 బ్యాటింగ్)

- టెస్టుల్లో అధిక క్యాచ్ (211)లు తీసుకున్న ఫీల్డర్‌గా జో రూట్. ద్రవిడ్ (210)ను అధిగమించాడు.
- టెస్టుల్లో తక్కువ బంతుల్లోనే (1303) వెయ్యి రన్స్ పూర్తి చేసిన వికెట్ కీపర్‌గా జేమీ స్మిత్.

2 ఇంగ్లండ్‌లో ఎక్కువ వికెట్లు (47) తీసిన రెండో భారత బౌలర్‌గా బుమ్రా. ఇషాంత్ (48) టాప్‌లో ఉన్నాడు.

3 లార్డ్స్‌లో హ్యాట్రిక్ శతకాలు పూర్తి చేసిన మూడో బ్యాటర్‌గా జో రూట్. గతంలో జాక్ హాబ్స్, మైకేల్ వాన్ ఉన్నారు.

తెలంగాణకు రెండు స్వర్ణాలు

ఇండియా ఓపెన్ పారా అథ్లెటిక్స్

బెంగళూరు: ఇండియన్ ఓపెన్ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో తెలుగు అథ్లెట్లు సత్తా చాటారు. శుక్రవారం మొదలైన ఈ పోటీల్లో తెలంగాణకు చెందిన దీప్తి జివాంజి (400 మీ.), అకీరా నందన్ (400 మీ.) స్వర్ణాలు సాధించారు. ఇక, ఆంధ్రప్రదేశ్ అథ్లెట్లు ఏడు పతకాలు గెలిచారు. రవి (ఎఫ్40 షాట్‌పుట్) పసిడి.. యాదగిరి (టీ54 షాట్‌పుట్), భవాని (100 మీ.), వెంకటేశ్వర్లు (100 మీ.) రజతాలు.. భవాని (లాంగ్ జంప్), శ్రీహరి (లాంగ్‌జంప్), లోకేశ్ (హైజంప్) కాంస్యాలు దక్కించుకున్నారు.

అమెరికా స్ఫూర్తితో తెలంగాణలో అభివృద్ధి



- రాష్ట్రం, అమెరికా మధ్య సారూప్యతలెన్నో..
- 2035 నాటికి ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా తెలంగాణ
- అమెరికా నుంచి అధిక పెట్టుబడులు రావాలి: సీఎం రేవంత్

హైదరాబాద్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): అమెరికాకు, తెలంగాణ రాష్ట్రానికి మధ్య ఎంతో సారూప్యత ఉందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఓటమిని అంగీకరించకుండా, ఎప్పుడూ బలమైన దేశంగా అనేక అంశాల్లో అమెరికా సానుకూల మార్గంలో పరిష్కారాలను చూపిందని చెప్పారు. తెలంగాణ కూడా అదే స్ఫూర్తితో పనిచేస్తూ అభివృద్ధి చెందుతోందని తెలిపారు. హోటల్ తాజ్‌కృష్ణలో శుక్రవారం జరిగిన అమెరికా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అమెరికా ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజాస్వామ్యానికి మార్గదర్శిగా, నిరంతర ఆవిష్కరణలతో అమెరికా.. ప్రపంచ దృక్కోణాన్ని మార్చిందని చెప్పారు. 2008లో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే హైదరాబాద్‌లో అమెరికా కాన్సులేట్ జనరల్ కార్యాలయం ఏర్పాటైందని గుర్తుచేశారు. భారతదేశంతో దౌత్యపరమైన సంబంధాలను మెరుగుపరుచుకోవడంలో అమెరికా ఎంతో నిబద్ధతను ప్రదర్శించిందని, తెలుగు ప్రజలతో స్నేహపూర్వక బంధాన్ని కలిగి ఉందని చెప్పారు. హైదరాబాద్‌లోని కాన్సుల్ జనరల్ జెన్నిఫర్ లార్సన్ రెండు దేశాల సంస్కృతుల మధ్య, ప్రజల మధ్య సంబంధాలను పటిష్ఠపర్చడంలో వారధిగా నిలుస్తున్నారని అభినందించారు. ఐటీ, ఫార్మా, రక్షణ, తయారీ, ఏరోస్పేస్ వంటి రంగాలకు చెందిన దాదాపు 200 అమెరికా కంపెనీలు హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్నాయని చెప్పారు. తెలంగాణను 2035 నాటికి ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడానికి, తెలంగాణ రైజింగ్ దార్శనికతకు తమ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. ఇందుకు అమెరికన్ల మద్దతు కూడా కావాలని సీఎం కోరారు. జాతీయ స్థాయిలో పరస్పర విశ్వాసం, విలువల ఆధారంగా అమెరికా-భారత్ మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం కొనసాగుతోందని చెప్పారు. 'ఒక్కటిగా ఉంటే మరింత బలంగా ఎదగగలమని నేను నమ్ముతా. హైదరాబాద్ మరింత పురోభివృద్ధి సాధించాలని, అమెరికా నుంచి తెలంగాణకు అత్యధిక పెట్టుబడులు రావాలని కోరుకుంటున్నా' అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

రాజాసింగ్ రాజీనామాకు ఆమోదం

తరచూ వివాదాస్పద వ్యాఖ్యల పట్ల అధిష్ఠానం సీరియస్



హైదరాబాద్/హైదరాబాద్ సిటీ/మంగళ్‌హాట్, జూలై 11(ఆంధ్రజ్యోతి): గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్‌కు బీజేపీ షాక్ ఇచ్చింది. అనూహ్యంగా పది రోజుల వ్యవధిలోనే ఆయన రాజీనామాను పార్టీ జాతీయ నాయకత్వం ఆమోదించింది. గత నెల 30న ఆయన పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. నాటి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అదే రోజు ఆయన రాజీనామా లేఖను జాతీయ నాయకత్వానికి నివేదించారు. "రాజీనామా లేఖలో మీరు ప్రస్తావించిన అంశాలు అసంబద్ధంగా ఉన్నాయి. పార్టీ సిద్ధాంతానికి, ప్రాథమిక సూత్రాలకు పొంతన లేకుండా ఉన్నాయి. మీ రాజీనామాను పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఆదేశాల మేరకు ఆమోదిస్తున్నాం" అని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్‌సింగ్.. రాజాసింగ్‌కు లేఖ రాశారు. కాగా, పార్టీ రాష్ట్ర అధ్యక్ష ఎన్నిక సందర్భంగా రాజాసింగ్ చేసిన విమర్శలను బీజేపీ జాతీయ నాయకత్వం సీరియస్‌గా తీసుకుంది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్.రాంచందర్‌రావు ఎన్నికపై బహిరంగ విమర్శలు చేశారు. రాష్ట్ర పార్టీ ఇన్‌చార్జులు సునీల్ బన్సల్, అభయ్ పాటిల్‌తో పాటు కేంద్ర మంత్రి, రాష్ట్ర పార్టీ అధ్యక్ష ఎన్నిక రిటర్నింగ్ అధికారి శోభ కూడా రాజాసింగ్ వైఖరిని తప్పుబడుతూ జాతీయ నాయకత్వానికి అదే రోజు నివేదించారు. అప్పటికే ఒకమారు సస్పెన్షన్‌కు గురై, ఏడాది అనంతరం, తిరిగి పార్టీలోకి వచ్చిన రాజాసింగ్, ఆ తర్వాత కూడా పలుమార్లు రాష్ట్ర పార్టీ ముఖ్యులపై బహిరంగ విమర్శలు చేశారు. కేంద్ర మంత్రి, నాటి రాష్ట్రపార్టీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డిపైనా ఆరోపణలు చేశారు. చివరకు పార్టీ రాష్ట్ర కార్యాలయం వేదికగా గుప్పించిన విమర్శలు, పార్టీ జాతీయ నాయకత్వం ఆయనకు షాక్ ఇచ్చేలా చేశాయి. ఆవేశంలో ఆయన రాజీనామా చేసినా.. ఆ తర్వాత పార్టీలోకి తిరిగి వచ్చేందుకు రాజాసింగ్ ప్రయత్నాలు చేసుకున్నట్లు ప్రచారం జరిగింది. అయితే, జాతీయ నాయకత్వం సీరియస్‌గా ఉందన్న విషయం గ్రహించి, ఒకరిద్దరు ముఖ్యనేతలు సైతం ఆయనకు అండగా నిలిచేందుకు వెనుకడుగు వేశారని పార్టీ వర్గాలు తెలిపాయి.

ఎమ్మెల్యేగా అనర్హత వేటు..?

రాజాసింగ్ రాజీనామాను ఆమోదించిన బీజేపీ జాతీయ నాయకత్వం, ఎమ్మెల్యేగా ఆయన అనర్హత విషయంలో కూడా అదే వైఖరి కొనసాగించే అవకాశాలు ఎక్కువ ఉన్నాయని పార్టీ వర్గాలు వెల్లడించాయి. పార్టీకి రాజీనామా చేసినందున ఎమ్మెల్యేగా తనను అనర్హుడిగా ప్రకటించాలని కోరుతూ స్పీకర్‌కు లేఖ రాయాలని రాజాసింగ్ గత నెల 30న ఇచ్చిన రాజీనామా లేఖలో కిషన్‌రెడ్డిని కోరారు. పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసిన తర్వాత, ఆ పార్టీ ఎమ్మెల్యేగా కొనసాగడం భావ్యం కాదని రాజాసింగ్ స్వయంగా పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో, ఆయన్ను అనర్హుడిగా ప్రకటించాలని కోరుతూ త్వరలోనే స్పీకర్‌కు లేఖ ఇచ్చే అవకాశం ఉందని పార్టీ ముఖ్య నేత ఒకరు వెల్లడించారు.

హిందుత్వం కోసమే పనిచేస్తా: రాజాసింగ్

తన చివరిశ్వాస వరకూ హిందూ సమాజ హక్కుల కోసం గొంతు వినిపిస్తూనే ఉంటానని రాజాసింగ్ తెలిపారు. "ప్రజలకు, దేశానికి సేవ చేయడం, హిందూత్వాన్ని రక్షించడం అనే లక్ష్యంతో 11 ఏళ్ల క్రితం నేను బీజేపీలో చేరాను. పార్టీ నన్ను నమ్మి, తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో వరుసగా మూడుసార్లు గోషామహల్ ఎమ్మెల్యే టికెట్ ఇచ్చింది. నేను ఈ నిర్ణయం ఏ పదవి, అధికారం లేదా వ్యక్తిగత ఆసక్తి కారణంగా తీసుకోలేదు. నేను హిందుత్వకు సేవ చేయడానికి పుట్టాను. నా చివరి శ్వాస వరకు హిందుత్వం కోసం పనిచేస్తూనే ఉంటాను." అని రాజాసింగ్ ఒక ప్రకటనలో వివరించారు. ప్రస్తుతం ఆయన అమర్‌నాథ్ యాత్రలో ఉన్నారు.

కార్పొరేటర్‌గా టీడీపీ నుంచి ప్రస్థానం..

రాజాసింగ్ 2009లో టీడీపీ నుంచి రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించారు. టీడీపీ, బీజేపీ పొత్తుతో టీడీపీ అభ్యర్థిగా మంగళహాట్ నుంచి కార్పొరేటర్‌గా ఎన్నికయ్యారు. 2014లో బీజేపీలో చేరారు. బీజేపీ అభ్యర్థిగా గోషామహల్ నుంచి 2014, 2018, 2023లో గెలిచారు. 2018లో అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ నుంచి గెలిచిన ఏకైక ఎమ్మెల్యే రాజాసింగ్. ఓ వర్గం వారిపై వివాదాస్పద వ్యాఖ్యలు చేయడంతో 2022 ఆగస్టు 23న రాజాసింగ్‌ను బీజేపీ సస్పెండ్ చేసింది. సస్పెన్షన్ వేటును 22 అక్టోబరు 2023లో ఎత్తివేసి గోషామహల్ టికెట్ ఇచ్చింది. రాజాసింగ్ ఏకంగా కేంద్ర మంత్రి, అప్పటి రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డిని లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేశారు. కిషన్‌రెడ్డి అధ్యక్షుడిగా ఉన్నంత వరకు తాను పార్టీ కార్యాలయంలో అడుగుపెట్టనని భీష్మించారు. పార్టీలో తనది ప్రత్యేక అజెండాగా రాజాసింగ్ వ్యవహరించేవారు. రాష్ట్ర అధ్యక్ష, శాసన సభ పక్ష నేత పదవులను ఆయన ఆశించారు. పార్టీలో పాత సామానును బయటికి పంపించాలని, కొందరికి రిటైర్మెంట్ ఇచ్చి ఇంటికి పంపాలని ఇటీవల అన్నారు. రాజాసింగ్ వివాదాస్పద వ్యాఖ్యలతో పార్టీకి, ఆయనకూ దూరం పెరిగింది.

ఆర్థిక సత్తా.. సాంకేతిక సామర్థ్యం ఉంటేనే!

హ్యామ్ రోడ్ల కాంట్రాక్టు నిబంధనల్లో మార్పు

కీలక సవరణలు చేసిన కేంద్ర ప్రభుత్వం

హైదరాబాద్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): హైబ్రిడ్ యాన్యుటీ మోడల్(హ్యామ్)లో నిర్మించే రహదారులు, ఇతర నిర్మాణాల కాంట్రాక్టులను చిన్న సంస్థలు దక్కించుకోవాలంటే కుదరదు. ఆర్థికంగా సత్తా, సాంకేతిక సామర్థ్యం ఉండాల్సిందే. కాంట్రాక్టు సంస్థలకు ఉండాల్సిన ఆర్థిక, సాంకేతిక అర్హతల్లో కేంద్రం కీలక మార్పులు చేసింది. ఈ మార్పులు తక్షణమే అమల్లోకి వస్తాయి. అర్హతల మార్పుపై కేంద్రం అన్ని రాష్ట్రాలకు గురువారం లేఖలు రాసింది. హైవేలు, సొరంగాలు, ప్రధాన వంతెనలు, రోడ్ ఓవర్ వంతెనలు, స్వతంత్ర ప్రత్యేక ప్రాజెక్టులు, హైవేల మార్పులు, కోర్ సెక్టార్‌లలో ఉన్న నిబంధనల్లో మార్పులు తెచ్చారు. రాష్ట్రంలో రోడ్లు, భవనాల శాఖ, పంచాయతీరాజ్ శాఖల పరిధిలో కలిపి 28 వేల కిలోమీటర్ల రోడ్లను హైబ్రిడ్ యాన్యుటీ మోడల్‌లో అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఎన్‌హెచ్‌ఏఐ, ఇండియన్ రోడ్ కాంగ్రెస్(ఐఆర్‌సీ) నిబంధనల మేరకు ఈ రోడ్లను నిర్మిస్తారు. అంచనా వేసిన ప్రాజెక్టు ఖర్చులో కాంట్రాక్టరుకు గతంలో 15% ఆర్థిక సామర్థ్యం ఉన్నా సరిపోయేది. దాన్ని 20 శాతానికి పెంచారు. ఒకటి కన్నా ఎక్కువ కంపెనీలు కలిపి పని చేస్తే ప్రతీ కంపెనీకి ప్రాజెక్టు వ్యయంలో 7.5 శాతం మేర గడచిన ఆర్థిక సంవత్సరంలో నికర విలువ ఉండాలని గతంలో షరతు పెట్టారు. దాన్ని ఇప్పుడు పది శాతానికి పెంచారు. గతంలో ఏదైనా మేజర్ బ్రిడ్జి, ఆర్వోబీ, ఫ్లైఓవర్/టన్నెల్ ప్రాజెక్టులను ఒకటి కన్నా ఎక్కువ కంపెనీలు కలిసి నిర్మిస్తే అందులో ఒక కంపెనీకి కనీసం పదేళ్ల అనుభవం ఉండాలని నిబంధన ఉంది. దాన్ని ఏడేళ్లకు తగ్గించారు. వంతెనలు, ఫ్లైఓవర్లు, సొరంగాలు నిర్మించాల్సినవి ఒకటి 60 మీటర్లకు మించి ఉంటే, లేదా అన్నీ కలిపి 100 మీటర్లకు మించి ఉన్నా దానికి సమానమైన పని చేసిన అనుభవం ఉండాలని నిబంధన పెట్టారు. గత అనుభవాన్ని పరిగణనలోకి తీసుకోవడానికి పాత ప్రాజెక్టు 90% పూర్తయి ఉండాలని స్పష్టం చేశారు.



మంత్రి తుమ్మలను సన్మానిస్తున్న అగ్రి డాక్టర్స్ అసోసియేషన్ నాయకులు

సేంద్రియ వ్యవసాయమే శ్రీరామరక్ష

- మన పంటలు దేశ, విదేశాలకు ఎగుమతవ్వాలి: తుమ్మల
- ఖమ్మంలో సేంద్రియ రైతు బజార్ ప్రారంభం

ఖమ్మం/హైదరాబాద్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): సమాజంలో అందరూ ఆర్థికంగా, ఆరోగ్యపరంగా ముందుకు పోవాలంటే సేంద్రియ వ్యవసాయమే శ్రీరామరక్ష అని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. దేశంలోనే తొలిసారిగా ఖమ్మంలో ఏర్పాటు చేసిన సేంద్రియ రైతుబజార్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా రైతులు అమ్మకానికి తెచ్చిన పలు సేంద్రియ కూరగాయలను మంత్రి పరిశీలించి అనంతరం జరిగిన సభలో ప్రసంగించారు. మన పంటలు, మన వంటలు దేశ, విదేశాలకు ఎగుమతి కావాలని, సేంద్రియ వ్యవసాయంలో రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. రసాయనిక ఎరువులు, పురుగుమందుల వాడకంతో భూసారం తగ్గడంతో పాటు కూరగాయలు, తినే ఆహారం కలుషితమై క్యాన్సర్ మహమ్మారి బారిన పడుతున్న వారి సంఖ్య పెరుగుతోందని, ఇందుకు పంజాబ్‌నుంచి ఢిల్లీకి వెళ్లే క్యాన్సర్ రైలే ఉదాహరణ అని పేర్కొన్నారు. వేలాది మంది క్యాన్సర్ రోగులు ఆ రైలులో వైద్యంకోసం వెళ్లి వస్తున్నారని, ఈ విషయాన్ని కేంద్ర మంత్రి నడ్డానే చెప్పారని గుర్తుచేశారు. దేశంలో ఎక్కువగా ఎరువులు వినియోగిస్తున్న రాష్ట్రంగా తెలంగాణ ఉందని.. దానిని క్రమంగా తగ్గించుకోవడానికి రైతులు సేంద్రియం వైపు మళ్లాలని ఆయన సూచించారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చొరవతో పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న పదోన్నతులకు మోక్షం కలిగిందని తెలంగాణ అగ్రి డాక్టర్స్ అసోసియేషన్ వ్యవస్థాపకులు కావేటి రాములు అన్నారు. 88 మంది వ్యవసాయశాఖ అధికారులకు పదోన్నతులు కల్పించారని కృతజ్ఞతలు తెలుపుతూ శుక్రవారం మంత్రి తుమ్మలను కలిసి సన్మానించారు.

రెవెన్యూ గ్రామానికో జీపీవో: మంత్రి పొంగులేటి



హైదరాబాద్, జూలై 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేయడంలో భాగంగా ప్రతి రెవెన్యూ గ్రామానికి ఒక గ్రామ పాలనాధికారి (జీపీవో)ని నియమిస్తామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి సూచనల మేరకు రెవెన్యూ గ్రామానికి ఒక జీపీవో, మండలానికి భూ విస్తీర్ణం ఆధారంగా 4 నుంచి 6 మంది లైసెన్స్ సర్వేయర్లను నియమించబోతున్నామని ఆయన తెలిపారు. ఈనెల 27వ తేదీన శిక్షణ పొందిన సర్వేయర్లకు రాత పరీక్ష నిర్వహిస్తామన్నారు. 28, 29 తేదీల్లో జేఎన్‌టీయూ ఆధ్వర్యంలో ల్యాబ్ పరీక్షలు ఉంటాయని పేర్కొన్నారు. ఆగస్టు 12వ తేదీన ఫలితాలు విడుదల చేసి, ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు 40 రోజుల పాటు శిక్షణ ఇస్తామని తెలిపారు. గత ప్రభుత్వం నక్షా లేని గ్రామాలను గాలికి వదిలేస్తే సీఎం రేవంత్ రెడ్డి చొరవతో ఆ గ్రామాలకు పరిష్కారం చూపామని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో 413 గ్రామాలకు నక్షా లేదని, తొలి విడతలో 5 గ్రామాల్లో రీ సర్వే ప్రయోగాత్మకంగా చేపట్టినట్లు వివరించారు. ఈ సర్వే ఫలితాలను పరిగణనలోకి తీసుకుని మిగిలిన గ్రామాల్లోనూ రీ సర్వే నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

మరో 2,500 కోట్ల అప్పు తీసుకోనున్న రాష్ట్రం

రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.2,500 కోట్ల అప్పు తీసుకొనేందుకు సిద్ధమైంది. ఈమేరకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు శుక్రవారం ఇండెంటు పెట్టింది. 32 ఏళ్ల కాల పరిమితితో రూ.1000 కోట్లు, 35 ఏళ్ల కాల పరిమితితో రూ.1000 కోట్లు, 38 ఏళ్ల కాల పరిమితితో రూ.500 కోట్ల చొప్పున ఈ రుణాన్ని తీసుకోవాలని నిర్ణయించింది. రాష్ట్రంతో కలిపి దేశంలోని 12 రాష్ట్రాలు రూ.26,900 కోట్ల అప్పుల కోసం ఇండెంట్లు పెట్టాయి.

కాన్‌స్టిట్యూషన్ క్లబ్ ఆఫ్ ఇండియా కోశాధికారిగా జితేందర్ రెడ్డి



న్యూఢిల్లీ, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలోని ప్రతిష్ఠాత్మక కాన్‌స్టిట్యూషన్ క్లబ్ ఆఫ్ ఇండియా కోశాధికారిగా రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు ఏపీ జితేందర్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు ఎన్నికల అధికారి శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. మహబూబ్‌నగర్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి రెండు సార్లు ఎంపీగా ప్రాతినిధ్యం వహించిన జితేందర్ రెడ్డి.. ప్రస్తుతం ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా, రాష్ట్ర ప్రభుత్వ క్రీడా సలహాదారుగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. చారిత్రక క్లబ్‌కు ట్రెజరర్‌గా ఎన్నిక కావడంపై జితేందర్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. తన ఎన్నికకు సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

భద్రాద్రి భూముల కబ్జాపై స్పందించవా.. రామచంద్రా?: కేటీఆర్



హైదరాబాద్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి రామచంద్రస్వామి దేవస్థాన భూములు కబ్జా అవుతుండడంపై స్పందించవా..? రామచంద్రా..! అంటూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావును బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. భద్రాచల ఆలయానికి చెందిన 889 ఎకరాల భూమి ఆంధ్రప్రదేశ్ పరిధిలో కబ్జాకు గురైతే.. బీజేపీ నేతల నుంచి ఒక్కమాట కూడా రాకపోవడం శోచనీయమని శుక్రవారం 'ఎక్స్' వేదికగా స్పందించారు. ఈ అంశంపై మాట్లాడేందుకు తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచంద్రరావుకు సమయం లేదా? లేకపోతే కేవలం రాజకీయ ప్రయోజనాలు కాపాడుకోవడం కోసమే మౌనంగా ఉంటున్నారా అని నిలదీశారు. తెలంగాణ బిడ్డల ఇంజనీరింగ్ ప్రతిభకు ఇంజనీర్ నవాబ్‌అలీ నవాబ్ జంగ్ బహదూర్ తార్కాణమని కేటీఆర్ అన్నారు. గురువారం నవాబ్ జంగ్ జయంతిని పురస్కరించుకుని తెలంగాణ నీటి పారుదల రంగానికి ఆయన అందించిన సేవలను గుర్తుచేసుకున్నారు.

సంజయ్‌కి రాష్ట్రపతి, ప్రధాని శుభాకాంక్షలు

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోదీ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ఆయురారోగ్యాలు, సుఖ సంతోషాలతో జాతికి సేవలందించాలని ఆకాంక్షించారు. కేంద్ర మంత్రివర్గంలో తన సహచరుడిగా సంజయ్ పనితీరు ప్రశంసనీయమని మోదీ తెలిపారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా.. సంజయ్‌కి ఫోన్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పలువురు కేంద్ర మంత్రులు, ఎంపీలు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు, సీనియర్ నాయకులు సంజయ్‌కి శుభాకాంక్షలు తెలిపారు.

వడ్డీమాఫీ కింద ఎస్‌హెచ్‌జీలకు 344 కోట్లు

మహిళా స్వయం సహాయక సంఘాలు తీసుకున్న రుణాలకు వడ్డీ మాఫీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.344 కోట్లు విడుదల చేసింది. ఈ మేరకు రాష్ట్ర ఆర్థిక శాఖ.. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్)కు నిధులు విడుదల చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. ఇందులో గ్రామీణ మహిళా సంఘాలకు రూ.300 కోట్లు, పట్టణ మహిళా సంఘాలకు రూ.44 కోట్లు విభజించి.. నేటి నుంచి ఈ నెల 18వరకు ఎస్‌హెచ్‌జీల ఖాతాల్లో వడ్డీ జమ చేయాలని ఆర్థిక శాఖ సూచించింది.

టీజీ సీపీజీఈటీ దరఖాస్తుకు 17న చివరి గడువు

ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రస్థాయి కామన్ పోస్ట్ గ్రాడ్యుయేట్ ఎంట్రెన్స్ పరీక్షలకు (టీజీ సీపీజీఈటీ-2025) ఆలస్య రుసుము లేకుండా ఈ నెల 17లోపు దరఖాస్తు చేసుకోవాలని కన్వీనర్ ఐ.పాండురంగా రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.

బీఆర్ఎస్ హయాంలో పత్రికా ప్రకటనల పేరిట నిధుల దుర్వినియోగం

- పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తి కాకుండానే ప్రారంభోత్సవమంటూ రూ.22.13 కోట్లతో ప్రకటనలు
- ఏడాదిలోనే 244.17 కోట్లు ఖర్చు
- విచారణ చేపట్టాలని గవర్నర్‌కు ఎఫ్‌జీజీ లేఖ

హైదరాబాద్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): పత్రికా ప్రకటనల పేరిట గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజాధనాన్ని పెద్ద ఎత్తున దుర్వినియోగం చేసిందని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్(ఎఫ్‌జీజీ) పేర్కొంది. దీనిపై విచారణ చేపట్టాలని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మను కోరింది. ఈమేరకు ఎఫ్‌జీజీ అధ్యక్షుడు ఎం.పద్మనాభరెడ్డి శుక్రవారం గవర్నర్‌కు లేఖ రాశారు. బీఆర్ఎస్ హయాంలో పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు నిర్మాణానికి రూ.32,000 కోట్లతో పాలనాపరమైన అనుమతులు ఇచ్చారని గుర్తు చేశారు. దీనికి పర్యావరణం, ఇతర అనుమతులు లేకపోవడం, జాతీయ గ్రీన్ ట్రైబ్యునల్ రూ.920 కోట్ల అపరాధ రుసుము విధించడం, రకరకాల కోర్టు కేసులు ఉండడంతో పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు చివరి దశకు చేరుతుందా? మధ్యలోనే ఆగిపోతుందా అనే సందేహాలు ఉండేవని పేర్కొన్నారు. అయినా... అప్పటి సీఎం 2023 సెప్టెంబరు 16న నార్లాపూర్‌లో, 17న కొల్లాపూర్‌లో ప్రాజెక్టుకు ప్రారంభోత్సవం చేశారని తెలిపారు. ఆ సందర్భంగా 13 తెలుగు, 7 ఆంగ్లం, 3 హిందీ, 6 ఉర్దూ, 2 మరాఠి పత్రికలు, 296 ఇతర చిన్న పత్రికలు, 322 మ్యాగజైన్లకు ప్రకటనలు (యాడ్స్) ఇచ్చారని తెలిపారు. ఇందుకోసం రూ.22,13,55,038 ఖర్చు చేశారని వివరించారు. పూర్తి కాని ప్రాజెక్టుకు రూ.22.13 కోట్లను ఖర్చు చేయడం ప్రజాధన దుర్వినియోగమే అవుతుందని ఆక్షేపించారు. 2022లో టీఆర్ఎస్ కాస్త బీఆర్ఎస్‌గా మారిందని, ఆ సందర్భంలోనూ భారీగా పత్రికా ప్రకటనలు ఇచ్చారని తెలిపారు. 2023 ఎన్నికలకు ముందు కూడా పెద్ద ఎత్తున ప్రకటనలు ఇచ్చారని వివరించాారు. ప్రకటనల కోసం ఏడాదిలోనే ఏకంగా రూ.244.17కోట్ల ప్రజాధనాన్ని ఖర్చు చేశారని తెలిపారు. తెలుగు, ఇంగ్లిష్, హిందీ, ఉర్దూ భాషల్లోనే కాకుండా మలయాళం, తమిళం, మరాఠి, ఒరియా, గుజరాతి, బెంగాలీ, పంజాబీ భాషా పత్రికలకు ప్రకటనలు ఇచ్చారని ఆరోపించారు. ప్రజాధనాన్ని ఇలా దుర్వినియోగం చేయడం ఏమాత్రం సమర్థనీయం కాదని పేర్కొన్నారు. ఈ విషయమై విచారణ చేపట్టి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

14న ఎడ్‌సెట్, పీఈసెట్ కౌన్సెలింగ్ షెడ్యూల్

బీఈడీ కాలేజీల్లో ప్రవేశాలకు ఉద్దేశించిన ఎడ్‌సెట్, వ్యాయామ కళాశాలల్లో ప్రవేశాలకు ఉద్దేశించిన పీఈసెట్ కౌన్సెలింగ్ షెడ్యూల్ ఈ నెల 14న ప్రకటించనున్నారు. ఎడ్‌సెట్ ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, ధ్రువీకరణ పత్రాల పరిశీలన ఈ నెల 21 నుంచి 31 వరకు, పీఈసెట్‌కు ఈ నెల 23 నుంచి 29 వరకు ఉంటుందని ఉన్నత విద్యామండలి ఓ ప్రకటనలో తెలిపింది.

మాతృభాష అమ్మ.. హిందీ పెద్దమ్మ!

హిందీ అంటే ఎందుకంత భయం?.. ఎందుకు ద్వేషిస్తున్నాం?

- ఇంగ్లిష్‌ను సొంతం చేసుకొన్న మనమే.. హిందీని మనభాషగా ఎందుకు అనుకోవడం లేదు?
- చిల్లర రాజకీయాల కోసమే కొందరు హిందీని వ్యతిరేకిస్తున్నారు
- అది రాజభాష.. హిందీని ప్రేమిద్దాం.. ముందుకు తీసుకెళ్దాం: పవన్ కల్యాణ్
- గచ్చిబౌలిలో రాజభాషా స్వర్ణోత్సవ వేడుకలు



కేంద్రమంత్రి కిషన్‌రెడ్డితో కరచాలనం చేస్తున్న పవన్ కల్యాణ్

హైదరాబాద్ సిటీ, జూలై 11 (ఆంధ్రజ్యోతి): "మన మాతృభాష అమ్మ అయితే హిందీ పెద్దమ్మ" అని ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. హిందీ మనది అని.. ఆ భాషను ప్రేమిద్దాం అని, ముందుకు తీసుకెళ్దామని పిలుపునిచ్చారు. హిందీని రాజభాషగా ఆయన అభివర్ణించారు. నాగరికత ముసుగులో ఆంగ్ల భాషను సొంతం చేసుకున్న మనమే హిందీని మనభాష అని అనుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగ, వ్యాపారాల కోసం ఇతర దేశాలకు వెళ్లినప్పుడు అక్కడి భాషలు నేర్చుకుంటున్నామని, మరి.. మన దేశానికే చెందిన హిందీ నేర్చుకునేందుకు ఎందుకు భయపడుతున్నాం? ఆ భాషను ఎందుకు ద్వేషిస్తున్నాం? అని ప్రశ్నించారు. హిందీ నేర్చుకోవాలని ఎవరినీ బలవంతం చేయడం లేదని, అయితే అది ఎవరైనా తేలిగ్గా అర్థం చేసుకోగలిగే భాష అని పేర్కొన్నారు. లాభం ఉందనుకున్నప్పుడు కొందరు హిందీని నిస్సంకోచంగా ఉపయోగిస్తూ అదే హిందీని చిల్లర రాజకీయాల కోసం వ్యతిరేకిస్తున్నారని మండిపడ్డారు. గచ్చిబౌలి స్టేడియంలో శుక్రవారం 'రాజభాష విభాగం స్వర్ణోత్సవ సమ్మేళనం' కార్యక్రమంలో పవన్ కల్యాణ్, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, రాజ్యసభ వైస్ ఛైర్మన్ హరివంశ్ నారాయణ్ సింగ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడారు. ఇంట్లో మాట్లాడుకునేందుకు మాతృభాష ఉంటే, బయట మాట్లాడేందుకు హిందీ అవసరమవుతుందని ఆయన చెప్పారు. మనమేమో విడిపోయేందుకు దారులు వెతుకుతుంటే.. హిందీ, దేశం మొత్తాన్ని ఏకం చేసేందుకు దారులు వెతుకుతోందని.. ఆ భాషను తాను స్వాగతిస్తున్నానని చెప్పారు. పర్షియన్, ఉర్దూ భాషలను ఆమోదిస్తూ.. హిందీని మాత్రం బలవంతంగా రుద్దుతున్నారని కొందరు అంటున్నారన్నారని.. అది అవివేకమేనని విమర్శించారు. విద్య, వైద్యం, వ్యాపార అవసరాల కోసం అన్ని భాషలు, మాండలికాలు అనే గోడలను ఛేదించుకుంటూ వెళుతున్న ఈ రోజుల్లో హిందీని వ్యతిరేకిస్తే రానున్న తరాల అభివృద్ధిని అడ్డుకోవడమే అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

దక్షిణాది చిత్రపరిశ్రమకు ఆదాయ వనరు

హిందీ నేర్చుకోవడం అంటే మన ఉనికి కోల్పోవడం కాదని, మన ఉనికికి మరింత సుదృఢం చేసుకోవడం అవుతుందని పవన్ కల్యాణ్ అన్నారు. మరో భాషను అంగీకరించడం అంటే ఓడిపోవడం కాదని, కలిసి ప్రయాణం చేయడం అని పేర్కొన్నారు. హిందీ సినిమా వ్యాపార ఆదాయంలో 31 శాతం మేర హిందీలోకి అనువాదమయ్యే దక్షిణాది భాషలకు చెందిన చిత్రాల ద్వారానే వస్తోందని.. తద్వారా దక్షిణాది చిత్ర పరిశ్రమకి ఆదాయం కూడా వస్తోందని చెప్పారు. వ్యాపార అవసరాలకు హిందీ కావాలి గానీ నేర్చుకోవడానికి మాత్రం వద్దు అనే ధోరణి తగదన్నారు. "హిందీ భాష పట్ల నాకు ఉన్న గౌరవం, నిబద్ధతను చూపేందుకే ఖుషీ సినిమాలో 'ఏ మేరా జహా' అనే పాటను పెట్టానని, మాతృ భాష తెలుగు అయితే.. రాజ భాష హిందీ అని చెప్పే ప్రయత్నం చేశాను" అని పేర్కొన్నారు. కార్యక్రమంలో తెలంగాణకు చెందిన హిందీ భాషావేత్త మాణిక్యాంబ, తమిళనాడుకు చెందిన హిందీ భాషావేత్త అనంతకృష్ణన్ పాల్గొన్నారు.

మొదటిసారిగా తెలుగు నేలకు 'అహికుంటకులు'

శ్రీలంక మూలవాసులైనా తెలుగు మాట్లాడగలరు.. కానీ తెలుగు రాయడం, చదవడం మాత్రం రాదు

- వర్ణమాల ఉందని ఈ మధ్యే తెలిసింది
- అహికుంటక తెగకు చెందిన మసన్న
- శ్రీలంక, నేపాల్, బంగ్లాదేశ్‌లోని సంచార తెగల్లో తెలుగు మాట్లాడేవారు
- తెలుగు నెరవు నిర్వాహకుడు రమేశ్
- అహికుంటక ప్రతినిధులకు సన్మానం



శుక్రవారం హైదరాబాద్‌లో శ్రీలంకకు చెందిన అహికుంటక తెగ ప్రతినిధులను సత్కరించిన తెలుగు నెరవు, తెలుగు జాతి ట్రస్టుల ప్రతినిధులు

హైదరాబాద్ సిటీ, జూలై 11(ఆంధ్రజ్యోతి): తెలుగు భాషకు ఎల్లలు లేవనడానికి శ్రీలంకలోని అహికుంటక తెగ ప్రజలు నిదర్శనం. వారెవరూ బతుకుదెరువు కోసం అక్కడికి వెళ్లినవారు కాదు. పక్కా లంకేయులైనా అచ్చ తెలుగు భాషీయులు. తొలిసారిగా రాష్ట్రానికి వచ్చిన సందర్భంగా వారిని శుక్రవారం బంజారాహిల్స్‌లోని లామకాన్‌లో తెలుగు నెరవు, తెలుగు జాతి ట్రస్ట్ సత్కరించాయి. ఆ తెగకు చెందిన ఆల్ సిలోన్ తెలుగు ఆర్టిస్ట్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు మసన్న మాట్లాడుతూ తమ తెగవారు 15 వేల మందికిపైగా ఉన్నారని తెలిపారు. తాము తెలుగులో మాట్లాడుతున్నా... రాయడం, చదవడం రాదని, అసలు తెలుగులో వర్ణమాల ఉందన్న విషయం ఈ మధ్యే తెలిసిందని చెప్పారు. 'మా ప్రధాన వృత్తి పాములు, కోతులను ఆడించడం. ఈ తరంలో చాలామంది ఇతర వృత్తులను ఎంచుకొని జీవనం సాగిస్తున్నారు. ఉన్నత విద్య అభ్యసించి మంచి ఉద్యోగాల్లో స్థిరపడుతున్నారు. మరోవైపు కటిక పేదరికాన్ని అనుభవిస్తున్న వారి సంఖ్య తక్కువేమీ కాదని మసన్న వివరించారు. తమను తెలుగు నేలకు, సంస్కృతికి దగ్గర చేయడంలో సీనియర్ జర్నలిస్టు, తెలుగు జాతి ట్రస్టీ డీపీ అనూరాధ, తెలుగు నెరవు సంస్థ నిర్వాహకుడు స.వెం.రమేశ్ చూపించిన చొరవ మరువలేనిదని కృతజ్ఞతలు తెలిపారు. తనది కిన్నెర మీటే పరంపరకు చెందిన కుటుంబమని కార్యదర్శి నిమల్ చెప్పారు. శ్రీలంకలోని తెలుగువారి అభ్యున్నతి కోసం కృషి జరగాల్సిన అవసరం ఉందన్నారు. బుద్ధ భగవానుడి దంతాన్ని శ్రీలంకకు తీసుకురావడంలో తెలుగు వనిత హేమమాల తోడ్పాటు అద్వితీయమని శ్రీలంక బౌద్ధ భిక్షువు థేరో గుర్తుచేశారు. తెలుగు నేల మీద ఒకనాడు విరాజిల్లిన బౌద్ధ చరిత్రను తెలుగు మీద మమకారంతో జపాన్ నుంచి వచ్చిన బౌద్ధ భిక్షువు యుషీ వివరించారు. భారత్‌లోని వివిధ రాష్ట్రాలతో పాటు శ్రీలంక, నేపాల్, బంగ్లాదేశ్ తదితర దేశాల్లో సంచార తెగల్లో తెలుగు మాట్లాడేవారు ఎక్కువ మంది ఉన్నారని రమేశ్ తెలిపారు. దేశదేశాల్లోని తెలుగు వారిపై అధ్యయనంలో డీపీ అనూరాధ కృషి ప్రత్యేకమైనదని కొనియాడారు. ఆమెతో పాటు తెలుగు నెరవు ప్రతినిధులు సుబ్బారెడ్డి, విజయ్, భానుకిరణ్ తదితరులు పాల్గొన్నారు. 'ఆంధ్రజ్యోతి' సిటీ బ్యూరో చీఫ్ చామర్తి మురళీధర్ 2007లో తన శ్రీలంక పర్యటన విశేషాలను సభికులతో పంచుకున్నారు. ఇన్నేళ్లకైనా తల్లివేరుతో పిల్లవేరు కలవడం సంతోషంగా ఉందన్నారు.


గాంధీభవన్‌లో స్వీట్లు పంచుతూ సంబరాలు జరుపుకుంటున్న మంత్రులు పొన్నం, వాకిటి శ్రీహరి, కేకే తదితరులు

ఇలా ఆర్డినెన్స్.. అలా నోటిఫికేషన్!

(మొదటిపేజీ తరువాయి)

కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఆర్డినెన్స్‌తో పాటు జీవోను ఒకేసారి విడుదల చేయాలని సూచించారు. న్యాయపరమైన సమస్యల గురించి కూడా చర్చించారు. కోర్టులో ఎవరైనా కేసులు వేసి, ఎన్నికల ప్రక్రియకు ఆటంకం కలిగించకుండా ముందు జాగ్రత్తగా హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో కేవియట్ పిటిషన్‌లు దాఖలు చేయాలని సూచించారు. సీఎం రేవంత్ సానుకూలంగా స్పందించారు.

వేడెక్కిన స్థానికం

ఎన్నికలకు సంబంధించి ప్రభుత్వం చర్యలను ప్రారంభించడంతో క్షేత్రస్థాయిలో రాజకీయం వేడెక్కుతోంది. అన్ని పార్టీల చూపు స్థానిక ఎన్నికల మీదకు మళ్లింది. అధికార పార్టీ మంత్రులు, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ ఛైర్మన్‌లు అంతా స్థానికంగానే ఎక్కువ సమయం గడుపుతున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు శంకుస్థాపనలు చేయడంతో పాటు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కేటాయించిన విషయాన్ని ప్రముఖంగా ప్రస్తావిస్తున్నారు. సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్నారు. రిజర్వేషన్లు ఎలా ఉంటాయనే దానిపైనే గ్రామాల్లో జోరుగా చర్చ సాగుతోంది. మండల పరిషత్ ఎన్నికల్లో తమకు టికెట్ వస్తుందా లేదా? అని లెక్కేసుకుంటున్నారు. పార్టీ రాష్ట్ర నేతలతో సంప్రదింపులు జరుపుతున్నారు.

క్యాబినెట్ నిర్ణయం అభినందనీయం: జాజుల

పంజాగుట్ట, జూలై 11(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం ఆర్డినెన్స్ ద్వారా చట్ట సవరణ చేయాలన్న రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయం అభినందనీయమని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో బీసీ కుల సంఘాల జేఏసీ ఛైర్మన్ కుందరం గణేష్ చారి, పూలే జయంతి ఉత్సవాల కమిటీ ఛైర్మన్ చిన్న శ్రీశైలం యాదవ్, బీసీ-ఏ కులాల అధ్యక్షుడు ఎం.భాగయ్యతో కలిసి ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌గౌడ్, బీసీ మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, వాకాటి శ్రీహరి, ఇతర క్యాబినెట్ మంత్రులకు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తమ డిమాండ్‌ను గౌరవించి రిజర్వేషన్ల బిల్లును అసెంబ్లీలో ఆమోదింపజేసి.. గవర్నర్ ద్వారా ఏప్రిల్ 11న రాష్ట్రపతికి పంపించిందన్నారు. మూడు నెలలు గడిచినా కేంద్ర ప్రభుత్వం కనీసం స్పందించలేదని విమర్శించారు. బీసీల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని రిజర్వేషన్ల పెంపునకు అన్ని పార్టీలు సహకరించాలని, అడ్డుకోవాలని చూస్తే ఎవర్నీ వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. బీసీ రిజర్వేషన్ల పెంపుపై రాజకీయ పార్టీల వైఖరి, రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానం, ఆర్డినెన్స్ ఆమోదం తదితర విషయాలపై రెండు మూడు రోజుల్లో హైదరాబాద్‌లో మేధోమధన సమావేశం ఏర్పాటు చేసి, భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని చెప్పారు.

ఇది జాగృతి విజయమే: ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్లపై ఆర్డినెన్స్ తెస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడాన్ని.. జాగృతి, బీసీబిడ్డల విజయంగా భావిస్తున్నామని ఎమ్మెల్సీ కవిత పేర్కొన్నారు. శుక్రవారం తన నివాసంలో మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ జాగృతి ఉద్యమాల ద్వారా ఒత్తిడి తేవడంతోనే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని తెలిపారు. ప్రభుత్వానికి నిజంగా బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలన్న చిత్తశుద్ధి ఉంటే హైకోర్టులో కేవియట్ దాఖలు చేసి ఆర్డినెన్స్ జారీ చేయించాలని డిమాండ్ చేశారు. ఈ ఆర్డినెన్సుకు గవర్నర్ ఆమోదం తెలిపి తన మర్యాదను నిలబెట్టుకోవాలన్నారు. కేంద్రం పరిధిలో ఉన్న బీసీ రిజర్వేషన్ల బిల్లును ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత కేంద్రమంత్రి బండి సంజయ్ తీసుకోవాలని ఎమ్మెల్సీ కవిత కోరారు.

ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం: ఆర్.కృష్ణయ్య

బర్కత్‌పుర, జూలై 11(ఆంధ్రజ్యోతి): విద్యా, ఉద్యోగ, స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లపై ఆర్డినెన్స్ జారీ చేయాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించడం బీసీలు సాధించిన విజయమేనని రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య అన్నారు. ఈ నిర్ణయం తీసుకున్నందుకు సీఎం రేవంత్ రెడ్డికి బీసీల తరఫున ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ 42 శాతం రిజర్వేషన్లను చిత్తశుద్ధితో అమలు చేయాలని, అన్నివర్గాలను కలుపుకుని ముందుకు వెళ్లాలని ప్రభుత్వానికి సూచించారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జకృష్ణ, జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం ఆధ్వర్యంలో శుక్రవారం బీసీ సంఘాల సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ.. 73, 74 రాజ్యాంగ సవరణల ద్వారా ఆర్టికల్ 246డీ 6టీ 6 ప్రకారం స్థానిక సంస్థలలో రిజర్వేషన్లు పెంచే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉందని గుర్తు చేశారు. 42 శాతం బీసీ రిజర్వేషన్లపై ఎవరైనా కోర్టుకు వెళ్లినా అది చెల్లదని, అందుకోసం రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టు, హైకోర్టులలో కేవియట్ దాఖలు వేయాలని సూచించారు. బీసీ రిజర్వేషన్లపై ఆర్డినెన్స్ తీసుకువచ్చిన తరువాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు.

మరోసారి బీసీలను మోసం చేసే ప్రయత్నం

» చట్టబద్ధత లేకుండా ఆర్డినెన్సా?: బీఆర్ఎస్ బీసీ నేతలు

హైదరాబాద్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): బీసీలకు ఆర్డినెన్స్ ద్వారా రిజర్వేషన్లు కల్పించే అవకాశం ఉంటే 20 నెలలు ఆలస్యమెందుకు చేశారు.. అది జరగదని తెలిసే.. సీఎం రేవంత్‌రెడ్డి మరోసారి బీసీలను మోసం చేయాలని చూస్తున్నారని బీఆర్ఎస్ బీసీ నాయకులు ఆరోపించారు. ఆ పార్టీ నేతలు తలసాని శ్రీనివాసయాదవ్, మధుసూదనాచారి, శ్రీనివాస్ గౌడ్, గంగుల కమలాకర్, దాసోజు శ్రవణ్, వద్దిరాజు రవిచంద్ర శుక్రవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో తమిళనాడు తరహాలో ముందుకు వెళ్లాలని బీఆర్ఎస్ మొదటి నుంచి చెబుతోందని, చటబద్ధత లేకుండా ఆర్డినెన్స్‌లు ఇవ్వడం సరైంది కాదని పేర్కొన్నారు. ఎన్నికలు ఆలస్యం అవుతున్నాయని బీసీల నోట్లో మట్టికొట్టే ప్రయత్నం చేయొద్దని, ఆర్డినెన్స్‌లను కోర్టులు కొట్టివేస్తాయన్న విషయాన్ని గుర్తించి రేవంత్ రెడ్డి ముందుకు వెళ్లాలని సూచించారు. తెలిసీ.. బీసీలకు ద్రోహం చేయాలని చూస్తే ఊరుకోమన్నారు. కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం 42 శాతం రిజర్వేషన్లు కల్పించాకే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలన్న డిమాండ్‌తో అసెంబ్లీలో, బయట కూడా బీఆర్ఎస్ తరఫున పోరాడామన్నారు.

దళితుల రిజర్వేషన్లు 18శాతానికి పెంచేలా కృషి

» మాల మహానాడులో మంత్రి వివేక్

ఖైరతాబాద్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణలోని రోస్టర్ విధానం వల్ల మాలలకు జరుగుతున్న నష్టాన్ని సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్తానని కార్మికశాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. ఖైరతాబాద్ వాసవి క్లబ్‌లో శుక్రవారం జరిగిన మాల మహానాడు నాయకుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. దళితుల రిజర్వేషన్లు 18శాతానికి పెంచేలా తన వంతు కృషి చేస్తానన్నారు. మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య మాట్లాడుతూ వర్గీకరణతో మాల విద్యార్థులు, నిరుద్యోగులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. అనంతరం సమావేశంలో పలు తీర్మానాలను ఆమోదించారు. ఎస్సీ వర్గీకరణలో రోస్టర్ విధానాన్ని సరిచేయాలని, దళితులకు 18శాతం రిజర్వేషన్ల కోసం పోరాడాలని, రోస్టర్ విధానాల్లో జరిగిన అన్యాయాలపై 28న కలెక్టర్లకు వినతిపత్రాలు ఇవ్వాలని నిర్ణయించారు.

స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయం

» 90% కైవసం చేసుకుంటాం: కోమటిరెడ్డి

» కాంగ్రెస్‌తోనే న్యాయం: దామోదర

» బీఆర్ఎస్ పాలనలో అధోగతి: జూపల్లి


మాడ్గులలో ఆస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి దామోదర. చిత్రంలో మంత్రులు కోమటిరెడ్డి, జూపల్లి, ఎమ్మెల్యే కసిరెడ్డి తదితరులు

ఆమనగల్లు, జూలై 11(ఆంధ్రజ్యోతి): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధిస్తుందని, 90 శాతం స్థానాలు కైవసం చేసుకుంటామని మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో సుపరిపాలన కొనసాగుతోందని, ప్రభుత్వ పథకాల ద్వారా ప్రజలంతా కష్టాల నుంచి వైదొలిగి సంతోషంగా ఉన్నారని చెప్పారు. రంగారెడ్డి జిల్లా మాడ్గుల మండల కేంద్రంలో శుక్రవారం మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు పర్యటించారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి, కలెక్టర్ నారాయణ రెడ్డిలతో కలిసి మాడ్గుల మండల కేంద్రంలో రూ.12.70 కోట్లతో నూతనంగా నిర్మించే 30 పడకల ఆస్పత్రి భవనానికి మంత్రి దామోదర శంకుస్థాపన చేశారు. ఆమనగల్లు మండలం కోనాపూర్ నుంచి మాడ్గుల మండల కేంద్రం వరకు రూ. 45 కోట్లతో చేపట్టే, మాడ్గుల నుంచి అందుగులకు రూ.30 కోట్లతో నిర్మించే బీటీ డబుల్ రోడ్డు విస్తరణ పనులకు మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి శంకుస్థాపనలు చేశారు. 220 మందికి కల్యాణలక్ష్మి చెక్కులను మంత్రి జూపల్లి పంపిణీ చేశారు. అనంతరం వాసవి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సభలో మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు విజయసోపానమన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన ప్రతి హామీని సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజాప్రభుత్వం నెరవేరుస్తూ 18 నెలల పాలనలో ప్రజలకు మరింత చేరువైందని పేర్కొన్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులతో పాటు పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలను యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేసి రైతులకు సాగునీరందిస్తామని ఆయన చెప్పారు. మంత్రి దామోదర మాట్లాడుతూ.. స్వేచ్ఛ, సమానత్వం, సామాజిక న్యాయం, రాజ్యాంగ పరిరక్షణ కాంగ్రెస్‌తోనే సాధ్యమని అన్నారు. కల్వకుర్తిలో రూ.45కోట్లతో వంద పడకల ఆస్పత్రి నిర్మిస్తున్నామని, కడ్తాల్, తలకొండపల్లిలో 30 పడకల పీహెచ్‌సీలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. దేశంలో మరే రాష్ట్రంలో లేనివిధంగా పేదల ఆరోగ్య పరిరక్షణకు రాష్ట్రప్రభుత్వం పెద్దపీట వేస్తోందని చెప్పారు. పనిచేస్తున్న ప్రభుత్వానికి ప్రజలంత అండగా ఉంటే మరింత అభివృద్ధి చేయడానికి వీలుంటుందని ఆయన పేర్కొన్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందని ఆరోపించారు. కేసీఆర్ చేసిన అప్పులకే రాష్ట్ర ప్రభుత్వం నెలకు రూ.6500 కోట్ల వడ్డీలు చెల్లించాల్సి వస్తోందని, అయినా దేశంలో మరేరాష్ట్రంలో లేనివిధంగా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగిస్తోందని చెప్పారు. 18నెలల కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో అద్భుత విజయాలు సాధించిందని మరో మూడున్నరేళ్లలో అభివృద్ధిలో దేశంలో తెలంగాణ అగ్రస్థానంలో నిలుస్తుందని చెప్పారు.

అధిష్ఠానం మా పాలనపై

పూర్తి సంతృప్తిగా ఉంది

(మొదటిపేజీ తరువాయి)


మీడియాతో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

రాష్ట్రానికి వచ్చి సమీక్ష జరిపిన తర్వాత.. తెలంగాణలో సామాజిక న్యాయం, ప్రభుత్వ హామీల అమలు తీరును ప్రశంసించారని తెలిపారు. భట్టి శుక్రవారం ఢిల్లీలో మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. తెలంగాణలో కుల సర్వే, ఎస్సీ వర్గీకరణ, సన్న బియ్యం, ఉద్యోగాల భర్తీ, ఇందిరమ్మ ఇళ్లు, రైతు రుణాల మాఫీ, రైతు భరోసా, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, మహాలక్ష్మి, గృహజ్యోతి పథకాలు విజయవంతంగా అమలు చేస్తున్నామని చెప్పారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ప్రజలకు వాస్తవాలు తెలియజేస్తున్నామన్నారు. రాష్ట్ర ఆదాయం ప్రతినెలా రూ.16 వేల కోట్ల వరకు ఉంటుందని... సుమారు రూ.7 వేల కోట్లు పథకాలకు, రూ.5,500 కోట్లు జీతాలకు, రూ.6,300 కోట్లు అప్పులు, వడ్డీల చెల్లింపునకు ఖర్చవుతున్నాయని భట్టి చెప్పారు. ఆదాయ వనరుల సమీకరణపై దృష్టిపెట్టామని తెలిపారు. అవసరమైనప్పుడు భూములు అమ్మడంలో తప్పేమీ లేదన్నారు. గత ప్రభుత్వాధినేతలు చేసిన అక్రమాలపై చట్టపరంగా శిక్షలు ఉంటాయని, ఉపేక్షించే ప్రసక్తే లేదని పేర్కొన్నారు. కేసీఆర్ చుట్టూ దయ్యాలు ఉన్నాయని ఆయన కుమార్తె కవిత స్వయంగా అన్నారని, ప్రజల్లో బీఆర్ఎస్ ప్రతిష్ఠ పూర్తిగా పడిపోయిందని వ్యాఖ్యానించారు. ఏపీలో జగన్‌లా కేసీఆర్ కూడా అసెంబ్లీకి రావడం లేదని విమర్శించారు. నియోజకవర్గాల పునర్విభజన తర్వాత రాష్ట్రంలో 150కి పైగా అసెంబ్లీ స్థానాలు ఉంటాయని, కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి వచ్చి తీరుతుందని ధీమా వ్యక్తం చేశారు.

కలసికట్టుగా పనిచేస్తున్నాం..

సీఎం రేవంత్‌రెడ్డి, తాను మంచి అవగాహనతో కలసికట్టుగా పనిచేస్తున్నామని, తమ మధ్య ఎలాంటి సమస్యలూ లేవని భట్టి తెలిపారు. కర్ణాటకలో సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ మధ్య అధికారం విషయంలో నెలకొన్న స్పర్థలను మీడియా ప్రస్తావించగా.. కర్ణాటకలో లాగా తెలంగాణలో అధికారం పంచుకునే ఏర్పాటు (పవర్ షేరింగ్ అరేంజ్‌మెంట్) ఏమీ లేదని స్పష్టం చేశారు. మంత్రి పదవుల ఆకాంక్షలు ఉండటంలో తప్పేమీ లేదన్నారు. తదుపరి మంత్రివర్గ విస్తరణపై అధిష్ఠానం నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు.

రాంచందర్‌రావును పదవి నుంచి తొలగించాలి

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ) దళిత విద్యార్థి రోహిత్ వేముల ఆత్మహత్యకు కారణమైన ఎన్.రాంచందర్‌రావుకు బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి ఇవ్వడం దారుణమని భట్టి పేర్కొన్నారు. బీజేపీ నాయకత్వం రాంచందర్‌రావును వెంటనే పదవి నుంచి తొలగించి, ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. "హెచ్‌సీయూలో ఆత్మగౌరవంతో బతకడానికి కావాల్సిన హక్కులు కల్పించాలంటూ వైస్ చాన్సలర్‌కు అంబేడ్కర్ స్టూడెంట్స్ అసోసియేషన్ వినతిపత్రం ఇచ్చింది. అప్పట్లో వర్సిటీ ఏబీవీపీ అధ్యక్షుడిగా ఉన్న సుశీల్‌కుమార్ దీనిని జీర్ణించుకోలేక ఆ విద్యార్థులను దేశద్రోహులుగా చిత్రీకరించారు. తర్వాత బీజేపీ నేతలు రంగంలోకి దిగారు. రోహిత్ వేముల, మరో నలుగురిపై కేసులు పెట్టాలంటూ రాంచందర్‌రావు గుండాలతో వచ్చి ధర్నాకు దిగారు. వీసీపై, అప్పటి కేంద్ర మానవ వనరుల శాఖపై ఒత్తిడి తెచ్చారు. ఈ క్రమంలో యూనివర్సిటీ అధికారులు రోహిత్ వేముల, మిగతా వారిని బయటికి పంపేశారు. అది తట్టుకోలేక రోహిత్ వేముల ఆత్మహత్య చేసుకున్నారు" అని భట్టి చెప్పారు. అలాంటి రాంచందర్‌రావును బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా, అప్పటి ఏబీవీపీ నేత సుశీల్‌కుమార్‌ను ఢిల్లీ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నియమించడం బీజేపీ దళిత వ్యతిరేక వైఖరిని స్పష్టం చేస్తోందని ఆరోపించారు. దళిత వ్యతిరేకులకే బీజేపీ పదోన్నతులు, ప్రోత్సాహకాలు ఇస్తోందని విమర్శించారు. రోహిత్ వేముల ఆత్మహత్య కేసును తిరిగి తెరిచేందుకు కోర్టు అనుమతి కోరుతామని తెలిపారు. దళితులకు రాజ్యాంగం కల్పించిన రక్షణ కట్టుదిట్టంగా అమలు చేసేందుకు రోహిత్ వేముల చట్టాన్ని తీసుకొస్తామని చెప్పారు.

కవితను చూసి జనం నవ్వుకుంటున్నారు!

» బీసీ రిజర్వేషన్లతో ఆమెకేం సంబంధం?

» ఇది రాహుల్ అజెండా.. రేవంత్ నిబద్ధత: మహేశ్ గౌడ్



హైదరాబాద్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్ కల్పిస్తూ ఆర్డినెన్స్ తేవాలన్న రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయానికి, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు ఏంటి సంబంధమని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ ప్రశ్నించారు. ఆమెను చూసి జనం నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఒకటి రెండు ధర్నాలు చేసినంత మాత్రాన తన వల్లనే అంతా అయిందంటూ కవిత మాట్లాడుతున్నారని, కాంగ్రెస్ సర్కారు నిర్ణయానికి ఆమె రంగులు పూసుకుంటున్నారని విమర్శించారు. శుక్రవారం గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు అన్నది రాహుల్‌గాంధీ అజెండా.. సీఎం రేవంత్ నిబద్ధత అని వ్యాఖ్యానించారు. రాహుల్ ఆశయాన్ని నెరవేర్చడంలో సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రుల కృషి అభినందనీయమన్నారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో సామాజిక న్యాయం కాంగ్రెస్‌తోనే సాధ్యమని, బీసీల అభ్యున్నతికి కృషి చేసేది కాంగ్రెస్ మాత్రమేనని మరోమారు నిరూపితమైందని చెప్పారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో బీసీలకు ఏం చేశారని.. కవిత బీసీల పాట పాడుతోందని ప్రశ్నించారు. కవితకు రాష్ట్రంలో భవిష్యత్తే లేదని అన్నారు. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్‌ను అమలు చేసేందుకు ఆర్డినెన్స్ తేవాలని క్యాబినెట్ నిర్ణయించిన నేపథ్యంలో గాంధీభవన్‌లో కాంగ్రెస్ బీసీ నేతలు సంబరాలు చేసుకున్నారు.


సూర్యాపేట జిల్లా తిరుమలగిరిలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్, చిత్రంలో మంత్రి అడ్లూరి, ఎంపీ చామల

సామాజిక న్యాయం.. కాంగ్రెస్ సిద్ధాంతం

» బీసీలకు 42% రిజర్వేషన్‌తోనే రానున్న ఎన్నికలు

» త్వరలో 5 లక్షల రేషన్ కార్డుల పంపిణీ

» 14న ప్రారంభించనున్న సీఎం: ఉత్తమ్

తిరుమలగిరి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): సామాజిక న్యాయం కాంగ్రెస్ సిద్ధాంతమని, బీసీ గణన చేసిన ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమేనని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. అడ్లూరి లక్ష్మణ్‌కు మంత్రి వర్గంలో స్థానం కల్పించడం.. తమ పార్టీ సామాజిక న్యాయం పాటిస్తుండనడానికి నిదర్శనమన్నారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ బీసీ రిజర్వేషన్‌పై క్యాబినెట్ తీర్మానం చేశామన్నారు. 42శాతం బీసీ రిజర్వేషన్‌తోనే రానున్న ఎన్నికలు జరుగుతాయని స్పష్టం చేశారు. సూర్యాపేట జిల్లా తిరుమలగిరిలో 14న సీఎం పాల్గొననున్న బహిరంగ సభ ఏర్పాట్లను శుక్రవారం మరో మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌తో కలిసి ఉత్తమ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉత్తమ్ విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో కొత్తగా 5లక్షల రేషన్‌కార్డులు ఇవ్వబోతున్నామన్నారు. సన్న బియ్యంతో రూ.3.10కోట్ల మందికి (84శాతం జనాభాకు) అన్నం పెడుతున్నామని, ఇది గొప్ప కార్యక్రమంగా భావిస్తున్నామన్నారు. అర్హత ఉన్న వారందరికీ రేషన్ కార్డులు ఇస్తామని, ఇది నిరంతర ప్రక్రియ అని పేర్కొన్నారు. కొత్త కార్డులు ఇవ్వడంతోపాటు పాత కార్డుల్లో సభ్యులను చేరుస్తున్నామన్నారు. కొత్త రేషన్ కార్డుల పంపిణీని ఈ నెల 14న సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నారని, ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే కార్యక్రమానికి ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ప్రతిపక్షాలు ఎన్ని ఏడ్పులు ఏడ్చినా గత ఏడాది రికార్డు స్థాయిలో 281 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పండిందన్నారు. యాసంగిలో 75లక్షల టన్నుల ధాన్యాన్ని పౌర సరఫరాల సంస్థ ద్వారా కొనుగోలు చేసినట్లు తెలిపారు. రైతులు, రైతు కూలీలు, గ్రామీణ ప్రాంతాలు బాగుండడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. కాగా, గత బీఆర్ఎస్ ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని పట్టించుకోలేదని, కేవలం కమీషన్ల కోసమే పనిచేసిందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ విమర్శించారు. పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని, సన్న బియ్యం ఇచ్చిన ఘనత కాంగ్రెస్‌కే దక్కుతుందని అన్నారు.

బీసీల నోటి కాడి ముద్ద లాక్కోకండి

చేతులు జోడించి వేడుకుంటున్నాం.. 'స్థానికం'లో 42% రిజర్వేషన్‌కు మద్దతు ఇవ్వండి

» బీఆర్ఎస్, బీజేపీలకు పొన్నం విజ్ఞప్తి

» ఆర్డినెన్స్‌కు కవచంలా నిలబడాలంటూ కాంగ్రెస్ బీసీ నేతలకు పిలుపు

» ఆర్డినెన్సుకు ఎవరూ అడ్డు పడొద్దు: కేకే




హైదరాబాద్/న్యూఢిల్లీ, జూలై 11 (ఆంధ్రజ్యోతి): 'కాంగ్రెస్ బీసీ నాయకులం అందరమూ చేతులు జోడించి వేడుకుంటున్నాం. బీసీల నోటికాడి ముద్ద లాక్కోకండి. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ కాంగ్రెస్ సర్కారు తీసుకువస్తున్న ఆర్డినెన్స్‌కు మద్దతు ఇవ్వండి' అంటూ ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీలకు మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని వ్యతిరేకించి.. సొంత పార్టీల్లో వ్యతిరేకతను తెచ్చుకోవద్దని హితవు పలికారు. శుక్రవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి వాకిటి శ్రీహరి, ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు (కేకే), ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ఇతర బీసీ నేతలతో కలిసి పొన్నం మాట్లాడారు. కులగణన సర్వే నివేదిక ఆధారంగా బీసీలకు విద్య, ఉద్యోగాలు, స్థానిక ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ రెండు బిల్లులను ఆమోదించి గవర్నర్ ద్వారా కేంద్ర ప్రభుత్వానికి పంపించామని గుర్తు చేశారు. బీజేపీ తెలంగాణ నేతలు.. ప్రధాని మోదీని కలిసి ఆ రెండు బిల్లులనూ ఆమోదించేలా చూడాలని కోరారు. బీసీలకు సీఎం పదవి ఇస్తామని ప్రకటించిన బీజేపీ.. కీలక సమయంలో బీసీ నేత బండి సంజయ్‌ను ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి తొలగించిందని పొన్నం విమర్శించారు. 'తెలంగాణలో బీజేపీకి చెందిన నలుగురు బీసీ ఎంపీలు, బీసీ ఎమ్మెల్యే రాజాసింగ్‌ను కాదని అగ్రవర్ణానికి చెందిన రామచందర్‌రావుకు అధ్యక్ష పదవిని కట్టబెట్టారు. రాజాసింగ్ రాజీనామానూ ఆమోదించారు. బీజేపీ.. బీసీలకు వ్యతిరేకంగా పనిచేస్తోందని దీంతోనే తేలిపోయింది. సామాజిక న్యాయం కాంగ్రెస్‌తోనే సాధ్యం. కాంగ్రెస్‌లో సీఎం రెడ్డి సామాజికవర్గానికి చెందిన వారైతే.. టీపీసీసీ చీఫ్.. బీసీ సామాజిక వర్గానికి చెందిన వారు. పంచాయతీ ఎన్నికలు ఇప్పటికే 18 నెలలు జాప్యమైంది. కాంగ్రెస్ బీసీ నేతలు.. కుల సంఘాల జేఏసీగా ఏర్పడి ఆర్డినెన్సుకు ఉక్కు కవచంలా నిలబడి ముందుకు సాగాలి' అని పిలుపునిచ్చారు. కేకే మాట్లాడుతూ.. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కేవలం పార్టీలకు సంబంధించినదే కాదని, సమానత్వంలో ఇదీ ఒక భాగమని చెప్పారు. దయచేసి ఆర్డినెన్సుకు ఎవరూ అడ్డుపడొద్దని విజ్ఞప్తి చేశారు. బీసీల విషయంలో రాజకీయం చేయడం తగదని బీఆర్ఎస్ నేతలకు హితవు పలికారు.

మంది పెళ్లిళ్ల దగ్గర కవిత మంగళహారతులు: ఆది శ్రీనివాస్



మంది పెళ్లిళ్ల కాడ మంగళహారతులు పట్టడం.. కవిత ఆపేయాలంటూ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఎద్దేవా చేశారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో బీసీల కోసం పోరాటం చేయని ఆమె.. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి.. రంగులు పూసుకుని సంబరాలు చేసుకుంటోందన్నారు. ఢిల్లీలోని తెలంగాణభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. కవితకు బీసీ బిల్లుతో ఏం సంబంధమని ప్రశ్నించారు. కామారెడ్డి డిక్లరేషన్ మేరకు బీసీ రిజర్వేషన్ల హామీని నిలబెట్టుకుంటున్నామన్నారు. ఇకనైనా బీసీలపై మొసలి కన్నీరు ఆపాలని హితబోధ చేశారు. విద్య, ఉద్యోగాలు, స్థానిక ఎన్నికల్లోనూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ అసెంబ్లీ ఆమోదించిన రెండు బిల్లులపై కేంద్రం ఇప్పటిదాకా నిర్ణయం తీసుకోనందునే.. పంచాయతీరాజ్ చట్టాన్ని సవరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకురావాల్సి వస్తోందని ఓ ప్రకటనలో ఆయన తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్‌ను 42 శాతానికి పెంచుతూ ఆర్డినెన్స్ తీసుకురావాలన్న క్యాబినెట్ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామన్నారు. దీన్ని స్వాగతించి.. బీసీలపైన ఉన్న చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని బీజేపీ, బీఆర్ఎస్ నేతలకు సూచించారు.

బీసీలకు వరం: బీర్ల అయిలయ్య



స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించడం బీసీలకు ఒక వరమని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. రాహుల్ గాంధీ ఆలోచనల మేరకు సీఎం రేవంత్‌రెడ్డి ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. ఆయన ఆలోచన మేరకే రాష్ట్రంలో కులగణన, ఎస్సీ వర్గీకరణ జరిగాయని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయం సాధ్యమవుతుందన్నారు.

ఊళ్లో పెళ్లికి కవిత హడావుడి ఏంటో?: ఇందిరా శోభన్




ఊళ్లో పెళ్లికి కవిత హడావుడి ఏంటో అర్థం కావట్లేదని కాంగ్రెస్ నేత ఇందిరా శోభన్ అన్నారు. కాంగ్రెస్ సర్కారు ఘనతను ఆమె తన ఖాతాలో వేసుకునేందుకు తాపత్రయపడుతున్నారన్నారు. ఆనాడు స్థానిక ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను కేసీఆర్ 22శాతానికి తగ్గించినప్పుడు కవిత ఎందుకు నిలదీయలేదని ప్రశ్నించారు.

మార్గదర్శకుడు సీఎం రేవంత్: మల్లు రవి



స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయడంలో సీఎం రేవంత్‌రెడ్డి మార్గదర్శకుడిగా నిలిచారని టీపీసీసీ క్రమశిక్షణా చర్యల కమిటీ ఛైర్మన్, ఎంపీ మల్లు రవి కొనియాడారు. దేశంలోని అన్ని రాష్ట్రాలు భవిష్యత్తులో తెలంగాణ నమూనాను అనుసరించాల్సి వస్తుందని ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

మళ్లీ ఈ అవకాశం రాదు: షబ్బీర్ అలీ



బీసీలంటే కేసీఆర్‌కు చులకన అని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ విమర్శించారు. తాము కేసీఆర్‌లాగా కాదని, కాంగ్రెస్ ప్రభుత్వానికి బీసీలకు న్యాయం చేయాలన్న చిత్తశుద్ధి ఉంది కాబట్టే ఆర్డినెన్సును తెస్తోందని చెప్పారు. మళ్లీ ఇలాంటి అవకాశం రాదని, రాష్ట్రంలోని బీసీలు కాంగ్రెస్ ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. గాంధీ భవన్‌లో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ.. బీసీ డిక్లరేషన్‌ను తన నియోజకవర్గం కామారెడ్డిలో చేయడం సంతోషకరమన్నారు. స్థానిక ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్‌ను 34 శాతం నుంచి 22 శాతానికి తగ్గించిన దరిద్రపు ప్రభుత్వం.. కేసీఆర్‌దేనని మండిపడ్డారు.

పాముకాటుతో చిన్నారి మృతి


వేదాన్ష్ (ఫైల్)

బెల్లంపల్లి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలో గురువారం అర్ధరాత్రి తండ్రీకొడుకులు నిద్రిస్తున్న సమయంలో పాము కాటు వేసింది. ఈ ఘటనలో 14 నెలల చిన్నారి మృతి చెందగా.. తండ్రి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ప్రస్తుతం అతని ఆరోగ్యం నిలకడగా ఉంది. బెల్లంపల్లికి చెందిన జంగపల్లి ప్రవీణ్‌కు భార్య, కూతురు, కుమారుడు వేదాన్ష్ (14 నెలలు) ఉన్నారు. రాత్రి భోజనం తర్వాత కుటుంబ సభ్యులందరూ ఇంట్లో నిద్రపోయారు. ఒకటిన్నర గంటల సమయంలో ఏదో కుట్టినట్లు అనిపించడంతో ప్రవీణ్ నిద్రలో నుంచి లేవగా.. ఓ పాము ఇంట్లో నుంచి వెళ్తుండడం గమనించి కర్రతో కొట్టి చంపాడు. వెంటనే భార్యకు విషయం చెప్పి పిల్లలను తీసుకుని ఆస్పత్రికి వెళ్లారు. అక్కడ ప్రవీణ్‌కు చికిత్స అందిస్తుండగా వేదాన్ష్ నోటి నుంచి నురుగులు రావడం గమనించి వైద్యులకు చూపించారు. పరిస్థితి విషమంగా ఉందని మెరుగైన వైద్యం కోసం మంచిర్యాలకు తరలించాలని వైద్యులు సూచించినా.. అంతలోనే వేదాన్ష్ మృతి చెందాడు.

ఉద్యోగం రాలేదని యువకుడి బలవన్మరణం

చిట్యాల, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగం రాలేదనే మనస్తాపంతో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నల్లగొండ జిల్లా చిట్యాల మండలంలో శుక్రవారం ఉదయం జరిగింది. మండలంలోని నేరడ గ్రామానికి చెందిన రూపని అఖిల్ (24) బీటెక్ పూర్తి చేసి కొంతకాలం హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ సంస్థలో పని చేశాడు. అయితే ఏడాదిగా గ్రామంలోనే ఉంటూ తన చదువుకు తగిన ఉద్యోగం కోసం అన్వేషణలో ఉన్నాడు. అయితే ఎక్కడా సరైన ఉద్యోగం రాకపోవడంతో పాటు ఆర్థిక ఇబ్బందులు తోడవడంతో చిట్యాల సమీపంలో రైల్వే ట్రాక్‌పై ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రైల్వే డ్రైవర్ ఇచ్చిన సమాచారం మేరకు రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని అఖిల్ తల్లిదండ్రులకు సమాచారమిచ్చారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు.

కల్లు సీసాతో పొడిచి.. టవల్‌తో ఉరి వేసి..

▸ అన్నను చంపిన తమ్ముడు


మంత్యా (ఫైల్)

మెదక్/కొల్చారం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ కిరాయి డబ్బుల కోసం, మంత్రాల నెపంతో తన అన్నను ఓ తమ్ముడు కల్లు సీసాతో పొడిచి, టవల్‌తో ఉరివేసి కిరాతకంగా చంపేశాడు. ఈ ఘటన మెదక్ జిల్లా కొల్చారం మండలం అంశానిపల్లిలో శుక్రవారం జరిగింది. మండలంలోని పసురం తండాకు చెందిన రామావత్ మంత్యా (46) తన తమ్ముడు మోహన్‌కు ట్రాక్టర్ కిరాయి డబ్బులు బాకీ ఉన్నాడు. ఇటీవల అదే తండాకు చెందిన మరొకరి ట్రాక్టర్‌తో తన పొలాన్ని దున్నేందుకు మంత్యా ఒప్పందం కుదుర్చుకున్నాడు. తనకు డబ్బులు ఇవ్వకపోగా, మరొకరితో ఒప్పందం కుదుర్చుకుంటావా అని ట్రాక్టర్ యాజమాని బిక్షపతిపై తమ్ముడు మోహన్ ఆగ్రహం వ్యక్తం చేశాడు. తన అన్న మంత్యా పొలం దున్నితే ట్రాక్టర్ తగులబెడుతానని బెదిరించారు. ఈ విషయాన్ని బిక్షపతి మంత్యాకు ఫోన్‌లో వివరించాడు. ఆ సమయంలో మోహన్ కల్లు దుకాణంలో ఉండగా, ఆగ్రహంతో అక్కడికి వచ్చిన మంత్యా తమ్ముడితో గొడవకు దిగాడు. మోహన్ కల్లు సీసాతో అన్నను కిరాతకంగా పొడిచి, టవల్‌తో ఉరి వేశాడు. చనిపోయాడా.. లేదా అనే అనుమానంతో బండరాయి వేశాడు. కొనఊపిరితో ఉన్న మంత్యాను కుటుంబ సభ్యులు కొల్చారం ఆస్పత్రికి తరలించగా, అప్పటికే చనిపోయినట్లు వైద్యులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ఆస్పత్రికి తరలించారు. కాగా మంత్యా మంత్రాలు చేయడం వల్లే గతనెలలో తన మనుమరాలు చనిపోయిందని మోహన్ అనుమానిస్తున్నాడు. అప్పటి నుంచి అన్నపై ఆగ్రహంతో ఉన్నాడని గ్రామస్థులు చెబుతున్నారు.

హెచ్‌సీఏ కేసు.. రంగంలోకి ఈడీ

▸ ఎఫ్‌ఐఆర్, దర్యాప్తు వివరాలు కోరుతూ సీఐడీకి లేఖ

▸ మనీలాండరింగ్ కోణంలో విచారణ!

హైదరాబాద్, జూలై 11(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ)లో ఆర్థిక అవకతవకల అంశంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) దృష్టి సారించింది. ఆర్థిక అవకతవకలు, సన్‌రైజర్స్ హైదరాబాద్ ఫ్రాంచైజీని బెదిరించడం, ఫోర్జరీ పత్రాలతో హెచ్‌సీఏలోకి ప్రవేశం తదితర ఆరోపణలపై హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్మోహన్‌రావు సహా ఐదుగురిని సీఐడీ ఇప్పటికే అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. ఐపీఎల్ మ్యాచ్‌ల నిర్వహణ నిమిత్తం బీసీసీఐ నుంచి వచ్చిన నిధులు, క్రీడా పరికరాల కొనుగోలు, స్టేడియం నిర్వహణ అంశాల్లో హెచ్‌సీఏ పాలకులు ఆర్థిక అవకతవకలకు పాల్పడ్డారని సీఐడీ పేర్కొన్న నేపథ్యంలో ఈడీ రంగంలోకి దిగింది. ఈ కేసును మనీలాండరింగ్ కోణంలో విచారించనుంది. ఈ మేరకు ఎఫ్‌ఐఆర్, రిమాండ్ రిపోర్టు, నిందితుల వాంగ్మూలాలు, ఇతర దర్యాప్తు వివరాలను తమకు ఇవ్వాలని కోరుతూ సీఐడీకి ఈడీ ఓ లేఖ రాసింది. తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి గురవారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన సీఐడీ హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్మోహన్‌రావు, కోశాధికారి శ్రీనివాసరావు, సీఈఓ సునీల్ కాంటే, శ్రీచక్ర క్రికెట్ క్లబ్‌కు చెందిన రాజేందర్ యాదవ్, అతని భార్య కవితను అరెస్టు చేసింది. దీంతో గురవారెడ్డి ఫిర్యాదును కూడా ఈడీ పరిశీలిస్తోంది. ఇక, ఒక్క ఓటు మెజారిటీతో హెచ్‌సీఏ అధ్యక్షుడిగా ఎన్నికైన జగన్మోహన్‌రావు.. శ్రీనివాసరావు, సునీల్ కాంటేతో కలిసి అక్రమాలకు పాల్పడ్డారని సీఐడీ దర్యాప్తులో తేలింది. ఐపీఎల్ మ్యాచ్‌లకు సంబంధించి ఉప్పల్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ప్లంబింగ్ పనుల నిమిత్తం రూ.21.7లక్షలను ఖర్చు చేసినట్లు హెచ్‌సీఏ తన రికార్డుల్లో పేర్కొంది. అయితే, ఆ పనులను తామే పూర్తి చేశామని సన్‌రైజర్స్ ప్రకటించింది. 2024-25 సీజన్ కోసం 1,340 క్రికెట్ బంతుల కొనుగోలుకు రూ.1.04కోట్లు ఖర్చు చేశామని హెచ్‌సీఏ రికార్డుల్లో పేర్కొన్నారు. కానీ, ఆ బంతుల వివరాలు స్టాక్ రికార్డుల్లో నమోదు కాలేదు. ఏసీల కోసం రూ.11.86 లక్షలు ఖర్చు చేసినట్టు జగన్మోహన్ బృందం పేర్కొనగా.. ఈ కొనుగోలు ప్రక్రియ టెండర్ల ద్వారా జరగలేదని సీఐడీ విచారణలో వెల్లడైంది. కాగా, హెచ్‌సీఏ పాత కమిటీ హయాంలో జరిగిన ఆర్థిక అవకతవకలపై గతంలో దర్యాప్తు చేసిన ఈడీ రూ. 51.29 లక్షల విలువైన ఆస్తులను అటాచ్ చేసింది. హెచ్‌సీఏ మాజీ అధ్యక్షుడు అజారుద్దీన్‌ను కూడా అప్పట్లో ప్రశ్నించింది.

‘ప్రైవేటు’గా వసూళ్లు!

(మొదటిపేజీ తరువాయి)



భావించారు. అంతే వెంటనే హైదరాబాద్‌లోని ఓ ప్రముఖ హోటల్‌ను వేదికగా చేసుకున్నారు. అక్కడికి అన్ని ప్రైవేటు కాలేజీల ప్రిన్సిపాళ్లు రావాల్సిందేనని ఆదేశాలు జారీ చేశారు. పిలిచింది పెద్ద అధికారి కావడంతో కిక్కురుమనకుండా అందరూ వెళ్లారు. అక్కడే ఆయన తన ఉద్దేశాన్ని వెల్లడించినట్లు సమాచారం. తనకు కావాల్సిందేంటో కూడా వారికి చెప్పినట్లు తెలిసింది. వాస్తవానికి ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలు ఈ సంస్థను పెద్దగా పట్టించుకోవు. కానీ, సీట్ల పెంపు వంటి విషయలో రాష్ట్ర ప్రభుత్వం ఎసెన్షియాలిటీ సర్టిఫికెట్ ఇస్తుంది. దాని ఆధారంగా ఈ సంస్థ మెడికల్ కాలేజీలకు కన్సెంట్ ఆఫ్ ఎఫిలియేషన్ (సీవోఏ) ఇస్తుంది. ఈ రెండూ ఉంటేనే ఎన్‌ఎంసీ కొత్త కాలేజీల ఏర్పాటుకు, సీట్ల పెంపునకు, కొత్త సీట్ల దరఖాస్తుకు అనుమతి ఇస్తుంది. సరిగ్గా ఇక్కడే ప్రైవేటు కాలేజీ యాజమాన్యాలు దొరికిపోయాయి. గతంలో తేలిగ్గా సీవోఏ, ఎసెన్షియాలిటీ సర్టిఫికెట్లను తెచ్చుకున్న కాలేజీల యాజమాన్యాల ఆటలు ఈ సారి సాగలేదు.

తనిఖీల మాటున వసూళ్ల పర్వం..


కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రైవేటు వైద్య కళాశాలల్లో లోపాలు, స్టైపెండ్‌పై వైద్యవిద్యార్థులు ఫిర్యాదు చేశారు. దీంతో స్టైపెండ్ విషయమై తనిఖీలు చేయమని సర్కారు ఆ సంస్థ అధికారులను ఆదేశించింది. దీన్నే అవకాశంగా తీసుకున్న ఆ ఉన్నతాధికారి.. తనిఖీల మాటున వసూళ్ల పర్వానికి తెరలేపినట్లు చెబుతున్నారు. ఓ మాజీ మంత్రికి చెందిన వైద్య కళాశాల నుంచి తనిఖీల సమయంలో రూ.40 లక్షలు తీసుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయాన్ని సదరు కాలేజీలో పనిచేస్తున్న వైద్య అధ్యాపకులు సైతం ధ్రువీకరించారు. అలా తనిఖీలకు పంపి, ఇలా వసూళ్లకు తెగబడినట్లు వైద్యవర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అధికారంలో ఉన్న ప్రజాప్రతినిధుల కాలేజీలు మినహా మిగిలిన వారి కళాశాలల నుంచి వసూళ్లు చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. సదరు కాలేజీలో ఉండే సీట్ల సంఖ్య ఆధారంగా వసూళ్లు చేసినట్లు పేర్కొంటున్నారు. వాస్తవానికి ప్రైవేటు కాలేజీలకు తనిఖీలకు వెళ్లినప్పుడు ప్రొఫెసర్ స్థాయి వారిని పంపుతారు. అయితే కొన్నిచోట్ల తనిఖీల్లో ఆ ఉన్నతాధికారి సైతం పాల్గొన్నట్లు ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలు చెబుతున్నాయి.

ఆయన కోసం మూడు వాహనాలు!

ఆ సంస్థలోని ఉన్నతాధికారులకు నిబంధనల ప్రకారం ఒక ప్రభుత్వ వాహనాన్ని మాత్రమే వాడుకునేందుకు అనుమతి ఉంటుంది. కానీ, ఆ అధికారి మాత్రం మూడు వాహనాలను వాడేస్తున్నట్లు వైద్యవర్గాలు వెల్లడించాయి. ఇందులో ఆయన కోసం ఒకటి, కుటుంబ సభ్యుల కోసం రెండు వాడుతున్నట్లు తెలిపాయి. కుటుంబ సభ్యుల్లో ఒకరిని రోజూ ఓ ప్రైవేటు వైద్య కళాశాలకు తీసుకెళ్లి, తీసుకురావడం కోసం ఒక వాహనాన్ని వినియోగిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆ ఒక్క వాహనానికి ఇంధనం కోసమే నెలకు రూ.లక్ష వరకు వెచ్చిస్తున్నట్లు సమాచారం. మూడు వాహనాలు వాడుకుంటున్న ఆ అధికారి ఆఫీసుకు వచ్చేది మాత్రం వారానికి ఒక్కసారేనని అక్కడి సిబ్బంది చెబుతున్నారు. అంతేకాదు కార్యాలయంలో ఆఫీసు ఖర్చుల కోసం ఉండే నగదు నిల్వలను సైతం తన సొంత అవసరాలకు వాడుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. సదరు అధికారి తీరుతో అక్కడ పనిచేసే మరో ఉన్నతాధికారి ఏకంగా నెలకుపైగా సెలవు పెట్టి వెళ్లిపోయినట్లు సమాచారం. అలాగే మరో ఇద్దరు అధికారులు కూడా కార్యాలయంలో జరిగే అవకతవకలు తమ మెడకు ఎక్కడ చుట్టుకుంటాయోనన్న భయంతో అక్కడి నుంచి వెళ్లిపోయేందుకు తీవ్రంగా ప్రయత్నాలు చేసుకుంటున్నట్లు వైద్యవర్గాలు వెల్లడించాయి. సంస్థలో జరుగుతున్న అవకతవకలు, ఉన్నతాధికారి వసూళ్లపై విచారణ జరపాలన్న డిమాండ్లు వినిపిస్తున్నాయి.

ఆ కాలేజీల్లో ఫీజులపై.. 6 వారాల్లో తేల్చండి

(మొదటిపేజీ తరువాయి)



అనుమతి ఇవ్వాలని కోరుతూ ఏస్ ఇంజనీరింగ్ కాలేజీ, గోకరాజు గంగరాజు కాలేజీ సహా దాదాపు పది కాలేజీలు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశాయి. వీటిపై జస్టిస్ కె.లక్ష్మణ్ ధర్మాసనం శుక్రవారం విచారణ జరిపింది. కాలేజీల తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. టీఏఎఫ్ఆర్సీ ఫీజులను నిర్ధారించినప్పటికీ.. ప్రభుత్వం వాటిని నోటిఫై చేయకుండా పాత ఫీజులను కొనసాగిస్తూ జారీ చేసిన జీవో 26 చెల్లదని పేర్కొన్నారు. టీఏఎఫ్ఆర్సీ చట్టబద్ధమైన సంస్థ అని, అది నిర్ధారించిన ఫీజులను ఆమోదించాల్సిందేనని వాదించారు. దీనికి సంబంధించి పలు సుప్రీంకోర్టు, హైకోర్టు తీర్పులు కూడా ఉన్నాయని వివరించారు.

విద్యార్థులపై తీవ్ర భారం పడుతుంది..

ఇక టీఏఎఫ్ఆర్సీ, ప్రభుత్వం తరఫున న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ.. పాత ఫీజులే కొనసాగించాలంటూ జారీ చేసిన జీవోలో దోషమేదీ లేదని తెలిపారు. కాలేజీలు ఏకంగా 70శాతం నుంచి 90 శాతం వరకు ఫీజులు పెంచాలని కోరుతున్నాయని, దానివల్ల విద్యార్థులపై తీవ్ర భారం పడుతుందని వివరించారు. రాష్ట్రంలో బీటెక్ కోర్సుల్లో దాదాపు లక్షా ఆరు వేల మంది, ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో దాదాపు 33 వేల మంది విద్యార్థులు ప్రవేశాలు పొందుతారని.. వారి పరిస్థితిని కూడా దృష్టిలో పెట్టుకోవాల్సి ఉంటుందని విన్నవించారు. కాలేజీలు సమర్పించిన ప్రతిపాదనలపై మార్చి నెలలో పరిశీలన చేపట్టామని.. ఆ ప్రతిపాదనల్లో వాస్తవ విరుద్ధమైన అంశాలు ఉన్నాయని స్పష్టం చేశారు. ఈ అంశాలన్నీ పరిశీలించాకే పాత ఫీజులు కొనసాగించాలంటూ ప్రభుత్వం జీవో ఇచ్చిందని వివరించారు. వాదనలు విన్న ధర్మాసనం.. పిటిషన్లు వేసిన కాలేజీల ప్రతిపాదనలను పరిశీలించి, ఆరువారాల్లో ఫీజులు నిర్ధారించాలని టీఏఎఫ్ఆర్సీని ఆదేశించింది. మరోవైపు ఫీజులు పెంచుకోవడానికి సీబీఐటీ కాలేజీకి అనుమతిస్తూ మరో సింగిల్ జడ్జి బెంచ్ ఇచ్చిన ఆదేశాలపై రివ్యూ పిటిషన్ వేస్తామని టీఏఎఫ్ఆర్సీ న్యాయవాది తెలిపారు. కాగా, ఫీజులు పెంచుకోవడానికి సింగిల్ జడ్జి అనుమతి ఇవ్వకపోవడంపై డివిజన్ బెంచ్‌లో అప్పీలు చేయాలని ఇంజనీరింగ్ కాలేజీలు భావిస్తున్నట్టు తెలిసింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.